I am an

మద్గీశసంపద

శ్రీ చాగంటి శేషయ్యగారి

ఇతర గ్రంథములు

ఆంధ్రకవితరంగిణి	1 వ	భాగము	రు 3–00
(కవులచరిత్ర)	2	,,	3–00
డిట్టో	3	,,	3–00
డిట్టో	4	,,	3–00
డిట్టో	5	,,	3–00
డిట్టో	6	,,	3–00
డిట్టో	7	,,	3–00
డిట్టో	8	,,	3–00
డిట్టో	9	,,	3–00
డిట్టో	10	,,	3–00
డిట్టో	11	,,	3–00
డిట్టో	12	,,	3–00

13, 14 భాగములు ముద్రణమగుచున్నవి.

విశ్వప్రయత్నము నవల		...	3–00
శ్రీ	,, ...	...	2–50
రాధారాణి	,, ...	...	0–50

నూతన గ్రామపంచాయితీల చట్టము

(Act 10 of 1950) 8-00

దుర్గేశనందని

శ్రీ చాగంటి శేషయ్యగారు
రచయిత

హిందూ ధర్మశాస్త్ర గ్రంథనిలయము
కపిలేశ్వరపురము : తూర్పు గోదావరి జిల్లా

★

ఏడవ కూర్పు
వెల రు 2-50

★

ఆనంద తీర్థ ప్రెస్
రామచంద్రపురం

ఒక్కమాట

వంగదేశ కవిసార్వభౌముఁ డగు బంకిం చంద్రఛాటర్జీ మొట్టమొదట నీ నవలను వంగభాషలో రచియించెను. చారు చంద్రఘటోపాధ్యాయులు దీని నాంగ్లేయభాషలో కనువదించిరి. ఇంక ననేక భాషలోని కిది పరివర్తనము సేయఁబడినది. క్రీ. శ. 1910 వ సంవత్సరమున చాగంటి శేషయ్యగారు దీని నాంధ్రీకరించి, ఆంధ్రప్రచారిణీ గ్రంథమాలలోఁ బ్రథమ పుష్పముగఁ బ్రకటించితిరి.

ఈ గ్రంథము నిప్పుడు మరల పేడవకూర్పుగ ముద్రింపించి, యాంధ్రలోకమున కర్పింపఁ గలిగిన భాగ్యము మాకల వడినందుల కెంతయు సంతసించుచున్నాము.

ప్రకాశకులు

శ్రీ రామచంద్ర

కృతి

తలిదండ్రు లెందు ము ♦ ద్దులు ముచ్చటలు దీర్ప
శాంతయై వెలసిన ♦ సాధుశీల
ఇరువురన్నలకడ ♦ మురిపంబుఁ జూపి సు
భద్రయై యలరిన ♦ భవ్యకీర్తి
అత్తమామలయెడ ♦ నతిభక్తి నెరపి సా
విత్రియై మించిన ♦ విమలహృదయ
పతియెడ ననురక్తి ♦ భక్తిఁ జూపుచు సుస్థి
రాత్మజయై యొప్పు ♦ ననఘచరిత

సర్వమంగళాపదసమా ♦ సక్తచిత్త
శ్రీమతి, వివేకవతి, కీర్తి ♦ శేష. సుగుణ
ధన్య, శ్రీసూరమాంబాభి ♦ ధాన నాదు
సోదరికి నీకృతినొసంగి ♦ సుకృతినైతి.

చాంగటి శేషయ్య

శ్రీరామచంద్ర

దుర్గేశనందని

ప్రథమభాగము

మొదటి ప్రకరణము

దేవాలయము

వంగదేశశకము 998 వ సంవత్సరమున వేసవికాలపు కడపటిదినములలో నొకపురుషుఁ డొంటరిగ గుఱ్ఱము నెక్కి పోవుచుండెను. ఆతఁడేగెడు బాట విష్ణుపురమునుండి జహానబాదునకుఁబోవును. సూర్యుఁడస్తమించు సమయమైనది. ఆతఁడింకను జాలదూరము పోవలసియుండెను. ఒంటరిపాటు, మార్గమున నెక్కడ నాశ్రయములేదు. ఆఋతువునందు సాయంకాలమగునప్పటికి, ఉఱుము, మెఱుము, లారంభమై గాలియు, వానయు, వచ్చుచుండుట కలదు. అట్లయినచో నాశ్రయ విహీనమైన యాప్రదేశమున నాతఁడు మిక్కిలి కష్టపడవలసివచ్చును. అందుచే నాతఁడు గుఱ్ఱమును బరుగెత్తింప నారంభించెను. సాయంతనమయినది. క్రమక్రమముగ గనుచీఁకటిపడెను. ఆకసమునంతట నల్లనివారిధరములు కాఱు క్రమ్ముకొనినవి. రాత్రిపడినతోడనే గాఢాంధకారము

చూపానునంత ప్రదేశమును గప్పివేసెను. గుఱ్ఱమునకు దారి చూపుట కష్టమయ్యెను. అతఁడు మెఱపుసహాయమున నతి కష్టముతో మార్గమును జూచుచుండెను. కొలఁది సేపటిలోనే వర్షముతోఁగూడి గాలిరోజనమారంభించెను. బాటసారి తుద కెట్లుపోవలయునో యేర్పరింపలేకపోయెను. కళ్ళెమును సడలించెను. గుఱ్ఱము దానియిష్టమువచ్చినత్రోవను బోవుచుండెను. ఇట్లు కొంతదూరమరిగెను. గుఱ్ఱముకాలున కేదో కఠినపదార్థముతగిలి కాలుజారెను. అంతలో విద్యుత్కాంతి తళుక్కుమనియెను. ఆప్రకాశమున బాటసారి కన్నులకు సమీపమునఁ దెల్లగ నెత్తయినదేదో యొకటి యటనున్నట్లు కాన్పించెను. అతఁడదియొక గృహమనుకొనెను. అశ్వమునుండి క్రిందికి లంఘించెను. క్రిందరాతితో నిర్మింపఁబడినసోపానములున్నవి. వానిచేతనే గుఱ్ఱము కాలుజారి పడెనని యాతఁడు గ్రహించెను. అందుచే నిట నొక్క యాశ్రయముండవచ్చునని తలంచి యాతఁడాయంధకారమున మెల్లగ నామెట్ల నెక్కనారంభించెను. విద్యుత్ప్రకాశ సాహాయమునఁ దనయెదుట నెత్తుగ నున్నదొక దేవాలయమని యాతనికి స్పష్టపడియెను. మెల్లగా నాతఁడు దానిద్వారమును సమీపించెను. కాని, యది మూయబడియున్నది. అతఁడు తలుపును దడవిచూచెను. వెలుపలిప్రక్క గొళ్ళెము వేసియుండలేదు. బాటసారి నివ్వెఱపడెను. ఆశ్చర్యమగ్నుఁడయ్యెను. "మనుష్య నివాసములేని

ప్రదేశమున నున్న యీ దేవాలయమునందిప్పుడెవరున్నారు? తలుపును లోపల వైచినవారెవరు?" అని తనలోఁ దానను కొనెను. పాపమాతని శిరస్సుపై వర్ష మతికఠినముగఁ గొట్టు చుండెను. "లోన నెవరున్ననేమి" అని యనుకొని యాపాంథుఁడు తన పాణితలమున నతివేగముగఁ దలుపును దట్టనారంభించెను. మరలఁ దట్టెను. మరలఁ దట్టెను. కాని, నిష్ఫలమైనది తలుపులు వీడలేదు. ఒక్కతన్ను తన్ని తలుపులను బ్రద్దలుకొట్టవలయునను నత్యుద్రేక మాతనికిఁ గలిగెను. కాని, తన్మూలమున భగవదపరాధమును జేసినవాడ నగుదునేమో యని శంకించెను. ఓర్పువహించెను. తలుపును విఱుగఁగొట్ట లేదు. కాని, యది పెళుసుకట్టుతోఁ జేయఁబడుటచేఁ గఠిన మగు నాతనిచేతి వ్రేటులకుఁ జీల యూడిపోయెను. బాటసారి తలుపును విసరి త్రోసెను. లోన బ్రవేశించెను. ఏదియో యస్పష్టధ్వని యొకటి యాతనికివినవచ్చినది. అతనితో గాలి కూడ లోనఁజొరఁబాఱెను. వెలుఁగుచున్న దీపమారిపోయెను. లోపల నెవ్వరుండిరో, యందున్న విగ్రహ మేదేవునిదో యతనికి బోధపడినదికాదు. నిర్భయుఁడగు నాబాటసారి తనస్థితినిఁజూచుకొని యించుక నవ్వుకొనియెను. భక్తిశ్రద్ధలతో నగోచరముగనున్న యావిగ్రహమునకు శిరస్సువంచి నమస్కార మొనర్చెను. ఆతఁడాచీఁకటిలోనే "ఈయాలయ మునందున్నవా రెవరు?" అని యడిగెను. ఎవరును బ్రత్యు

త్తరమీయలేను. ఆభూషణ క్రేంకారములు మాత్రము విన నయ్యెను. మాటలవలనం బ్రయోజనములేదని యాతఁడు తలంచెను. గాలియు, వానజల్లును, రాకుండఁ దలుపులు మూసెను. చీలకుబదులుగ నాతఁడు తలుపునాని కూర్చుండెను. మరల నిట్లు కేకవేసి చెప్పెను.

"ఇందున్న మీరెవ్వరో యిటు వినుఁడు. ఆయుధపాణినై నేనిటఁ గూర్చున్నాఁడను. నావిశ్రాంతికి భంగముఁ దేఁబోకుఁడు, మీరు పురుషులై యట్లు చేసితిరేని మీ కపాయము సంభవింపఁగలదు. గాని, స్త్రీలైనచో మీకేమియు భయములేదు. ఈ రాజపుత్ర వీరునిచేతఁ గత్తియు, డాలు, నున్నంతవరకు మీకు లేశమాత్రమును విచారము కలుగఁబోదు"

"అయ్యో! మీరెవ్వరు?" అను నొకమాట విన వచ్చెను. ఆధ్వని యొకస్త్రీది. బాటసారి యాశ్చర్యముతో "ఈ కంఠధ్వనినిబట్టి నన్నిట్లడిగిన దొకయువిదయని నాకుఁదోఁచు చున్నది. నన్నెఱుంగుటవలన మీకేమి బ్రయోజనము?" అనియెను.

"అయ్యో! మేము చాల భయపడుచున్నారము."

"నేనెవరైననేమి? నన్నుఁ గూర్చి నేఁజెప్పుకొనను. అది మాయాచారముగాదు. అయినను నేనిట నున్నంతవఱకు నబలలగు మీకిసుమంతయేని భయములేదు. నెమ్మదిగనుండుఁడు."

"అయ్యా! మీవాక్యమువలన మాగుండెలు కుదుటఁబడినవి. ఇంతదనుక మాప్రాణములపై మాకాశలేదు. ప్రాణములఱచేతఁ బెట్టుకొని యున్నాము. నాచెలి మూర్ఛపోయినది. ఇంకను దేరలేదు. మేముసాయంతన మీశ్రైలేశ్వరునిఁ బూజింపవచ్చితిమి. వర్షముమూలమున మాపరిచారకులును, బోయవాండ్రును, మమ్ముల దిగవిడిచిపోయిరి. వారెటకేగిరో మే మెఱుంగము."

"మీకేమియు భయములేదు. ధైర్యము వహింపుఁడు. విశ్రాంతిఁజెందుఁడు. తెప్పుదయమున మిమ్ముల మీయింటికి గొంపోయెద."

"అయ్యా! శ్రైలేశ్వరుఁడు మిమ్మురక్షించుఁగాక!"

రాత్రి రెండు యామములయినది. వర్షము, గాలియు, తగ్గెను. బాటసారి యిట్లనియెను.

"అబలలారా! మీర లొక్కింతసేపిట ధైర్యముతో నుండుఁడు. నేనీ సమీపమందలి పల్లెకుఁబోయి దీపమును గొనివచ్చెదను."

"అయ్యా! మీరెంతదూరమో పోనక్కఱవేదు. ఈ దేవార్చకుఁ డిట కత్యంత సామీప్యముననే యున్నవాఁడు. సుధాకిరణుని ప్రకాశమిప్పు డగపడుచున్నది. అందుచే మీరవ్వలకేగితిరేని యాతని కుటీరమును గాంచఁగలరు. నిర్జనమైన యీప్రదేశమున నాతఁడొక్కఁడే వాసముచేయుచున్న

వాఁడు. ఆతనియొద్ద నెపుడును దీపమునకుఁ గావలసినవస్తువు లుండును.'' అని మొదటియామెయే ప్రత్యుత్తరమిచ్చెను.

ఆమెచెప్పినరీతిగ పాంథుఁడవ్వలికేగెను. వెన్నెలయం దర్చకుని గృహమును గని తలుపునొద్దకేగి యాతనినిలేపెను. అర్చకుఁడు భయపడియెను. తలుపు తీయలేదు. రంధ్రము గుండ నీతఁ డెవరోయని తొంగిచూచుచుండెను. బాగుగ బరీక్ష చేసిచూచెను. బాటసారియందుఁ జోరుని లక్షణములు గనుపట్టలేదు. ఇంతేకాదు, బాటసారియొంటనున్న యమూల్యాలంకారముల నాతఁడుచూచెను. వానియందు సహస్రాంశమయినను దనయింటలేదు. ఇదియంతయు యోచనచేసి చూచి యర్చకుఁడు తలుపుతెఱచి దీపమును వెలిఁగించెను.

బాటసారి దీపముతో దేవాలయమునకువచ్చి యందు స్థాపించిన విగ్రహమునుజూచెను. అది శ్వేతశివలింగము దాని వెనుక నిరువురు స్త్రీలుండిరి. అందొకర్తు యానవతి ఆమె దీపమును జూచిన తోడనే మేలిముసుంగు వైచుకొని యవనతముఖి యయ్యెను. ఆమె హస్తములు కంకణస్థగితవజ్రకాంతులచే మెఱయుచుండెను. అవి మార్వారీ దేశపుఁ గంకణములవంటివి. ఆమె దుస్తులు శ్రేష్ఠమైనవి. బుటేదారి పనితోఁ జక్కఁగానున్నవి. వానిపై నానాయలంకారములు మనోహరములై కనుపట్టుచుండెను. పాంథుఁడామె యెవ్వరో యొక గొప్పయింటివనిత యని స్పష్టముగా గ్రహించెను. ఆ

యువతి ధరించినవానికంటె నారెండవస్త్రీ దాల్చినదుస్తులు తక్కువవిలువగలవి. అందుచే నామె యాయువతి పరిచారికయై యుండునని యాతఁ డూహించెను. అయినను, నామె సామాన్యపరిచారికలకంటె చాల విలువగల నగలనే ధరించి యుండెను. ఆమెవయసు ముప్పదియైదు సంవత్సరము లుండవచ్చును. ఇంతదనుకఁ దనతోడ మాట లాడినదాపరిచారికయే యని యతఁడు తలంచెను. అది స్వాభావమేకదా! వారల వేషములను జూచి యాతఁ డాశ్చర్యపడెను. వారిరువురి వేషములునుగూడ వంగదేశపుస్త్రీలవి వలెలేవు. ఉత్తరహిందూస్థానపు స్త్రీలవివలె నున్నవి.

బాటసారి దీపము నక్కడనుంచి వారి కెదురుగ నిలిచెను. దీపపుఁగాంతు లాతనిపైఁ బ్రసరించినవి. ఆయువిద లాతనివయ స్సిరువదియైదు సంవత్సరము లుండుననుకొనిరి. అతనిశరీరము పొడవయినది. ఇతరులెవ్వరైన నింతపొడవుండు రేనియంత సౌందర్యముగనుండరు. విశాలమయిన వక్షస్థలము. ప్రత్యవయవమును మాంసలమై సముచితౌన్నత్యమును గలిగి యుండెను. అందుచేతనే యాతని యౌన్నత్యము మనోహరముగ నుండెను. వర్షసమయమునం దభివృద్ధినందు మెత్తని పచ్చికవంటి శరీరచ్ఛాయ. కాదేని దానికంటె మనోహరచ్ఛాయగలిగి వసంతర్తువందలి నవమృదు పత్రమువంటి శరీరవర్ణము, దాని పైరక్ష, తాయెతులు, మొదలగు రాజ

పుత్రాలంకారములు ప్రకాశించుచుండెను. నడుమున కాసె కోక. దానఁ గత్తితోఁగూడిన యొుఱయొకటి వ్రేలాడుచుండెను. పొడవయిన యూతని చేతియందొక పెద్దబల్లెమున్నది. శిరమున వజ్రపుదురాయితోఁ గూర్చినయుష్ణీషము. కర్ణముల ముత్యాలతాటంకములు కంఠమున హారమొకటి శోభిల్లుచుండెను.

ఒకరినొకరు చూచుకొనిరి. ఒకరినొకరు పరిచయ మొనర్చుకొన నువ్విళూరుచుండిరి. కాని, యెవ్వరు నా విషయమున ముందంజ వేయలేకపోయిరి. అట్లుచేయుట యిరువురకును మర్యాదభంగమే యని యనుకొనిరి.

రెండవ ప్రకరణము

—♦—

పరిచయము

తుదకు రాజపుత్త్రుఁడే తనమనస్సును మొదట వెలిపుచ్చెను. ఆతఁడు పెద్దయామెతో “అమ్మా! మీరొకగొప్ప యింటివారని తలంచెదను. మీవంశ నామధేయముల నడుగ నాకు సందియమగుచున్నది. కాని, నావలె మీరు మీ వృత్తాంతములఁ దెలుపనభ్యంతరము లేనివారై యుండవచ్చును. అందుచే మీరెవ్వరని యడుగ స్వతంత్రించుచున్నాడను.” అనియెను.

"కాదు. కాదు, అయ్యా! స్త్రీ లెప్పుడైన ముందుగఁ దమ్మోఁదా మెఱింగించుకొందురా?"

"పరిచయము గలిగించుకొనుటకు ముందు వెనుక లేమి?"

"తన కులగౌరవాధిక్యమునుగూర్చి చెప్పుకొనఁదగదని స్త్రీతన్నుదా నెట్లెఱింగించు కొనఁగలదు? తనగృహమునుండి యివ్వలకు రాఁదగని యబల తనసంగతి నెట్లు చెప్పుకొనును? తనభర్తనామోచ్చారణ మొనర్పననర్హమైన వనితకు తనను దాను దెలుపుకొనుటమాత్రము స్వాతంత్ర్య మెక్కడిది?"

ఈమాటలకాయువకుఁ డేమియు బ్రత్యుత్తర మీయ లేదు. ఆతనిదృష్టి యన్యథా లీనమయియుండెను. ఆ రెండవ యువతి క్రమక్రమముగ మేలిముసుఁగును దొలఁగించి తన చెలివెనుకనుండి యాపురుషుని నిరీక్షించుచుండెను. ప్రసంగ సందర్భమున నాతని చంచలవీక్షణ మామెపైఁ బ్రసరించెను. ఆమె మొగమున దృఢముగా నాటుకొనియెను. అట్టిలావణ్య శాలినిఁ జూచుభాగ్యమిఁకఁ దనకెన్నఁడును లభింపదని యాత డనుకొనెను. తోడనే యువతీయువకుల వీక్షణములొండొం టితోఁ గలిసికొనియెను. యువతి యవనతాలోకన య య్యెను. పరిచారికావాక్యములకు బ్రత్యుత్తరమురాలేదు. ఆమె బాట సారివంకఁ బరికించెను. ఆతఁడు చూచుచున్న విధమునంతయు గ్రహించెను. తనసఖకూడ నాతని న్మాత్రముతో నిరీక్షించు

చున్న దసి తెలిసికొనియెను. అపవారించి, యామెతో నిట్లని యెను.

"అమ్మాయీ! ఇది యేమి? ఈ యీశ్వరుని సన్నిధిని పెండ్లియాడవలయునని యుద్దేశమా యేమి?

'చాలునులే' యని యువతి పరిచారిక నొక్క గిల్లు గిల్లెను.

పరిచారిక నిపుణవతి. సంగతి సందర్భములను జక్కఁగ గనిపెట్టెను. తనలో నిట్లని వితర్కించుకొనుచుండెను. "నాకు జాల భయమగుచున్నది. ఈయువకుని రూపసంపద మాచెలి హృదయాకర్షణ మొనరించుచున్నది. ఈమె మనసు నాతని కర్పించెనేని యందువలన నంతచెడుగు సంభవింపకున్నను—అయ్యో!—ఈమెమనసునకిఁక నెప్పటికిని విశ్రాంతియుండదు. ఆహా! ఎట్లయిన నిదివారింప నర్హము. ఔను. అయిన నది యెట్లు?—ఇప్పుడ మేమీతని విడచిపోవ యత్నించెదము గాక!"

కుశాగ్రబుద్ధియగు నాపరిచారిక యిట్లు నిశ్చయించుకొని యాతనితో "అయ్యా! స్త్రీలప్రతిష్ట నశ్వరమైనది. సామాన్యవాయుస్పర్శమునకు సయితము నిలువఁజాలదు. ఇక నీనాఁటిప్రచండవాయువునుగూర్చి చెప్పునదేమి? గాలియు వానయు నడఁగినవి. మేమింటికి నడచిపోవ యత్నించెదము, మాకనుజ్ఞ నొసంగుము" అనియెను.

ఈయర్థరాత్రిముననే మీారింటికి నడచిపోవలయునేని నేను మీాకు సహాయుఁడనై వచ్చెదను. ఆకసము నిర్మలముగ నున్నది. నేనిదివఱకే మాయింటి కేగవలసినవాఁడను. అయినను రక్షకులెవ్వరును లేకుండ మీాసఖివంటి సౌందర్యవతిని విడిచిపోవ నిష్టములేక యింతవఱ కట్టెయుండవలసిన వాడనైతిని."

"మీారు మాయెడల మహానుగ్రహముఁ జూపినారు. నామనోభావముల నన్నిటిని మీాకడ విన్నవింప లేకున్నదానను చెప్పిన మమ్ముఁ గృతఘ్నులనుగ భావింతురేమో! అయ్యా! స్త్రీల యదృష్టమునకు శాపమున్నది. ఆవిషయమున మీాకేమి చెప్పుదును? మేమెప్పుడును ననుమానముతోఁ జూడఁబడుట సర్వసామాన్యమయినది. మీారు మాతోఁ గూడవిచ్చేయుటకన్న సౌఖ్యమేమికలదు? కాని, యీబాలిక తండ్రి యీామెనడిగినచో నెట్లువచ్చునో యోచింపుఁడు. ఈ యర్థరాత్రమున మిమ్ముల నెవ్వరు తీసికొనివచ్చిరని యడుగ నామె యేమి ప్రత్యుత్తరమీాయగలదు?"

యువకుఁడు కొంచెమాలోచించి యిట్లనియెను.

"ఏమి? మానసింహమహారాజుగారి తనయుఁడగు జగత్సింగుసాహాయ్యమున వచ్చితిమనిన నేమి?"

పిడుగుపడినట్లయ్యెను. అయ్యువిదలిరువురు మహాశ్చర్యనిమగ్నలైరి. యేమియుఁ జేయలేకపోయిరి. లేచి నిలువఁ

బడిరి. యువతీమణి శిలావిగ్రహము చాటునకరిగెను. వాక్ని పుణయగు నాపరిచారిక వ్రేలాడుచున్న చీరచెఱఁగును, కంఠమునకుఁ జుట్టుకొని చేతులు జోడించి "రాజకుమారా! క్షమింపుము. ఎఱుఁగక వేయియపరాధములను గావించితిమి" అనియెను.

జగత్సింహుఁడు నవ్వుచు అట్టియపరాధములకు మన్ననలులేవు. అయినను మీరెవ్వరో నాకుఁ దెలియజేసితిరేని నేనన్నియు మఱచిపోయెదను. లేనిచో యుక్తమయిన దండనము మీకు జరుగకతప్పదు.''

మృదువాక్యములు నిపుణవతియగు స్త్రీకి ధైర్యమును గలుగఁ జేయును. ఆమె యిట్లనియెను.

"అయ్యా! అదేదియో యాజ్ఞయిండు; సిద్ధముగనున్నారము."

"మిమ్ములనింటికిఁ గొంపోవుటకన్న వేఱేమున్నది?''

పరిచారిక కేమిచెప్పుటకు దోఁచలేదు. ఢిల్లీ సార్వభౌముని సేనాధిపతికిఁ దనసఖినిగూర్చి చెప్పుట కామెకిష్టము లేదు. అందులకొక ప్రత్యేకకారణమున్నది. ఆతఁడు తమతోఁ గూడవచ్చుట యామెకంతకంటె నిష్టములేదు. ఆమె శిరస్సును వ్రేల్వైచి యోచించుచుండెను.

ఇంతలోఁ జాలదూరమున నెన్నియోయశ్వముల కాలిచప్పుడులు వారికి వినవచ్చెను. రాజు తటాలున నావలికేగి

చూచెను. నూఱుగురు రౌతులు గుఱ్ఱములపై వచ్చుచుండిరి. ఆతఁడు వారిదుస్తులను గుర్తించెను. వారాతని రాజపుత్రసైనికులే. కొలఁది కాలముక్రిందట నీతఁడు విష్ణుపురమునకు సైన్యసంబంధమైన యొక కార్యముపైఁ బోయియుండెను. నూఱుగురాశ్వికులతో మరలఁ దండ్రికడ కేగుచు మధ్యాహ్నమున నీతఁడు వారినివిడిచి ముందుపయనముఁ జేసెను. పిమ్మట రాజొక త్రోవను నాశ్వికులొక త్రోవను బోయిరి. జగత్సింహుఁ డీమార్గమునవచ్చి వర్షముచే నిట్టిశ్రమకు లోనయ్యెను. ఇప్పుడు మఱల నగపడినవా రాయాశ్వికులే. వారు తన్నానవాలు పట్టినారో లేదో తెలిసికొనుటకై "ఢిల్లీశ్వరునకు జయమగుఁగాక!"యని యొక్కకేక వైచెను. ఆక్షణమే యొకరౌతాతని సమీపించెను. జగత్సింహు డాతనిఁజూచి యిట్లనియెను.

"ధర్మసింహా! వర్షముచే నేనిట నాగిపోతిని."

ధర్మసింహుఁ డతివినయపూర్వకముగ వందనమొనర్చి "ప్రభూ! మీకొఱకుఁ జాలసేపు వెదకితిమి. మీరగపడలేదు. మీగుఱ్ఱపుడెక్కల జాడను గుర్తించుకొనుచు నిట్టు బయలు వెడలితిమి. అదిగో! అట దూరముగనున్న యామఱిచెట్టుకడ మీగుఱ్ఱము గాన్పించినది. దానిని తీసికొని వచ్చినారము" అనియెను.

అశ్వములతోఁగూడ నీవిటనుండుము. ఇరువురు మనుష్యుల నీసమీపమున నున్నపల్లెకు, బోయవాండ్రను బల్లకితోఁగూడఁ దీసికొనిరమ్మని పంపుము. మిగిలిన సైనికులను ముందునకుఁ బొండనుము''

ధర్మసింహుఁడు కొంచెమాశ్చర్య పడియెను. ఆజ్ఞాహేతు వేదియో యతనికిఁ దెలిసినదికాదు. యజమానుని నడుగుట తనకనగత్యమైనపనియని యాతఁడు తలంచెను.

''అయ్యా! మీ యాజ్ఞానుసరణి నొనర్చెద'' అనియెను.

రాజాజ్ఞను ధర్మసింహుఁడు సైనికుల కెఱింగించెను. అందొకఁడు తనప్రక్కనున్న యతనితో ''అద్భుతమైన యుత్తరవులైన వెంకులకో? విశేషములేవియో?''అనియెను. ఇంకొకఁడు ''ఏమి? ఎందులకుఁగాఁగూడదు? రాజపత్రిశిరోమణియగు మహారాజున కైదువందలకుఁ దక్కువకాకుండ శాణు లుండవలయుననుమాట జ్ఞప్తియుంచుకొనుము'' అని ప్రత్యుత్తర మొసంగెను.

రాజు తనయొద్దలేని సమయమున నా యువతీమణి మేలుముసుంగునుదీసి తనతోఁగూడ నున్నయాపెతో 'విమలా! రాజునకు నన్నెఱిగింప నీకేల యిష్టములేదు?' అని యడిగెను.

'నీప్రశ్నకుఁ బ్రత్యుత్తరము మీతండ్రిగారికిఁ జెప్పెదను లే? కాని యిపుడాధ్వని యేమియో?'

"రాజును వెదకుటకై యాతని సైనికులు వచ్చినట్లున్నది. ఆతఁడు మనతోనున్న నీకు భయమెందులకు?"

పల్లకీ, బోయవాండ్రకొఱకేఁగిన యాశ్వికు లింకను రాలేదు. ఆయువిదల నటవిడిచి సమీపమందలి పల్లెకు విశ్రమింపనేఁగిన మనుష్యులు మరల వచ్చుచుండిరి. జగత్సింగు వారినిజూచి లోనికేఁగి పరిచారికతో నిట్లనియెను. 'కొందఱు బోయవాండ్రును, ఆయుధపాణులగు మనుజులు కొందఱును, బల్లకితో వచ్చుచున్నారు, నీవావలకేగి వారు మీసేవకులగుదురో కారో గుర్తింపుము'

విమల తలుపుసందునుండి వారలఁజూచెను. వారామె మనుష్యులే. జగత్సిం గిట్లు చెప్పెను. "ఇఁక నేను మీకడనుండరాదు. ఉండిన నేదైననాపద రావచ్చును. మీకు సుఖమగుగాక! నాకనుజ్ఞ. సుఖముగ మిమ్ముల నింటికడఁ జేర్పుమని శైలేశ్వరు నిదెవేఁడుచున్నాఁడను. నాదొక్క ప్రార్థనమున్నది. వారము దినములలోపల మన యీసమావేశమెక్కడను దెలియనీయరాదు. కాని, నన్నుమాత్రి మెప్పుడును మఱవకుఁడు. నన్ను మఱచిపోకుండ నిదిగో దీనిని నీకడనుంచుము. మీప్రభుతనయ యెవ్వరో నే నెఱుంగలేకపోయినను మీలక్షణములు నాహృదయముననాటుకొనియున్నవి—'

ఇట్లు చెప్పుచు జగత్సింగు తలపాగనుండి ముత్యాలహారము నొకదానినితీసి విమల శిరస్సుపైనుంచెను. ఆయముత్యాల

హారము నామెగ్రహించి తనకబరికిఁజుట్టుకొని యవనతశిరస్కుఁడై వందనమొనర్చి యిట్లనియెను.

'రాకుమారా! మీరత్యంతాభిలాషతో నన్నొక్క విషయమునుగూర్చి యడిగితిరి. దానికిఁ బ్రత్యుత్తరమీయలేకపోయినందులకు కెంతయో చింత నొందుచున్నదానను. నన్ను మన్నింపుఁడు. మీరడిగినవిషయమున నేనిట్లు మౌనము వహించుటకుఁ దగినంత కారణమొకటి యున్నది. అయినను మీకంతగాఁ బ్రియతమగునేని పదునేను దినములు గడచినపిమ్మట మిమ్మెట దర్శింపఁగలుగుదునో యాజ్ఞయిండు.'

జగత్సింగు కొంచెమాలోచించి యిట్లనియెను. 'ఈ యాలయమునందే. ఇట నన్నుఁజూడనేరవేని మరల మనమెన్నఁడును గలిసికొనఁజాలము.'

విమల వందన మొనర్చుచు 'భగవంతుఁడు మిమ్ము రక్షించుఁగాక!' అనియెను.

జగత్సింగు మరల నొక్కమారా యువతీమణిపై జంచలదృష్టి సారించెను. పిదప నశ్వారోహణ మొనర్చి యదృశ్యుఁడయ్యెను.

మూఁడవ ప్రకరణము

—♦—

మొగలాయీలు—పఠానులు

పాఠకులారా! ఆలయమునుండి వెడలిన జగత్సింగే మయ్యెనో, లావణ్యరాశియగు నాయువతి చారిత్రమేదియో, తెలిసికొన మీరు వేడుక పడుచుందురు. కాని యావిషయ మిప్పుడు చెప్పను. జగత్సింగు రాజపుత్రుఁడు. ఆతఁడు వంగ దేశమున కేలవచ్చెనో యొంటరిగా నేల ప్రయాణముచేయు చుండెనో, మీకెఱింగించుటకై యాకాలపు వంగదేశ రాజ కీయస్థితి నిటసంగ్రహముగ వర్ణించెదను. అందుచే నీప్రకర ణము చారిత్రాంశములతో నిండియుండును. కావున నోర్పు వహింప లేనిచదువరు లీ ప్రకరణమును జదువకుండ దాఁటిం చెదరుగాక! గాని, యోర్పుతోఁ దుల్యమయినది లేదుసుఁడీ.

భక్తియార్ ఖిల్జీ, వంగదేశమున నర్ధచంద్రధ్వజమును నాటినతరువాతఁ బఠానులు దానిని గొన్నిశతాబ్దములు నిరం కుశముగ, బరిపాలించిరి. 932-వ సంవత్సరములో సుప్ర సిద్ధుఁడగు సుల్తాను బేబ రప్పటి ఢిల్లీచక్రవర్తియగు యిబ్రి హీమ్‌లోడీని జయించి ఢిల్లీసింహాసనము నాక్రమించుకొని యెను. కాని, యప్పుడును వంగదేశముమాత్రము తామర లేన్ వంశీయుల యధికారముక్రిందకుఁ బోయియుండలేదు.

మొగలాయీవంశదీపకుఁడగు నక్బరు, సింహాసన మధిరోహించువఱకును వంగదేశము పఠానుల స్వాతంత్రపాల

నములోనే యుండెను. అవివేకియగు దాయూదుఖానుఁడొక చెడుముహూర్తమున సాహసించి, నిద్రించుచున్న సింగమును దనచేతులతో మేలుకొలిపెను. అతఁడుచేసిన యీ దుడుకు కార్యమునకు ఫలము వెంటనే లభించినది. అక్బరుని సేనాధిపతియగు మణియమ్ఖా ననునాతఁడు రణరంగమున నాతని నోడించెను. దాయూదు సింహాసనమును గోల్పోయెను. 982-వ సంవత్సరములో దాయూదుఖానుతనతోడివారలతోఁ గూడ నొరిస్సాదేశమునకు బాఱిపోయెను. వంగదేశము మొగలాయీలచేతఁ బడియెను. పఠాను లొరిస్సాలోరాజ్యము స్థాపించుకొనిరి. వారి నొరిస్సానుండి లేవఁగొట్టుట మొగలాయీలకుఁ జాలకష్టమయిన పనిగానుండెను. తుదకు వంగశకము 986-వ సంవత్సరములో రాజప్రతినిధియగు ఖాన్ జహాఖా ననునతఁడు పఠానులను రెండవపర్యాయ మోడించి యొరిస్సాను చక్రవర్తియధికారము క్రిందికిఁ దీసికొనెను. తరువాత నల్లరులు బయలువెడలెను. వంగదేశమునఁ బన్నులువసూలు చేయుటలో నక్బరొక క్రొత్తసెటిలుమెంటు పద్ధతి నేర్పాటుచేసెను. అందుమూలమున నచ్చటి జాగీరుదార్లును, భూస్వాములును, నసూయజెందిరి. వారిశాశ్వత స్వాస్థ్యములను సంరక్షించుకొనుట కాయుధములను జేతఁ బూనిరి, ఇదేసమయమని పఠానులు మరల ధ్వజమెత్తిరి. తమలో, కటుల్ఖా ననునతని ప్రధానునిగాఁజేసి యొరిస్సాను మరలఁ దమయధికారముక్రిందికిఁ దీసికొనిరి. సమయమును

గని వెట్టి తమశక్తిసామర్థ్యముల నగపఱిచి మిధునపురము విష్ణుపురములను రెండుజిల్లాలనుగూడ పఠానులు వశపఱచుకొనిరి. ఈ రెండుమండలములు నోరిస్సారాజ్యములోఁ జేరినవికావు.

చక్రవర్తిప్రతినిధియగు ఖాన్ అజీమును, నాతని తరువాత ప్రతినిధి షహాభాజుఖానును గూడశత్రువులనుండి యాప్రదేశములను లాగుకొనలేక పోయిరి. తుదకీ దుష్కరకార్యనిర్వాహణమునకు హిందూయోధుఁ డొకఁడు నియమింపబడియెను.

నూతన మతాభిమానావేశమై హిమాలయపర్వతపంక్తినుండి మహమ్మదీయ సేనాప్రవాహము మనదేశమునకుఁ దోసికొనివచ్చినప్పుడు పృథ్వీరాజును, మఱికొందఱు రాజపుత్రవీరులును, తమనిరుపమాన శౌర్యముచే దాని నాఁపి హిందూదేశమును గాపాడిరి. కాని, అయ్యో! హిందూదేశమా! నీవకుగంటుటయే భగవదుద్దేశము కాఁబోలును. రాజపుత్రవీరు లైకమత్యములోఁ దమ బలమభివృద్ధిచేసికొనుటకుబదులు తమలోఁదాము గలహించిరి. విసుఁగుజెందకుండఁ బూనికతోఁ జేసిన ప్రయత్నములవలన మహమ్మదీయులు హిందూరాజ్యముల నొక్కటొక్కటిగ నొడిసికొనిరి. తుదకు ఢిల్లీయందు వారిరాజ్యమును స్థాపించిరి. చాలకాలము వఱకిట్లు మహమ్మదీయులు జయముల నందుచున్నను నొక్కమాఱుగ క్షత్రియజన్మలగు రసపుత్రుల నణఁగఁ ద్రొక్క-

లేకపోయిరి. రాజపుత్త్రిలలోఁ జాలభాగ మెప్పుడును స్వతంత్త్రిలుగనే యుండుచువచ్చిరి. ఇదిమొదలు మహామ్మదీయ ప్త్రిభుత్వము పూర్ణముగ విచ్ఛేదమగు వఱకును బరాక్రమైన జీవనులగు రాజపుత్త్రిలు యవనులతోఁ దఱచుగా యుద్ధము నకుఁ గాలుద్రవ్వుచునే యుండెడివారు. అనేకసమయములలోఁ మహామ్మదీయులఁ బలాయనులను గావించుచువచ్చిరి. అయినను గ్రిమక్రిమముగ ఢిల్లీసార్వభౌమునకుఁ గప్పము గట్టవలయునని చాలమంది రాజపుత్త్రిలు నిర్బంధింపఁబడిరి. క్రిమక్రిమముగ రసపుత్రిల పరాక్రిమమును క్షీణించినది. వారు పురాతనగౌరవప్రితిష్ఠలను నిలుపుకొనుటయందలక్ష్య భావము వహించిరి. చక్రివర్తి కుటుంబముతో సంబంధ బాంధవ్యములు చేసికొనుట మొదలగు నుపాయములచే వారియను గ్రిహాసంపాదనముఁజేయ మొదలుపెట్టిరి. ఇఁకఁ జక్రివర్తులో! పరాక్రమవంతులగునట్టి శత్రివుల నెవ్విధముననైనఁ దనకు లోబఱచుకొనవలయునను తలంపున రాజపుత్త్రిలతో బంధుత్వమును స్నేహము నభివృద్ధి చేసికొనుచుండిరి. ఆకాలమున సామంతరాజులందఱుఁ గ్రిమగ్రిమముగఁ జక్రివర్తి సేవకులు కాఁజొచ్చిరి. ధీవిశారదుఁ డగు నక్బరుచక్రివర్తి పూర్వపు సార్వభౌములకంటె నన్నివిషయములందును జాలఁ దెలివి గలవాఁడు. హిందూరాజ్యమునుబరిపాలించుటకు స్వదేశస్థులే తగినవారనియు, విదేశీయులనర్హులనియు, యుద్ధమునందుఁ గాని పరిపాలనమునందుఁగాని రాజపుత్రిలతో సమానులు

లేరనియు యక్బరునకు నమ్మకము. కావుననే యక్బరు సర్వసామాన్యముగ హిందూదేశనివాసులనే, యందుముఖ్యముగ రసపుత్రులనే, తనప్రభుత్వమున ముఖ్యోద్యోగులుగ నియమించెను. మనకథాకాలమున నక్బరుకడ నున్నతోద్యోగమున నున్న రాజపుత్రులలో, రాజగు మానసింహుఁడగ్రగణ్యుఁడు. అక్బరునకుమారుఁడగు సలీమున కీతఁడు బావమఱఁది. అజీమ్ ఖానుఁడును, షాబాన్ ఖానుఁడును, విఫలప్రయత్నులై పోవ నక్బరీ పరాక్రమశాలిని బెంగాలు బీహారు దేశములకు, బరిపాలకునిగఁ బంపెను.

997–వ సంవత్సరములో మానసింహుఁడు పాట్నా చేరి యక్కడి యల్లరుల నణచివైచెను. మరుసటి సంవత్సరమున నొరిస్సాపై దండువెడలెను. మానసింగు పాట్నాకు వచ్చి నప్పుడు వంగదేశమునఁ దనకుఁ బ్రతినిధిగ సయ్యదు ఖానునను నతనిని నియమించివచ్చెను. ఒరిస్సాపై కేగుచు నిప్పుడు సయ్యదుఖానునకాతనిసైన్యముతోఁగూడ బరద్వాను, నొద్దకువచ్చి తన్ను గలిసికొనుమని యుత్తమువ్రాసెను.

మానసింగు బరద్వాను జేరెను. సయ్యదు రాలేదు. ఇట్లు వర్తమానముమాత్ర మంపెను. 'సైన్యమును సమకూర్చుటలోఁ జాలనాలస్యముగాకతప్పదు. అప్పటికి వర్షకాలము వచ్చును. వర్షకాలమున సైన్యములతోఁ బ్రయాణము సలుపుటదుర్ఘటము. కావున నదిగతించువరకును మీరటవిడిసి

యుందు రేని నా సైన్యముతో వచ్చి చేరెదను' అంతకంటె వేరు మార్గము లేనందున నాతఁడు చెప్పినరీతిగఁ దారుకేశ్వర నదీ తీరముననున్న జహనబాదునగరమున, సేనలను విడియించి మానసింహుఁడు సయ్యాను కొఱకెదురు చూచుచుండెను.

తానూరకుండుటనుజూచి కటులుల్ ఖానుఁడు దేశమును గొల్లగొట్టుటకై బయలుదేరినాఁడనియు సమీపమునఁ గొన్ని మైళ్ళలలోనున్నవాఁడనియు జహనబాదులోనున్న మాన సింహునకొక సమాచారము వచ్చెను. మానసింగు పరిపరి విధముల చింతించెను. శత్రువెక్కడనుండెనో, యాతని యుద్దేశమేమియో యాతఁడేమిచేయుచుండెనో మొదలగు వృత్తాంతముల నిజమును తెలిసికొని రానొక యుద్యోగిని బంప వలయునని నిశ్చయించెను. అప్పుడాతని ప్రియపుత్రుఁడగు జగత్సింహు డాతనితోఁగూడ నున్నవాడు. శత్రువుల సమా చారములను తెలిసికొనుటకై పోవలయునని జగత్సింగుకూడ నాత్రము నొందుచుండెను. అదియెఱిఁగి మానసింగునూఱుగు రాశ్వికులతో జగత్సింగును శత్రుసమాచారములను కను గొనుటకుఁ బంపెను. రాజపుత్రుఁడు తనపనిని నెఱవేర్చు కొని మరలెను. ఆతఁడు మరల జహనబాదునకుఁ బోవుచు మార్గమధ్యమునఁ జదువరులకు బరిచయుఁడయ్యెను.

యువకుఁడైన సేనాధిపతి

జగత్సింగు తండ్రికడకు వచ్చెను. 'పఠాను లించు మించేఁబది వేలున్నారు. వారిప్పుడు ధారాపుర సమీపమున విడిసియున్నారు. చుట్టుపక్కలఁబల్లెలఁగొల్లగొట్టుచున్నారు. కొన్నిదుర్గములనుగూడఁ బట్టుకొనిరి. జయమును సంపాదించు చున్నారు. ఎదిరించువారులేక నిర్భయముగ నున్నారు. అనివిన్నవించెను. మానసింహుఁడు వారిదౌర్జన్యము నాక్షణమె యణంచివేయవలయునని యూహించెను. కాని, యీ పని సామాన్యమయినది కాదు. మిగులఁ గష్టము. కర్తవ్యమును నిశ్చయించుటకై యాతఁడీ దండయాత్రయందుఁ దనతోఁ గూడవచ్చిన సేనానాయకులందఱఁగూర్చి సభ చేసెను. అం దాతఁడిట్లు చెప్పెను.

'ఆదినమున కాదినము, గ్రామముతరువాత గ్రామము పరగణా వెంట పరగణా, క్రమక్రమముగా చక్రవర్తిచేతి నుండి దాఁటిపోవుచుండెను. మనమిప్పుడు పఠానుల నణంచి తీరవలయు, కాని, ఇదియెట్లు? వారిబల మతివిస్తారముగ నున్నది. మఱియు, వారుకోటలోపలనుండి రణమొనర్పఁ గలరు. మనమిప్పుడు వారినెదుర్కొని జయించినను; వారి నాశనమొనర్పఁ జాలము. కోటనుండి వెడలగొట్టలేము. ఒక వేళనట్టియెడమనమే యోడిపోవుటసంభవించెనేని యాశ్రయ విహీనమైన యీ శత్రుప్రదేశమున మనమువారిచేఁ జిక్కి

నాసనముగునుము. ఆలోచనా విహీనమైన యీ సాహస కార్యముచేఁ జక్రవర్తిసైనికుల ప్రాణముల నెన్నిటినో గోలుపోవలసిన వచ్చుటయేగాక యొరిస్సా నెప్పటికైన జయింపఁ గలుగుదు మనునాశకూడ లేకుండఁ జేసికొనినవార మగుదుము. కావున సయ్యదుఖాను వచ్చువఱకును మనమిట నిరీక్షించుచుండుటయే కర్తవ్యమని నాకుఁ దోచుచున్నది. కాని, యీలోపున శత్రువులు చెలరేఁగకుండ నాపుటకై తగిన యేర్పాటుల శీఘ్రముగఁ జేయవలసియుండును. మీయభిప్రాయఁమేమి?

'సయ్యదువచ్చువఱకును వేచియుండుటయే యుక్తము' అని వృద్ధోద్యోగులందఱుఁ బ్రతివచనం బిచ్చిరి.

మాన—'శత్రుల నాపుటకై సమర్థుఁడగు నొక్కని యాధిపత్యముక్రిందఁ గొలదిసైన్యము నంపుటమేలని నాయభిప్రాయము. సైన్యమునంతను బంపి కోల్పోవుటకంటె నిది మంచిది'

వృద్ధు—'మహారాజా! యీవత్సైన్యము నంపినను గెలుపొనఁగూడదని భయమొందుచున్నప్పుడు వేఱుగఁగొలది సైన్యమునంపినఁ బ్రయోజనమేమి?'

'రణరంగమునకు శత్రువుల కెదురుగఁ బంపవలయునని నాయభిప్రాయముకాదు. పల్లెలపై బఠానులు గుంపులు గుంపులుగఁబడి కదా పాడుచేయుచున్నవారు. కొలఁదిసైన్యమైనను రహస్యముగ దాఁగియుండి రణమొనర్చినచో శత్రుసమూహము నాఁపఁగల్గుదురని నాయుద్దేశము'

'మహారాజా ! అమోఘమైన నాశమున కిష్టపడి యెవఁడట్టి సైన్యాధికారమును వహించును?'

మానసింహుఁ డాగ్రహమున బొమ్ములుముడివడనిట్లని యెను. 'ఏమిా! మృత్యువనినఁ దృణప్రాయముగ నెంచెడి నిందఱు రాజపుత్త్రిలలో,నిందఱు మొగలాయీలలో, నొక్కని హృదయకోశమునుండియు నూపిరాడుచుండుట లేదా?'

అక్షణమే కొందఱు మొగలాయీలును, గొందఱు రసపుత్త్రిలును, లేచి 'రణమునకేగ మేముసిద్ధముగనున్నాము' అనిరి. అట జగత్సింగుగూడ నుండెను. అక్కడనున్న యందఱిలో నాతఁడు మిగుల పసివాఁడు. వారి వెనుకనుండి యాతఁడు 'మీయాజ్ఞ యయ్యేనేని చక్రవర్తి కార్యమును నిర్వహించుటకు నేనుగూడ సిద్ధముగ నున్నాఁడను.' అని యెను.

'ఆ! అట్లేలకాకూడదు?' అని మానసింగు గారవమున మాఱుపలికెను.

'రాజపుత్త్రిలును, మొగలాయీలును, నింతలో పౌరుషహీనులనిపించుకొనరని నాకు ధైర్యము కలిగినది. అట్లయిన నపాయకరమైన యీపనిని నిర్వహించుటకుమీరం ఱును సిద్ధముగ నున్నట్లేకదా? ఇప్పుడిందెవ్వ రీపనికి నియమింతుము?' అని యూతఁ డనియెను.

అందొక సభ్యుడు నవ్వుచు నిట్లు చెప్పెను.

'మహారాజా! ఇప్పుడిటుల చాలమంది ముందంజవేసి వచ్చుట జయసూచకము. వీరందఱు నీపనికై పంతములాడు

చున్నవారు, ఇందెవఁడు కొలది సైన్యముతో నేగుట కిష్ట పడునో వాని నీకార్యమునకు నియమింపుఁడు.'

'ఔనౌను. ఇదిమంచి యాలోచన' అని చెప్పుచు మానసింహుఁడు మొట్టమొదట తనకుఁ దానే యీపనికి ముందంజవేసి వచ్చిన యాతనితో 'నీవెంతసైన్యముతో శత్రువులపై కేగెదవు' అనియడిగెను.

'పదునేనువేలతో అట్లనుగ్రహింపుఁడు'.

'అట్లు చేయవలనుకాదు. పదునేనువేల వాహిని నిందుండి విడఁదీసితిమేని నిఁక నిటచాలినంతసైన్యముండదు. పదివేలతోఁ బోవసిద్ధముగనున్న శూరుఁడెవఁడు?'

సేనానాయకు లందఱూరకుండిరి. తుదకు యశవంతసింగు పదివేలకును సైన్యాధిపత్యమును దనకిప్పింపుమని యడిగెను. అతఁడు రాజపుత్త్రుఁడు. మానసింహునకిష్టుఁడు. మానసింహుఁడు వారలనందఱ సంతోషముతోఁ గలయఁజూచెను. ఇంతలో జగత్సింగులేచెను. అతనిదృష్టియాతనిపైఁ బ్రసరించెను. రాజదృష్టియాతనిపైఁ బడెను. ఆతఁడు వినయముతో 'మహారాజా! మీయనుగ్రహముండెనేని నేనయిదువేలసైన్యముతోఁబోయి కటులుఖానుని సువర్ణరేఖానది యావలియొడ్డునకుఁ దరిమివేయఁగలను' అనియెను.

మానసింహుఁ డూరకుండెను. సభ్యులు గుసగుసలాడుచుండిరి. కొంచెముసేపుండి 'కుమారా! రసపుత్త్రవీరులందఱును నిన్నుఁజూచి గర్వపడవలసినదే. అదినే నెఱుఁగుదును. కాని బిడ్డా! నీవు చాలదుడుకువాఁడవు' అనియెను.

జగత్సింగు చేతులుజోడించి 'తండ్రీ! నాప్రతినఁ జెల్లించుకొననేరక చక్రవర్తిసేనల వ్యర్థముగఁ గోలుపుచ్చితినేని నాకర్హ దండనము గావింపుడు' అని ప్రత్యుత్తరమిచ్చెను.

మానసింహుఁ డొక్కించుక యోచించి 'కుమారా! ఇటువినుము. రాజపుత్రోచితమైన నీస్వేచ్ఛా పరాక్రమమునకు నేనేలయభ్యంతరముఁ జెప్పవలయును? అట్లభ్యంతరము కలుగఁ జేయుట భగవదుద్దేశము కానేరదు. కావున నీకార్యమునకు నిన్నే నియమించితి' అనియెను.

ఇట్లు చెప్పుచు మానసింహుఁ డత్యంతాప్యాయముగ నాతనిఁగౌఁగిలించుకొని, సెలవొసంగెను.

అయిదవ ప్రకరణము

గరమందరము

జగత్సింహుఁడు ప్రయాణముచేసిన విష్ణుపురమునుండి జహనబాదునకుఁ బోవు బాటయొక్క గుఱుతు లిప్పటికి నున్నవి. ఆబాటకు దక్షిణమున కొంతదూరములో గరమందరమను నగరమొకటి యున్నది. దేవాలయమున జగత్సింహునిగలిసికొనినస్త్రీ లీపట్టణముననే పోయియుండిరి. ఈ నగరమునఁ బురాతన దుర్గములుచాలఁగనున్నవి. బహుశః దానికా పేరు వానిమూలముననే వచ్చియుండును. ఆమోదరానది దానిగుండఁ బ్రవహించుచుండును. మూఁడుకోణములు

గానున్న యాపట్టణమునకు మఱఁపుతిరిగి రెండువైపుల నానది వ్యాపించియుండెను. మూఁడవపక్కఁ బర్వతమును దొలిచి నిర్మించిన కోటగలదు. ఆకోటయొక్క శిరోభాగమున, నది మొట్టమొదటఁ బట్టణమున నెటఁ బ్రవేశించియుండెనో యా తావున, నాకసమునంటుచు నీటిలో విశాలమైన దుర్గమొకటి నిర్మింపఁబడియుండెను. అదియంతయు నల్లరాతితోఁ గట్టఁ బడినది. అభేద్యమగు నాదుర్గముయొక్క పాడైపోయిన విశా లోన్నతభాగములిప్పుడుకూడ గనఁబడుచున్నవి. కాలమాహా త్మ్యమున నందలికట్టడములన్నియుఁ గూలిపోయి క్రిందిభాగము లింకను గన్పట్టుచున్నవి. వెలుపలిభాగములఁ జంత, మఱ్ఱి మొదలగు వివిధవృక్షములును, మాధవియున్నగు పొదలును, నరణ్యముల వలెబెళెఁగి, పాములకును, దోడేళ్ళు మొదలగు క్రూరజంతువులకును, నివాసస్థానములయ్యెను. నదీతీరమున మఱికొన్ని దుర్గములున్నవి. వానియందేకవంశీయులగు కొం దఱు భాగ్యవంతులు కాపురమున్నారు. కాని, మనకథకును వీనికిని సంబంధమేమియును లేదు. మొదటిదుర్గమే మనకు గావలసినది.

ఢిల్లీ సార్వభౌముఁడగు బాలిన్, వంగదేశమును జయింప నేతెంచినప్పుడు జయధారసింహుఁడను యోధుఁ డొకఁ డాతనితోఁగూడ నుండెను. బాలినునకు జయమొనఁ గూడిన నాఁటిరాత్రి చక్రవర్తిపక్షమున నాతఁ డత్యద్భుత శౌర్యమును జూపియున్నాఁడు. అతఁడొనర్చినసేవకు సంతస మంది చక్రవర్తి గరమందరమను జాగీరు నాతనికి బహుమాన

మిచ్చెను. ఈజాగీరుదారును వంశీయులు క్రమక్రమముగ పరాక్రమవంతులై కోటలనుగట్టుకొని వంగదేశప్రభువును నిరాకరించుచువచ్చిరి. వంగశకము 998-వ. సంవత్సరములో పైనవివరించిన యాదుర్గము వీరేంద్రసింహుని స్వాధీనమందుండెను. ఈతఁడు జయధారసింహుని వంశీయుఁడు.

ఈతనిచిన్నతనములోఁ దండ్రికిని నీతనికిని సరిపడినది కాదు. ఇతఁడు దురహంకారి. తాలిమి లేనివాఁడు. తండ్రి యానతిప్రకార మొకప్పుడును బ్రవర్తించినవాఁడు కాఁడు. అందుచేఁ దండ్రియును దనయుఁడును నెప్పుడును గలహించుచునే యుండిరి. ఎప్పుడును వాదప్రతివాదములాడుచునే యుండెడివారు. వీరియింటి సమీపమున నొకభూస్వామి యున్నాఁడు. ఆతనికి బుత్త్రులు లేరు. ఒక్క-కుమార్తె యుండెను. ఆమెను దనకుమారునకుఁ బరిణయము చేయవలయునని వీరేంద్రసింహుని తండ్రి నిశ్చయించెను. ఈసంబంధమును జేసినచో వీరేంద్రునకు గొప్పయాస్తి లభించునని యాతని యుద్దేశము. ఇంతేకాదు, ఆకన్నెకూడ చాల సౌందర్యవతి. ఏవిధముచేఁ జూచినను ముసలివానిదృష్టికీవివాహము మిక్కిలి యనుకూలముగాఁ గాన్పించెను. వివాహ ప్రయత్నములన్నియుఁ జేసెను. దీనినంతను ద్రోసివైచి వీరేంద్రసింహుఁడు తమకు సమీపముననున్న నిరాధారురాలును బేదయు నగు నొక యనాథస్త్రీతనయను రహస్యముగఁ బరిణయమయ్యెను. ఈవార్త తండ్రిచెవులఁబడియెను. పట్టరాని కోపమువచ్చెను. తనయుని నావలకుఁ దరిమివైచెను. తండ్రిచే లేవఁగొట్టఁబడి

వీరేంద్రుడుఢిల్లీకివచ్చెను. సేనలో సైనికుడుగా జేరవలయునని యాతనియుద్దేశము. ఆతని భార్య యప్పుడు గర్భవతి. ఆమెను దనతోఁ దీసికొనిపోలేదు. తల్లి యింటికడ నుంచెను.

కుమారుఁడు వెడలిపోయినపిమ్మట నాముసలివాడు చాల శోకించెను. పశ్చాత్తాపపడెను. కుమారునివృత్తాంతములను దెలిసికొన శ్రద్ధవహించెను. అన్నివిధములఁ బ్రయత్నించెను. కాని, నిష్ఫలమయ్యెను. పిమ్మట గోడలిని సన్మానించి సంతోషపూర్వకముగా పేదరాలగు నామె తల్లి యింటనుండి తనకడకుఁ దీసికొనివచ్చెను. పిదప వీరేంద్రసింహుని భార్య యొకయాఁడుశిశువునుగని కొలది దినములలోనే కాలధర్మము నొందెను.

ఢిల్లీ జేరి వీరేంద్రసింహుఁడు సైనికవృత్తి నవలంభించెని. చక్రవర్తి రాజపుత్రసైన్యములోఁ జేరెను. కొలఁది కాలములోనే తన శక్తిసామర్థ్యములఁజూపి యందున్నతాధికారమును బడసెను. కొన్నిసంవత్సరములు గడచినవి. వీరేంద్రసింహుఁడు చాలద్రవ్యమును సంపాదించెను. గొప్పపేరు తెచ్చుకొనియెను. ఇంతలో నాతనితండ్రి మరణించెను. ఆ సమాచారమునువిని యాతఁడిట్లు వితర్కించుకొనెను. "ఇంక మనమింత దూరదేశమున నుండుట నగత్యము. సేవకావృత్తియునవసరమే" ఆతఁడు మరలఁదన స్వగృహమును జేరెను. ఢిల్లీనుండి యాతఁడెందఱినో మనుష్యులను దనతోఁగూడఁ దీసికొనివచ్చినాఁడు. అందొకపరిచారికయు, నొకసన్యాసియు నుండిరి. మనకథయందు వీరిరువురతోడను మనకుఁ బనియుం

డును. పరిచారిక పేరు 'విమల' సన్యాసి పేరు 'అభిరామస్వామి'.

మనమిదివఱకు విమలను పరిచారికయనిపిలుచుచున్నారము. ముందునునట్లే పిలుతుముగాక! ఆమె వీరేంద్రుని పనికత్తెయని యందఱు ననుకొనెడివారు. వీరేంద్రసింహుని గృహకృత్య విషయములన్నియు నామెయే నిర్వహించుచుండెను. విశేషించి యాతనికుమార్తె విషయమున మిగుల శ్రద్ధ తీసుకొనుచుండెను— కోటలోనామె నివసించియుండుటకిఁక వేఱుకారణములేవియు గనఁబడవు. అందుచే నేనామెను బరిచారికయని పిలుచుచున్నాఁడను. కాని, యామెయందు బరిచారికాలక్షణము లేవియుఁ గాన్పించుటలేదు. ఆమెను గోటలోనివారందరు గృహయజమానురాలుగ గౌరవించుచుండిరి. మిక్కిలి విధేయతను జూపుచుండిరి. ఆమెముఖలక్షణములనుబట్టిచూడ యౌవ్వనమున నామె యత్యధిక సౌందర్యవతియని చూపట్టుచున్నది. ప్రత్యూషసమయమున నస్తమింపనున్న చంద్రరేఖవలె నామె సౌందర్య తేజోకిరణ లేశమిప్పటికిని ప్రకాశించుచున్నది. గజపతి విద్యాదిగ్గజుఁడను నతఁడొకఁడా కోటలో నివసించియుండెను. అతఁడభిరామస్వామిశిష్యుఁడు. శాస్త్రపాండిత్య సంపాదనవిషయమున నెట్లున్నను, చాతుర్యముగా మాటలాడి హాస్యగాఁడనిపించుకొనవలయునని యతనికిఁ జాల నభిలాషకలదు. అతడు విమలనుజూచి "ఈపనికత్తె నేతిముద్ద తపేలావలె మనోహరమయినది. మోహాగ్ని చల్లారినకొలఁదిని యీయామె శరీరమంతకంతకు బింకమునొందుచున్నది" అని చెప్పుచుండును.

తనీ్నరీతిగ నెగతాళిమాటలాడినది మొదలు విమల, యాతనికి 'రసికదాసస్వామి' యను నెగతాళి నామ మొసఁగి పిలుచుచుండెను. రూపము నడవడి యటుండనిండు. విమల నాగరికత, సంభాషణతీరుఁ బరికించినచో నామెను సామాన్య పరిచారికయని భావింపవలనుపడదు. ఆమె చాలాకాలము చక్రవర్తి జనానాలో నుండెనని చాలమంది చెప్పెదరు. అది సత్యమో యసత్యమో విమలయే చెప్పవలయు. కాని, ఈ విషయమునమాత్ర మెప్పుడును నామె యే సూచనయుఁ జేసి యుండినట్లు కనబడదు.

విమల వితంతువా? భూషణములనుధరించినదే! విధవ వలె పర్వదినముల నుపవాసము చేయుచుండుట లేదే! అయి దువవలెనే సంచరించుచున్నది.

తిలోత్తమ నామె యతిగాఢాబమాఁతోఁ జూచుచుం డును. నిజముగా నామెయెడల నెంతో ప్రేమ, ఆమెస్వభావ మాలయములో స్పష్టపడినదికదా! విమలయన్నఁ దిలోత్త మకుగూడ నతిప్రేమ. వీరేంద్రసింహునితో వచ్చిన యభి రామస్వామి సర్వదా యింటికడనుండఁడు. తఱచు దేశము తిరుగుచుండును. ఒకటి రెండుమాసములు గరమందరమున నున్న నొకటిరెండు నెలలు తిరుగుచుండును. కోటలోని వారును, దదితర జనులును, నభిరామస్వామి వీరేంద్రసింహు నకు నాధ్యాత్మికగురువని తలంచెదరు. అందులకుఁ దగినట్లే వీరేంద్రుఁడాతని యెఱుకలేకుండ నేకార్యమును జేయఁడు. అతని నెంతయో పూజించుచుండును. ఆతఁడు చెప్పినట్లు

ప్రతివిషయమును జరుగుచుండును. అభిరామస్వామియనుభవ శాలి. కుశాగ్రబుద్ధి మఱియు జితేంద్రియుఁడు. ప్రాపంచక విషయములపై మనసువోనీయఁడు. అవసరమున్నప్పుడింద్రియ వృత్తులను సాధించి శాంతముగ లోకవ్యాపారములఁ జొనిపి నడిపింపఁగలఁడు. ఇఁక నట్టిమహనీయుని యాలోచనలు కొనసాగుట కేమికొదవ? అహంకార స్వభావుఁడై తాలిమిలేని వీరేంద్రసింహుని యోచనలకంటె నాతని యోచనలు జయప్రదములనిన నందాశ్చర్యమేమున్నది?

విమలయు నభిరామస్వామియునే గాకుండ నాష్మ్ని యను నింకొక పరిచారికకూడ వీరేంద్రసింహునితో వచ్చి యుండెను.

ఏడవ ప్రకరణము

అభిరామస్వామి యాలోచన

విమలా తిలోత్తమలు సుఖముగా నింటికిఁ జేరిరి. మూఁడు నాలుగుదినములు గడచెను. ఒకనాఁడు వీరేంద్రసింహుఁడు గృహకార్య నిర్వాహణస్థానమున మసలందుపైఁ గూర్చుండ నభిరామస్వామి విచ్చేసెను. వీరేంద్రుఁడు లేచి స్వామికొక దర్భాసనమొసంగెను. అభిరాముఁ డందుపైఁ గూర్చుండెను. ఆతనియనుజ్ఞఁగైకొని వీరేంద్రుఁడు మరల మసలంముపై నుపవిష్టుండయ్యెను.

"వీరేంద్రా! ఈదినమున నీతోఁ గొన్నిముఖ్యములైన సంగతులు మాటలాడవలసియున్నది"

'స్వామీ! అవహితుఁడను. అనుజ్ఞయిండు'

'మొగలాయీలకును బతానులకును గొలఁది కాలములో నొక గొప్పయుద్ధము జరుగనున్నది.'

'ఔను. ఏదోయొక గొప్పయుపద్రవము బహుశః జరుగఁగలదు..'

'ఇప్పుడు నీవేమి చేయ నెంచినాఁడవు?'

'ఈహస్తము శత్రుహతముఁ జేయకుండ నూరకుండునది కాదు. రానిండు.'

'వీరేంద్రా! నీవాడినవాక్యములు నీవంటి వీరాగ్రేసరునకుఁదగినవే. అయినను, జయముమాత్ర మొక్కపరాక్రమ విలాసమువలననే సమకూడునది కాదు. సంధివిగ్రహములను గూర్చినపద్ధతులను బాగుగ నెఱుంగుటనుబట్టి యుండును. నీవు పరాక్రమశాలివి. వీరాగ్రగణ్యుఁడవు. కాని, నీ సైన్యము వేయికి మించిలేదు. శత్రువులు నీకంటె నూఱు మడుంగులధికబలమును గలిగియున్నారు. ఎంత యోధుఁడయినను నట్టిశత్రునితో యుద్ధమునకు డీకొనునా? లెక్కకు నీ సైన్యముకంటె మొగలాయీల యొక్కయు బతానుల యొక్కయువాహినులు చాలహెచ్చుగనున్నవి. నీవందొక్కరి సాహాయ్యమును గలిగియుండినఁగాని రెండవవారి చేతినుండి నీవెట్లు దాటిపోఁగలవు? నేనిట్లంటినని కోపింపకుము. బాగుగ యోచింపుము. నీకిరువురును విరోధులైన నేమి ప్రయోజ

నము? ఎవరితోనైన శత్రుత్వమనర్థకమే. అట్టియెడ నొకరికి బదులిరువురితో వైరమెందులకు? కావున నందొకరితో నిష్టముగనుండిన మేలని నాయభిప్రాయము.'

వీరేంద్రసింహుఁడు చాలసేపూరకుండి యిట్లనియె.

'అయ్యా! అయిన నన్నెవరితోఁ జేరుమనియెదరు?'

'జయమెప్పుడును న్యాయపక్షమున నుండును, ఏపక్షమున న్యాయముండునో, యాపక్షమునఁ జేరుము. రాజద్రోహము మహాపాపము చక్రవర్తిపక్ష మంగీకరింపుము.'

'చక్రవర్తి యెవరు? మొగలాయీలును, పఠానులును రాజ్యమునకుఁ బోరాడుచుండుట లేదా?'

కప్పమెవరు గైకొనుచుందురో వారే చక్రవర్తులు.'

'అక్బరా?'

'నిశ్చయముగ నక్బరే.'

వీరేంద్రుని మొగమునఁ గోపచిహ్నములు కాన్పించెను. క్రమక్రమముగఁ గన్నులెఱ్ఱవడియెను. ఆ లక్షణములఁ జూచి యభిరామస్వామి యిట్లనియెను.

'వీరేంద్రా! కోపమునణంపుము. ఢిల్లీ సార్వభౌమునితోఁ జేరుము. మానసింహునితోఁగాదు'

వీరేంద్రుడు కుడిహస్తమునుజూఁచి యెడమ వ్రేలితో దానినిజూపుచు 'అయ్యా! మీ యాశీర్వచన ప్రభావమున నీహస్తమును మానసింహుని రక్తములో ముంచెదఁగాక!' అనియెను.

'శాంతింపుము. శాంతింపుము. అహంకారమభివృద్ధికి

భంగకరము. మునుపటి తప్పిదమున కేయుపాయముచేనైన మానసింహుని దండింపుము. అక్బరుతో నీకు వైరమేల?'

'నేను చక్రవర్తింజేరి యే సేనాధిపతి చేతిక్రింద రణమొనర్చెదను ? ఎవరికి సాయమొనర్తును ? ఎవరిని గౌరవింతును ? మానసింహునా ? అట్లైన్నఁడును సరిపడదు— కాలుచేయి యాడుచున్నంతవఱకు—కంఠమున జీవమున్నంతవఱకు—వీరేంద్రసింహుఁడట్టిపని చేయఁబోఁడు' అని క్రోధముగా ననెను.

అభిరామస్వామి ఖిన్నుఁడై యూరకుండెను. అట్లు కొంచెముసేపుండి 'అయినఁ బఠానులలోఁ జేరుటయే మంచిదనెదవా!' అనియెను.

'ఎవరితోనైన మైత్రి సంపాదించుట నాకంత యగత్యమా ?'

'ఔను. అగత్యమే'

'అయినఁ బఠానులపక్షమే యవలంభించెదను.'

స్వామి నిట్టూర్పువిడిచెను. మానము వహించెను. అతనికి నేత్రముల బాష్పము లుదయించెను. వీరేంద్రుఁడు మహాశ్చర్యముతో 'స్వామీ! నాయపరాధములను క్షమింపుఁడు. ఎఱుంగక నేనేమి నేరములఁ జేసితినో యానతిచ్చి నన్ననుగ్రహింపుడు' అనియెను. అభిరామస్వామి నేత్రముల దుడిచికొని చెప్పెను.

'వినుము. కొన్నిదినములనుండి జ్యోతిశ్శాస్త్ర గణితము జేయుచున్నాఁడను. నీకుమార్తెయందు నీకంటె నా

కెక్కువ ప్రేమయున్నదని నీవెఱుంగుదువుగదా! అమె గ్రహస్థితిని గణితము చేసినాఁడను.'

వీరేంద్రుఁడూరక చూచుచుండెను. ఆత్రముతో 'అయ్యా! గ్రహస్థితి యెట్టులున్నది? మీరేమి కనిపెట్టితిరి? అనియెను.

'ఒక మొగలాయీ యుద్యోగస్తునివలన నామెకొక గొప్ప యుపద్రవము రానున్నది.'

వీరేంద్రుని ముఖము నల్లవడియెను.

మొగలాయీలు నీకు శత్రువులుగా నుండిననే వారి మూలమున నీకాపదవచ్చును. వారికి నీవు స్నేహితుఁడవే యైనచో నట్టిదేదియు సంభవింపదు. ఇందువలననే మొగలాయీల పక్షమున నుండుమని నీకు బోధించుచున్నాఁడను. ఈ రహస్యమును వెలిపుచ్చి నీకు వ్యధకలుఁగజేయుట నాయుద్దేశము కాదు. అయినను, మనుష్యప్రయత్నములు పనికిరావు కదా! యోగమును దప్పింప నెవ్వరితరము? అది జరుగక తీరునా? లేకున్న నీవక్లిందులకు నిశ్చయించుకొని యుందువు?

వీరేంద్రసింహుఁడు మూకీభావము వహించెను.

'వీరేంద్రా! కటులుఖానుని రాయబారి యొకఁడు వచ్చి ద్వారముకడ నున్నాఁడు. నేనాతనిఁజూచియే యిటకు వచ్చితిని. నేను వలదనిచెప్పుటచే ద్వారపాలకుఁడాతనిఁ జాలసేపటినుండి నీకడకు రానీయలేదు. నేను చెప్పవలసినదేదియో చెప్పితిని. నీవాతనిప్పుడు రప్పింపవచ్చును అర్థమైన ప్రత్యుత్తరంబీయవచ్చును.'

వీరేంద్రుడు మోమెత్తి నిట్టూర్పుతో నిట్లనియెను.

'అయ్యా! తిలోత్తమను నేను చూడనంతవఱకు, నామె నాతనయయని భావింపనేలేదు ఇప్పుడో! ఆమెదక్క నాకీప్రపంచమున నెవ్వరును లేరు. నేను మీయాజ్ఞానువర్తినై మెలంగెద. గతమునంతను మఱచిపోయెదను. మానసింహుని పక్షమవలంబించెదను. రాయబారిని గొనిరమ్ము.'

వీరేంద్రునాజ్ఞను సరణిని దూతను లోనికిఁ దెచ్చిరి. అతఁడొక యుత్తరమునిచ్చెను. అది వీరేంద్రసింహునకు, కటులుఖాఁ వ్రాసినది. ఆ యుత్తరమునందలి సారాంశమిది.

'వేయిగుఱ్ఱపుదళమును, నయిదువందల మొహరీలును శీఘ్రముగఁ బంపుము. లేకున్న గరమందరముపై నిరువది వేల సైన్యముతో నెత్తివచ్చెదము.'

వీరేంద్రుడుత్తరముం జదివి యిట్లుజెప్పెను.

'రాయబారీ! మీరాజు సైన్యమును బంపనిమ్ము'

దూత, యవనతశిరస్కుండై వందనమొనర్చి పోయెను

విమల చాటుననుండి యీప్రసంగమును వినెను.

—*—

ఏ డ వ ప్ర క ర ణ ము

పరధ్యానము

తిలోత్తమ కోటలోని యొకగది గవాక్షములోఁ గూర్చుండియుండెను. ఆగదియామోద రానదినంటియున్నది. అది వేగముగఁ బ్రవహించుచు మర్మరధ్వనులను చేయుచుం

డెను. ఆమె ప్రవాహమందలి యొకసుడివంక వీక్షించుచుండెను మనసుమాత్ర మక్కడలేదు. పరధ్యానముతో నుండెను. సాయంతనమైనది. అస్తమించుచున్న సూర్యుని మృదుకిరణములచే నాకసమునఁ బశ్చిమాశయందలి మేఘములకు బంగారు పూఁత పూయఁబడెను. ఆబంగారు మేఘములీ నిరంతరప్రవాహోదకమున నాట్యము జేయుచుండెను. నది కావలియొడ్డున నత్యున్నత సౌధరాజియు, వృక్షపంక్తియు, నాకాశపటముపై జిత్రింపఁబడినట్లుండెను. కోటలోపల శుకపికశారికామయూరాది విహంగము లవ్యక్తమధురధ్వనులు సేయుచుండెను. రాత్రిసమీపించినతోడనే యొక విహంగ మాకసమునఁ దన ఱెక్కలవిప్పి నిశ్శబ్దముగఁజరించుచుఁగూటికై వెదకుచుండెను రసాలవృక్ష వనమందు నామోదరానదీ జలములందును విహార మొనర్చిన మందమలయా నిలుండిప్పుడు తిలోత్తమ కుటిలాలకములతోడనో, యామెభుజములపై సొగసుగనున్న పయ్యెదతోడనో, యాటలాడుకొనుచున్నవాఁడు. తిలోత్తమ లావణ్యవతి, ఆమెనిరుపమాన రూప సంపదలను బాఠకమహాశయుల దృష్టిపథమునఁ బెట్టవలయునని నాకెంతయో యభిలాషకలదు. కాని, యది గొంతెమ్మకోరిక. నాకది సాధ్యపడునా? ఓపాఠకమహాశయా! నీయావనమున నెప్పుడైన మోహావలోకనమునశాంతమృదుప్రకాశవిశిష్టనవయావనవతీ లావణ్యమును జూచియుంటివా? ఆమెమాధురీరూపము నీ హృదయ భావములయం దెన్నటికిఁబోవకుండునట్లు మలఁచియున్నదా? ఆయప్సరసన్నిభవిగ్రహము నీయావనమున, కౌమా

రమున, వృద్ధత్వమున, కార్యభారముచే నిరవకాశముగనున్న ప్పుడు, విశ్రాంతిసమయమున, నిద్రయందు, మేలుకువను, స్వప్నమున లోపల వెలుపల నంతట నెప్పుడును, గన్పట్టు చుండెనా? అట్లు కన్పట్టుచున్నను లేశమైన హృదయకళంక మును గలుగఁజేయని పరిశుద్ధవ్యక్తియగునట్టి కన్నియ నెప్పు డైనఁ జూచియుంటివా? చూచియుండిననే తిలోత్తమ యెట్టిలావణ్యవతియో నీవు గ్రహింపఁ గలుగుదువు. కొన్ని మనోహరాకృతులు తమ యుజ్వల లావణ్య ప్రభాజాలముల మన యజ్ఞానాంధకారమును బాఱఁదోలును. మఱికొన్ని తమ శరీరకాంతిచ్ఛటలఁ గపటవిన్యాసములు నెఱపుచు మన హృదయముల విషపూరితములుగ జేయుచుండును. తిలో త్తమ రూపరేఖావిలాస మట్టిదికాదు. ఆ మధురాకృతి కుసు మపేసలము. అది తన కోమలావయ రూప సంపదల మన మనోవీధి హర్షామృతబిందువుల గురియుచుండును. వసంత కాలమున సాయం సమయమందా నిలంబులఁదూఁగాడు మంజుల మాకందాంకురంబుచాడ్పున నాకోమలాకృతి మన తలంపుల నర్తనము సేయుచుండును.

తిలోత్తమ పదునారేండ్లది. ఆమెశరీరమింకను నిండు యౌవనవతికివలెఁ బూర్ణముగ నభివృద్ధిఁ జెందియుండలేదు. ఆమె రూపరేఖలయందింకను బాల్యచిహ్న మగపడుచునేయు న్నది. ధనురాకారమై మనోహరముగనున్న యామెఫాల ప్రదేశము సంకుచితమునుగాదు. విశాలమునుగాదు. స్నిగ్ధ జ్యోత్స్నవలె శాంతిప్రపూర్ణము. ఆమె వినీలచూర్ణ కుటిల—

కుంతలముల, భ్రూలతలను, గండభాగములను, కంఠప్రదేశమునను, భుజతలంబులను, వక్షస్థలమునను, విహరించుచుండెను. మిగిలిన కచపంక్తి వెనుకభాగమున మౌక్తికహారమున ముడువఁబడియుండెను. ధనురాకారముగఁ దీర్చినట్లున్న యాభ్రూలతలు చిత్రకారుఁడు చిత్రించినట్లొప్పుచుండెను. ఇఁక నొకఛాయామాత్ర మిచ్చియుండినయెడల నవి యేలోపమును లేక పరిపూర్ణత్వమునుబొంది యుండును. చదువరీ! హావవిలాస పూరితములగు చంచలనేత్రములు మాత్రమే నీకుఁ బ్రియతమములా? అట్లయినఁ దిలోత్తమ నీ హృదయాకర్షమొనర్పని రాశపడవలసినదే. ఆదృష్టులు ప్రశాంతములు. తనచూడ్కుల నామె విద్యుత్కాంతులఁ బ్రసరింపఁ జేయనేరదు. ఆ కోమలనేత్రము లతి విశాలములు, నిరంతరశోభా పరిపూర్ణములు, ప్రశాంత తేజో విభాసితములు. అవి ప్రత్యూషసమయ నిర్మల గగనభాగంబు కరణిసుందర నీలకాంతుల మెఱయుచుండును. వీక్షించునప్పుడాసుందరి నిర్మల విశాలనేత్రముల యందెందును గాపట్యలేశమయినను గానఁబడదు. కుటిలవీక్షణముల నామె యెఱుంగదు. ఆచూడ్కులు ధారాళములు, కాపట్యశూన్యములు, హృదయభావ ప్రబోధకములు, అవియే యామె హృదయనైర్మల్యము నెఱుకసేయున మోఘసూచకములు. ఆసుందరివదనము నెవ్వరైనఁ దేఱిపాఱఁజూచిన నామె యవనతముఖియగును చూడ్కులధోముఖంబులగును. తిలోత్తమ సమగ్రనాసిక యలంకార భారవహనక్లేశ మించుకయిన నెఱుంగదు.

కెంజాయరంజిల్లు నాయుల్లసితోష్ఠపుటంబు మాధురీ రసార్ద్రమయి యొప్పారుచుండెను. ఆయోష్ఠములు శిరీషకుసుమ పేశలములు, కించిద్వక్రిభానవిలసితములు, నిరంతర మందహాస రేఖా విభాసితములు, ఆహా! మృదు మందహాసాలంకృతంబగు నాసుకుమారాధర కిసలయంబును గాంచు భాగ్యమొక్కతరినైన నీకన్నులకబ్బెనేని, నీవు సన్యాసివైనను, తత్వవేత్తవైనను, యువకుఁడవైనను, వృద్ధుఁడవయినను, నీజన్మమధ్యమున దానినిమఱపోందఁజాలవు. అయిన నమాయకత్వమును, బాలికాత్వమును, దప్ప నంగు వేఱొకటేదియు గోచరింపదు.

పోతఁబోసినరీతి బాగుగఁ దీర్చినట్లొప్పుచున్నను, దిలోత్తమ సుకుమారావయవములు పరస్పరానుగుణముగఁ బరిపూర్ణత్వమును బొందియుండలేదు. యౌవనప్రాదుర్భావమువనో, నైసర్గిక గుణవిశేషమువలననో, యాసుందరగాత్రిమణుమాత్రమైన స్థూలమైనట్లగపడదు. అయిన నాసుకుమారశరీరావయవమ్ములన్నియుఁ బరిపూర్ణ వలయాకారమునొంది యతికోమలముగఁ గన్పట్టుచుండెను. ఆనిండయిన మణిబంధమున మార్వారీకంకణములు, నానిండయిన దండల వజ్రదీపితములగు భుజాలంకారములు, నానిండయిన వ్రేల నంగులీయకము, నానిండయిన కటిసీమ బంగారు మొలనూలు, నానిండయిన భుజముల భుజకీర్తులు, నా నిండయిన కంఠమున రత్నహారము మెరయుచుండెను. ప్రత్యవయవమును బరిపూర్ణ సౌందర్య విభాసితమైయుండెను.

తిలోత్తమయామెభవనమున గవాక్షమునఁగూర్చుండి యేమిచేయుచున్నది? సంజకెంజాయ నొప్పారుచున్న యాకసమును జూచుచుండెనా? అయిన నామె సుందరావలోకనము భూమిపైఁబ్రసరించుచున్న దేమి? నదీతీరమునుండివచ్చుమందమలయానిల సౌరభము ననుభవించుచుండెనా? అయిన, నామె ఫాలభాగమున స్వేదబిందువు లుదయించు చున్న వేమి? మలయానిలుం డామెవదనమున నొకప్రక్కనుమాత్రమే సోఁకు చున్నాఁడు. పొలములమేయుచున్న పశుగణమునుజూచుచుండెనా? అదియునుగాదు. పశుగణమింతకుఁబూర్వమే 'అంబా' యని యఱచుచుఁ దమయిండ్లకుఁ బోయియే యుండెను. కోకిలాగీతమును వినుచుండెనా? అట్లయినచో దీర్ఘాలోచన సేయుదానివలె నట్లుచూచుచున్న దేమి? లేదు. ఆమె యేమియుఁజూచుటలేదు. వినుటలేదు——తాననుభవించిన కష్టసుఖముల నెమరువేసికొనుచుండెను.

ఈబాలప్రాయమున నెట్టియాలోచన లామెహృదయమునాకర్షించి యుండును? ఆమె హృదయమున నేదయిన మోహాంకుర ముదయించి యపూర్వ వికారమునకు లోను జేసెనా? అయియుండును.

ఒకపరిచారిక దీపమును గొనితెచ్చెను. ఆలోచనల విడిచి తిలోత్తమ యొకపుస్తకమును గైకొని దీపముకడఁ గూర్చుండెను. ఆమె చదువఁగలదు. అభిరామస్వామికడ సంస్కృతము నభ్యసించెను. ఆమె యేమిచదువుచున్నది? కాదంబరి. ఆపుస్తకమామెకు సంతోషజనకము కాలేదు.

కొంచెము చదివి దానినటనుంచెను. పిదప సుబంధువిరచితం బగు వాసవదత్తం గైకొనియెను. ఒక్కించుక చదివి పరధ్యానముతో నాలోచించుచుండెను. మరలఁజదివెను. మరలయోచించెను. వాసవదత్తకూడ నామెకంత మనోహరముగ లేకపోయెను. పిదప గీతగోవిందమును గైకొనెను. కొంతసేపటి వఱకది యింపుగనేయుండెను. కాని,

'ముఖరమధీరమ్ త్యజమంజీరమ్ రిపుమివ కేళీలోలమ్'

అను గీతమును చూచునప్పటి కామెకు సిగ్గువచ్చెను. పుస్తకమును క్రిందఁబడవైచెను. ఆమెకొంతవఱకు శయ్యపైఁ గూర్చుండెను. అట, కలమును సిరాబుడ్డియు నుండెను. పరధ్యానముతో నామె యదియు నిదియు వ్రాయనారంభించెను క—స—మ — గది — తలుపు — చెట్టు — మనుష్యుఁడు ఇంక నేమేమియో—క్రమ క్రమముగ నాశయ్యయందొక భాగమంతయు నట్టివ్రాఁతలతో నిండిపోయెను. ఇఁక వ్రాయుటకుఁ దావులేదు. ఆమెచేయుచున్న దేదియో యిప్పుడు గ్రహించెను. తానుచేసినపనికయినవ్వుకొనియెను. తానేమి వ్రాసెనో చదువుకొనియెను. ఆమె యేమి వ్రాసినది ? వాసవదత్తా—మహాశ్వేతా — క—స—మ—ప—చెట్టు—సంజూతి—శివా—గీతగోవింద—విమలా—పొదలు—ఆకులు—కొన్ని యడ్డగీతలు కొన్ని నిడుపుగీఁతలు—కొన్ని వంకరటింకరగీతలు—కోట—అది—ఇది—ఇంకను నేమివ్రాసినది?

"కుమార జగత్సింహ"

తిలోత్తమముఖము సిగ్గుచే నెఱ్ఱవడియెను. తెలివితక్కువపిల్లా! నీవు సిగ్గుపడుట కిక్కడ నెవరున్నారు?

'కుమారజగత్సింహ' తిలోత్తమ యీమాటకొకసారి రెండుసారులు, మూఁడుసారులు, లెక్కలేనన్నిసారులు చదివెను. దొంగతనముచేయునప్పటి దొంగవలె నామె తలుపువంక జూచెను. మరలఁజూచెను. మరలజదివెను.

తనకృత్యము నెవ్వరైనఁజూచిపోవుదురను భయముచే నామెకుఁ జాలసేపు చదువధైర్యము లేకపోయెను. అతిశీఘ్రముగ జలమునుదెచ్చి వ్రాసినదంతయు, గడిగివైచెను. కాని ప్రయోజనము లేకపోయెను. ఆమె తనవస్త్రముతోఁ దుడిచి వైచెను. ఇంక నేదయిన స్పష్టముగఁ గన్పట్టుచుండెనేమో యని పరీక్షించెను. ఒక గుర్తైన దానిపై లేదు. కాని, ఇంక నేదియో యున్నటులామెకుఁ గాన్పించుచుండెను. ఆమె మరలఁగడిగి శుభ్రముగఁ దుడిచివైచెను. ఇంకను నింకను గన్పట్టుచునేయున్నది. ఏమది?

'కుమారజగత్సింహ'

ఎనిమిదవ ప్రకరణము

విమలయాలోచనము

అభిరామస్వామి తనకుటీరములోఁ బవిత్రాసనముపైఁ గూర్చుండెను. విమల యటఁనిలువబడియుండెను. జగత్సింగునితో వారెట్లు కలిసికొనిరో యాకథనంతయు నాతనితో జెప్పుచుండెను.

'ఈదినము పదునాల్గవదినము. ఱేపటితో పదునేను దినములు పూర్తియగును.'

'మంచిది నీవేమినిశ్చయము చేసుకొంటివి?'

'ఈవిషయమున మీయాలోచన కావలయు, అందు లకే మిమ్ముల దర్శించితిని.'

'అట్లయిన నావిషయమున నీక నేమియు నాలోచనము సేయరాదని నా యభిప్రాయము'

విమల యూరకుండెను. మిగుల విచారమునొందెను.

'ఏల? అట్లు విచారముతో నున్నదానవేమి?'

'ఇఁక తిలోత్తమ నేమిసేయవలయు?'

'ఏమి! తిలోత్తమ హృదయక్షేత్రమున మోహాంకురములుదయించెనా?'

కొంచెము సేపుండి విమల యిట్లనియెను.

'స్వామీ! నేను మీకడ నెంతని యీవిషయమును వెలిపెట్టుదును? ఈపదునాలుగు దినములనుండియు నహర్నిశము నామెచేష్టలంగని పెట్టుచున్నదానను. మోహవికారము లామెహృదయమున బాగుగా వృద్ధినొందినవి.'

'నీ వాఁడుదానవు. అనురాగచిహ్న మొక్కించుక కనఁబడినతోడనే యదియెంతో ఘనముగనున్నదని యూహింతువు. విమలా! తిలోత్తమ భావిసుఖమునుగూర్చి విచారింపకుము. ఆమె బాలిక. ప్రథమావలోకమున నామెహృదయ మించుకంత యొక ప్రక్కకొఱఁగినది. ఈవిషయమగు ప్రసం

గము నామెకడఁ దేవకుండ నుండినచోఁ గొలఁది కాలము లోనే యామె జగత్సింహుని మఱచిపోగలదు.'

'స్వామీ! ఇదియట్లుకాదు. ఆమెలక్షణములను బరికింప మీరనుకొనినట్లులేవు. ఈపదునేనుదినములలోపల నామె స్వభావమున నెంతయో మార్పుజెందినది. సఖులతోఁ గాని నాతోఁగాని యుల్లాసముగా మాటలాడుటలేదు. మాతోడనే కాదు ఈనడుమనామె తఱచుగ మాటలాడియేయెఱుఁగదు. చదువుకొనుటలేదు. పుస్తకములు శయ్యక్రింద నిద్రించుచున్నవి. పూలచెట్లెండిపోవుచున్నవి. నీరు పోయువారెవరు? ఉపేక్ష వహించుటచే వినోదవిహంగములు కృశించుచున్నవి. వేయేల ఆమె భుజించుటలేదు. నిద్రించుటలేదు. పరిశుభ్రవస్త్రముల ధరించుటలేదు. ఆమె మున్నెన్నఁడు నాలోచన చేసి యెఱుంగదు. ఇప్పుడో! షష్టిఘటికలు నాలోచనానిమగ్నయై యుండెను. ఆమెవదనము వాఁడిపోయియున్నది.'

అభిరామస్వామి చాలసేపు మాటలాడలేదు. 'ఒక్కమాఱు చూచినంతమాత్రమున నంతదృఢానురాగ మేర్పడదని నానమ్మకము. ఐనను, స్త్రీహృదయము దురవగాహము. అందు ముఖ్యముగ నవయౌవనవతుల హృదయములు భగవంతునకేయెఱుక. ఒరులెఱుంగఁజాలరు. కాని, నీవిప్పుడేమి చేయుదువు. ఆ సంబంధమునకు వీరేంద్రుఁడెన్నటికిని సమ్మతింపఁడు.'

'నేనాభయము మూలముననే యీవిషయము నింతవఱకు వెలిపుచ్చలేదు. జగత్సింహునకు మా వంశనామము

లెఱింగించి యుండలేదు.' విమల మొగ మొక్కింత మార్పు జెందెను. ఇట్లనెను. 'ఇప్పుడు మనమహారాజు మానసింహునితోఁ జెలిమిచేయ నిశ్చయించుకొనియెనుగదా! జగత్సిం డల్లుఁడగుటకు సమ్మతించిన నందునుపద్రవమేమున్నది?'

'మానసింహుఁడుమాత్ర మా వివాహమున కెట్లంగీకరించును?'

'అతఁడంగీకరింపకున్న జగత్సింగే స్వతంత్రింపగలడు'

'వీరేంద్రసింహుని తనయనాతఁడు మాత్రమేల పరిణయమాడును?'

'కులగౌరవ విషయమున నీ రెండు వంశములలోను నంత లోటుపాట్లు లేనివంశమేది? జయధార సింహుని పూర్వులు యదువంశములోనివారేకదా!'

'అట్టివంశమున జననమొందిన తిలోత్తమ మ్లేచ్ఛుని బావమఱఁదిని బెండ్లియాడునా?'

'విమల యాతనిపై దృష్టి సారించెను.

'ఎందులకుఁ బరిణయమాడరాదు? యదువంశమున కంటె హీనమగు వంశమేది?'

ఈమాట యనినతోడనే సన్యాసి నేత్రము లగ్ని గురియసాగెను.

'దుష్టురాలా! నీదుష్టగుణమును నీవు పోనిచ్చుకొంటివి కావు. నాయెదుటనుండి యావలకుబొమ్ము' అని కఠినముగా ననియెను.

—౧౦—

తొమ్మిదవ ప్రకరణము

కులాలంకారము

జగత్సింగు తండ్రికడ సెలవుగైకొని బయలువెడలెను. ఆతని సమాచారములు పఠానుల కత్యంతభయమును గలుగ జేసెను. వారికి దిగులుజనియించెను. కట్లుల్ ఖానుని నేఁబదివేల సైన్యముతోఁగూడ సువర్ణరేఖానదియావలకుఁ దరిమివేయుదు ననికదా యాతఁడు శపథముపట్టియున్నాఁడు. ఆతండింతవఱకు నట్టిజయమును గాంచకపోయినను జహానబాదునుండి బయలు దేరిన పదునైదు దినములలోపల సేనాధిపతిగనుండి చూపిన వ్యూహరచనాది యుద్ధనైపుణ్యమును విని మానసింహుఁడపరి మితానందమును బొందెను. 'పరాక్రమశాలియగు నాతన యునిమూలమున రాజపుత్రుల ప్రాచీనయశస్సు పునరుద్ధా రణము నొందగలదు' అని మెచ్చుకొనెను.

జగత్సింగు పరిపంథిచమూ సాగరముపైఁ దన కొలఁది సైన్యముతోఁబోయి బహిరంగముగ రణమున నెదిరించుట తగనిపనియని యెఱుంగును. అట్లెదిర్చిన నపజయమో మృత్యువో తప్పదు. అందుచే శత్రుసేనల కెదుటఁబడి రణ మొనర్పకుండుటకై జగత్సింహుఁడొక క్రొత్తపద్ధతి నవలం భించెను. తనసైన్యమును సాంద్రారణ్యముల యందును, విశాల పర్వతగుహాలయందును, దాచియుంచుచువచ్చెను. అట్టితావులా దేశముననున్నవి. పటకుటీరములకుఁ గూడ నట్టి ప్రదేశములనే యేర్పఱచెను. అవి ఎత్తైనగుట్టల మఱుఁగున నుండి యత్యంత సమీపముననున్న మనుష్యునకుఁగూడఁ గాన

రాకుండనుండెను. ఇవ్విధంబున దాఁగియుండి పఠానులగుంపే దైన సమీపముననున్నదని తెలిసినతోడనే సముద్ర తరంగమువలె బైఁబడి వారిని నిర్మూలముఁ జేయును.

వివిధ వేషములతో వేగువాండ్రనుబంపి శత్రువుల సమాచారములఁ దెప్పించుకొనుచుండెను. వేగువాండ్రు పండ్లమ్మువారిపోలిక, చేపఁలమ్మువారివిధమున, యాచకులభాతి, మతసన్యాసులరీతి, బ్రాహ్మణులవైఖరి, వైద్యులవలె, జోయి శత్రువుల యుద్దేశములను, ప్రయత్నములను, దెలిసికొని వచ్చుచుండిరి, అతఁడిట్లు వార్తల నెఱింగి యనువైన తావున కతిశీఘ్రముగ రహస్యముగ సైన్యమును భవితవ్య మెఱుఁగకుండవచ్చు పఠానులఁ దాఁకుటకై పంపుచుండెడివాఁడు. ప్రస్తుతావస్థనుబట్టి యొక చిన్నయపజయము సంభవమైనను నది తన సంపూర్ణనాశనమునకుఁ గారణమగునని జగత్సింహుఁ డెఱుంగును. అందుచే నామార్గమున నొకవేళ పఠానులబల మధికముగ వచ్చెనేని యెదుర్కొనెడివాఁడుకాఁడు. వారు దృష్టిపథమును దాఁటినపిదప మెల్లగవారిని వెంబడించి, యశ్వముల నాహారపదార్థముల నాయుధసామగ్రులఁ గొల్లగొట్టుకొని పోవుచుండును. అట్లుగాక వారు స్వల్పముగ నుండిరేని యనువగు ప్రదేశమునకు వచ్చుపఱకును బొంచి యుండి రాఁగనే వారిపైఁబడి యాకలిగొన్న పెద్దపులివలె ముక్కలు ముక్కలుగ వారిని నరికించుచుండెను. ఇట్లుచేయు చుండుటచే రాజపుత్ర బలము సమీపమున నున్నదని యెఱుంగక పఠానులు యుద్ధసన్నాహముచేయకుండ నుండుచు

వచ్చిరి. పాపము వారాకస్మికముగ రాజపుత్రులచే నోటంబడి పోరాటములేకయే ప్రాణములను గోల్పోవుచుండిరి.

ఈవిధముగా నెందఱో చాలఁగలవడిరి. పఠానులు నాశనమైరి. తుదకు బహిరంగరణమున జగత్సింగు సేనల నిర్మూలముఁజేయవలయునని వారుదృఢనిశ్చయులైరి. కాని, వారెక్కడనున్నారో యెవరును జెప్పలేరు. యమభటులవలె పఠానులవశానకాలమున వారంతట వారగపడి వారి మరణ కార్యములు సమాప్తినొందినతోడనే మరల నదృశ్యమై పోవుచుండిరి. జగత్సింహుఁడు వ్యూహరచనాది విద్యలఁ బరిపూర్ణుఁడు. అతఁడెప్పుడును దన యయిదువేల వాహిని నొక్కచోఁ గూర్పలేదు. ఇక్కడవేయి—అక్కడ నైనూరు దలు మఱియొకచో—రెండువందలు ఇంకొకచో రెండువందలు— ఈరీతిగ నుంచుచువచ్చెను. శత్రువు వచ్చుచున్నాఁడని తెలి యుటతోడనే యెక్కడ కెంత పంపవలయునో యక్కడ కంత సైన్యము నంపుచుండెడివాఁడు. కార్యము ముగిసినపిమ్మట నిఁక నాతావునఁ దనసేనల నుంచెడివాఁడు కాఁడు. రాజ పుత్రులెక్కడనుండిరో యెక్కడలేరో పఠానులు తెలిసికొన లేకపోయిరి. ప్రతిదినమునను, ప్రతినిమిషమునను, పఠానుల నాశనసమాచారములే కటుల్ఖానునకు వచ్చుచుండెను. ఏది యెట్లున్నను కోటలోనుండి కొలఁదికొలఁదిగ సైనికు లీవల రాను జంకుచుండిరి. వారి దుండగములణఁగిపోయినవి. వారికి కోటయే శరణ్యమయ్యెను. తుదకాహారపదార్థ సంపాదనమే వారికి దుర్ఘటముగ నుండెను. పఠానులవలన దేశమున

కుపద్రవము గలుగకుండ వారింపఁబడెననియు, వారు జగత్సింహుని చేతిలోఁ జిక్కికొనిరనియు, మానసింహునకు సమాచారమువచ్చెను. ఆతఁడు తనయునకిట్లుత్తరము వ్రాసెను.

'క్షత్రియకులాలంకారమా! కుమారా! చక్రవర్తి దేశమును పఠానులచేతినుండి విడిపింపగలవని నమ్ముచున్నాఁడను. నీకు సాహాయ్యమునకై యింకను బదివేల సైన్యమంపితిని.'

దానికి జగత్సింగిటులఁ బ్రత్యుత్తరము వ్రాసెను.

'తండ్రీ! మీచిత్తము. ఇంకను నధికముగ సేనలు వచ్చినమేలే. రాకపోయినను మీ యనుగ్రహమున నీయైదు వేలతోడనే నాశపథముఁ జెల్లించుకొనియెదను.'

జగత్సింగు వీరావేశుఁడయ్యెను. అవిచ్ఛిన్నవిజయాభిలాషియై యేగెను.

'ఓశైలేశ్వరా! నీ యాలయమున నే యువతీమణి యొక్క ప్రేమావలోకమున కీతఁడవశ్యుఁడయ్యెనో, యా భువనైక సుందరి యీసంగర కలకలారావమధ్యమున జగత్సింహుని మనసునకుఁ దలఁపునకువచ్చునా? అదృశ్యమయి పోవునా? అదృశ్యమైనచో నాతఁడును నీవలె ఱాతితో సృజియింపబడినవాఁడే.

పాఠకులారా! రండు. మనము విమలయొద్ద కేగుదము. జగత్సింగు ఱాయియో మనుష్యుఁడో చూతముగాక! ఈరణగుణాధ్వనులతో మనకేల? ఈయున్నిటికంటె విమల యొక్క తెరయే మనోహరమైనది.

పదియవ ప్రకరణము

ఆలోచనాంతర ప్రయత్నము

అభిరామస్వామి విమలను బొమ్మనిననాఁటి సాయంకాలమామె తనభవనమున నలంకరించుకొనుచుండెను. ఆమె ముప్పదియై దేండ్ల వయసుగల స్త్రీగదా! అలంకరణమునందింకను నామెకుత్సాహముండునా? ఏమి? ఎందుల కుండదు? యౌవనమున కిన్ని యేండ్లతోఁ బోవునను నియమమున్నదా? ఎప్పుడునుండదు, మోహసౌందర్యము లెంతకాల ముండునో యంతకాలమును యౌవనముండును. అవి వోయిన నదియుఁ బోవును. సౌందర్య విహీనయగువనిత నిజముగా యువతియైనను పలితయే. యువతి సౌందర్యవతియయ్యేనేని యామె నిరంతర యౌవనవతియగును. ఎవతెహృదయము మోహోల్లాసముల కపరిచయమో యామె యువతి కాదు. వానియందనుభవ మెవతెకుండునో యామె కేండ్లతోఁ బనిలేదు. ఇప్పుడునువిమలశరీరముల్లాసభావములచేనుప్పొంగుచునే యున్నది. ఇంకను నామె యంతరంగము మోహ పరిపూర్ణమయియే యున్నది. ఇప్పటికిని మోహప్రేరితములగు భావములామె హృదయమును వీడనేలేదు ఇంతేకాదు. ఏండ్లుగడచినకొలది సుకుమార సౌందర్యము మృదుభావము నొందుచుండును. చదువరులు కొంచెము వయస్సుగడచినవారుగ నుందురేని, యీమాటకుఁదప్పక సమ్మతించెదరు.

ఆమె యోష్ఠములు పక్వబింబ ఫలసదృశములు తాంబూలరాగసంయుతారుణ కాంత్యుజ్వలములు, వానిసౌందర్య

మును జూచిన యే మనుజుఁడా మెయౌవనవతి కాదని చెప్ప గలఁడు! కజ్జల సంయుతవిశాల నేత్రములనుండి వెడలుచున్న యాచంచల కటాక్షవీక్షణమూలం జూచిన, నామె యిరువది యైదేండ్లయువతికంటెఁ దక్కువవయస్సుగలదికాదని యెవఁడు చెప్ప సాహసించును? ఆహా! ఏమి యా నేత్రద్వయ సౌంద ర్యము! ఏమి యానిర్మాణకుశలత! ఏమి యాసుందర తర వీక్షణము ఏమి యాప్రకాశము! కొందఱు స్త్రీలనేత్రము లాశాప్రపూర్ణములు. అనవరత కేళీవిలాస తత్పరాయత్త చిత్తసంసూచికములు.

విమలనేత్రములిట్టివే. పాఠకులారా! విమల నిశ్చయ ముగ యౌవనవతి. ఇంతేకాదు. ఆమె నిరంతర యౌవన మనుభవించుచున్నదని చెప్పవచ్చును. చంపక కుసుమచ్ఛా యతో మెఱయుచున్న యామె మృదుగాత్రమును గాంచి, పదునాఱేండ్ల యువతీమణి యింతకంటె కోమలశరీర యని యెవ్వఁడు చెప్పగలఁడు? ఆమెకర్ణముల మాటుననుండి వచ్చి గండభాగములపైఁ బడు చూర్ణకుంతలములను జూచిన నామెనుజవ్వనియని చెప్ప సందేహ మెందులకు? యువతికిమాత్ర మట్లు కపోలములపైఁ బడుచుండవా? ఓ పాఠక మహాశయు లారా! నాదొక్కప్రార్థనము. నామనవి చెల్లింపుఁడు. మీ మనోనేత్రము నొక్కమాఱు వికసింపఁజేయుఁడు. విమల దర్ప ణముకడ తలదువ్వుకొనుచు నెట్లు గూర్చుండి యుండెనో చూడుఁడు! సాంద్రములగు శిరోజముల వామహస్తమునఁ బట్టుకొని యెట్లు దువ్వెనచేఁ జిక్కుదీయుచున్నదో పరికిం

పుడు. ఆమెయౌవన మనోహర వేషమును దర్పణమునఁ జూచికొని యెట్లు మందహాసముఁ జేయుచున్నదో వీక్షింపుడు. నడుమనడుమ నామె యోష్ఠములనుండివచ్చు మృదు మధుర గానామృతమును మెల్లిగఁ జెవియొగ్గివినుఁడు. ఇంతే కాదు. మీ కభిలాషకలదేని కామోద్రేక జన్యములగు నామె వక్షోజవైభవ దర్శనమున మీనేత్రములకు విందొనర్పుఁడు. పిమ్మట నవి కాలమునుజయించెనో లేదో నిష్పక్షపాతముగఁ జెప్పుడు. ఇవియన్నియుఁ గనివినిమీరిప్పుడామెకంటె నేయువతీ రత్నముమీహృదయము నాకర్షింపగలదో యోచింపుఁడు.

ఆమెశిరోజములను జడయల్లుకొనియెను. జడ ముడి వేయలేదు. వీపున వ్రేలాడవైచెను. పరిమళోదకములలోఁ దడిపిన చేరుమాలచే వదనము దుడిచికొనియెను. సుగంధ ద్రవ్యములతోఁ గూడిన తాంబూలరాగముచే నామెయోష్ఠ ములు ప్రకాశించుచుండెను. ముత్యములచేఁ జెక్కఁబడిన కంచెల దొడిగికొనియెను. ఆమెశరీరమంతయు సువర్ణమయా లంకారములు ధరించెను. పిమ్మట నాలోచించి మరల నామె యందు కొన్నిఁటిని దీసివైచెను. బుటేదారి యంచులతో నున్న మనోహరవస్త్రముల ధరియించెను. పగడములచేఁ బొదుగఁబడిన పాదరక్షలఁ దొడిగికొనియెను. జగత్సింహునిచే నియ్యఁబడిన ముత్యాలహారమును జక్కఁగదువ్విన యామె శిరోజములఁ జుట్టుకొనియెను.

అలంకరించుకొనుట యయినది. విమల తిలోత్తమ యున్న గదిలోనికిపోయెను. ఆమె వేషముజూచి తిలోత్తమ యాశ్చర్యపడి యిట్లనియెను.

'విమలా! ఇదేమి? ఈయలంకార మెందులకు? విశేషము లేమి?'

'ఆగొడవయంతయు నీకేల? నీకుఁ జెప్పదగినది కాదు'

'చెప్పవా? నిజము చెప్పు! నీవెటకేగెదవు?'

'నేను వెళ్ళిపోయెదనని నీతో నెవరుచెప్పిరి?'

తిలోత్తమ కలవరపడియెను. విమల యామెయాకుల పాటు గ్రహించి నవ్వుచు నిట్లనియెను.

'నేను చాలదూర మేగుచున్నాను'

తిలోత్తమ వదనము పూర్ణముగ వికసించినకమలము వలె నయ్యెను.

'నీ వెటకేగెదవు?'

'చెప్పుకో!'

తిలోత్తమ యామెవదనమునఁ జూడ్కులునిలిపెను.

విమల యామెహస్తమును గ్రహించి గవాక్షముకడకు దీసికొనివచ్చి యిట్లు చెప్పెను.

'నేను శైలేశ్వరుని యాలయమున కేగుచున్నదానను. అచ్చట నేనొక రాజోత్తమునితోఁ గలిసి మాటలాడవలసి యున్నది.'

తిలోత్తమ శరీరము కంపమొందెను. ఏదియో గొప్ప మనోవికార ముదయించెను. ఆమె ప్రత్యుత్తర మీయలేదు. విమల చెప్పఁదొడంగెను.

నేనభిరామస్వామితో మాటలాడితిని. జగత్సింగు నకు నిన్నిచ్చి పరిణయమొనర్ప మీతండ్రిగారెన్నఁటికి నిష్ట

పడదు. అట్టిప్రస్తావము నాతనికడఁ దేరాదు. ఇంకనీవిషయ మాతనిచెవిఁబడిన నేమి ముప్పువాటిల్లునో? ఎంతయాగ్రహ మొందునో? ఎట్టిదండన విధించునో? ఈగండము గడచిన భగవంతున కనేక వందనములొనర్చెద.'

తిలోత్తమ యవనతముఖియై 'అయిన నెందుల కేగ దవు' అనెను.

'ఈదినమున వచ్చెదనని యాతనితో వాగ్దత్త మొనర్చి యుండలేదా! మనవృత్తాంతము నెఱింగించెదనని చెప్పియుండ లేదా! మనల నెఱింగినంతమాత్రమున నతనికగు ప్రయోజన మేదియో నెఱుంగను. ఐనను మన యుదంతమాతనికిఁ దెలి పెదను. ఈసందర్భమున నాతఁ డేది శ్రేయస్కరమని తలం చునో చూతముగాక! నిజముగా నిన్నాతఁడు ప్రేమించిన---

ఆమెను సంపూర్తిగ నుడువనీయలేదు, తిలోత్తమ వస్త్రపుఁ జెఱఁగుచే నామెనోరును మూతవైచి 'విమలా! ఈమాటయేమి! సిగ్గు! సిగ్గు! నీయిష్టమువచ్చిన చోటకుఁ బొమ్ము అంతేకాని నావిషయ మెవ్వరివద్దను తలపెట్టకుము. ఒకరి విషయమును నాకడ నుడువకుము' అనియెను.

విమలకు నవ్వువచ్చెను. 'నీవు బాలికవు; పాప మీ వయసున నిన్నిసందర్భమున ముసుఁగుమనియెవ్వరుచెప్పుదురు?'

'పో! ఇంక నీమాటలు నేను వినను పొమ్ము.'

'అయిన నేనాలయమునకుఁ బోను.'

'ఎక్కడకును బోవలదని నిన్ను పట్టుకొంటినాయేమి? నీ వెక్కడకుఁ బోవలయునన్న నక్కడకుఁబోవచ్చును.'

'అయిన నేను వెళ్ళనే వెళ్ళను' అని విమల నవ్వుచు చెప్పెను,

తిలోత్తమ యవనతావలోకనయై 'వెళ్ళు' అనెను. విమలకు మరల నవ్వువచ్చెను. ఒక్కించుక సేపూరకుండి యామెతో 'నేను వెళ్లెదను. మరల వచ్చువఱకును నిద్ర బోకుము.' అనియెను. తిలోత్తమ మోమునఁ జిరునగ వంకురించెను. అది 'నే నెట్లు నిద్రపోఁగలను.' అని చెప్పుచున్నట్లగ పడియెను. విమల దానిని గ్రహించెను. ప్రయాణోన్ముఖయయ్యెను. తిలోత్తమభుజముపైఁ జేయివైచి రెండవ చేతితో నామెగడ్డమును బట్టుకొని ఒక్కమాఱామె ముఖమువంకఁ బరికించెను. నిండు ప్రేమమున నామెను ముద్దు పెట్టుకొనెను. తిలోత్తమ బాష్పలోచనయై చూచుచుండెను. ఇంతలో నాప్తాస్మీ గదితలుపునొద్దకువచ్చి 'విమలా ప్రభువువారి సెలవయినది' అనియెను.

తిలోత్తమ యామాటవిని విమలతో రహస్యముగ 'నీవు నీదుస్తులను మార్చుకొని మఱియటకుఁబొమ్ము' అని చెప్పెను. విమల 'భయములేదు' అని బదులునుడివి వీరేంద్రసింహుని శయనాగారమున కేగెను.

ఆయన పండుకొనియుండెను. పరిచారికయొకతె పాదములు పట్టుచుండెను. ఇంకొకర్తు విసరుచుండెను. విమల పానుపుకడకేగి 'ఏమిసెలవు' అనియెను. వీరేంద్రుఁడు తల యెత్తి చూచి యాశ్చర్యమునొంది యిట్లనియెను.

'విమలా! నీవేదైన పనిమీదఁ బోవుచుంటివా?'

'చిత్తము. యేలికయాజ్ఞయేమి?'

'తిలోత్తమ యేమిచేయుచున్నది? ఆమెకు దేహా రోగ్యము చెడినది. ఇప్పుడు నెమ్మదిగ నున్నదా?'

'ఉన్నది'

'విమలా! నీవొక్కింతవిసరెదవా? ఇంతలో నాస్వామినీ తిలోత్తమను దీసికొనివచ్చెను.'

ఇంతవరకు విసరుచున్నస్త్రీ యవ్వలి కేగెను. విమల యాస్వామిని నావల వేచియుండుమని సైగచేసెను. వీరేంద్రుడు కొండొక పరిచారికతో 'లక్ష్మీ! తాంబూలమును గొనిరమ్ము' అనియెను. పాదసంవాహన మొనర్చుచున్న యామె తాంబూలమును దేబోయెను.

'విమలా! ఈదినమున వేషమువైచితి వెందులకు?'

'పనియుండి'

'ఏమిపని? నేను వినరాదా?'

'అయిన వినుడు'

విమల యాతనిపై మోహవికార బీజములగు వీక్షణములం బఱపి యిట్లనియెను. 'నేను జారిణినిగదా! నేనిప్పుడొక స్థానమునకుం బోవలయు.'

ఇట్లుచెప్పుచు నటనుండి యామె తత్క్షణము వెడలిపోయెను.

—♦o♦—

పదునొకండవ ప్రకరణము

ఆస్మానీ దౌత్యము

విమలసైగప్రకార మాస్మాని యామెకొఱకు వేచి యుండెను. విమలవచ్చి యిట్లుపలికెను.

'నీతో రహస్యమయిన మాటయొకటి చెప్పవలసి యున్నది.'

'నీ వేషమునుజూచి యీదినమున నేదో గొప్ప విశేష మొకటి యుండియుండునని యిదివరకే యనుకొంటిని'

'నేనిప్పుడొక కార్యముమీఁదఁ జాలదూరము పోవలసి యున్నది. ఒంటరిగఁబోలేను అన్యులఁగూడ దీసికొనిపోవుట శ్రేయము గాదని తోఁచెడిని. నీవిప్పుడు తప్పక నాతో రావలయు'

'నీ వెటకేగెదవు'

'ఆస్మాని! నన్నింతగా నీ వెప్పుడు నడుగలేదే?'

ఆస్మాని కలవరపడియెను. విమలయిట్లుచెప్పెను.

'కొంచెమాఁగి నేజెప్పునది వినుము. నేను కొన్ని గృహకృత్య వ్యవహారములనిమిత్త మేగుచున్నదానను. అవి నిర్వహించుకొని మరలవచ్చెదను. ఆస్మానీ! ఇంక నొక మాట. ఈదినమున నీపూర్వపరిచయు నొక్కనిని నీవు చూచెదవనుకొమ్ము. అతఁడు నిన్నానవాలు పట్టగలఁడా!'

ఆస్మాని యాశ్చర్యముతో 'అదేమి?' అనియెను.

'నీవు రాజా జగత్సింగును జూచెదవనుకొమ్ము.'

ఆష్మానీ యూరకుండెను. గద్గదస్వరముతో నిట్లనెను.

'అంతటిభాగ్యము నాకు లభించునా?'

'లభించుననుకొనుము.'

'రాజపుత్త్రుఁడు నన్నుఁదప్పక గుర్తించును'

'అయిన నీవు రావలదు. ఇఁక నేనెవ్వరిని దీసికొని పోవుదును? ఒక్కతెను పోలేనే?'

'రాజపుత్త్రిని జూడ నాకుఁజాల నభిలాషగలదు.'

'ఆకోర్కె నిప్పుడణంచుకొనుము. నేనిప్పుడేమి చేయుదును? ఏమియును దోఁచుటలేదు.'

విమల యాలోచింపఁ దొడంగెను. ఆకస్మికముగ నాష్మానీ విమలకుఁ దెలియకుండ నవ్వ మొదలుపెట్టెను.

'నిర్ణిమిత్తముగ నవ్వుచున్నా వెందులకు?'

'నాకొకయూహ వొడమినది. మన దిగ్గజుని గూడఁ దీసుకొని పోఁగూడదా?'

'మంచిమాట చెప్పితివి. ఆరసికుని దీసికొనిపోయెదను'

'నేనూరక హాస్యముకొఱకంటిని.'

'పరిహాసముకాదు. ఆమందునిఁగూర్చి నాకేమియు ననుమానములేదు. గ్రుడ్డికన్ను దెఱచినను మూసినను సమానమే. దానికి రాత్రింబవళు లనుభేదమేమి? ఆబ్రాహ్మణుఁడేమియు గ్రహింపలేఁడు. కాని యాతఁడు వచ్చుట కిష్టపడఁడేమో? ఏమిచేయవలయు?'

'ఆపనినాపైఁ బెట్టుము. నేనాతనిఁదోడి తెచ్చెదను. కొంచెముసేపీద్వారముకడ నాఁగుము' అని ఆష్మానీనవ్వుచుఁ జెప్పి కోటలోని కుటీరమువంక కరిగెను.

అభిరామస్వామి శిష్యుఁడగు గజపతి విద్యాదిగ్గజునిఁ జదువను లెఱిఁగియే, యున్నారు. విమల యాతనిని 'రసిక దానస్వామి' అని యెందులకుఁ బిలుచుచుండెనోకూడ పాఠకు లెఱుఁగుదురు. ఈసుప్రసిద్ధపురుషుఁ డాకుటీరములో నివసించి యుండెను. ఇంచుమించాతఁడు తొమ్మిదడుగులపొడవుండును కొంచెము తక్కువగా నొక యడుగు విశాలము. కటిప్రదేశము మొదలు పాదమువఱకాతని కాళ్ళపొడ వాఱడుగులు, వానిపుష్టినిగూర్చి చెప్పనక్కఱలేదు. రెండును రెండుపుల్లల వలె నుండును. ఆతని శరీరకాంతి సిరాను బోలియుండును. అతని కాళ్ళను కజ్జులనుకొని యొకప్పుడగ్ని మ్రింగివేయ యత్నించెను. కాని, వానియందు రసమేది? రసవిహీనమని విసర్జించుటచే నవి కొరకచ్చులయ్యెను. ఆతఁడు చాల పొడ వగుటచే పంగి మడతఁబెట్టుటకు సిద్ధముగ నున్నట్లుండెను. ఆతని యవయవము లన్నిటిలోను ముక్కు ప్రధానస్థానము గైకొనినది. శరీరమునందంతట నుంపవలసినపుష్టి నంతయు నటనుంచినట్లు కన్పట్టుచుండెను. ఆతనిశిర స్సోఢ్రదేశపు బోయవానివలె క్షౌరము చేయఁబడియుండెను. ఇప్పుడిప్పుడే పెఱుఁగుచున్న వెంట్రుకలాతని శిరస్సుపై ననేకముగ సూదులను గ్రుచ్చినట్లున్నవి. లలాటముననుంచిన తిలకసౌందర్యము కొంచెము చక్కఁగనున్నది.

'గజపతి విద్యాదిగ్గజ' నునుబిరుదు మాతని కూఱక విచ్చినది కాదు. ఆతనిబుద్ధి యసాధారణమైనది. బాల్యకాలమునఁ జతుష్పతి విద్యాశాలయందు వ్యాకరణ మభ్యసింప

నారంభించెను. ఏడుమాసముల పదునేను దినములైననుగాక పూర్వమే యాతఁడు 'వృద్ధిరాదైచ్' అను సూత్రమును మూలవ్యాఖ్యానములతోఁ గూడఁ వల్లించివైచెను. భట్టాచార్యులవారి యనుగ్రహము వలననైననేమి, సహాధ్యాయుల విద్యాపఠన ధ్వనులవలననైననేమి, పదునేను సంవత్సరముల లోపల నాతఁడామూలాగ్రముగ నామవాచక సంబంధమయిన విద్యనంతను బూర్తిచేసెను. వేఱువిషయమునఁ బ్రవేశింపక పూర్వము గురువు నామవాచకమునఁ వీఁడెంతగడిదేరెనో పరీక్షింతమని 'నాయనా! రామశబ్దమున కంతమున 'ఆమ్' చేర్చిన నేమివచ్చునని యడిగెను. గజపతి చాలసేపాలోచించి 'రామూంత' అని బదులుచెప్పెను. (సరియైన రూపము రామమ్)

'బిడ్డా! నాయొద్ద నేర్చుకొనఁ దగినదంతయు నేర్చుకొన్నాఁడవు. విద్యసంపూర్ణమయినది. ఇఁక నీకుఁ జెప్పుటకు నాకడ సమర్థతలేదు. నీవింటికిఁ బోవచ్చును.'

'గురువర్యా! నాదొక్కమనవి. నాకు బిరుదమో!'

'నీవసామాన్యవిద్యను సంపాదించితివి. బిడ్డా! అందులకై నీకొక యపూర్వబిరుదము నీయవలసియున్నది. విద్యాదిగ్గజమను బిరుదమును గైకొనుము.'

గజపతి గాలఁ దృప్తినొందెను. గురునకు వినయపూర్వకముగ వందనమొనర్చెను. ఇంటికిఁబోయి యిట్లు యోచించుకొనెను. 'వ్యాకరణశాస్త్రమునఁ బరిపూర్ణుఁడనైతినికదా! కొంచెము ధర్మశాస్త్రముకూడ నభ్యసించెదను

గాక, అభిరామస్వామి యాశాస్త్రమున గొప్పపండితుఁడని వినియున్నాఁడను. సూర్యకిరణప్రసార మున్నంతవఱకీ ప్రపంచమున నాతఁడుదక్క నాకు బోధింపఁదగిన వారెవ్వరున్నారు? నేనాతనియొద్దకే పోయెదను'

ఇట్లు నిశ్చయముఁజేసికొని యీకోటలోనికి వచ్చెను. అభిరామస్వామికడఁ జాలమంది శిష్యులున్నారు. అతఁడెవ్వరిని నిరాకరించెడివాఁడు కాఁడు. అందుచే దిగ్గజుఁడేమేని నేర్చుకొనినను నేర్చుకొనకపోయినను నాతనికి విద్యఁజెప్పుటకు నిరాకరింపలేదు.

పవిత్రుఁడగు నీగజపతి కేవల వ్యాకరణజ్ఞుఁడేకాఁడు న్యాయవాదియును, సాహిత్యమును, హాస్యశాస్త్రమును గూడ నీతఁడు చవిచూచినాఁడు. వీనియందీతఁడు ప్రవీణుఁడనుట కుదాహరణము 'నేతిముద్దతపేలా' ఈతఁడీ విద్యాయుధములన్నియు నాపాన్పుపైఁ జూపుచుండెను. దీనికొక రహస్యకారణమున్నది. ఆతెఁడొకప్పు డిట్లూహించుకొనెను. 'నేనిటకు వచ్చినది వినోదముకొఱకుగదా? ఇదే నాదివ్యమైన బృందావనము. నేనెకృష్ణుఁడను. ఈయాపాన్పని నా రాధిక' ఆపాన్పనికి హాస్యమనిన నతిప్రియము. ఆమె కీ మదనమోహనుఁడు వినోదార్థము పెంచుకొను మర్కటముగా నుండెను. విమలకూడ నీవాసన గ్రహించినది. అప్పుడప్పుడీకోతి నాడించుట కామెయు వచ్చుచుండును.

'ఇదిగో! నాచంద్రావళి ఏమి! ఎందులకుకాదు? దీనికి నేతిముద్దతపేలాయని బిరుదమిచ్చితినిగదా? ఇది తెచ్చిపెట్టుకొన్నదని విమలకుఁ దెలియకుండుటెంత యదృష్టము.'

మాధవుని యదృష్ట మేమోకాని యీదినమున నొక గొప్పయానందము గలుగనున్నయది. ప్రకభానుతనయ తనం తటఁదా నాతని కుటీరమున కేగుచున్నది.

—♦o♦—

పంద్రెండవ ప్రకరణము

ఆష్మానీ సాంకేతిక స్థానము

దిగ్గజమనోహారిణియగు నాష్మానీ సౌందర్య మెట్టి దియో తెలిసికొనఁజదువరు లువ్విళులూరుచుందురు. వారి వినోదార్థ మీప్రకరణమున నామెఁగూర్చి తెలిపెదగాక! స్త్రీలలావణ్యము నిదివఱకెందఱో కవులభివర్ణించి యున్నారు. నేనును నీ పాతమార్గమునఁ బోయిన నది హేయముగ నుండును. గ్రంథచౌర్యము కూడనగును. కావుననేనిట పార్థ నమును ముందుగ నారంభించి పిదప నామె లావణ్యమును వర్ణించెద.

ఓ వాగ్దేవతా! ఓ పద్మాసనా! ఓశరదాత్రికాచంద్రి నినభానా! ఓకృపాప్రపూర్ణ! ఓమృదు పదాధరీకృతపంకజా! నే నాష్మానీసౌందర్యము నభివర్ణింపఁ దలపుఁ గొన్నాఁడను. నీమృదుపదాశ్రియమిచ్చి రక్షింపుము. ఓ సుందరయువతీజన గర్వభంజనీ! నీవు బహుమృదు సమాసపదనిర్మాతవు నేను సౌందర్యమును వర్ణింపఁ బోవుచున్నాఁడను. నాకొక్క మాఱు నీ లలితపదాశ్రియమిచ్చి రక్షింపుము. పండితజన

మనోభీష్టప్రదాయినీ! ఓదీనజన సంరక్షణీ నీవువిద్యావిహీనుల నెప్పుడును ప్రేమింపనిదానవు. భారతాలయందు విద్యాదీపమును బ్రకాశవెుందించిన తల్లి వినీవే. ఒక్కసారి నాలో నున్న యజ్ఞానాంధకారమును బాపి నన్ననుగ్రహింపుము.

తల్లీ! నీకు రెండు వేలురూపములున్నవి. రఘువంశ కుమారసంభవ మేఘదూత శాకుంతలాదులు రచియించునప్పుడు కాళిదాసునం దేరూపముచే నుంటివో, యేరూపముచే నావేశించి మహాకవి వాల్మీకిచే రామాయణమును రచింపఁ జేసితివో, యేరూపముచే భవభూతిభారవులయందుఁ బ్రవేశించి మాలతీమాధవీ కిరాతార్జునీయములను విరచింప శక్తినొసఁగితివో, యట్టిరూపమున నాయందుఁ బ్రవేశించి నాభుజములకు, నొప్పియెత్తింపకుము. ఏరూపముచే శ్రీహర్షు నావేశించి నైషధకావ్యమును, తినయసమాన్య విద్యాప్రభావముచే విరచింప నొనర్చితివో, వంగదేశమునకంతకు హృదయాకర్షణముగావించిన భరతచంద్రునియందు దశరథరాయియందు నేయాకారముచే నుంటివో, భారతాలయందు పుస్తకాలయములయం దేరూపముచే నధివసించియుంటివో, యట్టిరూపమున నాశిరసునఁ బ్రవేశింపుము. అమ్మా! నేనాష్మానీ సౌందర్యమును వర్ణించెదను.

ఆష్మానీ వేణి చాలపొడవయినది. పామువలెనున్నది. దానిని జూచుటతోడనే సర్పముయొక్క గర్వమణగిపోయినది. అది చుట్టచుట్టుకొనిపోయి యిట్లు విచారించెను.

'అయ్యో! ఆషాఢ్మనీజడచే నేను పరాభవింపఁబడితిని. లజ్జలేక నామొగమును మరల నీలోకమున కెట్లుచూపుదును? పాతాళమునకుఁ బోయెదఁగాక' అని పుట్టలోదూరిపోయెను. అదివిని బ్రహ్మ 'ఓహో! లోకమునకు గొప్పయుపద్రవము సంభవించినదే! ఇఁక జనులను గఱచువారెవ్వరు. అని యోచించి దానితోఁకఁబట్టుకొని యివ్వలకు లాగెను.' తన ముఖము మరల ప్రజలకుఁ జూపవలసివచ్చెననెడి సిగ్గుచేఁ బాము తన తలను బుట్టనుబెట్టి కొట్టుకొనియెను. అందుచే దానితల చదునైనది. అప్పటినుండియు పాములకు పడగ లేర్పడినవి. కళాహీనమయిన తనరూపమును జంద్రుఁడామె వదనముకడఁ జూపనెఱచెను. సిగ్గుపడి తలయెత్తలేకపోయెను. సృష్టికర్తకడ కేగి మొఱపెట్టుకొనెను. విధాత 'సుధాకరా! భయపడకుము. వెళ్ళుము; లెమ్ము. ఇఁకమీఁద స్త్రీలవదనములు మఱుగుపరచెదనులే' అని భయముదీర్చి పంపివేసెను. అప్పటినుండియు స్త్రీలకు మేలిముసుఁగు లారంభమయినవి. ఆషాఢ్మనీనేత్రములు రెండును రెండుకాటుకపిట్టలవలెనుండెను. విధాత సూక్ష్మబుద్ధిగలవాఁడు. ఆపక్షులు తమఱెక్కలనుజాపి యెగిరిపోవునను భీతిచేఁ బంజరమునకుఁ దలుపులవలె గను ఱెప్పల నేర్పఱచినాఁడు. ఆమెనాసిక తానే యధికురాలనని గరుత్మంతునితోఁ బోరాడుచుండెను. ఆతఁడు పక్షులకురాజు. పక్షిరాజు భయపడి తత్క్షణము వృక్షాగ్రమునకుఁ బాఱిపో యెను. ఆకాలమునుండియు విహంగములకు ధరణిజములమీఁ దనే జీవింపవలసివచ్చినది. ఒకానొకకారణమున నొక దానిమ్మ

పండు వంగదేశమునుండి పాట్నాకు వలసపోయెను. ఒక యేనుఁగు దానితో వెంటఁబడెను. ఆగజము దానితోండ ముతోఁగూడ బర్మాకు వలసపోవుచున్నది. ధవళగిరిమాత్ర మక్కడనే యుండెను. ఆ మహీధరము తనలోనిట్లు వితర్కిం చుకొనెను. 'నేను ఎంతయెత్తున్న దానను? అయిదుమైళులా? ఇవియో; ఇవి యాఱుమైళ్లున్నవే?' ఈవిషయముంగూర్చి యది దీర్ఘాలోచనచేయ మొదలుపెట్టెను. అందుచే దాని తల వేడియెక్కెను. అప్పు డాపర్వతముపై హిమము మతిదట్ట ముగ వర్షించుచుండెను. అప్పటినుండియు నాకొండమంచుఁ గురియుచుండును. ఆషాన్సనీ సౌందర్య మిట్లున్నది.

అదృష్టదేవత యాషాన్సనీపై ద్వేషము వహించెను. పాపమామె విధవయయ్యెను. ఆమె దిగ్గజుని కుటీరముకడకు వచ్చెను. తలుపు వేసియున్నది. లోపలదీపము వెలుఁగుచుం డెను.

'ఏమండోయి మహాశీయా!'

ఎవరును మాటాడలేదు.

'ఏమండో గోసాయిఙా'

ఎవరును మాఱుపలుకలేదు.

చంపుడు. ఈమాయలాఁ డేమిచేయుచున్నాఁడు? ఓహో! రసికదాసస్వామీ!'

ఇప్పటికిని ప్రత్యుత్తరములేదు.

ఆషాన్సనీ తలుపుసందునుండి తొంగిచూచెను. ఆతఁడు భోజనము సేయుచుండెను. అందుచే మాటలాడలేదు.

బ్రాహ్మణులు భోజనసమయమున, మాటలాడుట సంభవించె నేని వారిక భోజన మొనర్పరుకదా!

'ఇతఁడు మిగులనాచారము నడుపుచున్నాఁడు. ప్రసంగానంతరమున, భోజన మొనర్చునో లేదో చూచెదఁగాక!' అని యాషాష్మనీ తనలోననుకొని యిట్లనియెను.

'నేను విటదాసిని'

ప్రత్యుత్తరము లేదు.

'ఓ రసికాగ్రగణ్యా!'

'హమ్'

'బ్రాహ్మణుఁడు కబళము నోటనుంచుకొని మాటలాడెను.'

'అది మాటలాడుట కాదు' అనుకొని 'ఓహో! ధైర్యదర్పణమా!' అనిపిలిచెను.

'హమ్'.

'ముందు మాటలాడుము. పిదపఁ దినవచ్చును.'

'హమ్, హమ్'

'ఇట్లైనా? నీవు బ్రాహ్మణుఁడవు కావా? ఇట్టిపని చేయుదువా? ఇదియంతయు నిప్పుడే స్వామికి విన్నవించెదను. గదిలో నెవరిని పెట్టుకొని యున్నాఁడవు?'

బ్రాహ్మణుఁడు భయపడి గదియంతయుఁ జూచెను. ఎవ్వరును లేరు. మరల భోజన మొనర్ప నారంభించెను.

'ఇదేమి మరల తినుచున్నావు. మాటలాడిన పిదప మరల భోజనము చేయుదురా?'

'ఏదీ? నేనెప్పుడు మాటలాడితిని?'

ఆష్మానీ పకపక నవ్వి యిట్లనియెను.

'ఇప్పుడు మాటలాడలేదా!'

'ఎప్పుడు'

ఆష్మానీకి మరల నవ్వువచ్చెను.

'ఇదిగో యిప్పుడు మాటలాడలేదా?'

'ఔనౌను. లేదు. నేనిఁక తినను.'

'ఇంకఁ దినరాదు. ఆలస్యమేల, లెమ్ము తలుపుఁ దీయుము'

ఆష్మానీ మరల తొంగిచూచెను, నిజముగా నాతఁడు విస్తరికడనుండి లేవఁబోవుచుండెను.

'వలదు. వలదు. మిగిలిన కుంభమునుగూడఁ జెల్లించి మఱిలెమ్ము.'

'కాదు కాదు. అట్లుచేయరాదు. నేను మాటలాడితిని'

'నాతోడు నీవుతప్పక తినవలయును.'

'మహాపాపము, మాటలాడినపిదప భోజనము చేయుదునా?'

'నేను నీతోఁ గొన్ని రహస్యపుమాటలు చెప్పవలయునని వచ్చితిని, నీవుమరల భోజనము జేయకున్న నవి నీతోఁ జెప్పను. ఇదిగో వెళ్లిపోవుచున్నదానను.'

'వలదు, వలదు. ఆష్మానీ! కోపపడకు. నేనుతినెదను.'

బ్రాహ్మణుఁడు మరల తిన నారంభించెను. రెండు మూఁడు కబళములు తినినపిదప నాష్మానీ యిట్లనెను.

'చాలు. తిన్నాఁడవు. లెమ్ము, తలుపుఁదీయుము.'

'చేతిలోనున్నది తిననిమ్ము.'

'చాలునని యెప్పుడును నీకడు పేమవదు. లెమ్ము. లేని-చో మాటలాడినపిదప భోజనముచేసెనని యందఱితోఁ జెప్పెదను.'

అబ్బ! ఏమితొందర? ఇదిగో! లేచుచున్నాఁడను'

బ్రాహ్మణుఁడు పరిషేచనముచేసి లేచితలుపుఁదీసెను.

పదమూఁడవ ప్రకరణము

ఆపాన్మానీ వ్యభిచారము

తలుపు తీసినపిదప నాపాన్మాని లోనఁబ్రవేశించెను. తన ప్రేమాస్పదయగు నాయువతికి రసికులొనరించురీతిగ స్వాగత మొసంగుటకై యాతఁడు మిగుల సంతసముతో తనచేయి యెత్తి యిట్లుపాడెను.

'ఓం గాయత్రీ వరదాదేవీ'

'ఇది చక్కని పద్యభాగము. దీనినెక్కడినుండి సంపాదించితివి?'

'నేనీదినమున నీకొఱకు రచియించితిని'

'నీవిఁక విటసార్వభౌముఁడ వని పిలువఁదగినవాడవు.'

'రసికాః! కౌశికోవాసః' 'సుందరీ! కూర్చుండుము. హస్తప్రక్షాళన మొనర్చుకొని వచ్చెదను.'

ఆప్మానీ తనలో 'అభాగ్యుఁడా! చేయికడుగుకొనుము. మిగిలిన యన్నమునుగూడ నీచేఁ దినిపింపకుండిన నన్నీ పేరున బిలువకుము' అని యనుకొని ప్రకాశముగా—

'ఏమి ప్రక్షాళన మెందులకు? తిను. తిను.' అనియెను.

'ఏమనెదవు? పాత్రముకడనుండి లేవలేదా? మరలఁ దినుటయెట్లు?'

'ఎందులకు తినరాదు. ఇఁక నక్కడ నన్నములేదా? విసర్జించి కడుపు మాడ్చుకొనెదవా?'

'నేనేమి చేయుదును? నీవంత తొందరనిచ్చితివి' అని విచారముతోఁ జెప్పుచు బ్రాహ్మణుఁడన్నమువంక నత్యాతురతతోఁ జూచుచుండెను.

'అయినఁ దప్పక నీవు తినవలయు'

'ఎంతపాపము! నేను పరిషేచన మొనర్చితిని. అట నుండి లేచితిని, మరల నెట్లు తినెదను?'

'నీవు తినితీరవలయు, నేనుజూచెదను' అని చెప్పుచు నాప్మాని యతనిచేయిని గ్రహించి బలాత్కారముగ నీడ్చుకొనిపోయి భోజనపాత్రముకడఁ గూర్చుండఁబెట్టెను.

'ఛీ! ఛీ! ఏమిపనిచేసితివి? మూతి కడుగుకొనకుండ నన్ను ముట్టుకొనెదవా?'

ముట్టుకొనిన నుపద్రవమేమి? మోహవిషయమునన ట్టి యభ్యంతరములేదు.'

బ్రాహ్మణుఁ డూరకుండెను.

'తినుము'

'నేను ఉత్తరోపాశన మొనర్చితిని, అన్నముకడనుండి లేచితిని. మఱియు నన్నుముట్టుకొంటివి. ఇఁక నేనెట్లు భుజించెదను.'

'నీవు తినవలయు, ఇంత మాత్రమేకాదు. ఈ పాత్రమున నేను తినినపిమ్మటఁగూడ నీవు భుజింపవలయును.'

ఇట్లుచెప్పుచు నాపాప్మని యొకముద్దనుగయికొని నోటఁబెట్టుకొని భుజించుచు మిగిలినయన్నమును బాత్రముననుంచి 'రమ్ముతినుము' అనియెను. బ్రాహ్మణుఁడు తెల్లబోయి చూచుచుండెను. 'మాట, విను' అని యాపాప్మని దిగ్గజుని చేవిలో నేమియో చెప్పెను.

బ్రాహ్మణుఁడొక్కగంతువైచి 'హోయి! హోయి! అయినఁ దప్పక తినెదను' అని కేకలువేయుచు పశువువలె నపవిత్రమయిన యాయన్నమును, మ్రింగ నారంభించెను. కనురెప్ప వేయునంతలో నదియంతయు నదృశ్యమయ్యెను.

'ప్రియా! ఇఁక—'

'తొందరపడకుము. ఆనోటియందేనా?'

'ఔనౌను. ముఖప్రక్షాళన మొనర్చుకొని వచ్చెదను' అనిచెప్పుచుఁబోయి యతివేగముగ వచ్చెను. నోరు కొంత భాగము కడుగుకొనియెను. కొంతభాగమునకు జలదర్శనమే లేదు. ఒకమెతుకు పండ్లసందున నిరుకుకొని యుండెను.

'కాంతా! ఎక్కడ? నీయధరామృతమేది?'

'నీకు హాని సంభవించును. ముందు మూతిని తుడిచికొనుము'

త్వరత్వరగా నాతఁడు చేతులును మొగమును దన వస్త్రముయొక్క ముందఱి చెఱఁగుతోఁ దుడిచికొనియెను.

'ప్రియా! ఇఁక—'

'ఈప్రక్కకురమ్ము'

దిగ్గజుఁడామెయొద్ద కేగెను ఆమె ప్రక్కను గూర్చుండెను.

'నోరుఁ దెరువుము'

దిగ్గజుఁడు మాటాడుటలేదు. చెప్పినట్లెల్ల చేయుచుండెను. అతఁడు తన రెండుపెదవులను విప్పి దాకవలెపెట్టెను. ఆస్మానీ చేరుమాలునుండి తాంబూలద్రవ్యములఁదీసి నమల నారంభించెను. దిగ్గజుఁడు నోరునట్లే విప్పియుంచెను. ఆమె నోరంతయు తాంబూలద్రివ్యములతో నిండియుండెను. ఆమె యాతమ్మ నాతనినోట నుంచెను. పాపము గజపతి యిరుకునఁబడెను. దుఃఖాకరమయ్యెను. ప్రియురాలొసంగిన తాంబూలము నమియలేడు ఉమిసిన విరసుఁడందురేమో! పోసిందు! దానిని మ్రింగనులేఁడు. అతఁడప్పుడే భోజనముచేసెను. పాపము నోటినిండనున్న యాతమ్మ నెట్లు మ్రింగగలడు? అందుచే నీలకంఠుని గళమందున్న హాలాహలమువలె నది యక్కడనే యుండెను.

ఇదియే సమయమని ఆస్మానీ దంతశోధకితో నాతని విశాల నాసికారంధ్రముల నట్టెపొడిచెను. ఆతనికొక్క తుమ్మువచ్చెను. తత్క్షణమే యాతనినోటనున్న యమృతము

ప్రివాహరూపమున నతివేగముగ బయలువెడలి యాతని శరీరమునంతను ముంచివైచెను.

సందేహావస్థనుండి విడివడి బ్రాహ్మణుఁడు శరీరమును గడిగికొని యీక్రింది మనోహరగీతమును బాడెను.

'దక్షిణే పశ్చిమే వాపి నకుర్యాద్దంతధావనమ్'

పదునాల్గవ ప్రకరణము

దిగ్గజుని బలాత్కార ప్రయాణము

అట విమల యాష్మానీ యెంతసేపయినను రాలేదని తొందరపడుచుండెను. ఇఁక నిట వేచియుండినఁ గార్యములేదని తలంచి గజపతిని స్వయముగ వెదకుటకామె బయలువెడలెను. కుటీరములోనికి వచ్చుచుండుటంగని యాష్మానీ 'రమ్మ! చంద్రావళి! రమ్మ' అనియెను.

గజపతి 'ఈదినము సుదినము. ఉదయమున శయ్యనుండి నేనేశుభముహూర్తమున లేచితినో? ఒకటేచాలును. రెండువచ్చినవి. శాస్త్రమిట్లు చెప్పుచున్నది.'

'ఏకచంద స్తమోహంతి నచమూఢశతైరపి'

ఆష్మానీ—'ఈరసికః శేఖరుఁడు వర్ణభ్రష్టుఁడయ్యె, వింటివా?'

గజపతి—'అదియెట్లు?'

ఆ—నేనెంగిలిచేసిన యన్నమును నీవు భుజింపలేదా?

గ—'ప్రపంచక విషయమయిన యుపద్రవమందే మున్నది? అన్నము పవిత్రమయినది. నీవు తల్లి, భగవత్స్వ రూపిణివి'

'షో ! షో !'

విమల యాషాన్మనీ చెవిలో రహస్యముగ 'ఇతఁడు రాఁడా?' అనియెను.

'ఆవిషయమింకను ఇతనితోఁ జెప్పలేదు.'

'అయిన నేఁజెప్పెదను. ఓరసిక శేఖరా! నేను ముఖ్య ముగ నొకమాట చెప్పవలసియున్నది.'

'అదియేమి'

'నీకు మాయందుఁ బ్రేమకలదా?'

'ఆహా! ఏమిప్రశ్న?'

'మాయిరువురియందును'

'ఇరువురు! ఇరువురియందును'

'నేఁజెప్పినట్లు చేయుదువా?'

'సందేహమేమి?'

'తత్క్షణమేనా?'

'తత్క్షణమే?'

'ఈనిముసము నేనా?'

'ఈనిముసముననే'

'మేమిరువుర మిప్పాడెందులకు వచ్చితిమో నీవెఱుం గుదువా?'

'నేనెఱుఁగుదును'

'మేము నిన్నుఁ దీసికొని లేచిపోయెదము' అని యూషాన్సీ చెప్పెను.

బ్రాహ్మణుఁడు మూఁగవానివలె నయ్యెను. నోరు తెఱచుకొని యట్లుకూర్చుండెను. విమల యతిప్రియత్నమున నవ్వునాఁపుకొని 'మాటాడవేమి?' అనియెను.

'న్యా—న్యా—న్యా—ట—ట—ట'

'అయిన నీవు రావా?'

న్యా—న్యా—న్యా—ట— ట—ముందు స్వామి యొద్దకేగి చెప్పవలదా?

'ఆయనతో నేమి చెప్పెదవు? మీ గురువుగారితో యోచించుటకిది మీయమ్మ తద్దినమనుకొంటివా?'

'కాదు, కాదు. అయిన, వెళ్ళనక్కఱలేదు. కాని, మీ రేదినమున వెళ్ళెదరు?'

'ఏదినమునవోనా? ఇప్పుడే, నేనలంకృతనై వచ్చితిని చూడలేదా!'

'ఇప్పుడీనిమిషమున నేనా?'

'ఔను. ఎందులకుఁగారాదు? నీకిష్టములేదని చెప్పుము మేము మఱొకనిని వెదకుకొనెదము. మా మనస్సులు మాత్రము నీపయిననే యున్నవి.'

గజపతి చాలకాలమోర్పు వహింపలేకపోయెను.

'మంచిది నేను సిద్ధముగనున్నాఁడను'

'అయిన వస్త్రమును బుచ్చుకొనుము'

దిగ్గజుఁడు నమబలిపుచ్చుకొనియెను. విమల ప్రయా ణోద్యుక్తమయ్యెను. గజపతికూడఁ బోవసిద్ధపడి 'సుందరీ'

'ఏమనియెదవు'

'మనము మరలవచ్చు టెప్పుడు?'

'మరల వచ్చుటయా? మనముస్థిరముగఁబోవుట లేదా? మనము ముప్పురమును మఱియొకదేశమున దంపతులమై చరింతము.'

దిగ్గజుఁడు పరమానందమునొందెను.

'అయిన నీవస్తువులన్నియు నిట వదలివేయనా?

'అవశ్యము. అవి నిరర్థకములు.'

'ఈయిత్తడిపాత్రిలను నెట్లయిన విడువవలసినదేనా?'

'భయపడకుము. వీని నన్నిఁటిని నేను మూల్యము నిచ్చి పుచ్చుకొనెదను.'

బ్రాహ్మణుఁడు కొంచెము విచారపడియెను. కాని యేమిచేయగలఁడు? వారియిష్టము ననుసరించి ప్రవర్తింప వలయునుకదా! లేనిచో వారియెడఁ దనకుఁ బ్రేమలేదను కొందురేమో యని యాతని సందేహము. ఆతఁడు విమలతో నిట్లనియెను.

'పోనిమ్ము. ఈఖుంగిపతియో?' (పుస్తకములుంచు కొనెడి యీతాకులపెట్టె)

'ఇట్టివి బండ్లకొలఁది నున్నవి' అని విమలయనుకొని 'త్వరపడుము'

విద్యాదిగ్గజున కున్నవి యుత్తమున రెండుపుస్తకములు. అందొకటి సంస్కృతవ్యాకరణము. ఒకటి హిందూధర్మశాస్త్రము. 'వ్యాకరణముతోనిఁక నాకేమి పనియున్నది. అదియంతయు నాకుఁ గరతలామలకమేగదా! ధర్మశాస్త్రము మోసికొనిపోయెదఁగాక' అని యాతఁడు దాని నావెట్టెయందుంచెను. దుర్గా! శ్రీహరీ! అని కేకవైచి విమలతోడను, నాపాస్మానీతోడను, బయలువెడలెను. కొంతదూరమరిగినపిదప నాపాస్మానీ 'నడచుచుండుఁడు నేను పిదపవచ్చి కలిసికొనెదను' అని చెప్పి యామె గృహమునకుబోయెను. విమలాగజపతులు పోవుచుండిరి. చీఁకటిలో వారు తెలిసికొననేలేరు. అప్పుడే కోటఁదాటిపోయిరి. కొంచెము దూరమరిగినపిదప దిగ్గజుఁ డిట్లనియెను. 'ఆపాస్మానీ రాలేదేమి?

'ఆమె రాదుగాఁబోలు! నాయొక్క తెతోను వచ్చుటకు నీకిష్టములేదా?'

బ్రాహ్మణుఁడు మౌనము వహించెను. కొంతసేపుండి నిట్టూర్పువిడిచి 'అయ్యో! పాత్రములారా!' అనియెను.

పదునేనవ ప్రకరణము

—♦—

దిగ్గజుని ధైర్యము

విమల త్వరగత్వరగ నడచుచుండెను. గరమందరము దాఁటెను. రాత్రి గాఢాంధకారము. నక్షత్రములకాంతినామె

జాగ్రత్తగా నడచుచుండెను. పొలమునఁ బ్రవేశించెను, కొంచెము దిగులువడియెను. గజపతియొక్క మాటయైననాడుట లేదు. అట్టిసమయమున మనుష్య కంఠధ్వని యెంతసంతోషదాయకము! ఎంతభయనివారకము! ఎంతసుఖకరము! అందుచే విమల దిగ్గజునిట్లు పలుకరించెను.

'రసికాగ్రగణ్యా! ఏమియాలోచించుచున్నావు?'

'నాయిత్తడిపాత్రములఁగూర్చి'

విమల మాఱుపలుకలేదు. తనలో నవ్వుకొనుచుండెను. మరల కొంతసేపటికి 'దిగ్గజా! దయ్యములనిన నీకు భయము కలదా?' అని ప్రశ్నించెను.

'రామ. రామ. రామ. రామనామోచ్చరణ మొనర్పుము' అని కేకవైచుచు విమల కొకగజము సమీపమునకు వచ్చెను.

ఈమార్గమున దయ్యములబాధ చాలఁగ నున్నది.'

దిగ్గజుఁడు మిక్కిలి సమీపమునకువచ్చి ప్రేలాడుచున్న యామె చీరచెఱఁగును బట్టుకొనియెను. విమల యిట్లు చెప్పుచుండెను.

'ఆనాఁడు మేము శైలేశ్వరుని యాలయమునుండి వచ్చుచున్నప్పు డాత్రోవప్రక్కనున్న మఱ్ఱివృక్షముకడ నేదియో కనఁబడినది. చాలభయంకర రూపముకలది'

ఆమెచీర లాగఁబడుచుండుటనుబట్టి బ్రాహ్మణుఁడు రావియాకువలెఁ గంపించుచున్నాఁడని యామె తెలిసికొనియెను. ఆవిషయమునుగూర్చి యింకను జెప్పినచో నిఁకచల

నమేయుండదు. అందుచే నాప్రసంగమును జాలించి "రసిక శేఖరా! నీవేమయినఁ బాఁడగలవా?" అని యడిగెను.

"ఆ! పాడఁగలను"

"కూనిరాగమును దీయని రసికుడుండునా? పాడుము"

♦ దిగ్గజుఁడిట్లు పాడఁదొడంగెను.

శ్యామలగాత్రు కదంబస్థితుఁగను
సమయము చెడ్డదియే సఖవామలో
చనయిటు వినవే పరవశనయి
పోయితినే

ఈవిపరీతపు ధ్వనిని వినియాపక్రిక్కను నెమరువేయుచు మెల్లగఁ బండుకొనియున్న యొక గోవతివేగముగఁ బ్రాణ సంరక్షణార్కై పరుగెత్తనారంభించెను. ఏదియెట్లున్నను నాతఁడింక నీరీతిని పాడుచునేయుండెను.

(*) తత కేకికలాపకునిఁ మురళీధరుఁ
గనివెనుకన్ మతిదప్పిపోయిననాఁడే
కులమున మచ్చనుదెచ్చితినే

♦ ధా స ధ సా రి రి గా మా రి రి గ మ ప
ప రి రి గ రి స ని సా గ మ పా ధ బా
మ మ గ గ రి రి గా మ మ ధ ధ ధ ధ
ప మ గ రి సా

(*) ప ప సా స స రీ స రి గా మ గ రీ గ మ సా రి రి
గ రి స ని సా గ మ పా ధ పా ప మ గా రీ
గ గ మ మ ధా ధ ప మా గ రి సా

♦ చెలియాతని నవ్వులు వెన్నెలలే పలుకాడిన తేనెలు
చిప్పిలునే చెలియాతనినవ్వులు ముద్దులపల్కులు గని
మతిచెడిన దిఁకేమందుర్.

దిగ్గజుఁ డెంతయో కాలము పాడలేదు. ఆకస్మికముగ నాతని చెవి కస్సరోంగనా వీణాగానస్వరసమ్మేళనమై యతి మనోహరమై యమృత తుల్యమైన మధురగానధ్వనియొకటి వినవచ్చెను. విమల హెచ్చుస్థాయిని పాడుచున్నది. ఆగాన మామెదియే.

అత్యంతమనోహరమై మహోల్లాసకరములగు సప్త స్వరములను, నారాత్రియందు నిశ్శబ్దమయిన యాకాశము నంతట వ్యాపింపఁ జేయుచుండెను. ఆగానధ్వని మందమలయ మారుతముతోఁజేరి నేతెంచుచుండెను. దిగ్గజుఁ డాగీతము నత్యంతశ్రద్ధతో వినుచుండెను. ఆమె మానివేయుటతోడనే "మరల"అని దిగ్గజుఁ డనియెను.

"మరల నేమి".

"మనోహరమైన కీర్తనయొకటి పాడుము."

"ఏమి పాడుదును"

"వంగదేశపు కీర్తనము పాడుము"

"అట్లే" ఇట్లు చెప్పుచు విమల పాడనారంభించెను.

ఇంతలో నామెధరించినవస్త్రముచెఱఁగు గట్టిగ లాగ

♦స రి గా గ గ గా రి గ మా మ మ మా గ పా ప ప పా మ గ
రీ రి రి రీ ప మ గా గ గ గా మ గ రీ రి రి రీ గ మ ప ధ ప
మ గ మ గ రి సా సా సా

బడియెను. ఆమె వెనుకకుఁ దిరిగిచూచెను. బ్రాహ్మణుఁడు వ్రేలాడుచున్న యామె చీరచెఱఁగును గట్టిగఁ బట్టుకొని పాదసమీపమున ప్రాణములన్నియు బిగబట్టుకొనియుండెను. విమల యాశ్చర్యపడి 'అది యేమి?' అట్లుపడిపోయినాఁడవు మరల దయ్యము కనఁబడెనా యేమి'—అనియడిగెను.

బ్రాహ్మణుఁడు మాటాడలేకపోయెను. వ్రేలితోఁ జూపుచు "అక్కడ" అనియెను. విమల యావైపునకుఁ జూచెను, కష్టముమీఁదవచ్చు నుచ్ఛ్వాసము లామెచెవులం బడియెను. తోపకుసమీపమున నేదియో యున్నదని యామె కనిపెట్టెను

ధైర్యము తెచ్చుకొని బాగుగఁ బరికించెను. అది చక్కగ నలంకరింపబడిన యొక యశ్వము. ప్రాణావసాన సమయమున నెగయూపిరి విడుచుచున్నదని యామె తెలిసికొనెను.

విమల నడువ నారంభించెను. ఆగుఱ్ఱమును జూచినప్పటినుండియు నామె ఏమికీడుమూడునో యని భయమొందుచుండెను. చాలసేపు నిశ్శబ్దముగ నుండెను. అర్ధక్రోశము నడచిరి. దిగ్గజుఁడామెను మరలలాగెను. విమల "ఏమి" అని యడిగెను. గజపతి యొకవస్తువు నామెకుఁ జూపెను.

"ఇదియొక సైనికుని తలపాగ" అనిచెప్పి విమల యోచనాసముద్రమున మునింగెను.

చంద్రోదయమైనది. విమల యింకను నేదియో యోచించుచునేయుండెను. చాలసేపు గడచినపిమ్మట దిగ్గజుఁడు

ధైర్యము తెచ్చుకొని యిట్లనియెను. "సుందరీమణీ! నీవు మాటాడుటలేదేమి?"

"ఈత్రోవపైనున్న గుర్తులను జూచినావా?"

గజపతి సవిమర్శదృష్టితో మార్గమునుజూచి ఇట్లు బదులుచెప్పెను.

"ఔను. ఎన్ని యోగుఱ్ఱపుడెక్కల గుర్తులున్నవి."

"ఆ! వివేకమన నిట్లుండవలయును. దీనినిబట్టి నీవేమ యిన గ్రహించితివా."

"లేదు"

"అదిగో మరణించిన గుఱ్ఱము, ఇదిగో సైనికుని తల పాగ, ఇదిగో నిటనశ్వముల కాలిచిహ్నములు. వీనినన్నిటిని జూచియు నీవేమియును గ్రహించుకొనలేదా? నేను వేఱేచెప్ప వలయునా?"

"అయినవిశేషము లేమి?"

"ఇప్పుడే యెందఱో సైనికులీమార్గమున నడచినారు'

"అయిన, వారు మనలను మించి చాలదూరముపోవు వఱకును మనము మెల్లగఁబోవుదము" అనియాతఁడు భయ ముతో ననియెను. విమల విచారముతో నిటు బదులు చెప్పెను.

"ఓయి మందబుద్ధీ! మనలను మించిపోవుటనుచు చెప్పు చున్నావేమి? ఆచిహ్నము లెటువైపునకున్నవో చూడ లేదా? ఈసైనికులు గరమందరము ప్రక్కకేగినారు"

విమల విచారపడెను. శైలేశ్వరాలయము దృష్టిపథ

మునఁ బడియెను. విమల యిట్లు యోచించెను. "ఈ బ్రాహ్మణుఁడు జగత్సింగునుజూడరాదు. చూచిన కీడుమూడఁగలదు. ఈతనిని దప్పించుకొనుటెట్లు?" ఆమె యిట్లు యోచించుచుండ బ్రాహ్మణుఁడామెకుఁ దప్పించుకొనుమార్గమును జూపెను. చీరచెఱఁగును మరల లాగెను. ఆమె తిరిగిచూచి "ఏమి" అనియెను.

"దానికది యెంతదూరమున్నది?"

"దేనికి?"

"ఆమఱ్ఱిచెట్టునకు"

"ఏమఱ్ఱిచెట్టునకు?"

"నీవాదినమున దానినెక్కడఁ జూచితివో యాచెట్టునకు."

"దేనినిజూచితిని"

"రాత్రులయందు పేరు చెప్పరాదు."

విమల యాతనియుద్దేశ్యమును గ్రహించెను. సమయమునకు బాగుగ జ్ఞప్తికివచ్చెనని తలంచి పెద్దకంఠధ్వనితో "ఓహో" అనియెను.

"అదియేమి? అదియేమి" చెప్పవా? అని యాతఁడాత్రముతో నడిగెను.

విమల శైలేశ్వరుని యాలయముకడనున్న మఱ్ఱిచెట్టును జూపి "అదిగో యదే మఱ్ఱిచెట్టు" అని మెల్లగా ననియెను. దిగ్గజుఁడొకయంగుళమైన ముందున కడుగిడలేదు. ఇఁక నడుగిడలేదు. నిశ్చయము.

ఆకుపలెఁ గంపింపఁజొచ్చెను. విమల యిట్లనియెను.

"నాతోఁగూడరమ్ము"

"నేనింక నొక్క యడుగైన వైవఁజాలను." అని యాతఁడు వడకుచుఁ జెప్పెను.

"ఔను నేనుకూడ భయపడుచుంటిని."

బ్రాహ్మణుఁ డొకయడుగు ముందునకు వైచి పరుగెత్తిపోవ సిద్ధపడియెను. విమల చెట్టువైపునకుఁ జూచెను. ఆవృక్షముకడ తెల్లని రూప మొకటియున్నది. అది శైలేశ్వరుని నందివాహనమని యామె యెఱుంగును. గజపతితో నిట్లు చెప్పెను.

"నిన్నుఁ గాపాడునీయిష్టముదైవమును స్మరించుకొనుము. చెట్టుక్రిందనున్న దానిని జూచితివా?"

"ఓభగవానుఁడా! రక్షింపుము, రక్షింపుము" అని కేకవేయుచు నాతఁడు వెనుకకుఁ బరుగెత్తెను. ఆతని కాళ్లుచాల పొడవైనవి. వాని యనుగ్రహమున నాతఁడొక క్షణికములో నర్ధక్రోశము దాఁటిపోయెను.

విమల గజపతి స్వభావముబాగుగ నెఱుంగును. ఆతఁడు దిన్నఁగ దుర్గద్వారముకడకుఁ బోవునని యాలోచించెను. అందుచే నించుకేనియు సందేహముంచక యామెయాలయము వైపునకు నడచెను.

విమల యింతకుఁబూర్వమాలోచింపని విషయమొకటి యిప్పుడు జ్ఞప్తికిఁ దెచ్చికొనెను. "జగత్సింహుఁ డాలయమునకు వచ్చియుండునా?" ఈయాలోచన మామెకుఁ జాలవిచా

రము గలిగించెను. ఆతఁడు తప్పక వచ్చెదనని వాగ్దత్తమొనర్చి యుండలేదు. ఆతఁడు చెప్పినదేమి? "ఈయాలమునను న్నుఁ జూఁడగలవు. లేనిచో నన్నెప్పుడును గనలేవు" అనికదా! ఈవాక్యములఁబట్టి చూడనాతఁడు వచ్చుటకంటె రాకపోవుటకే యెక్కువయవకాశమున్నది. అతఁడు వచ్చియుండనిచో వృథాప్రయాసముకదా! ఆమెయిట్లు చింతించెను.

"అయ్యో! నేనీవిషయము నింతకుముందేల యాలోచింపనైతిని? బ్రాహ్మణు నేల మరలఁ బంపివైచితిని? ఈ యర్ధరాత్రిమున నేనొక్కతెను మరలి పోవుటెట్లు? ఓ వైశ్వేశ్వరా? ఏమిచేయుచున్నావోకదా!"

ఆలయముకడకుఁ బోవలసినచో నామఱ్ఱివృక్షముక్రింద నుండియే పోవలసియుండెను. విమల యెట్లో పోవుచుండెను. అట నందివాహనములేదు. ఇంతకుఁ బూర్వముచూచిన తెల్లని రూపమునులేదు ఆమె కొంచెమాశ్చర్యపడెను. వృషభముండిన నట నెక్కడనో స్పష్టముగ నగపడవలసినదే కదా!

విమల యాతసుప్రికాండము వంక వీక్షించెను. దాని కావలప్రక్కనున్న మనుష్యుని తెల్లదుస్తులయొక్క యొక భాగముకనుపెట్టెను. ఆమెచాలభయపడియెను. అతిశీఘ్రముగ నామెట్లనుదాఁటి యాలయము కడకుఁబోయి శక్తికొలఁదిని దలుపును ద్రోసెను. అది వేయఁబడియుండెను. "ఎవరక్కడ" అని కేకవైచెను. విలువంపైన యాకట్టడమునుండి "ఎవరక్కడ?"అని ప్రతిధ్వని వినవచ్చెను. విమల ధైర్యమును దెచ్చుకొని యిట్లనియెను.

"మార్గాయాసము నొందియున్న యబలను."

తలుపువీడెను. లోనదీపము వెలుగుచున్నది. ఆమె ముందున్నతుడగు మనుష్యుఁడొకడు నిలువఁబడెను. ఆతని చేతఁగత్తితోనున్న యొఱయొకటియుండెను. విమల యాతనిఁ జూచెను. ఆనవాలుపట్టెను. ఎవరు?

రాజాజగత్సింహుఁడు.

పదునాఱవ ప్రకరణము

—♦—

శైలేశ్వర సన్నిధానము

విమల విశ్రాంతిఁజెందుటకై కూర్చుండెను. శైలేశ్వరునకును రాజునకును వందనములొనర్చెను. కొంతసేపటి వఱకును ఇరువురునుమాటలాడలేదు. వారిహృదయములొకరికొకరెట్లుతెలుపవలయునో వారెఱుంగలేకపోయిరి. ఇరువురును గలవరమొందిరి. మాటలాడ నారంభించుటెట్లు? ఇట్టి విషయములలో విమల పూర్ణప్రజ్ఞకలది. మాటలాడనుగలదు. ఊరకుండనుగలదు. చిఱునగవుతో నామె యిట్లనియెను.

"శైలేశ్వరుని యనుగ్రహమున మిమ్ము మగలఁజూడఁ గలిగితిని."

ఈయర్ధరాత్రిమున నాకుఁ జాల భయమయినది. మిమ్ములనుజూచుటతోడనే మరలధైర్యము గలిగినది.

"మీకందఱకు క్షేమమా?"

జగత్సింహుఁడు తిలోత్తమయందు నిజముగ బద్ధానురాగుఁడైయుండెనో లేదో ముందు తెలిసికొనినపిదపఁ దక్కిన విషయములను బ్రసంగింపవలయునని విమల తలంచి యిట్లు చెప్పెను,

"చిత్తము, మీక్షేమముకొఱకే శైలేశ్వరుని బూజింపనిటకువచ్చితిని కాని, మీరలొనర్చిన యర్చనలచే దేవుఁడు సంప్రీతుఁడయినాఁడు. ఇఁక మాపూజ లంగీకరించునా? కావున సెలవుఁగైకొని మరలిపోయెదను."

"మంచిది. నీవొక్కతెవుఁబోలేవు. నేను నీకు సహాయము వచ్చెదను."

జగత్సింగు కేవల మాయుధవ్యాపార తత్పరుఁడయియుండలేదని విమల గ్రహించెను.

'నేనొక్కతె నేలపోలేను?'

'మార్గమందే దేని యుపద్రవము గలుగవచ్చును'

'కలిగిన మానసింహ మహారాజుకడకుఁ బోయెదను'

'ఎందులకు?'

'మీచే నియమింపఁబడిన సేనాధిపతి రాష్ట్రప్రజలకు మార్గమధ్యమునఁ గలుగు నుపద్రవముల నణంప నశక్తుఁడుగ నున్నవాఁడు; శత్రునిర్మూలనా సామర్థ్య మాతనికడలేదు' అనిమహారాజుతో విన్నవించుకొనెదను.

'శత్రువులను నాశనమొనర్ప నీశ్వరునకైనను సాధ్యముకాదు. ఇఁక మనుష్యుఁడన నెంత? చూడుము. ఈశ్వరుఁడు తనకోపాగ్నిచే నగజుని భస్మముచేసినాఁడుకద! పదు

నేనుదినములక్రిందట నీయాలయమునందే యామన్మథుఁడే యద్భుతముగఁ దనప్రతాపము నగపఱచుచు కలవరమొందించినాఁడు. ఈశ్వరుని పరాక్రమట్టిది. ఇఁక మనుష్యుఁడన నెంత?' అని సైన్యాధిపతి సమాధానము చెప్పకొనెను.

'ఎవరిని గలవర మొందించినాఁడు' అని విమల చిఱునగవుతో నడిగెను.

'సేనాధిపతినే'

'ఏమి? మహారాజీయసాధ్యకార్యమును నమ్మునా?'

'నాకు సాక్షులున్నారు?'

'ఎవరు?'

'నీవు. మంచిస్వభావముగల—'

''ఈమీపరిచారిక దుస్వభావముగలది. నన్నువిమలా యని పిలువవచ్చును'

''నాకుసాక్షి విమల'

'కాదు. విమల యెప్పుడు నట్టిసాక్ష్యమీయదు'

'కావచ్చును. పదునేనుదినములలోపలనే తానుచేసిన వాగ్దత్తమును, మఱపుఁ జెందినయామె యెప్పుడును సరియైన సాక్ష్యమునీయదు.'

'నేనేమి వాగ్దత్త మొనర్చితిని?'

'మీసఖి వంశనామము లెఱింగింప వాగ్దత్తమొనర్చి యుండలేదా?'

'విమల కంఠధ్వని యింతలో మార్పుచెందెను.'

''రాకుమారా! ఆవిషయమును మీకడఁ దెలుప సం

దియమందుచున్నదానను. ఆమె యుదంత మెఱింగించి మీ మనస్సునకు సంతాపము గలుగజేసినదాన నగుదునేమోయని భయమగుచున్నది'

రాజపుత్త్రిడొక్కించుక యాలోచనముచేసెను. పరిహాస వచనములు చాలించి యిట్లనెను.

'విమలా! ఆమెవృత్తాంత మెఱింగించుట వలన నాకసౌఖ్యముగలుగుననియే తలంచుచుంటివా?'

'ఔను'

జగత్సింగు కొంచెమాలోచించి మరల నిట్లనియెను. 'ఏమిరానున్నదో రానిమ్ము. నామనోరథ మీడేర్పుము. ఆమెయెవ్వరో యెఱుంగఁజాలకపోవుటచే దుస్సహపరితాపతప్తుఁడ నగుచున్నాఁడను. ఈపరితాపమునకంటె వేఱుపద్రవ మేమియునుండదు. ఒకవేళ నీవు తలంచినదియే సత్యమైనను నిప్పుడు నేననుభవించుచున్న వేదనకంటెనదియధిక బాధాకరముగనుండదు. పిదప నేనెట్లో చూచుకొనియెదను. ముందీపరితాపాగ్నిఁ జల్లార్పుము. విమలా! నేను వినోదముకొఱకిటకు రాలేదు. వినోదముగా యథేచ్ఛతోఁ జరించుటకు నాకిప్పు డవకాశములేదు. ఈపదునేను దినములనుండియు గుఱ్ఱమువీఁపుదక్క వేఱుశయ్య నెఱుంగను. నాహృదయమునకు విశ్రాంతిలేదు. నీకొఱకు యత్నించుచున్నాఁడను''

అతని గుట్టుఁదెలిసికొనుటకే విమల యిదివఱకట్లు మాటలాడెను. ఆమె యభీష్టము నెఱవేఱినది. జగత్సింహుని యభిప్రాయమును దెలిసికొనియెను. అయిన నింకను నాతని హృదయమును దెలిసికొనఁగోరి యామె యిట్లనియెను.

"రాజపుత్త్రా! నీవు రాజనీతివిదుఁడవు. ఈయుద్ధసమయమున నీకులభ్యముకాని యొకయువిదయందు బద్ధానురాగుడవై పరితాపమందుచుందువా?"

'నీవామెనుమఱచిపోయితివా, ఇరువురకును శ్రేయమే, నీకుయుద్ధమున జయముగలుగును.'

'ఆఁ! ఎవరిని మఱచిపోవుట?' ఆతని యధరోష్ఠము మనోవ్యాకులభావ గర్భితమైన మందహాసమును సూచించుచుండెను. "ఆఁ! ఎవరిని మఱచిపోవుట? మీచెలిరూపము ప్రథమావలోకన సమయముననే నాహృదయమున మలఁచినట్లు స్థిరముగ నాఁటుకొనినది. ఈశరీరము భస్మమయినఁగాని యాహృదయమునుండి యారూపము విడిచిపోవుటెట్లు జనులు నన్ను కఠినహృదయుఁడటందురు. ఆతిమీఁద మలఁచినది. ఆయి నశించినప్పుడుదక్క నశింపదని నీవెఱుంగవా? యుద్ధమునుగూర్చి యేదియో మాటలాడితివి. నేనా లావణ్యరాశిని జూచినదిమొదలు రణములోననే యుంటిని. రణరంగమున నున్నను నింటికడనున్నను నామె ముఖలావణ్యమొక్కనిమిషమైన నాహృదయమునకు మఱపురాలేదు. పఠానుఁడు నాతల నఱుక చేయియెత్తినప్పుడు నాహృదయమునకు ముందుగ నీవిషయమే జ్ఞప్తికివచ్చెడిది. 'అయ్యో! ఇట వీరమరణము నొందితినేని యిఁక నీజన్మమున నాకాయువతీరత్నమును దర్శించుభాగ్యము లభింపకపోవునుగదా! ప్రథమావలోకనమే కడసారి చూపగునుగదా!' అని విచారించెడివాఁడను. 'విమలా! మీచెలిఁజూడ నేనెచ్చటికిఁ బోవలయును?'

విమలకు సంశయ విచ్ఛేదమయ్యెను. ఇఁక నాతని హృదయమును దెలిసికొననగత్యమేమికలదు? అమె యాతని తోనిట్లనియెను. 'నీవాసుదతీమణిని గరమందరమునఁగాంచఁగలవు, ఆమెపేరు తిలోత్తమ. వీరేంద్రసింహుని తనయ.'

జగత్సింగునకు సర్పదష్టమైన ట్లయ్యెను. అవనతశిరస్కుఁడై ఖడ్గమునకుఁ జేరగిలఁబడి నిట్టూర్పువిడిచెను. చాల సేపటికి 'విమలా! నీవనినమాట నిజమైనది. తిలోత్తమ నాతిలోత్తమకానేరదు. రణమునకుఁ బోయెదను. నాభవిష్యత్సౌఖ్యమునందలి యాశలన్నియు శత్రువుల రక్తములోఁ గడిగివైచెదను''అని విచారముతో ననెను.

విమలయుఁ జాలవిచారమొందెను. ''రాజకుమారా! ఈప్రపంచమున వాస్తవానురాగముగలవారెప్పుడైన జయమొందిరేని నీవును తిలోత్తమను బరిణయమాడఁగలవు. ఇంతలోనే నిరాశఁజెందనేల? అదృష్టమీదినమునఁ బ్రతికూలముగ నుండిన తేపనుకూలముగ నుండవచ్చును'' అనియెను.

ఆశావాక్య మెంతో మధురమయినది. ఆశాదేవత మహాగాఢాంధకార దినమున మానవుని చెవియందు రహస్యముగ నేదియో మాటలాడును. ''మీరంతగా చింతించుచున్నారెందులకు? నామాట వినుఁడు. మబ్బును వానయు శాశ్వతముగా నుండవు.''అని యాశాదేవత విమలాముఖమున వాక్రుచ్చెను. జగత్సింహుఁ డామాటలు వినెను. భగవదుద్దేశము నెవ్వరు చెప్పఁగలరు? అదృష్టవిధానములను ముందుగ నెవరు తెలిసికొనఁగలరు? ప్రపంచమున నసాధ్యమగు

కార్యమేదికలదు? ఎన్నియసాధ్యకార్యములు ప్రపంచమున సాధ్యమగుటలేదు.

జగత్సింహుఁ డాశాబద్ధుఁ డయ్యెను. ఇట్లనియెను. "ఈదినమున నాకు మనస్స్థిమితములేదు. కర్తవ్యనిశ్చయము సందసమర్థుఁడను. విధివిధానము జరిగితీరును. అది యవిలంఘ్యము. హృద్గతమును వెలిబుచ్చుచున్నాఁడను. ఇది శైలేశ్వరుని సన్నిధిని శపథ మొనర్చుచున్నాఁడ. తిలోత్తమను దక్క మఱియెవ్వరిని నేను పరిణయమాడఁబోను. విమలా! నామాటలన్నియు మీ చెలితో విన్నవింపుము. ఆమె నింక నొక్కమాఱు చూడవలయునని చాలగనభిలాష కలదు. ఇఁక నెప్పుడును నిట్టికోరికఁ గోరను.

విమల ముఖము సంతోషముచే వికసింప నిట్లనియెను. "మాసఖియిచ్చు ప్రత్యుత్తరము మీకుఁ జేరుటెట్లు?"

"నిన్ను మరల శ్రమపుచ్చుకొనుమని కోరుటకు నాకు సాహసము గలుగకున్నయది. అయినను నానిమిత్తమొక్కమాఱు మరల శ్రమపడి యీయాలయమునఁ గలిసికొంటివేని నేను నీఋణమందుండెదను. ఎప్పుడోయొకప్పు డర్హమైన ప్రత్యుపకార మొనర్చి జగత్సింగు నీఋణమును దీర్చుకొనఁ గలఁడు"

"రాజతనయా! నేను నీసేవకురాలను, నన్నిన్నివిధముల వేఁడుకొన బనిలేదు. అయినను, రాత్రులయందీత్రోవను రా నాకుఁ జాలభయమగుచున్నది. నావాగ్దత్తమును జెల్లింపక పోవుదుననుభీతిచే నేనీనిశియందు సాహసమునవచ్చితిని. దేశమున శత్రుబాధ లధికముగనున్నవి. నేను మరల రాలేను"

జగత్సింహుఁడు కొంచెమాలోచించి యిట్లనియెను. 'విమలా నేనొక్కమాట చెప్పెదను. నీకుఁదప్పుగానుండనిచో నేను నీతోఁగూడ గరమందరమునకువచ్చి యనువయినప్రదేశమున రహస్యముగ నుండెదను వీూచెలిహృదయము నట నాకెఱింగింపవచ్చును"

"అయినరమ్ము" అని విమల యాహ్లాదముతో నని యెను.

వారాలయమునుండి నిర్గమింపనుద్యుక్తులైరి. ఇంతలో నాలయమున కావలప్రక్క నెవ్వరో మెల్లగ నడచుచున్న ట్లడుగులధ్వని వారికివినవచ్చెను.

జగత్సింహుఁడు. "నీవెవర్నైనఁగూడఁ దీ సి కొ ని వచ్చితివా?"అని విమల నడిగెను.

"లేదు"

"అయిన మనమిప్పుడు వినినధ్వని యెవరిది? మన ప్రసంగము నవ్వలనుండి యెవ్వరును వినలేదుగదా!" అని చెప్పుచు నతఁడీవలకువచ్చి యాలయముచుట్టును దిరిగెను. ఎవ్వరును గనఁబడలేదు.

పదునేడవ ప్రకరణము

వీరపంచమి

శైలేశ్వరునకు వందనమొనర్చి వారిరువురును గరమందరమునకుఁ బ్రయాణమైరి. అతివేగముగ నడచుచుండిరి. ఇరువురును మాటలాడుటలేదు. ఒక్కింతసేపటికి రాజిట్లనియె.

"విమలా! నాకొక్కవిషయమునుగూర్చి మహాశ్చర్య మకలుగుచున్నది. అదివినిన నీవేమిచెప్పెదవో నాకుఁ దెలియదు."

"ఏవిషయము"

"నీవు పరిచారికవు కావని నాయుద్దేశము"

"అట్లు తలంచుచుంటి రేల?" అని విమల మందహాసముతో నడిగెను.

"వీరేంద్రసింహుని తనయ అభిరామ ప్రభువు కోడలు కాకపోవుటకొకప్రత్యేక కారణమున్నది. అదిచాలరహస్యము. కేవలము సేవకురాలవేయైనచో నీవాకారణమును దెలిసికొనఁజాలవు"

విమల నిట్టూర్పు విడిచెను.

"కుమారా! నిజమును గ్రహించితివి. నేను పరిచారికనుగాను. అయినను నాదురదృష్టముచే నట్లు సంచరింపవలసి వచ్చినది. అదృష్టమును నిందింపనేల? అది యంత చెడ్డదియునుగాదు." అనివిచారముతో బదులుచెప్పెను.

ఈప్రసంగమామెకు విచారకారణ మని జగత్సింహుఁడు గ్రహించెను. ఆప్రస్తావనను మానివేసెను.

రాజపుత్రా! ఇప్పుడుకాదుగాని మఱియొకప్పుడు నావృత్తాంతమును దెలిపెదను. ఆధ్వనియేమి? మనల నెవఁడైన వెంబడించుటలేదుకదా?"

మనుష్యుల యడుగులధ్వనియుఁ, నిరువురు మనుష్యులు గుసగుసలాడుకొనుధ్వనియు, వారికి వినవచ్చెను. వారొక

మైలు నడచిరి. జగత్సింగు "విమలా! నాకు చాల సనుమానముగనున్నది. చూచి వచ్చెద నుండుము" అని చెప్పి కొంచెము వెనుక కరిగెను. చుట్టును బరికించెను. ఎవ్వరును గనఁబడలేదు. మరలవచ్చి విమలతో నిట్లనియెను. "ఎవఁడో కుటిలుఁడొకఁడు మనతోఁగూడ వచ్చుచున్నట్లున్నది. మెల్లగ మాటలాడుము"

ఒరులకు వినఁబడకుండ మాటలాడుచు నిరువురును గోటయొద్దకు వచ్చిరి.

"నీవిప్పు డీదుర్గమున నెట్లు ప్రవేశించెదవు ? అర్ధరాత్రము. ద్వారము బంధించియుండును కదా!"

"నేనివ్వలకు వచ్చునప్పుడందులకుఁ దగిన యేర్పాటు గావించియే వచ్చితిని"

"రహస్యమార్గ మేదయిన నుండెనా?"

"చోరుఁడున్నచోట కన్నముండదా?"

"విమలా! నేనిఁక ముందునకు రానక్కఱలేదు. ఈ సమీపముననున్న రసాలవనమునం దుండెదను. తిలోత్తమతో నామాటలుగ నిట్లనుము. "నిన్నొకమాఱు దర్శింపనభిలాష మెండుగఁగలదు. నాకన్నుల కట్టిభాగ్య మలవడఁజేయవే విధముల వేఁడుకొనుచున్నాఁడను. అది యిప్పుడు కాకపోయిన పదునేను దినములు—ఒకమాసము—తుదకొక సంవత్సరము గడచిన పిమ్మటనైనను సరియే"

"ఆవన మంత రహస్యమైనది కాదు. నాతోఁగూడ రమ్ము"

"ఇఁక నెంతదూరము?"

"దుర్గములోపలకు"

రాకుమారుడు కొంచెము యోచించెను.

"విమలా! నేనట్లు చేయఁజాలను. యజమానునియాజ్ఞ లేకుండ దుర్గమునఁ బ్రవేశింపను."

"నీకు భయమేమి"

"క్షత్రియజన్మ లెప్పుడును భయమన్నమాట యెఱుంగరు కాని, యభిన్నసుప్రభువు తనయుఁడు దుర్గేశుని యెఱుక లేకుండ దుర్గమునఁ బ్రవేశించిన నది చౌర్యమనిపించు కొనదా?" యని కోపముతోఁ బలికెను.

"నేను నిన్నుఁదీసికొనిపోవుచుండఁ జౌర్య మెట్లగును?"

"నేనిట్లనుచున్నానని యన్యథా భావింపకుము. నీవు పరిచారికవు. నన్ను కోటలోని కాహ్వానము సేయుటకు నీకు స్వాతంత్ర్యమేమికలదు?"

"నాకు స్వాతంత్ర్యముకలదు. ఆవిషయమున నీకు నమ్మకము కలిగినపిమ్మటనే రావచ్చును"

"అట్లే!"

విమల రహస్యముగ నాతనితో నేదియో చెప్పెను.

"అమ్మా! దయచేసి నడువుము. నేనును వచ్చెదను"

"నేను సేవకురాలను నీవట్లనరాదు. నాకాజ్ఞాపింపుము"

"నీయిష్ట మెట్లట్లే"

వారు నడచుచున్నతోవ దుర్గద్వారముకడకుఁబోవును.

ఆఫ్రిక్క మామిడితోఁటకలదు. ప్రధాన ద్వారముకడ కది స్పష్టముగ నగపడదు. ఆమోదరానది వైపునకుఁ బోఁదలఁచిన వారీతోఁట మార్గముననే పోవలసి యుండును. విమల ప్రధానమార్గమును విడిచి తోఁటలో ప్రవేశించెను. రాజా మెతోఁగూడ నడచుచుండెను.

వారందుఁ బ్రవేశించిన తోడనే క్రింద రాలియున్న యెండుటాకులు నలిగి యెవరో మనుష్యులు నడచుచున్నట్లు ధ్వని వినవచ్చెను. విమల 'మరల' అనియెను.

"ఒక్కించుక సేపిట నాఁగుము. నేనుచూచివచ్చెదను" అనిచెప్పుచు జగత్సింహుఁడొఱనుండి కత్తిదీసి ధ్వని విన వచ్చిన త్రోవఁబట్టి పోయెను ఎవ్వరును గానరాలేదు. ఆ మామిడితోఁపునందడుగు భాగమంతయు నడవి మొక్కల పొదలతో నిండియుండెను. మఱియు వృక్షచ్ఛాయచేగాఢాంధకారమయము. ఏమిగాన వచ్చును? మృగములయొక్క కాలిచప్పుడుచేనైన నీధ్వని కలుగవచ్చును. ఎట్లయినను సంశయవిచ్ఛేదము కర్తవ్యమని నిశ్చయించుకొని జగత్సింహుఁడొక వృక్షాగ్రమున కెక్కెను. చుట్టునవలోకించెను. చాల సేపటికి కిరువురు మనుష్యులు గనఁబడిరి. వారిశిరస్సులపైఁ జంద్రకిరణోజ్వలితంబులగు తలపాగ లుండెను. వారొక యత్యున్నత వృక్షచ్ఛాయ గాఢాంధకారమున దాఁగియుండిరి.

జగత్సింహుఁడు వారలను బాగుగ గుర్తించెను. ఇరువురుండుట స్పష్టము. వృక్షమునుగూడ నానవాలు చూచు

కొనియెను. మెల్లగదిగి విమలయొద్దకువచ్చెను. చూచిన దంతయుఁ జెప్పెను.

"ఇప్పుడు రెండుబల్లెములుండెనా"

"బల్లెములున్న నేమి"

"వారెవరో బాగుగ గుర్తించెదను. వారుధరించిన యుష్ణీషములఁబట్టి చూడ దుర్మార్గులగు పఠానులని తోఁచెడిని. వారేదో దురుద్దేశముతో మనలను వెంబడించియుందురు"

విమల కప్పుడు చచ్చిపోయిన యశ్వమును, తలపాగయు, గుఱ్ఱపుకాలి గుర్తులును స్మరణకువచ్చెను.

"మీరిటనుండుఁడు. ఆయుధములను గైకొని వచ్చెదను" అని చెప్పుచు విమల కోటకిందకుఁ బోయెను. ఆమె యలంకరించుకొనిన గదియొక్క గవాక్ష మీవనమున కెదురుగ నున్నది. ఆమె యాగవాక్షముకడ కేగి తనకడ నున్న తాళముచెవి ద్వారబంధమునకు వ్రేలాడఁబడియున్న తాళమునఁ బెట్టిత్రిప్పెను. పిదప గడియనుబట్టుకొని గవాక్షమును గోడలోనికిఁ దోచివైచెను. అదియొక క్రొత్తపద్ధతి గవాక్షము కమ్ములసహితముగ గోటలోనికిఁబోయి మార్గమేర్పడియెను. విమల గదిలోఁ బ్రవేశించెను. గవాక్షము నెప్పటియట్లు తీసి తాళమువైచెను. లాగిచూచెను. తాళము సరిగా పడినది. అవ్వలివారలకు రాదని నిశ్చయించుకొనెను.

త్వరితముగ వడచి యాయుధశాలకరిగి యారక్షకునితో నిట్లనియెను.

"నాకు రెండుకుంతములిప్పుడు కావలయు. ఇమ్ము. మరల నవి నీకిచ్చెదను. ఇట్లడిగి పుచ్చుకొంటివని యెవ్వరి తోడను జెప్పకుము"

"అమ్మా! వానితో మీకుఁ బ్రయోజనమేమి?"

"ఈదినమున వీరపంచమి వ్రతమును జేయుచున్నదా నను. స్త్రీలు శూరుఁడగు తనయుఁడు గలుగవలె నని యా వ్రతమును జేయుదురు. అందాయుధపూజ ముఖ్యము. నాకట్టి తనయుఁడు కలుగవలయునని యభిలాష. ఇదియొరులతోఁ జెప్పకుము"

ఆయుధశాలాధికారి గ్రహింపఁ గలిగినంత గ్రహిం చెను. ఆదుర్గమునందలి సేవకులందఱా మెకు విధేయులే. ఈతఁ డును మఱుమాటాడకుండ రెండు వాఁడికుంతములఁ దెచ్చి యిచ్చెను.

విమల యతివేగమున గవాక్షముకడకు వచ్చి మును పటివలెనే దానిని తెఱచి జగత్సింహునియొద్ద కేగెను.

మిక్కిలి తొందరగఁ బోవుచుండుటవలన, మరల శీఘ్రముగ వత్తమను నుద్దేశముతోడనో విమల గవాక్షమును వేయకుండఁగనే పోయెను. ఇది యపాయమునకు దారిచూపు టయేగదా! గవాక్షమునకు సమీపమున నొకవృక్షముకడ నాయుధపాణియై యొకమనుష్యుఁడు కూర్చుండియుండెను. ఇది యంతయుఁ గనిపెట్టెను. విమల దృష్టిపథమును దాఁటి పోవువఱకు నాతఁ డటనుండి కదలలేదు. పిదపనాతఁడు పాద రక్షలనటవిడిచి మెల్లగనడచి గవాక్షమును సమీపించెను.

లోపల నెవ్వరైన నున్నారేమోయని పరికించెను. ఎవ్వరును లేరు. నిశ్శబ్దముగ లోపలకేగెను. గదిద్వారమునుదీసి కోట లోపలఁ బ్రవేశించెను.

ఇఁక నిట జగత్సింహుఁ డాయుధములను విమలయొద్ద నుండి గైకొని యథారీతిగ వృక్షాగ్రము నధిరోహించెను. తానానవాలుంచుకొనిన వృక్షమువంక వీక్షించెను; ఇప్పు డక్కడ నిరువురు లేరు, ఒకతలపాగయే కన్పట్టుచుండెను. రెండుచేతుల రెండుబల్లెములఁ దాల్చి యాతలపాగకై గుఱి చూచి శక్తికొలది విసరివేచెను. ఎండుటాకుల మర్మరధ్వనులు విననయ్యెను. ఏదియో యొకపదార్థము క్రిందపడినట్లయ్యెను. ఇఁక నక్కడ పాగలేదు. జగత్సింగు గుఱితప్పునా? చెట్లు కొమ్మలనుండి యామనుష్యుని క్రిందపడవైచి మఱితృప్తి నొందెను.

జగత్సింగు వేగముగవృక్షమునుదిగి యామనుష్యుని కడ కరుదెంచెను. అతఁ డాయుధపాణి యగు నొకమహమ్మదీయసైనికుఁడు. చచ్చినట్లు పడియుండెను. కుంతమాతని నేత్రమున గ్రుచ్చుకొనినది.

రాజుజాగ్రత్తగఁ బరికించెను. ప్రాణము పోయినది. ఆయుధమీాతని నేత్రములోనే కాదు—మెదడులోఁ గూడ నాటెను. అతని కంచుకమున నొకకాగితమున్నది. జగత్సింగు దానిని పుచ్చుకొని వెన్నెలలో నిట్లుచదివెను.

"కటులుఖానుని పక్షమువా రందఱు నీయుత్తరముఁ

దీసికొని వచ్చినవానియుత్తరువుల కిదిచూచినతోడనే విధే యులు గావలయును''

''కటుల్ ఖాన్''

విమల యామాటలను వినెను. కాని, దానియర్థమును గ్రహింపలేకపోయెను. జగత్సింగు విమలయొద్దకు వచ్చియం తయుఁ జెప్పెను.

''అయ్యో ! ఈసంగతి నీకాయుధములను దెచ్చి యిచ్చినపు డెఱుంగకపోయితినికదా! ఎఱిఁగియుండిన నీకా కుంతములఁ దెచ్చియిత్తునా? నేనెంత పాపాత్మురాలను ? ఈరాత్రి నేనొనరించిన ఘోరకార్యమునకుఁ జాలకాలము వఱకుఁ బరిహారమును సేయలేను.''

''ఇందు విచారించుట కేమియవకాశము కలదు. నశిం చినవాఁడు శత్రువేకదా! అందుఁ దగనిపనియేమున్నది?''

''రణవీరులట్లే తలంచెదరు. మేముస్త్రీలముగదా''

విమల కొంచెమాలోచించి ''రాజకుమారా ! ఇఁక నిటఁ దడయు టపాయకరము. కోటలోనికిఁ బోవుదమురమ్ము. తలుపును దెఱచివచ్చితిని. రమ్ము'' అనియెను.

ఇరువురును శీఘ్రముగ నడచివచ్చి కోటలోపలఁ బ్రవే శించిరి. లోపల నడుగిడు నప్పుడు జగత్సింగునకు హృదయము కొట్టుకొనియెను. కాళ్ళు కంపమొందసాగెను. అపారపారా వారశత్రుసైనిక నికాయంబుపై రణరంగమునకుఁ బోనున్న ప్పుడుకూడ నాతని శిరోజమైనను చెక్కుచెదరి యెఱుంగదు. అట్టిదీసంతోషభవనమునఁ బ్రవేశించునప్పు డిట్లు కంపముజని యించెనేమిచెప్పుమా? భవితవ్యమేమి సూచనచేయుచున్నదో?

విమల మరల యథాప్రకారముగ గవాక్షమునుమూసి రాజపుత్రునితో శయనాగారమును బ్రవేశించెను.

"రాజతనయా! నేనొకనిముషములో మరల వచ్చెదను" దయచేసి యీశయ్యపై నధివసింపుడు. మీహృదయ మన్యథావర్తింపదేని భగవంతుని శయ్యాస్థానము వలపత్రమే కదాయని తలఁపుఁడు."

విమల యవ్వలకేగెను. కొంతసేపటి కాగది నంటియున్న యింకొకగదితలుపు తీయఁబడియెను. లోపలినుండి "రాజతనయా! ఇటుదయచేయుఁడు ఒకమాటవినుఁడు" అను మాటలు వినవచ్చెను.

మరల జగత్సింహుని హృదయము కొట్టుకొనియెను. బహుశః అంతరాత్మ స్పష్టముగ నేదియో యాతనికి బోధించియుండును. అతఁడు శయ్యనుండి లేచి విమలయొద్ద కేగెను.

ఆమె మెఱుపువలె నదృశ్యమయ్యెను. ఆగది సుగంధద్రవ్యములచే బరిమళించుచుండెను. స్వచ్ఛమైన దీపము ప్రకాశించుచుండెను. అట నొకప్రక్క మేలిముసుఁగున నొక యువతీరత్నమున్నది. ఆమెతిలోత్తమగాక మఱెవ్వరు ?

పదునెనిమిదవ ప్రకరణము

విమల మరల తనగదిలోనికివచ్చి శయ్యపైఁ గూర్చుండెను. ఆమె మనోరథము నెఱవేరినది. ముఖము పరిపూర్ణానందమును సూచించుచుండెను. అట వెనుక దీపము వెలుఁగు

చున్నది. ఎదుట దర్పణమున్నది. ఆమెదుస్తులు ధరించినవి ధరించినట్లున్నవి. ఒక్కనిముషమామె తనరూపమునుదర్పణమునఁ జూచుకొనియెను. ఆహా! ఏమి యావేణికుటిలత్వము! ఏమి యానేత్రసౌష్టవము! ఏమి క్రిందికనుఱెప్పపై నాకాటుకరేఖ! ఏమియాయధరసౌందర్యము! గులాబిపూచాయవంటి యాతాంబూలరాగము. ఆకర్ణాలంకార చుంబితగండభాగములు. ఇవియన్నియుఁ దాల్చినవి తాల్చినట్లుండెను. ఆమె యొరగిలఁ బరుండియుండెను. పాఠకులారా! ఒక్కమాటా సమయమున నాయువిదనుజూచిన నెవనికన్యయువతిపైమనస్సు పోవును? విమల మందహాసముచేయుచుఁ దనలావణ్యమును గూర్చి యాలోచించుకొనుచుండెను. తాను విశేషప్రయత్నమొనర్చి మిగుల శ్రమనొంది తీసికొనివచ్చిన నిరుపమాన సౌందర్యరాశి యగు జగత్సింహునిం దిలోత్తమతోఁ గూర్చి నందులకామె విచారపడునా? ఎప్పుడు నట్లుతలఁపదు. తాను పూనినకార్యము సఫలీకృత మయ్యెనని పరమానందము నొందుచుండెను. దిగ్గజునిమాట యామె తలంపునకు వచ్చెను. కారణము లేకుండ నతఁడు గృహమునుండి వెడలసమ్మతింప నందుల కామెకు చిఱునవ్వువచ్చెను.

విమల జగత్సింగుకొఱకు వేచియుండెను. ఇంతలో సమీపమందలి మామిడితోఁటయందు బాకాధ్వని యొకటి విననయ్యెను. ఆమె యులికిపడి వెంటనేతనగదినుండి బయలు వెడలెను. ఎప్పటివలె నాధ్వనికుర్గద్వారముకడనుండి వచ్చియుండలేదు. అదిగాక యిట్టిసమయమున నెప్పుడును నట్టి

ధ్వనిచేయను. వెంటనే యామెమనసునకు శైలేశ్వరాలయమునకుఁ బోయి వచ్చులోపల జరిగినదంతయు జ్ఞప్తికి వచ్చెను. ఆమె యాధ్వని యేదో యాపత్సూచక మనితలంచెను. గవాక్షము నొద్దకువచ్చి పరికించెను. అం దేమియుఁ గనఁబడలేదు. భయమునొంది. యామె గదినుండి బయలు వెడలెను. ఆగది కావల పెరడు. దాని కావలవరుస గదులు. అందు సౌధముపై కెక్కుటకు సోపానములుకలవు. విమలపై కేగెను. అంతట నవలోకించెను. ఎవరును గాన్పింప లేదు. తోఁట గాఢాంధకారమయము. ఆమెకు భయ మధికమయ్యెను. పిల్లగోడయొద్దకువచ్చి వక్షము దానిపైనాని క్రిందకువంగి దుర్గము చుట్టునున్న ప్రదేశమును విమర్శించెను. ఎవరునుగానరాలేదు. స్నిగ్ధజ్యోత్స్నసముదయమున పచ్చని పత్రిసముదాయ మూలలాడుచుండెను. నడుమ నడుమ మంద మారుతుఁ డాకుల నల్లలనాడించుచుండ నవి యెఱ్ఱగ మెఱయుచుండెను. తోఁటయడుగుభాగ మంతయు నంధకారబంధురము. అక్కడక్కడ చంద్రప్రకాశము పత్రముల నడుమనుండి తప్పించుకొని మచ్చమచ్చలుగఁ బ్రకాశించుచుండెను. నిశ్శబ్దముగనున్న యామోదరా నదీప్రవాహముపై ధవళకిరణుఁడు నక్షత్రగణములతోఁగూడఁ బ్రతిఫలించుచుండెను. అవ్వలియొడ్డున దూరముగ గగనచుంబిత సౌధరాజి దృశ్యమగుచుండెను. వానిపై పహరా మనుష్యుఁడటునిటు తిరుగుచున్నట్లు కన్పట్టుచుండె. ఇవియన్నియు నామెచూచెను. ఆశాభంగమునొంది వెనుకకు మరలెను. ఇంతలో

నామెపీపు నెవరో వ్రేలితోఁదాకినట్లయినది. తటాలున వెనుకకుఁ దిరిగి చూచెను. ఆతఁ డాయుధహస్తుఁడగు నొక మనుష్యుఁడు. ఆమెయెప్పుడును నాతని నెఱుఁగదు. ఆమెచిత్తరువు వలె నిలువబడిపోయెను.

"నోరెత్తకుము. ఎత్తితివా నిన్నీకోటకిఁ్రిందకుఁ ద్రోసి వేయుదును"అని యాతఁ డనియెను.

విమల నిట్లాకస్మికముగ ప్రమాన్పడచేసిన యామనుష్యుఁడు పఠానుసైనికుని వేషమును దాల్చియుండెను. ఆతఁడు ధరించియున్న యమూల్యములగు దుస్తులనుబట్టి యాతఁడేదియో ముఖ్యాధికారియని సులభముగఁ దెలిసికొనవచ్చును. ఆతనివయసు ముప్పదేండ్లకుమించదు. అత్యంత సౌందర్యవంతుఁడు ఉన్నతమయిన లలాటభాగమున నాతని తలపాగయందొక వజ్రిములంకరింపఁబడియున్నది. విమల పూర్ణముగ భయవివశయయియుండనిచో తనకెదుట గన్పట్టు పురుషుఁడు రూపసంపదలయందు రాకొమరునకుఁ దీసిపోవువాఁడు కాఁడని యనుకొనియుండును. ఆతనిశరీరమంత గొప్పదికాదు. వక్షస్థలమును నంతవిశాలమయినది కాదు. ఆతనియందు వలెనే యీతనియందును వీరశృంగార లక్షణములుగానవచ్చుచుండెను. కాని యీతని శరీరమంతకంటె మృదువైనది. అనర్ఘ్యమయిన యాతని మొలదట్టియందు పవడపుబొత్తములతోఁగూర్చబడిన యొఱయు, నందొక డెమాస్కసుపట్టణములోఁ జేయబడిన కటారియు నుండెను. ఆతనిచేత నొఱ దీసిన ఖడ్గముమాత్రముండెను. ఇంక నేయాయుధమును లేదు

"కేకలు వైవకుము. వైచినఁ దత్క్షణము నిన్ను క్రిందకు ద్రోసి వైచెద"

విమల స్వభావముగ మనస్థైర్యముకలది. ఆమెకుఁ గలిగిన భయాద్భుతములొక్క నిముషము మాత్రమేయుండెను. రెండవమాఱాతడు మాటాడుటతోడనే యాతని యభిప్రాయమును గ్రహించెను. ఆమెయున్నది స్వాధాంతము. ఎదుట నాయుధహస్తుడగు సైనికుడు. సైనికులు వ్యర్థాలాపములాడువారుగారు. అతఁడు బెదరించునట్లు త్రోసివేయుట కూడ నంతకష్టమయినదికాదు. నిపుణవతియగు నామె యివి యన్నియు మనమునఁ దలపోసి 'నీవెవరవు?' అనియడిగెను.

"నన్ను తెలిసికొన నీకగత్యమేమి?"

"నీవీదుర్గమున కేలవచ్చితివిఁ! చోరులగ్ని స్తంభమున కంటగట్టబడుదురని నీవెఱుంగవా?"

"నేను చోరుఁడనుగాను."

"నీవిట కెట్లువచ్చితివి?"

"నీయనుగ్రహావశముననే—నీవు గవాక్షమును దెఱచిపోయి నప్పుడిందు బ్రవేశించితిని. ఇటకు నీవెనుకనే వచ్చుచుంటిని."

విమలహస్తమున శిరసును మొత్తుకొనియెను.

"నీ వెవరవు?"

"ఇంకను నన్నుఁ దెలుపుకొనుటకు సందియమెందులకు? నేను పఠానుఁడను"

"పఠానుడనినఁజాలదు జాతికి పఠానుడవే కాని, నీవెవరవు?"

"నా పేరు అస్మార్ ఖాఁ"

"నేనెప్పుడట్టివానిని వినియుండలేదు"

"కటులోఖానుని సేనాధిపతిని"

విమల కంపించెను. ఎట్లయిన నాతనిచేతులనుండి తప్పించుకొనిపోయి వీరేంద్రసింహునకీవార్త నెఱింగింపవలయుననను నుద్దేశమామె హృదయమును దహించివేయుచుండెను. కాని, యది యెట్లు సాధ్యమగును? కేవల మసాధ్యము. మార్గమునకడ్డముగ నతఁడు నిలువఁబడియుండెను. ఇఁక వేఱుగతిలేదు. ఆమె ఇట్లుతలంచెను. "నేనీతనితో మాటలాడుచుఁ గాలక్షేపము సేయుచున్నంతవఱకు నేను నిర్భయముగ నుండవచ్చునుగదా! ఇంతలో నేకావలివాఁడైననిటుల రాఁగూడదా!" ఆమె మరల మాటలాడ దొడంగెను.

"నీవీదుర్గమున నెందులకుఁ బ్రవేశించితివి?

"వీరేంద్రసింహునకు మాపక్షమున నుండుటకైదూతం బంపితిమి. ఆతఁడుసమర్థతగలదేని సైన్యమునెత్తి రావచ్చునని మరల వర్తమానమంపెను."

"నీవు చెప్పునది తెలిసినది. ఈదుర్గాధిపతి మీతో స్నేహమొనర్పక మొగలాయీలతో జేరెననియు నందులకు దుర్గమును బట్టుకొన వచ్చితిమనియు—అయిననీవొక్కఁడవే కనఁబడుచున్నాఁడవే?"

"ప్రస్తుత మొక్కఁడనే"

"అందులకని యేకాఁబోలు నన్ను పోకుండ నభ్యంతరముగలుగఁజేయుచున్నాఁడవు?"

పఠానుని చేతినుండి తప్పించుకొనుటకిక నాశలేదని తుదకామె యిట్లుచెప్పెను. పితికితనము నారోపించినందులకు గోపముతెచ్చుకొని యతనిధైర్యమును గనఁబరచుటకు దారియొసఁగునని యామె యోచించెను. అతఁడిట్లు ప్రత్యుత్తరమిచ్చెను.

"సుందరీ! నన్ను భయపెట్టుటకు నీకడ క్రీగంటి చూపులుదక్క వేఱాయుధము లెవ్వియులేవు. వానికైనను నంతగా భయపడను. అయినను నీతో నాకొక్కపనియున్నది"

విమల యాశ్చర్యమునొంది యాతనిముఖముపై తన దృష్టిని సారించెను.

"నీవస్త్రము చెఱఁగుననున్న తాళమును నాకిమ్ము. నాహస్తములచే నిన్నుముట్టుకొని నిన్నగౌరవపఱచుఁ టెందులకు?"

విమల మందహాసమొనర్చుచు "ఇది మిగుల చక్కగనున్నది. ఇంతకొక్కనిముషము పూర్వము నన్ను క్రిందకుఁ ద్రోసివేయ యత్నింపలేదా?"

"అవసరమువచ్చినప్పుడు ధర్మమనగత్యము. అవసరమయ్యోనేని యిప్పుడు నట్లేయొనర్చెదను"

అతనికప్పుడుగవాక్షముయొక్క తాళమత్యావశ్యకము, ఈవిషయము గ్రహించుటకు వివేకవతియగు విమల కెంత కాలము కావలయును? కాని, యతని నెట్లు తప్పించుకొన

వలయునో యామెకుఁ దెలిసినది కాదు. తనంతట తాను దానినీయని యెడల నాతఁడు బలాత్కారముగఁ గైకొనఁ గలఁడు. విమలగాక మఱెవ్వరైన నట్టిస్థితియందున్నచో తాళ మును నిస్సంశయముగ నిచ్చియుందురు. కాని విమల సామా న్యముగ నిచ్చునా? ఆమె యిట్లు బదులు చెప్పెను.

"నేనీ తాళము నీయనిచో నీవెట్లు పుచ్చుకొందువు?" ఇట్లు చెప్పుచు వస్త్రమునామె హస్తములోనికిఁ దీసికొనియెను. అస్మాక్ తన నేత్రములా వస్త్రముపైనుంచి యిట్లనియెను.

"నీవీయని యెడల నీమృదుగాత్ర స్పర్శనభాగ్యము నాకు లభింపఁగలదు"

"అట్లే చేయుము" అని చెప్పుచు విమల వస్త్రమును దోఁటలోనికి విసరివైచెను. అస్మాక్ తనహస్తమును జాపి యెగురుచున్న వస్త్రమును బట్టుకొనియెను. అస్మాన్ యొక్క జాగ్రతయు మెలకువయుఁ జూచి విమల యత్యాశ్చర్యపడి యెను.

అస్మాక్ విమలహస్తములను తనహస్తములతో దృఢ ముగాఁబట్టుకొని వస్త్రముననున్న తాళమును దంతములతో విప్పి దట్టియందు భద్రపఱచెను. విమల ముఖము వెలవెలఁ బోయెను. అస్మాక్ ఖానామె చేతులను వస్త్రముతో నొక్క స్తంభమునకుఁ గట్టివైచెను.

"ఇట్లు చేయుటలో నీయుద్దేశమేమి?" అని విమల యనెను.

"ఈపని రణమునకవసరము"

"ఈపాపకార్యమునకు ఫలితము శీఘ్రకాలములోనే యనుభవింతువుగాక!"

విమలనట్లేయుంచి యస్మాన్ వెడలిపోయెను. మరల వచ్చి "స్త్రీలనోరు నమ్మరాదు" అనిచెప్పుచు నామెనోరును వస్త్రములచేఁ గట్టిగ గట్టివైచెను.

అస్మాన్ విమలయొక్క క్రిందిగదిలోనికి దిగెను. తాళమును ద్రిప్పి మునుపటివలె గవాక్షమును గోడలోపలకుఁ ద్రోసివైచెను. మార్గమేర్పడియెను. అస్మాన్ మెల్లగనీల వైచెను. పాదరక్షలులేకుండ నొకఁడు వృక్షముమాటు నుండి వచ్చి లోపలఁ బ్రవేశించెను ఇంకొకఁడు వచ్చెను. మఱొకఁడువచ్చెను. వేఱొకఁడువచ్చెను. ఇట్లనేకులు కోట లోఁ బ్రవేశించిరి. తుదివానితో "ఇఁక రావలదు. నీవును, దక్కిన సైనికులును, వెలుపలభాగమున నుండుడు. నేను సైగ చేసినతోడనే కోట నరికట్టుడు. తాజ్‌ఖానుతో నిట్లు చెప్పుము" అని యస్మాన్ చెప్పెను.

ఆమనుష్యుఁడు మరలిపోయెను. సైనికులతో గూడ నస్మాన్‌ఖాన్ నిశ్శబ్దముగ బురుజుపైకెక్కెను. విమలను బంధించియున్న ప్రదేశమునుండి పోవుచు నిట్లనియె. "ఈ యువిద చాల వివేకవతి. ఈమెను నమ్మరాదు. రహీమ్! నీవిమెకడ రక్షకుఁడవుగా నుందువా? ఆమెనోరు విప్పివేయుము. కాని, యామె యెగురుటకుఁగాని యెవనితోనైనమాటలాడుటకుఁగాని, కేకవేయుటకుఁగాని, యత్నించెనేని తక్షణము నరికివేయుము, సంశయింపకుమా!"

"చిత్తమక్లే యొనర్చెదను"

పతానులాబురుజునుండి యాబురుజునకుఁ బోవుచుకోట యావలిప్రక్కకుఁ బోయిరి.

పందొమ్మిదవ ప్రకరణము

కాముకుఁడు—అతని యువతి

కుశాగ్రబుద్ధియగు నస్నాక్ వెడలిపోవుట విమల చూచెను. తనబుద్ధిసామర్థ్యముచే నెట్లో బంధమునుండి విడివడవచ్చునను నాశచే ధైర్యము తెచ్చుకొనియెను. ఏమిచేయ వలయునో యోచించుచుండెను.

కొంతసేపయిన పిమ్మట నాతనితోమాటలాడ నారంభించెను. కావలివాఁడు కానిమ్ము! కాలునిదూతగానిమ్ము! అట్టి సుందరీమణితో మాటలాడకుండ నెవఁడుండఁగలడు? విమల మొదట నేదో లోకాభిరామాయణమును బ్రసంగింప నారంభించెను. పిదప క్రమక్రమముగా నాతని పేరు, దేశము, ఇల్లు ఉద్యోగము, కష్టము, సుఖమునుగూర్చి వివిధ ప్రశ్నలను బ్రశ్నించెను. ఆతనికిఁగూడ నామెయందంతయాప్యాయము జనించెను. సమయమునుజూచి విమల తనయమ్ముల పొదినుండి వాఁడిగ్నైన బాణములఁ దీయ నారంభించెను. ఒక ప్రక్క నమృతముఁజిలుకు మృదుమధుర వాక్యములు, ఇంకొకప్రక్క గుఱితప్పకుండ విడిచిన పువ్వులమ్ములు. ఇవి రెండును నాతనిహృదయమును గఱగింప నారంభించెను.

వాని విధమునంతనుజూచి విమల యాతనికి వినాశకాలము దగ్గఱవడెనని తెలిసికొని మృదుమధురస్వరమున నిట్లనియెను.

"సాహేబుజీ! నాకుఁజాల భయమగుచున్నది నా యొద్దకువచ్చి కూర్చుండెదవా?"

సాహేబు పరవశుఁడయ్యెను. విమల సమీపమునకు వచ్చికూర్చుండెను. ఆమె యితరవిషయములనుగూర్చిమాటలాడెను. విమల తనయౌషధము పనిచేయుచున్నదని గ్రహించెను. ఆతఁడామె సమీపమునకు వచ్చినది మొదలామెను దదేకదృష్టితోఁ జూచుచుండెను.

"మీకు స్వేదము విస్తారము పట్టినట్లున్నది. నాహస్తముల నొక్కమాఱు విప్పితిరేని మీకొక్కింత విసరెదను. పిదప మరల నన్నుగట్టివేయవచ్చును." అని విమలయనియెను,

ఆతని లలాటమున నొక్క స్వేదబిందువయినలేదు. కాని, విమల నిశ్శంశయముగ దానినిజూచియుండెను. లేనిచో నామె యెందులకనియుండును? ఇంతేకాదు. ఆమె యాహస్తముతో విసరుట? ఆహా! ఆమృదుహస్తము! అట్టిభాగ్యమెవ్వరికి లభించును? ఇట్లాలోచించుకొని రహీమ్ వెంటనే యామె కట్లు విప్పెను.

విమల తనవస్త్రముతో నాతనికిఁ గొంచెము విసరెను. పిదప నేమియు నభ్యంతరములేకుండ తనశరీరమును గప్పుకొనియెను. రక్షకుఁ డామెను మరల బంధింపలేకపోయెను. దీనికొక కారణమున్నది. విమలను కట్టుటకు త్రాడుకావలెను గదా! ఆవస్త్రమును త్రాడుగా నుపయోగించుటకంటెనామె

శరీరమున నుంచుటయే మేలుగానున్నది. అది యామెకెంతో సౌందర్యము నొసంగుచున్నది. ఆమె రూపసంపదలు మఱింత ప్రకాశించుచుండెను. ఏరూపసంపదల నుదయమున దర్పణమునఁ జూచుకొని విమల మందహాసమొనర్చెనో యవి యిప్పుడీరక్షకుని మూఁగవానివలెఁ జేసివైచెను.

"సాహేబుజీ! నిన్ను నీభార్య ప్రేమింపదా?"

"నీకట్టియాలోచన మేల కలుగవలయును?"

"ప్రేమించునెడల నిట్టివసంతర్తు సమయమున నిట్టి భర్తను విడిచి యామె యెట్లు సహించియుండఁగలదు?"

గాఢమయిన నిట్టూర్పె దీనికిఁ బ్రత్యుత్తరము.

విమల యమ్ములపొదినుండి యమ్ములు నిరంతరాయముగ వెడలుచున్నవి.

"చెప్పుటకు నాకు సిగ్గగుచున్నది. కాని, నీవేనాభర్త వైనచో నన్నువిడిచి రణమునకేగ సహింపఁగలుగుదునా?"

కావలివాఁడు మరల నిట్టూర్పువిడిచెను. విమలయిట్లు చెప్పుచుండెను.

"నీవు నాభర్తవైతివా?" ఆమెకూడ నొక్కింత నిట్టూర్పు విడిచెను.

మోహపూరితాపాంగ వీక్షణముల సారించెను. రక్షకుఁడు పరవశత్వమును బొందెను.

క్రమక్రమముగ నాతఁడు సమీపమునకు జరుగుచుండెను. విమలయు నట్లేచేయుచుండెను. వారిశరీరము లొండొంటిఁ దాఁకినవి. కావలివానికు దేహకము గలిగెను. విమల

తన మృదుహస్తము నాతనిపైవైచెను. ఆతఁడు పరవశుఁడయ్యెను.

"అడుగ సిగ్గగుచున్నది. నీవు జయమును గాంచినచో నేను జ్ఞప్తియందుందునా?"

"ఎంతమాట! నిన్నెప్పుడైన మఱచిపోవుదునా?"

"నాహృదయము నీ కెఱిగింపనా?"

"ఇంతకన్న నేమికలదు. ఆవశ్యము చెప్పుము"

"చెప్పను. నేఁజెప్పను. విని నీవెట్లు యోచింతువో?"

"చెప్పవా! చెప్పవా! నిన్ను బ్రతిమాలుకొనియెద. నన్ను నీదాసానుదాసునిగ గ్రహింపుము. జెప్పుము."

"నీతో లేచిపోవుటకు నేను సిద్ధముగా నున్నదానను, దుర్మార్గుడగు నాభర్తకుఁ గళంకముఁ దెచ్చిపెట్టెదను."

మరల కిర్రుగంటిచూపుల మోహ ముదయింపఁజేసెను. రక్షకుఁడు సంతోషముతో నుప్పొంగుచు గంతులు వేయుచుండెను.

"నీవట్లు చేయుదువా?"

"ఓగజపతి విద్యాదిగ్గజ రమ్మా! నీవంటి వివేకులింకను గొందఱీప్రపంచమున నున్నవారు. చూడుము."

"నీవు తీసికొనిపోయినచో రాకేమి? నిశ్చయముగ వచ్చెదను. అదినాకెంతో యానందదాయకము"

"నేనెప్పుడును నీసేవకుఁడనే. తీసికొనిపోవవా?"

"అపారమైన నీప్రేమకు బదులు నేనేమిచేయఁగలను. ఈస్వల్పమును గ్రహింతువుగాక!"

ఇట్లు చెప్పుచు విమల తన మెడలోనున్న బంగారపు గొలుసును నాతని కంఠమున వైచెను. ఆతని యానందమునకు మేరలేదు. స్వర్గసుఖ మనుభవించుచుండెను.

"ఒకరికంఠమందలి హారము నొకరికంఠమున వ్రేయుటయే పరిణయమని మాశాస్త్రము లుద్ఘోషించుచున్నవి."

సాహేబు పండ్లు పైకిఁ గన్పట్టునట్లు నవ్వుచునిట్లనియెను.

"హు! హ్హా! హ్హా! అయిన మనము పరిణయమైతిమనుట నిశ్చయమా?"

"నిశ్చయముగను" అని చెప్పుచు విమల యేదో యోచించుచుండెను.

"ఏమి యాలోచించుచున్నావు?"

"ఏమియును లేదు. నాకింకను సుఖముగలుగుననునాశ లేదు. మీవాండ్రు దుర్గమును వశపఱచుకొనలేరని నాకుఁ దోఁచుచున్నది."

"ఎప్పుడును నట్టిసందేహ మొందకుము. దుర్గమీపాటికే మనదైయుండును."

"లేదు. లేదు. యీవిషయమున నొకరహస్యమున్నది'

"అది యేమి?"

"నీకుఁ గోటను బట్టుకొన సామర్థ్యముగలదేని యది నీకు వెల్లడిచేయుదును."

రక్షకుఁడది వినసిద్ధముగ నోరు తెఱచుకొనియుండెను. విమల చెప్పుటకయిష్టముతో నున్నట్లునటించెను.

"ఏమి? ఏమి?" అని తొందరతోఁ నాతఁడడిగెను.

"నీకుఁ దెలియదుగాని జగత్సింహుఁడు బదివేల సైన్యములతో నీదుర్గమునకు సమీపమున నున్నవాఁడు. మీరటకు రహస్యముగ వచ్చెదరని విని యంతకుముందే యాతఁడాకస్మికముగ వచ్చినాఁడు. ఆతఁడిప్పుడేమియు మాటలాడఁడు. కాని, మీరు జయమునొంది నిర్భయముగ విశ్రాంతివహించి యున్నప్పుడాతఁడు వచ్చి మిమ్ములను జుట్టుముట్టును"

సాహేబు నిశ్శాంతపడి మౌనమువహించి యుండెను.

"అదియెట్లు" అని యాతఁ డాశ్చర్యమున నడిగెను.

"ఈసమాచారము నీకోటయందందఱకును దెలియును. నేనుకూడ వింటిని."

సాహేబానందపరవశుఁ డయ్యెను.

"ప్రియా! నేఁడు నన్ను ధన్యుని జేసితివి. నేను బోయి సేనాధిపతికీవార్త యెఱింగించి వచ్చెద. ఇట్టి సమాచారము నెఱింగించినందులకు బహుమానమందెదను. నీవిటనే యుండుము. శీఘ్రముగ వచ్చెదను."

విమల విశ్వాసమునుగూర్చి యాతని కిసుమంతయైన సంశయములేదు.

"నీవు మరలవచ్చెదవా?"

"తప్పకుండ ఇప్పుడేవచ్చెదను"

"నన్ను మఱవకుము"

"మఱవను. ఎప్పుడును మఱవను"

"రాకపోయిన నాతోడు"

"నీకంతభయమేల? తప్పకవచ్చెదను"

ఆతఁడుదృష్టి పథమునుండి దాఁటిపోవుటతోడనే విమల మెల్లఁగజారెను.

అస్మాన్ చెప్పినమాట నిజమయినది. విమలనేత్రములలో విషమున్నది. ఆమె కన్నులలో నిసుకపోయును.

ఇరువదియవ ప్రకరణము

గదినుండి—గదికి

విమల బంధమునుండి విడివడియెను. స్వేచ్ఛనొందెను. ఇప్పుడు ప్రథమకర్తవ్యమేది? వీరేంద్రసింహునకీవార్త యెఱింగించుటకదా! ఆయుద్దేశముతోడనే యామె యూపిరియైన విడవకుండ నాతనిశయనాగారము వంకకుఁ బోవుచుండెను.

అమె యింకను సగము దూరమైనను నడువలేదు. రణసూచకమగు, "అల్లాహో!"అనుధ్వనివినవచ్చెను. 'పఠానుల జయసూచకధ్వనియాయిది?' అనియామెయొక వెఱ్ఱికేక వైచెను. పెద్దకోలాహలము వినవచ్చెను. కోటలోనివారందఱు మేల్కనిరని యామె యనుకొనెను.

పఠానులు వీరేంద్రుని శయనాగారమునకుఁ బోయిరి. తలుపును బ్రద్దలుకొట్టి లోనఁ బ్రవేశించిరి. ఇదియంతయు నామె చూచుచుండెను. అట నేదియో గందరగోళముగనున్నది.

ఆమె తొంగిచూచెను. వీరేంద్రుఁడగపడియెను. నడుము గట్టిగ గట్టఁబడియుండెను. వెఱ్ఱివానివలె నాతఁడు ఖడ్గమిటునిటు త్రిప్పుచుండెను. శరీరమునుండి రక్తము వరద లగుచున్నది. అంతలో నతని ప్రయత్నములన్నియు వ్యర్థమైనవి. బలిష్ఠుఁడగు నొకపఠానుని కత్తిదెబ్బ తగులుటచే, నాతని చేతనున్న ఖడ్గము క్రిందపడిపోయెను. ఆతనిని పఠానులు కైదీగాఁబట్టుకొనిరి. ఇవియన్నియు విమలచూచెను. అధైర్యపడియెను. అటనుండి బయలుదేఱెను. తిలోత్తమను రక్షించుట కింకను నవకాశముకలదని యటువైపు బఱుగెత్తెను. త్రోవయందును సందు సందుల మూల మూలల నెక్కడఁ జూచిన బఠానులే. తిలోత్తమకడ కేగుట సులభసాధ్యము కాదు. దుర్గము శత్రువులస్వాధీన మయ్యెననుట కించుకేని సందియము లేదు.

విమల, తాను తిలోత్తమగది వైపునకేగిన పఠానులచేఁజిక్కుదునని తలంచెను. వెంటనే వెనుకకు మరలెను. చాల వ్యాకులపడియెను. ఈమహోపత్సమయమున నీ సమాచారములనుదెల్పి జగత్సింగును, తిలోత్తమను గాపాడుట యెట్లని మనస్సున యోచించుచుండెను. ఇంతలో నింకొక గదిని కొల్లగొట్టి సైనికులామార్గమున వచ్చుచుండిరి. వారిని జూచి విమల మిక్కిలి భయపడియెను. అతిత్వరితముగఁ బోయి యొకగదియందొక పెట్టె చాటున దాగికొనియెను. పఠాను లాగదిలోనికివచ్చి దోచుకొనుచుండిరి. వారు పెట్టె వెనకఁ జూచిరేని తప్పక వారికి కనఁబడును. వారి పాలఁ

బడకుండ తప్పించుకొను భాగ్యము తనకు లేదని విమల చింతించెను. ధైర్యమును వహించి యామె కొంచెము సేపట నుండెను. మెల్లగా పెట్టెయందునుండి వారిచేష్టలఁ జూచుచుండెను. విమల నిరుపమానధైర్యసంపదగలది ఆపదకోలఁదిని నామెధైర్య మతిశయించుచుండెను. పఠానులు వారిపని మీఁద నుండుటఁజూచి యామె యటనుండి బయలువెడలి మెల్లగ నడుగులిడుచు తప్పించుకొనిపోవఁ బ్రియత్నపడియెను. కొల్లగొట్టు కొనుటయందత్యాశక్తితోనున్న పఠానులామెను జూడలేదు. ఆమె తలుపునుదాఁటి పోనుద్యుక్తురాలగుచుండ నొకసిపాయి వెనుకనుండివచ్చి యామె చేయి పట్టుకొనియెను. ఆమె వెనుకకుఁ దిరిగిచూచెను. ఆతఁడు రహీమ్‌సాహెబు.

"ఇప్పుడు పరుగెత్తుము. ఎక్కడకుఁ బోయెదవు"

విమల రహీమ్‌చేతిలో మరలఁ బడియెను. తెల్లపోయెను. కాని యీ వెలవెలపాటొక్క నిమిషమే. ఆమె నిరుపమాన సూక్ష్మబుద్ధి బలమున మరల నామె మొగ మంతలో వికాశమును బొందెను. ఉల్లాసభరితయై యథాస్థితికివచ్చెను. ఇట్లు తలంచెను. ఈతని మూలముననే నాప్రాణములను గాపాడు కొనియెదఁగాక! ఆతనితో నిట్లుచెప్పెను. "హాష్! చెప్పెదనాతో రమ్ము!" ఇట్లుచెప్పుచు నాతనిహస్తమునుబట్టు కొని యవ్వల కీడ్చుకొని పోయెను. ఆతఁడు ఏమియు ననక యామెతోఁగూడఁ బోవుచుండెను.

"మంచివాఁడవు. వారందఱు నుండగ నట్లుచేసెదవా?

నన్నువిడిచి నీవెక్కడకుఁ బోయితివి. నేను నీకొఱకు వెదు కని ప్రదేశమెక్కడను లేదు.''

ఆమె క్రీగంటిచూపులు మరలఁ బ్రసరించెను. గొప్ప బుద్ధిమంతుడగు నాసాహేబు కోపాగ్ని చల్లారెను.

''జగత్సింహుని సమాచారముల నెఱింగింప సేనాధి పతికొరకు వెదకుచుంటిని. ఆతని కనుఁగొనలేకపోయితిని. మరల బురుజుపైకి వచ్చితిని. కాని నీవక్కడలేవు. అప్పటి నుండియు నిన్ను ప్రతిస్థలమునను వెదకుచుంటిని''

''ఎప్పటికిని రాకపోవుటచే నీవు నన్ను మఱచిపోయితి వని తలంచితిని. అందుచే నిన్ను వెదకుచు బయలువెడలితిని దానికేమిగాని యింకనాలస్యము చేసిన లాభమేమి? మీ వాండ్రుకోటను బట్టుకొన్నారు. మనము పలాయనమగుట కిదియే సమయము''

''ఈ రాత్రి కాదు. రేపుదయమున. సేనాధినాయకునితో జెప్పకుండ నేవచ్చుటెట్లు? రేపుదయమున నాతనియొద్ద సెలవు గైకొని వచ్చెదను''

మనమిప్పుడే పోవచ్చును. కాని, తత్క్షణమునాయలం కారములు మొదలయినవి జాగ్రత్తచేయవలయు—లేనిచో నితరసైనికులపహరించుకొనిపోయెదరు''

''అయిన సరియే.''

విమల, రహీమునుగూడఁ దీసికొనిపోవుటకుఁ గారణ మితరసిపాయిలచేతినుండి తప్పించుకొనుటకే కాని వేఱు కాదు. సూక్ష్మబుద్ధియగు నామె భావిజ్ఞానమునను దృష్టాంత

ముగ నట్టిస్థితియే సంభవించెను. వారిరువురు నెంతో దూరము పోలేదు. అంతలో పఠానుల రెండవగుంపు వారికెదురు పడి యెను. వారు విమలనుజూచి "ఇదిగో జారిణి !"

"సహచరులారా ! ఇటు రాఁబోకుఁడు. మీ వ్యాపారములఁ జూచుకొనుఁడు" అని రహీమ్ చెప్పెను.

సైనికులు సంగతిని గ్రహించి వారిని వదలివేసిరి. అందొకఁడిట్లనియెను. "రహీమ్! సేనాధిపతి నీనోటనుండి యీకబళము నూడఁబెఱుకుకొనక పోయిన నీవదృష్ట వంతుఁడవే"

రహీమును విమలయు వెడలిపోయిరి. విమలయాతనిని క్రిందనున్న తన శయనాగారమునకుఁ దీసికొనిపోయెను.

"ఇది నాశయనాగారము. ఇందున్న వస్తువులలో, నీకుఁ గావలసినవి పుచ్చుకొనుము. దీనిపైనున్నదికూడ నా పడకటిల్లె. నేనుపోయి నాయలంకారములు వస్త్రములు మొదలగునవి తీసికొనివచ్చెదను' అని చెప్పుచు నామె తాళము చెవులగుత్తి నాతనియెుద్దఁ బడవైచెను.

అనేకవస్తువులతో నిండియున్న యాగదిని రహీమ్ చూచెను. పెట్టెలకు తాళములు లేకుండఁజేయుటకై త్వరపడుచుండెను. విమలయొక్క నమ్మకము విషయమున నాతనికి రవ్వంతయైన సందేహములేదు. ఆమె యీవలకు వచ్చి గొళ్లెమునుదగిల్చి యాగదికి తాళమును వైచెను. రహీమాగది యందిప్పుడు ఖైదీగనున్నాఁడు.

విమల సౌధముమీఁదకుఁ బఱుగెత్తెను. తిలోత్తమ

యొక్కయు నామెయొక్కయు భవనములు దుర్గమునందు లోపలభాగమున నుండెను. అందుచే పఠాను సైనికులింకను నంతదూరము పోలేదు. ఇంతేకాదు. ఈయార్పులు, అల్లరి, ఆపద నాయువతీ యువకులెఱుంగుదురో లేదో సందియమే. విమలయట కేగెను. కానితత్క్షణము లోపలకుఁబోలేదు. నూతన దంపతుల విలాసచేష్టలఁ జూడవలయు ననువినోదమామె కధిక మయ్యెను. తలుపురంధ్రమునుండి చూచుచుండెను. ప్రకృతి స్వభావము నెవ్వరు దాఁటఁగలరు? భయంకరమైనయాపద సమయమునఁగూడ విమల వినోదమునకు లోనయ్యెను. ఆమె కొంచె మాశ్చర్యపడియెను. ఏమిచూచినదో? తిలోత్తమ శయ్యపైఁ గూర్చుండియుండెను. జగత్సింగు నిలువఁబడి యుండెను. సౌందర్యరాశి యగునాయువతీరత్నముయొక్క మృదుకరముల నాతఁడు పట్టుకొనియుండెను. మరియు నాతఁడు నేత్రములను దుడుచుకొనుచుండెను. విమల యిట్లు యోచించుకొనియెను.

"అశ్రువుల విడుచుచున్నారు. ఇది వీరొండొరులు సెలవు తీసికొనుసమయము కాఁబోలును! ఏమయినను నీయిరువురును సంభవింపనున్న మహాపదనుగూర్చి యేమియు నెఱుంగరుకదా! ఆహా! ఈప్రపంచమున మోహముమాత్రమే మహోన్నతప్రభావముకలది. ఓమోహదేవతా! శ్రవణేంద్రియశక్తి నశింపకయున్నను, ఈదంపతుల నీకోలాహలము వినఁబడకుండునట్లు మహాబధిరులను జేసివేసితివికదా!"

యుద్ధము

—♦—

విమల లోనఁ బ్రవేశించెను. సంభవింపనున్న మహాపదను జగత్సింహునకు విన్నవించెను. మొదట నాతఁడామాటను విశ్వసింపలేదు. ఇంతలో పఠానుల కోలాహలము విననయ్యెను.

అతని సందియములు పోయినవి.

"రాజోత్తమా! శీఘ్రముగఁ దాఁటిపోవుట కేదేని యుపాయమునుఁ జూపుము. లేనిచో మనమిట నశించిపోయెదము."

ఒక్కనిమిషము వఱకాతఁ డాలోచించుచుండెను.

"వీరేంద్రసింహుఁ డేమిచేయుచున్నాఁడు?"

"శత్రువులాతనిని బట్టుకొనిరి."

తిలోత్తమ యొక్క కేక వైచి శయ్యపై మూర్ఛపోయెను. జగత్సింహుఁడు తెల్లవోయి "రక్షింపుడు. రక్షింపుడు. తిలోత్తమను రక్షింపుఁడు" అనియెను.

విమల తత్క్షణము పన్నీరుబుడ్డినిఁదెచ్చి యామెనోటి మీఁదను, లలాటమునను మెడపైని చల్లనారంభించెను. విసరుచుండెను కలకలము క్రమక్రమముగ సమీపించుచుండెను.

"అదిగో! వారువచ్చుచున్నారు. మనలను రక్షించుకొనుటయెట్లు?" అని విమల యడిగెను. జగత్సింగు నేత్రముల నగ్ని గురియ నిట్లనియె.

"ఓ భగవానుఁడా! నీయాజ్ఞ యిట్లున్నదా? ఇట్టియాప

త్సమయమునఁ నీస్త్రీలనడుమ నేనిట్లు కప్పువడియుండవలసిన దేనా?"

"ఇపుడిట చేయవలసినపని యేదియో చూడుము. నేనేమియు మేలు చేయలేకపోయినను తుదకు దిలోత్తమ ప్రక్కనుబడి చచ్చిపోయెదను." అని విమల కఠినముగ సదుత్తరమిచ్చెను.

రాజుమనసునకది ములుకులవలె నాఁటెను. ఇట్లనెను.

"ఇట్టిదురవస్థయందీమెను విడిచి నేనెట్లు పోఁగలను ఆమెకొఱకు నేనుగూడ నిట ప్రాణముల విడిచెదను."

ఆనిముషమున కానిముషము భయంకరధ్వనులును నాయుధధ్వనులును సమీపములగుచు వినవచ్చుచుండెను.

"తిలోత్తమా! తిలోత్తమా! ఇట్టిసమయమున నీవేల మూర్ఛపోయితివి? నిన్ను నేనెట్లు రక్షింపఁగలను?" అని విమల యనియెను. తిలోత్తమ నేత్రములను విప్పెను.

"తిలోత్తమ మరలఁ బ్రతికినది. రాజకుమారా! రాజకుమారా! ఆమెను రక్షించుటకింకను నవకాశమున్నది."

"భూచరఖేచరులెవ్వరునుగూడ మనలనిఁక రక్షింపఁజాలరు. మనమీగదిని విడిచితిమా నిన్నుకోటదాఁపలకుఁ దీసికొనిపోఁగలను. కాని అయ్యో! తిలోత్తమ యసహాయురాలగును. విమలా! చూడుము! అదిగోవారు సోపానముల నెక్కుచున్నారు. ముందు నాప్రాణముల నిటనర్పించెదను. కాని, ప్రాణములు పాగొట్టుకొనియైనను మిమ్ముర‌క్షింపలేకపోయితినికదాయని చింతించుచున్నాఁడను."

ఒక్కనిముషములో విమల తిలోత్తమనెత్తుకొనియిట్లని యెను.

"అయ్యా! తిలోత్తమను నేనెత్తుకొనివచ్చెదను."

తత్క్షణమే యిరువురును దలుపునొద్దకు వచ్చిరి. ఆవైపున నలుగురు పఠానులు పరుగెత్తుచుండిరి.

"విమలా! కాలము మించిపోయినది. నావెనుకకు రమ్ము" అని రాజపుత్రుఁడనియెను.

పఠానులు వారినిజూచిరి. "అల్లాహో" యని కేకవైచి దయ్యములవలె వారిపై దుమికిరి. వారినడుమునకుఁ జుట్టబడి యున్న యాయుధములధ్వనికూడ నధికమయ్యెను. జగత్సింహుఁడు తనఖడ్గము నందొకని వక్షమున గట్టిగ నాటెను. దానితో వారికేకలన్నియు నణఁగినవి. ఆపఠానుఁడు భయంకరముగనార్చి మరణించెను. రాజపుత్త్రుఁడాయుధమును దీసికొనకముందే, ఇంకొకపఠానుఁ డొకబల్లెము నాతనిమెడపై విసరెను. కాని, యది తనమెడపైఁ బడకపూర్వమే మెఱపువలె నతివేగముగ నెడమచేతితో దానిని బట్టుకొని, యాకుంతముతోడనే జగత్సింహుఁడాశత్రువు నొక్కపోటునఁ గడతేర్చెను. ఒక్కనిమిషములో తక్కిన యిరువురుపఠానులొక్కమాటుగఁ దమయాయుధముల నాతనిపైవిసరిరి. పాపమాతనికూపిరి విడుచుటకైన నవకాశములేదు. అందొకని ముంజేతిని నఱికివైచెను. కాని రెండవవాని దెబ్బనుదప్పించుకొనలేకపోయెను. ఆదెబ్బ శిరస్సుపైఁ దగులకుండ, నాతని భుజముపైగాఢముగఁ దగిలెను. జగత్సింగు గాయమునొంది

వేఁటకానిచే దెబ్బతినిన పెద్దపులివలె రెట్టించిన యాగ్రహము గలవాఁడై మరలఁగొట్టఁ బ్రయత్నించుచు పఠానుని యాయుధమును రెండుచేతులగట్టిగఁ బట్టుకొని యొకవ్రేటున నాతని శిరస్సును ఖండించెను. ఇంతలోఁ జేయిఁ బోగొట్టుకొనిన పఠానుఁడు నడుముననున్న చిన్న కటారిని రాజపుత్రుని శరీరముపైవైచెను. అదియాతనిఛేతిలో గాఢముగ గుచ్చుకొనియెను. రాజపుత్రుఁడు దానినొక సూదిగుచ్చుకొన్నట్లెంచి, పాదముతో నొక్కతన్నుదన్ని యాతనిని దూరముగఁబడవైచెను. ఆపఠానుని శిరమును ఖండింప యత్నించుచుండ పఠానులసేనాప్రవాహము "అల్లాహో!"యని భయంకరధ్వనులుచేయుచు నాభవనములోనికి రానారంభించెను. ఇఁక వీరితో రణమొనర్చుట ప్రాణమర్పించుటకుఁ గాని వేఱులాభములేదని యనుకొనియెను.

అతని శరీరమునుండి రక్తము ప్రవహించుచుండెను. దేహమురక్తవిహీనమగుటచే నాతఁడు దుర్బలుఁడయ్యెను.

తిలోత్తమ యింకను మూర్ఛనొందియే యుండెను. విమలయేడ్చుచు నామెనుదనపై బరుండఁజేసెను. రాజకుమారుని నెత్తురుపడి విమలవస్త్రములు రక్తమయమైపోయెను.

అప్పటికప్పుడే గదియంతయు పఠానులచే నిండిపోయెను. రాజపుత్రుఁ డాతనికత్తికిఁ జేరగిలఁబడి యొక్కనిమిషము శ్రమతీర్చుకొనుచుండెను. ఒక సైనికుఁ డిట్లనియెను.

"బానిసవాఁడా! విధేయుఁడవు కమ్ము. నీప్రాణములను పుచ్చుకొనము."

ఈవాక్యమారిపోవనున్న యగ్నికిఁ గొ్రొత్తప్రజ్వలనమొసఁగిన ట్లయ్యెను. జగత్సింగు ముందునకురుమికి యాతని తలను నఱికి పాదములకడఁబడ వైచెను. పిదపనాయుధమును ద్రిప్పుచు 'యవనులారా! రాజపుత్త్రుఁ డెట్లుచచ్చిపోవునో చూడుఁడు' అనియెను.

ఆతని యాయుధము మెఱుపువలె నృత్యము సేయు చుండెను. కృత్రిమయుద్ధమువలనఁ బ్రయోజనము లేదనియుసాధ్య మైనంతవరకు శత్రువులవధియించి చచ్చిపోవలయుననియు నాతఁడు నిశ్చయముచేసికొనియెను. సాంద్రముగనున్న సేనా సమూహములో నుఱికి ఖడ్గమును రెండుచేతులఁ బట్టుకొని తన్ను రక్షించుకొనుట కించుకంతైనఁ బ్రయత్నముసేయక శత్రువుల నుఱుమాడుచుండెను. ఒకటి—రెండు—మూఁడు— ఒక్కొకదెబ్బ కొక్కొకని కవయవఖండనమో, బలమయిన గాయమో యగుచుండెను. గాయములురక్తధారలనాతనిపైఁ గురియుచుండెను. రాజపుత్త్రుని హస్తములుపట్టువదలెను. తలతిరుగుచుండెను. నేత్రములదృష్టి తక్కువయ్యెను. కర్ణముల కస్పష్టధ్వనియొకటిమాత్రము వినఁబడియెను.

"చంపకుఁడు! ఎవ్వరును జంపకుఁడు! రాజపుత్త్ర శార్దూలమును జీవముతోఁ బంజరమున నుంపుఁడు"

రాజపుత్త్రునికిఁక నేమియు వినఁబడలేదు. ఈవాక్యము లస్మాన్ ఖాన్ పలికెను.

రాజపుత్రుని చేతులు పట్టువదలి వ్రేలఁబడియెను. ఆతని ఖడ్గము గణగణమనుధ్వనితో క్రిందఁబడిపోయెను. ఒక పఠానుని శవముపై నాతఁడు స్మృతితప్పి పడెను.

ఇరువదిమంది పఠానులా రాజచంద్రుని తలపాగయం దున్న రత్నము నపహరింపవలయునని యాతనిపై గుమికెరి. అస్మాన్‌ఖా నిట్లుచెప్పెను.

"మీా ప్రాణములపై నాశయున్నచో రాజపుత్రుని నంటకుఁడు."

అందఱును వెనుకకు తగ్గిరి. అస్మానును, నింకొక సైని కుఁడును జగత్సింహు నెత్తికొనివచ్చి పఱుపుపై శయనింపఁ జేసిరి. ఒకనిమిషమునకుబూర్వమే యాతఁడు తనవివాహానం తరమునఁ దిలోత్తమతో విలాసముగ నేశయ్యపైఁగూర్చుండి నిర్భరానందమును బొంద నభిలషించెనో యా శయ్యయే యిప్పుడాతని కంపశయ్యయైనది. ఔరా! కాలమహిమ!

పిదప నస్మాన్‌ఖా నిట్లడిగెను—

"ఆస్త్రీలెక్కడనున్నారు?"

విమలా తిలోత్తమల నస్మాన్‌ఖాన్ చూడలేదు. రెం డవమాఱు పఠానులామందిరమునఁ జొరబడినప్పుడు విమల రానున్న యాపదను గ్రహించెను. వేఱుగతి లేమి శయ్య క్రిందఁ దిలోత్తమనుదాచి, తాను దాఁగికొనియెను. అస్మా నిట్లనియెను.

"ఆస్త్రీ లెక్కడున్నారు? కోట యంతయుఁ బరిశోధింపుడు. కూడనున్న స్త్రీ యసాధ్యురాలు చాల తెలివి గలది. ఆమె తప్పించుకొనిపోయిన నాకు నెమ్మది కలుగదు జాగ్రత్తగ నుండుఁడు. వీరేంద్రుని తనయయెడల నమర్యాదగఁబ్రవర్తింపకుఁడు."

కొందఱు సైనికులు కోటలోపల నితర ప్రదేశముల వెదుకఁబోయిరి. ఒకరిద్దఱాగదినలువంకలఁ బరికించుచుండిరి. అన్నిమూలల వెదకిరి. అగపడలేదు. ఒకఁడు దీపముతో మంచముక్రిందఁ జూచెను. వాఁడొక్క కేకవైచుచు నిట్లు చెప్పెను.

"అయ్యో! ఇక్కడనున్నారు."

'వారేనా?" యని యస్మానాత్రిముతో నడిగెను.

"వారే. వారే. ఇక్కడనున్నారు."

అస్మాన్ ముఖము వికసించెను.

"ఈవలకు రండు, భయములేదు"

విమల ముందుగ నివ్వలకు వచ్చెను, పిదపఁ దిలోత్తమను దీసికొనివచ్చి కూర్చుండఁబెట్టెను. తిలోత్తమకు మరల జీవము వచ్చినది. కూర్చుండియుండెను.

"మనమిప్పుడెక్కడ నున్నాము" అని మెల్లగా విమల నడిగెను.

"భయములేదు. మేల్మొసుఁగు సరిగ వైచికొనుము" అని విమల రహస్యముగఁ జెప్పెను.

ఆయువిదలను, గనిపెట్టిన యూసైనిసుఁ డస్మానుతో "ఈస్త్రీలను నేను చూచితిని. ఏలిక చిత్తము" అని యెను.

"నీవు బహుమతి యడుగుచున్నాఁడవా? నీపేరెవరు?'

"నాపేరు కరీమ్. కాని నాపే రెవ్వరు నెఱుంగరు. నేను పూర్వము మొగలాయీ సైనికులలోనుండెడివాఁడను. అందుచే నన్ను మొగలుద్యోగస్థుఁడనియెదరు"

విమల కంపమునొందెను. అభిరామస్వామి గ్రహచార గణితము జ్ఞప్తికి వచ్చెను.

"మంచిది. నేను జ్ఞప్తియుంచుకొనెదనులే" యని యుస్మాన్ చెప్పెను.

మొదటిభాగము సంపూర్ణము.

దుర్గేశనందిని

రెండవ భాగము

మొదటి ప్రకరణము

అయేషా

జగత్సింగు నేత్రములు విప్పెను. మనోహరమైన మందిరమున శయ్యపైనుంటినని యాతఁడు తెలిసికొనెను. ఆప్రదేశము నదివఱకెన్నఁడు చూచియుండినట్లు స్ఫురింప లేదు. ఆగది విశాలమైనది. అనర్ఘ్యపదార్థాలంకృతము. చలువరాళ్ళతోఁ జేయబడిన చప్టాపై మృదువగు తివాసీ పఱుపఁబడి యుండెను. దానిపై వరుసగఁ బన్నీరుబుడ్లు, వెండి, బంగారము, దంతముతో నిర్మింపఁబడిన వివిధవస్తువులు పెట్టియుండెను. తలుపులకు ముందువైపున చలువనొసంగుటకై పచ్చని తడకలు వ్రేలాడవేయఁబడియుండెను. సూర్యకిరణప్రసారము గదియందుఁజొరకుండ నుండినప్పటి నుండియు వానిని దడిపి మెత్తనగునట్లు చేయుచుండిరి. ఆ ప్రదేశము నానావిధ పరిమళ భరితమై యుండెను.

అందఱు నిశ్శబ్దముగనుండిరి. రాజపుత్రిన కొకపరిచారిక మెల్లగ పరిమళోదకములు చిలకరించిన వీవనతో విసరుచుండెను. ఇంకొకతరుణి కొంచెము దూరమునఁ జిత్తరువువలె నిలుచుండియుండెను. రాజపుత్త్రుఁడు పండుకొని యున్న దంతపు మంచముపై నాతని ప్రక్క నొక్కయువిద

కూర్చుండియుండెను. ఆమె యాతని గాయములకు మందు పూయుచున్నది. క్రిందతివాసీపై శ్రేష్ఠములగు దుస్తులను ధరించియుండిన పఠానుఁడొకఁడు తాంబూలమును నములుచు పర్షియన్ పుస్తకమును జదువుకొనుచుండెను. కాని, పైకి చదువుట లేదు. ఎవరును మాటలాడుట లేదు. ధ్వనిచేయుట లేదు.

జగత్సింహుఁడు చుట్టునుజూచెను. ఒత్తిగిలఁబోయెను. శరీరమంతట కఠినమైన గాయములు పడియుండుటచే నొప్పిచే కదలలేకపోయెను.

"నెమ్మదిగానుండుఁడు. కదలకుఁడు." అని ప్రక్కను గూర్చుండియుండిన స్త్రీమృదుమధుర కంఠనినాదముతోఁ బలికెను.

"నేనెక్కడ నున్నాఁడను?" అని యాతఁ డతినీరసస్థితితో నడిగెను.

"అయ్యా! మాటలాడకుఁడు. మీరశ్వ ప్రదేశము ననేయున్నారు. విచారపడకుఁడు."

"ఇప్పుడు కాలమెంత యయినది?"

"మధ్యాహ్న మయినది. మీరు మాటలాడరాదు. మాటలాడిన వ్యాధికుదురదు. మేమీప్రదేశమును విడిచి పోవలసినవారమగుదుము."

"ఇఁకనొక్క మాటమాత్రమే. నీ వెవరవు?" అని ప్రియత్నపూర్వకముగా నడిగెను.

"నా పేరయేషా"

రాజు మెల్లగ నయేషా ముఖలక్షణములను జింతన చేయుచుండెను. ఆమె నాతఁ డిదివఱకెప్పుడైనఁ జూచియుండెనా? లేదు.

అయేషా యువతీశిరోమణి. ఏండ్లిరువదిరెండున్నవో లేవో? ఆమె సౌందర్య మతిమనోహరము. ఆసౌకుమార్య మనన్య సామాన్యము. అట్టిరమణీయక మొకటిరెండు మాటలఁ దెలుప వలనుపడదు. తిలోత్తయుఁ బరిపూర్ణసౌందర్యరాశియే. కాని, యయేషాసౌందర్యమట్టిదికాదు. దాని తీరు వేఱు. నిరంతరసుకుమార యౌవనవిరాజిత యగు విమల రూపరేఖలుకూడ మనుజుల హృదయాకర్షణమున గావించునవియే, కాని యావాఙ్మనసగోచరములగు నయేషాశృంగార సౌమ్యలక్షణములతోఁ నవియును సాటిరానేరవు. కొందఱు సుందరీమణుల సుకుమార లావణ్యము వికసితవసంతమల్లికా కుసుమ విలాసమును గేలిసేయుచుండును. నవవికసితవిలాస విరాజితము, మందాక్షనిమీలితము, కోమలావయువ సమంచితము, నిర్నిద్రతేజోవిభాసితము, మంజులమాధురీ ప్రపూర్ణ పరిమిళసమ్మిళితము, తిలోత్తమ సౌందర్య మట్టిది. కొందఱు విలాసినీమణుల శరీర సౌందర్య మపరాహ్ణస్థలపద్మసదృశము-పరిమళవిహీనము — ముకుళీభావ సన్నిహితము — ఆర్ద్రీభావ విరహితము—అయిన విలాసశోభితము, పరిపూర్ణవికసితము—తేజోవిరాజితము—మధుపరిపూర్ణ పరిపక్వము, విమలరూప సంపదయట్టిది, బాలభానుని కోమలారుణస్పర్శమున వికసిత హృదయమై విలసిల్లు పద్మినియుంబోలె నయేషా యొప్పారు

చుండె. అట్టి దేదీప్యమాన సౌందర్యము, అట్టి దివ్యసౌరభము, అట్టి మాధురీరసపరిపూర్ణసందర్శనము—అట్టి తేజః పుంజము—సకల కుసుమరాజంబగునట్టి రాజీవంబునంగాక మఱి యెచ్చటనుండును? అది ముకుళితంబునుగాదు—ఆర్ద్రీభావ విరహితంబును గాదు. ఉజ్జ్వల తేజఃపుంజ సమాచ్ఛాదితము.

ఈవికసితపద్మపత్రికాంతు లిపుడు సూర్యకిరణములఁ గూడఁ దిరస్కరించుచున్నవి. అయిన నాకమలము మృదు మందహాసకాంతుల విలసిల్లుచునే యుండును. చదువరీ! నీ వెన్నఁడైన సౌందర్యప్రకాశమును జూచియుంటివా? చూడకున్నఁ దుదకు వినియైననుందువు. చాలమంది లావణ్యవతులు తమ సౌందర్యకాంతులఁజుట్టును ప్రకాశింపచేయుదురు. కొందఱు తమ సౌందర్యప్రకాశమున మామలగృహములఁ బ్రకాశింపఁజేయుచుందురు. రేపల్లెవాడయందును, నిశుంభయుద్ధమునందును, నాయాప్రదేశములు స్త్రీల సౌందర్యముచేఁ బ్రకాశించినవే. కాని యాప్రకాశ మప్రతిష్ఠాకరమైనది. సౌందర్యప్రకాశమున నాయభిప్రాయమేమియో చదువరులు గ్రహించితిరా? విమల సౌందర్యప్రకాశముకలదియే కాని యాప్రకాశము ప్రదీప ప్రకాశమువంటిది. కొంచ మస్పష్టమయినది. చమురు తక్కువ. అయినను గృహోపయోగము నకుఁ జాలును. దాని సాహాయ్యమున నొకగదినుండి వేఱొక గదికేగవచ్చును. వంటజేసికొనవచ్చును. పక్కవేసికొనుట మొదలగు కార్యములఁ జక్కఁజేసికొనవచ్చును. కాని దాని నంటరాదు. అంటిన దహించును. తిలోత్తమకూడ సౌందర్య

ప్రకాశితయే. ఆ కాంతి యర్ధచంద్రుని మృదుకిరణప్రకాశము వంటిది—స్వచ్ఛమైనది. ఉపశాంతికరమైనది—చల్లనిది—కాని ప్రతిదినోపయోగమున కనువుపడనిది—స్వభావముగ నంత దృఢమైనదికాదు — దూరమునుండి వచ్చునది—అయేషాసౌందర్య ప్రకాశము మధ్యాహ్న సూర్యప్రభాసమాదృశము—జాజ్వల్యమాన తేజోవిరాజితము. అనేక సహస్రకిరణ ప్రకాశితము—తత్కిరణ ప్రసారమునఁ బ్రతిపదార్థమును, హాసముద్రిత మగుచుండును.

సరోవరమునకుఁ బద్మమెట్టిదో మనకథ కయేషా యట్టిది. కావున నామెముఖ సౌందర్యాది లక్షణములఁ జదువరులకుఁ గరతలామలకముసేయఁ జాలనేదుక పడుచున్నాఁడను. ప్రకృతిమర్మజ్ఞయుఁ జిత్రనిర్మాణకుశలినియు నగుదివ్యలేఖిని నావశమై యుండెనేనియు—కేవల చంపకవర్ణమును గాక, కోమలారుణచ్ఛాయమును గాక, నవవికసిత పుండరీక ద్యుతియునుగాక, త్రివిధవర్ణసమ్మిళితమగు నాశరీరచ్ఛాయను బోలిన చాయ నాయత్తపరచుకొనఁ గలిగితినేనియు—కోమల కుటిలకుంతలముల నలంకృతమై, కుసుమశరుని విహారరంగ స్థలము కరణి నొప్పారు నావిశాలవర్తుల ఫాలప్రదేశ మున్నదున్నట్లు చిత్రింపఁగలిగితినేనియు—కోమల ముఖమండలమునఁ గుటిలకుంతలముల నంతమనోహరముగ నల్లుకొనినట్లు వ్రాయఁ గలిగితినేనియు — చికురజాలముల శ్రవణద్వయపార్శ్వముల నంత మాధుర్యముగ మలపినరీతి లిఖింపఁగలిగితినేనియు—కౌశేయసమాదృశము లగునట్టి వినీలకుంతలముల నిర్మింపఁ

గలిగితి నేనియు—ఫాలాగ్రముననుండి కుంతలముల కవ్విధం
బున సీమంతమును దిద్దఁగలిగితి నేనియు—ఆసుందర చికురజాల
ముల నంత కోమల సంస్కారమును బొందినట్లు ప్రదర్శింప
గలిగితి నేనియు—ఆస్నిగ్ధోన్నత కేశజాలముల నట్టి వేణీవిలాస
మున గ్రాలునట్లు ప్రదర్శింపఁగలిగితి నేనియు—భ్రూలతలనంత
సాంద్రముగఁ జిత్రింపఁగలిగితి నేనియు—కణతలకడ నతిసూక్ష్మా
గ్రములుగనుండి క్రమక్రమాభివృద్ధిఁ గాంచి భ్రూమధ్యభాగ
సామీప్యమున నుచితవైశాల్యము నొంది పరస్పర చుంబనా
భిలాష నట్లొండొంటినొఱసికొన యత్నించులాగున భ్రూల
తల వ్రాయఁగలిగితి నేనియు—విద్యుల్లతికాప్రభాజాలముల దళ
తళత్కాంతులఁ బ్రకాశించు నీరదంబులగతి కోమలచంచ
లములగునట్టి మృదుపక్ష్మములఁ జిత్రింపఁ గలిగితి నేనియు—
ఆవిశాల నేత్రముల రమణీయతను, నాయుభయపక్ష్మములఁ
సుందరవక్రరేఖావిలాసమును, కోమలారుణ రేఖాసమ్మిళితం
బగునాయుజ్జ్వల వినీలకాంతిస్ఫురణంబును, కృష్ణదీధితిప్రకా
శితము లగునాకనీనికలను, ఆత్మగర్వసంసూచకంబుగ నిశిత
పుటంబులం గ్రాలునాసమగ్రనాసికను, ప్రకృతి మాధురీనిల
యస్థానం బగునాయోష్ఠపుటంబును, సుందరవేణీ సమాలింగి
తంబును, చంద్రకాంతోపల సదృశంబునగు నాగళసౌభా
గ్యంబును, శ్రవణాలంకారచుంబితంబులగు నాసంపూర్ణవిక
సితగండ భాగంబులను, వివిధరత్నకటక ప్రదీపితములును,
సమధికబలసంపూర్ణములును, నగునామృదుకరములను, నైజ
దీధితులరత్నాంగుళీయప్రభాజాలములనడంచునాకోమలాంగు

ఘులతీకును, స్థలపద్మరేఖావిలాసంబునుంబోలి యామృదుల హస్తముల సౌకుమార్యమును, ఆత్మకాంతిచ్ఛటలచే హారగత మౌక్తికద్యుతుల నపహసించు నావిజృంభిత వక్షస్థలగాంభీర్యవిలసనమును, సమున్నతబలోదంచితావయవశోభితం బగు నామంజులగాత్ర మహిమంబును, చిత్రఫలకంబునకుఁ దేఁగలిగితి నేనియు—వీని నన్నిటి నుచితరీతిఁ బ్రదర్శింపఁ గలిగితి నేనియు—అప్పుడును గూడ నేనాలేఖని నంటసాహసింపను. అసత్యమైన యీప్రపంచమున నయేషాసౌందర్య మొక్కటియే సత్యమైనది. ప్రకృతిరమసృజించిన పదార్థములం దెల్లనామెయే సర్వోత్కృష్టమైనది. ఆమెకటాక్షము సాయం సమయ మందలి మందానిలంబునఁ గదలియాడునీలోత్పలంబుల ననుకరించుచుండును. అయ్యో! ఆవేశితుఁడనుగాక యామెను జిత్రింప నేనెట్లు సాహసింతును?

జగత్సింహుఁ డయేషాను చూచెను. తత్క్షణమే యాతనిమనసునకుఁ దిలోత్తమ స్ఫురణకువచ్చెను. శూలము గ్రుచ్చినట్లయ్యెను. ఆతని సిరలవెంట రక్తమతివేగముగఁ జలింపనారంభించెను. గాఢమయిన యూతని గాయముల నుండి మరల రక్తమతివేగముగఁ బ్రవహించుచుండెను. నేత్రములు మూఁత వడియెను. స్మృతి లేకుండబోయెను. శయ్యపైనున్న యాలావణ్యవతి తత్క్షణమే లేచెను. చదువుకొనుచుఁ దివాసిపైఁ గూర్చుండియున్న మనుజుఁ డయేషాను పలుమాఱు జూచుచుండెను. ఆతనిదృష్టి పుస్తకముమీఁదికిని, నయేషాపైకిని, గంతులువైచుచుండెను. ఆతనికి తనివి

తీరలేదు. శయ్యనుండి లేచుచున్న కాంతను గండభాగంబుల నాట్యమాడుచున్న కర్ణాలంకారంబులఁ దదేకధ్యానమునఁ గాంచుచుండెను. అయేషా తిన్నగ నతనికడకువచ్చి చెవిలో రహస్యముగ నిట్లు చెప్పెను.

"అస్మాన్! శీఘ్రముగ వైద్యుని రప్పింపుము"

కోటనుబట్టుకొనిన యస్మాన్‌ఖానితఁడే. అయేషా వాక్యమునువిని వైద్యునికొఱకు కాతఁడవ్వలకేగెను. ఆయువిద వెండిపీటపైనున్న పాత్రను గైకొని యందున్న ద్రవపదార్థముతో రాజపుత్రుని ఫాలమును, ముఖమును, తడుపుచుండెను.

అస్మాన్‌ఖాన్ వైద్యుని దీసికొనివచ్చెను. వైద్యుఁడు రక్తప్రవాహము నాపుటకుఁ దగినయౌషధములనయేషాకిచ్చి వాని యుపయోగములను, వాని నిచ్చువిధములను మెల్లగఁ జెప్పెను. అయేషా వైద్యుని చెవియందు "ఇతని వ్యాధిని గూర్చి మీరెట్లు తలంచెదరు?" అని యడిగెను.

"జ్వరము చాలభయంకరముగ నున్నది."

వైద్యుఁడు సెలవుగైకొని వెడలిపోయెను. ద్వారము కడనున్న యస్మాన్‌ఖా నాతనితో మెల్లగా నిట్లనియెను.

"ఈతనికి నెమ్మదికలుగునా? మీయభిప్రాయమేమి?"

"నాకేమియు నమ్మకము లేదు. అయిన నీయు దేకముతగ్గినపిమ్మట మరల నన్నుఁ బిలువుఁడు"

—♦—

పుష్పపరివృతోపలము

ఆరాత్రి చాలపొద్దుపోవువఱకును నయేషాయునస్మాన్ ఖానును జగత్సింహునియొద్దఁ గూర్చుండిరి. ఆతని కొక్కింత సేపు తెలివి, ఒక్కింత సేపు స్పృహలేమి. వైద్యుఁడు పదింబదిగ వచ్చుచుఁ బోవుచుండెను. అయేషా యెడతెగకుండ నాతనిని గనిపెట్టుకొనియుండెను. పండ్రెండుగంట లయినది. ఒకదాసి లోపలికివచ్చి యయేషాతో "బీగము నన్ను నీకొఱకుఁ బంపినది" అనిచెప్పెను.

అయేషా నేను వెళ్లెద ననియెను. అస్మాన్ కూడ లేచెను.

"నీవుకూడ లేచితివేమి"

"చాలరాత్రియైనది. నీకు సాయముగ వచ్చెదను"

అయేషా సేవకులతో "జాగ్రత్తగనుండుఁడు" అని చెప్పి తల్లిభవనమువంక నడచెను. అస్మానిట్లడిగెను.

"నీవీరాత్రి బీగముకడ నుండెదవా?"

"ఉండను. మరల రాజపుత్త్రునికడకు వచ్చెదను"

"అయేషా! నీతోసమానలగు దయాస్వభావలీలోకమున లేరు. మీతండ్రి కీతఁడు గర్భశత్రువు కదా! అదియుఁదలంపక నిజముగా నీవాతనిని మృత్యుదేవతనోటఁ బడకుండరక్షించితివి. నీవలెనాతనికి సహోదరియైనను బరిచర్యలఁ జేయదు'

అయేషాముఖము మందహాసాలంకృతంబయ్యెను.

"అస్మాన్! ప్రకృతియందు నేనాఁడుదాననై జన్మించితిని. నాప్రథమవిధి వ్యాధిపీడితుని గాపాడుట. దాని నుపేక్షించితినా మహాపాప మొనరించినదాన నగుదును. నా విధిని నేను నిర్వర్తించినందుల కాధిక్యమేమియును లేదు. కాని నీకుమాత్ర మట్టిబుద్ధి యేలపుట్టవలయును? అస్మాన్! నీకు నీతఁడు ప్రబలవైరి కదా! రణక్షేత్రమున నీగర్వమణంప నెప్పుడును గోరుచుండెడివాఁడు కదా! నీహస్తములచేతనే యిట్టిదశకుఁ బాల్పడినవాఁడుకదా! అట్టి ప్రాణశత్రువును గూర్చి ప్రతిదినము నంతశ్రమ నొందుచు జాగ్రత్తతీసికొనుచున్నాఁడ వెందులకు? అట్లుచేయుట నీ గుణవిశేషములనే వెల్లడి సేయుచున్నది."

"అయేషా! లోకమంతయు నీయట్టిమృదులస్వభావము గలదియేయని తలంచుచున్నావు. నాహృదయమునీవనుకొనినట్లంత యుదారమైనదికాదు. జగత్సింహునకు నెమ్మదిగా నున్నందువలన మాకుఁ గలుగులాభములను నీ వెఱుంగవా? ఆతఁడిప్పుడు మరణించెనేని, యందుచే మాకగుప్రయోజన మేమి? రణరంగమున మానసింహుఁడు కుమారునకుఁదీసిపోవు వాఁడుకాఁడు. ఒకయోధునకు బదులుగ నింకొకనితోఁబోర వలసియుండును. జగత్సింహుని మేము కాపాడి యాతనిని కైదిగనుంచితిమని మానసింహుఁడు మేము చెప్పినట్లెల్ల నడచును. అతని ప్రియతనయుని బంధవిమోచనకై మాకనుకూలమగు పద్ధతులతో సంధి చేసుకొనవలసిన వాఁడగును.

ఇంతేగాక, యక్బరుకూడ నట్టిసమర్థుఁడగు సేనాధిపతిని మరల సంపాదించుకొనుటకై సంధివిషయములనే యాలోచించును. మేమాతని నాదరముతోఁ జూచితిమేని రాజపుత్త్రుఁడుగూడఁ గృతజ్ఞుఁడై పఠానులకులాభముగఁ జక్రవర్తితో సంధియొనర్పఁ దనశక్తికొలఁది పాటుబడును. అతని ప్రయత్నములు వ్యర్థములు కానేరవు. అధమమాతనిని విడిచిపుచ్చినందులకు విశేషద్రవ్యమయినను లభింపఁగలదు. రణరంగమునజయము సంపాదించుటకంటె నాతనిప్రాణమును గాపాడుటయే మాకుఁ జాలశ్రేయస్కరము."

అస్మాన్‌ఖా నిప్పు డిట్టినడవడిని గలిగియుండుటకుఁ గారణమీయోచనలనుమాట వాస్తవమే. సందియములేదు. కాని, కేవల మీయోచనలేకాకుండ నింకనొక్కవిశేషము కూడఁగలదు. కొందఱు మనుజులు తమ్ములోకులుకృపామృతచేతస్కులని యనుకొని పోవుదురను భయముతోఁ బైకిఁ గఠినహృదయులవలె చరించుచుందురు. అట్టివారుదయనుస్త్రీలక్షణముగాఁ బరిగణించి నిరంతరమును దానిని దిరస్కరించుచుండియు, సదా మంచినే చేయుచుందురు. అట్టివారి నిదియేమని యడిగినప్పుడు "అయ్యా! మీరన్యథా భావింపవలదు. ఈమార్గమున నాకార్యమును నెఱవేర్చుకొనఁ దలంచితిని" అని చెప్పి వారిస్వభావమును గప్పిపుచ్చుచుందురు. అస్మాన్‌ఖా నిట్టితరగతిలోని వాఁడని యయేషా యెఱుంగును. ఆమెనవ్వుచు నస్మాన్‌తో నిట్లనియె.

"అస్మాన్! అందఱును నీవలె స్వార్థపరులును, దూర

దృష్టియుతులు నగునట్లు భగవంతుడనుగ్రహించిన బాగుగ నుండును. అట్లయిన నీకమంచితోఁ బ్రిసక్తియే యుండ కుండఁ బోవును.''

అస్మాన్ ఖాన్ యుక్తిగఁ బ్రత్యుత్తర మీయనెంచిమృదు స్వరమున నిట్లనియెను.

"నేను స్వార్థపరుఁడనే ఇందులకొక దృష్టాంతము జూపెదను.''

అయేషా విద్యున్మిళితపయోధర దృశంబగు తన దృష్టి నాతనిపైఁ బఱపెను. ఆతఁడిట్లు చెప్పుచుండెను.

"నేనాశతో జీవించియున్నాఁడను. ఎంతకాలమిట్లా శాబద్ధుఁడనయి యుందును?''

అయేషా గంభీరముగ వీక్షించెను. అస్మాన్ ఖానున కా వీక్షణమునఁ గొ్రొత్తయందములు కాన్పించెను.

"ఆవిషయమును తండ్రిగారి నడుగుము. ఆయన నీకే మియు లేదనలేఁడు''

"ఆ ప్రయత్న మిదివరకే యయిపోయినది''

"ఆతఁ డేమి చెప్పెను''

"ఆతఁడు బీగమ్మునొ నయేషా నామె ఇష్టమువచ్చిన వానికిచ్చెద''నని వార్థత్త మొనర్చినాఁడు. కాని, యిప్పటి వఱకును నీహృదయము నేనెఱుంగలేక పోతిని''

మరల నామె మృదుమధుర వదనము మందహాసా లంకృతంబయ్యెను, ఇట్లనియెను.

"స్త్రీలహృదయమును బురుషు లెప్పుడు తెలిసికొనఁ గలిగిరి?"

"దీనినిబట్టి నేనేమి యనుకొందును?"

"నేను నిన్ను ప్రేమించుచున్నానని"

అస్మాన్ ముఖము సంతోషముచేఁ బ్రకాశించెను.

"నీనాథునిగనా?" అని యస్మానడిగెను.

"నాప్రియసోదరునివలె"

అస్మాన్ ముఖము వెలవెలఁ బోయెను.

"అయ్యో! ఇంకను నల్లే యనెదవా? ఓదైవమా! ఈ కోమలగాత్రి హృదయమును బుష్పపరివృతోపలముగఁ జేసితివా?" అనియెను.

అయేషా నామె జననికడకంపి యస్మాన్‌ఖాన్ విచార హృదయముతోఁ దనయింటికేగెను,

—§o§—

మూఁ డ వ ప్రి క ర ణ ము

నీవా తిలోత్తమవు కావా ?

ఆమఱునటి సాయంతనము జగత్సింగు పరుండియున్న గదిలో నయేషాయు, నస్మానుఖానును, వైద్యుఁడునుగూర్చుండియుండిరి. వారుమాటలాడుట లేదు. నిశ్శబ్దముగ నుండిరి. అయేషా శయ్యపైఁ గూర్చుండి రాజపుత్త్రునకు విసరుచుండెను. మఱియు నట్టియుపచారములొనర్చుచుండెను. వైద్యుఁడనునిమిషము నాతనినాడిని బరీక్షించుచుండెను. రాజునకు స్పృహ లేదు.

"ఈజ్వరము తగ్గినప్పుడీతఁడు బహుశః మరణించును ఆసమయము దాఁటెనేని తప్పక యీతనివ్యాధి కుదురఁ గలదు" అని వైద్యుఁడనియెను.

జ్వరము క్రమక్రమముగ తగ్గుచుండెను. అందరును జాగ్రత్తగఁ గనిపెట్టి చూచుచుండిరి. వైద్యుఁడు పదింబదిగ నాతనినాడిని జూచుచుండెను. హీనము—ఇంకను హీనము—ఒక్కింతస్ఫుటము—అని యాతఁడు మెల్లగఁ జెప్పుచుండెను.

ఆకస్మికముగ రాజపుత్త్రుని ముఖము వైవర్ణ్యమును బొందెను. 'కాలము సమీపించుచున్నది' అని వైద్యుఁడనెను. అయేషాస్వాములు కదలకుండ నాత్రముతో నా వాక్యములను వినుచుండిరి. వైద్యుఁడు జగత్సింగు నాడిని బట్టుకొని యుండెను.

కొంచెముసేపుండి 'స్థితిబాగుగలేదు. నాడి క్రమము తప్పినది' అనియెను. అయేషా మొగము వెలవెలబోయెను. అంతలో రాజపుత్త్రుని వదనము రక్తవిహీనమై వికారసూచకమయ్యెను. ఆతనిపిడికిళులు గట్టిగ బిగిసికొనిపోయినవి. నేత్రములు స్వభావ విరుద్ధముగఁ జలించుచుండెను. ఆతనికిఁ గాలము సమీపించెనని యయేషా తెలిసికొనియెను. ఔషధమును సిద్ధముగ బట్టుకొనియున్న వైద్యుఁడాలక్షణములఁ నన్నింటిఁజూచి యాతనినోరుఁదెఱచి యౌషధమును వేసెను. అతిశీఘ్రముగ మార్పుకనఁబడియెను. క్రమక్రమముగ నాతని ముఖము యథాస్థితికి వచ్చెను. వేఱువికారములులేవు. స్వభావముగ నున్నది. శరీరమున వ్యాప్తమైన తెలుపు పోయినది.

రక్తమన్ని నాళములగుండ జక్కగఁ బ్రవహించు చుండెను. గుప్పిళులు వీడినవి. నేత్రము లంతస్విమితతచే మూఁతలు వడియెను. వైద్యుఁడు నాడిని శ్రద్ధతో జాగ్రత్తగఁ బరీక్షిం చెను. చాలసేపు పరీక్షచేసి చూచి 'ఇక నేమియు భయము లేదు. తప్పక ఇతఁడు జీవించును.' అని సంతోషముతోఁ జెప్పెను.

'జ్వరము తగ్గినదా' అని యస్మాన్ఖా నడిగెను.

'ఆ! తగ్గినది'

అయేషాయు, నస్మానుఁడును నతికుతుకముఁబొందిరి.

'ఇక నేమియు నపాయములేదు. నేనిటనుండ నవస రములేదు. పండ్రెండుగంట లగుదనుక మీరీ యౌషధము నప్పుడప్పుడీతని కిచ్చుచుండుడు' అనిచెప్పి వైద్యుఁడు వెడలి పోయెను. పిమ్మట నస్మాన్ఖానుగూడ దనయింటికేగెను. అయేషా రాజును గాపాడుచు నాతని ప్రక్కను శయ్యపై గూర్చుండియుండెను.

రాత్రి రెండుజాములు కావచ్చుచున్నది. జగత్సింగు కనులు దెఱచెను. తోడనే ముందుగ నయేషాయొక్క విలాస వదన మాతని కగపడియెను. అతని క్రీగంటి చూపులనుబట్టి యాతనిమనసు పరిభ్రమించుచుండెనని యయేషా తెలిసికొని యెను. ఆతఁడేదియో జ్ఞప్తికిదేఁ బ్రయత్నించు వానివలె జూచు చుండెను. కాని, యెందాతనికి జయముకలుగలేదు. ఏమియు జ్ఞప్తికిరాలేదు.

అయేషావై పునకు జాలసేపు వీక్షించి యిట్లనియెను.

'నే నెక్కడ నున్నాడను?'

రెండు దినములపిమ్మట మరల నాతఁడు మాటలాడుట కిదియే మొదటిసారి. ఆమె యిట్లు బదులు చెప్పెను.

'కటులుఖాను కోటలోపల'

రాజు మగల నేదియో జ్ఞప్తికిఁ దెచ్చుకొన బ్రయత్నించెను. చాలసేపూరకుండి "నేనెందుల కిక్కడ నున్నాడను?' అనియెను.

అయేషా మొదట నేమియు బ్రత్యుత్తర మీయలేదు. కొంతసేపాగి 'మీరు జబ్బుగనున్నారు' అని బదులు చెప్పెను.

'లేదు. లేదు. నేను ఖయిదీని' అని రాజపుత్రుఁడాలోచన సేయుచుఁ దలపంకించుచుఁ జెప్పెను. ఆతని ముఖలక్షణములు మార్పు నొందుచుండెను.

అయేషా ప్రత్యుత్తర మీయలేదు. రాజునకు జ్ఞాపకశక్తి మరల గలుగుచున్నదని గ్రహించెను.

'నీ వెవ్వరవు?'

'నా పేర యేషా'

'అయేషా యెవ్వరు?'

'కటులుఖాని కుమార్తె'

రాజపుత్రుఁ డూరకుండెను. మాటలాడుటకు బలము దెచ్చుకొని చాలసేపటి కిట్లనియెను.

'నేనెన్ని దినములనుండి యిటనున్నాఁడను?'

'నాల్గుదినములనుండి'

'గరమందర మింకను మీ స్వాధీనమునందుండెనా?'

'ఉన్నది'

జగత్సింగు మరల నొక్కింతవిశ్రాంతి వహించి యిట్లనెను. "వీరేంద్రసింహుఁడేమిచేయుచున్నాఁడు?"

"ఖైదీగానున్నాఁడు. ఈదినమున నాతని విచారణ జరుగును."

జగత్సింగుని ముఖము కాంతివిహీనమయ్యెను.

"తక్కిన దుర్గనివాసులందఱేరీతిగనున్నారు?"

"అన్నివిషయములు నాకుఁదెలియవు" అని యాతని ముతో నయేషా యనెను.

రాజు తనలో నేదియో గొణుగుకొనియెను. ఆతని పెదవులనుండి యొకపేరు జారి యివ్వలఁబడెను. అయేషా దానిని వినియెను.

"తిలోత్తమ"

అయేషా మెల్లగలేచి వైద్యుఁడిచ్చిన యౌషధమును దేఁబోయెను. అది నోటికింపైనది. అయేషా కర్ణాభరణము లూగులాడుచుండెను. ఆమెనిరుపమానసౌందర్యమును గూర్చి జగత్సింగు యోచించుచుండెను. ఆమె యౌషధమును దీసికొని వచ్చెను. అదిపుచ్చుకొని యాతఁడిట్లనియెను.

"నేను స్పృహలేకుండ పడియుండినప్పుడు స్వర్గమునందుండు నప్సరస యొకర్తు నాతలదిక్కునఁ గూర్చుండి నన్నుఁ గాపాడుచుండెనని కలగంటిని. నీవాతిలోత్తమవు కావా?"

"అయ్యో! మీరు తిలోత్తమనుగూర్చి కలగని యుందురు" అని యయేషా ప్రతివచనంబిచ్చెను.

నాలుగవ ప్రకరణము

—:o:—

మేలుముసుగుతో నున్న యువతి

"కోటఁ బట్టుకొనినపిదప రెండుదినములు గడచినవి. మధ్యాహ్నసమయమునఁ గోటలో కటుల్‌ఖాను కొలువుదీర్చి యుండెను! రాజసేవకు లిరుప్రక్కల బారులుదీర్చి యుండిరి. ముందుభాగమున పరిమిత జనసమూహము నిశ్శబ్దముగఁ గూర్చుండెను. ఈదినమున వీరేంద్రసింహుని వ్యవహారమును విమర్శించెదరు.

ఆయుధపాణులయి రక్షకభటులు కొందఱు వీరేంద్రసింహుని దీసికొనివచ్చిరి. ఆతని ముఖ మెఱ్ఱబారి రక్తముఁ గ్రక్కుచుండెను. కాని, యందు భయసూచక మేదియును లేదు. ఆతని విశాలనేత్రములు ప్రజ్వలించుచు మిణుగురుల రాల్చుచుండెను. ఆతని ముకుపుటములుబ్బి యదరుచుండెను. ఆతఁ డధరమును గఱచుకొనుచుండెను. ఆతనిఁజూచి ఖానిట్లనెను.

"వీరేంద్రసింహా! ఈ దినమున రాజద్రోహాపరాధమునకయి నిన్ను విచారించెదము. నీవు మాయెడలఁ బ్రతికూలాభిప్రాయము నేల కలిగియున్నాఁడవు?"

వీరేంద్రునిముఖ మెఱ్ఱవడియెను. గోపమూ నణంచుకొని యిట్లు చెప్పెను.

"నేను చేసినదేదియో ముందునాకుఁ జెప్పుము"

"అయ్యా! ఏలికను గౌరవముగ సంబోధింపుము" అని యొకసభ్యుఁడ నెను.

"సొమ్మును సైనికులను నీవేలపంపలేదు" అని ఖా నడిగెను.

"నీవు రాజద్రోహివి, దోపిడకాఁడవని గూడ నిన్ను పిలువవచ్చును. నీకు నేనెందులకు ధనమీయవలయు? సైన్యమునేల పంపవలయు?" అని నిర్భయముతో వీరేంద్రసింహుఁ డనియెను,

చూపఱు లాశ్చర్యపడిరి. ఆతఁడు తన నాశనమున కయి సిద్ధమగుచున్నాడని యనుకొనిరి. కటుల్ ఖానున కత్యాగ్రహమున శరీరము కంపించెను. కాని మనో వికారములను సులభముగ జయించుటలో నాతఁడు కడునేర్పరి. కోపము నణంచుకొని మెల్లగ నిట్లనియెను.

"నీవు మారాష్ట్రములో నివసించియుండియు మొగలాయీలలో నెందులకుఁ జేరితివి?"

"నీరాష్ట్రమెక్కడున్నది?"

కటుల్ ఖాను క్రోధావేశుఁడయి యిట్లనియెను.

"ఓరీ! ద్రోహీ! నీవు తగినఫల మనుభవింపఁగలవు. నీప్రాణముల నాసించుట కింకను నీకవకాశమున్నది. కాని నీవు పిచ్చివాఁడవు. నీయహంకారమే నిన్నణగఁ ద్రొక్కుచున్నది."

వీరేంద్రసింహుఁడు తిరస్కారసూచకముగ నవ్వుచు ప్రతివచనంబిచ్చెను.

"కటుల్‌ఖాను! నేను నీకుఁ జిక్కికొనినంతమాత్ర మున నీయనుగ్రహమునాసించువాఁడనుగాను. నీవంటిశత్రుని యనుగ్రహమును నేనెన్నఁడ పేక్షింపను. ఈప్రాణము నట్లు రక్షించుకొనకపోయిన నేమిలోపము? నాప్రాణములను బుచ్చు కొనినంతమాత్రమున నీవు తృప్తినొంది సుఖపడఁ గలిగితి వేని సంతోషపూర్వకముగ నాప్రాణముల నిటఁ దీసిపెట్టె దను. కాని, నీవు నన్నును నావారిని నపకీర్తిపాలు చేసితివి. నాప్రాణ ప్రియను నీ—వు—"

ఇఁక నాతఁడు తనవిచారమును చాల సేపాపలేక పోయెను. గద్గదకంఠుఁడయ్యెను. నేత్రములు బాష్పావృతము లయ్యెను. నిర్భయాత్మకుండును, గర్వియు నగు నావీరేంద్ర సింహుఁడు తల వ్రేలవయిచి బాలకునివలె నేడ్వనారంభిం చెను.

కటుల్‌ఖాను స్వభావసిద్ధముగ నతికఠినుఁడు. ఎవరికేని నాపదమూడినదన్న, నాతనికిఁ గడుసంతోషము. అదియు దనవంటిప్రాణియేయని తలంచువాఁడు కాఁడు. అతని శత్రుఁ డగు వీరేంద్రసింహుని దురవస్థను చూచినతోడనే కటుల్‌ఖా నుని ముఖ మానందముచే వికసించెను. అతఁడిట్లనియెను.

"వీరేంద్రుఁడా నావలన నీకుఁ గావలసిన యుపకార మేమయిన నుండెనా? ఆలోచించుకొనుము. నీమరణము సమీపించినది."

మంచముమన్న వీరేంద్రుని హృదయము నాతని యంత ర్యాభిప్రాయమును గ్రహించెను. ఆతఁడు మెల్లగా నతనితో నిట్లు చెప్పెను.

"శీఘ్రముగ నన్ను వధించుట కాజ్ఞయిమ్ము. ఇంత కంటె వేఱేమియు లేదు"

"అదిసరియే. ఇంకను వేఱేమయిన?"

"ఈజీవితమున నాకిఁక వేఱేదియు లేదు"

"కడసారి యొక్కమాఱు నీ తనయను జూడఁ గోరిక లేదా?"

చూపఱులందఱు విచారగ్రస్తులై నిశ్శబ్దముగనుండిరి. వీరేంద్రుని నేత్రములనుండి యగ్నికణము లొలుకుచుండెను.

"వ్రీలిపోయియున్న యీహృదయము నింకనుపాదము చేననఁగ ద్రొక్కుచున్నాఁడ వెందులకు? ఇటుచేసినఁగాని నీకుఁ దనివిలేదా! కానిమ్ము. నీయిష్టమువచ్చినట్లొనర్పుము. లోకమున నేను పరాక్రమవిహీనుఁడనై పోయినాఁడను. కాని పరలోకమున్నది. భగవంతునికడ నీవిందులకుఁ బ్రత్యుత్తర మొసంగుదువుగానిలే"

ఈమాటలు కటులూఖానునకు హృదయసంకటమును గలిగించెను. ఎంతదుష్టున కైనను పరలోకము భగవంతుఁడను వాక్యములు చెవులఁబడినప్పుడు హృదయము కంపింప కుండునా?

"తలవరీ! ఇంకేమియులేదు. నీపనిచేయుము" అని కటులూఖాననియె.

కొలువు నిశ్శబ్దముగనుండెను. ఆపరిజాసమూహమున నుచ్ఛ్వాస నిశ్వాసములైనను లేవు. సూదికిందఁబడినను నా ధ్వని వినవచ్చుచుండెను.

రక్షకభటులు వీరేంద్రుని వధ్యస్థానమునకుఁ గొంపో యిరి. ఆతఁడింకను నటకుఁ జేరలేదు. నడుమ నొకమహమ్మ దీయుఁడువచ్చి యాతని చెవిలో నేదియో రహస్యముగఁ జెప్పెను. వీరేంద్రుఁడు దానిని గ్రహింపలేదు. అప్పుడా మహమ్మదీయుఁ డొకయుత్తరము నాతనికిచ్చెను. పరధ్యాన ముతో నాలోచించుచు వీరేంద్రుఁ డాయుత్తరము విప్పి చూచెను. అది విమల స్వయముగా వ్రాసినది. ఆతఁ డయిష్టమును సూచించుచు నాలేఖను నలిపి యావలఁబాఱ వైచెను. ఉత్తరమునుదెచ్చిన యాతఁడు దానిని గైకొని వెడలిపోయెను.

చూపఱులలో వీరేంద్రుని సమీపముననున్న యొకఁ డింకొకనితో మెల్లగా నిట్లనియెను.

"ఈయుత్తరము బహుశః యీతని తనయ యంపినదై యుండును."

వీరేంద్రుఁడీమాటవిని వెనుకకుఁ దిరిగి "నాకొమార్తె యనుచు మాటలాడుచున్నా రెవరు? నాకు కుమార్తెలేదు" అనియెను.

ఉత్తరముఁ దీసుకొనిపోవుచున్న యాతఁడు "నేను వచ్చువఱకును నిరీక్షింపుడు" అని భటులతోననియెను.

"చిత్తము మహాప్రభూ!" అని వారుబదులునుడివిరి.

ఉత్తరమును దీసుకొనివచ్చినవాఁ డస్మార్ ఖానుఁడే అందు చేత నే సేవకులాతనిని "మహాప్రభూ"యని సంబోధించిరి.

లేఖనుగైకొని యాతఁడభ్యంతర మందిరములోకిఁంది భాగమునొద్ద కరిగెను. అట మేల్ముసుంగు వైచికొనిన యువి దయొక ర్తుండెను. అస్మారామెయొద్దకువచ్చి యిటునటుఁ జూచి జరిగినదంతయుఁ జెప్పెను.

"నేనునీకు మిక్కిలి శ్రమనొసంగుచున్న దానను కాని మనుష్యుల నీదురవస్థల పాలుజేసినవాడవు నీవే ఈమాటజ్ఞప్తి దెచ్చుకొని నానిమిత్తమీపని చేయవలయు"

అస్మార్ ప్రత్యుత్తరమీయలేదు. ఆమెగద్గదస్వరము తో మరల నిట్లనియెను.

"నీవంగీకరింపవేని నాకిఁక దిక్కెవ్వరు? భగవంతుఁడే గతి. ఆతఁడే న్యాయమును జేయఁగలఁడు"

"అమ్మా! నీవు నాపైఁ బెట్టినకార్యమెంత యపాయ కరమైనదో తెలిసికొనఁజాలకున్న దానవు. ఈ విషయము కటుల్ ఖానెఱింగెనేని నాప్రాణములనుబుచ్చుకొనకమానఁడు"

"కటుల్ ఖానుఁడా? నీప్రాణములనుబుచ్చుకొనుటయా అస్మార్! నన్నెందులకు వచింపఁ జూచెదవు? కటుల్ ఖానుఁడు నీకు లేశమాత్రమైన నపకారముఁ జేయగలఁడా?"

"కటుల్ ఖానునిసంగతి నీకుఁ బాగుగఁ దెలియదు. అయినను నిన్ను వధ్యస్థానమునకు గొంపోయెద. రమ్ము"

వారిరువురు నాస్థలమునకు వచ్చిరి. వీ రేందుఁడు

సన్న్యాసివలెనున్న యొక బ్రాహ్మణునితో మాటలాడుచుండెను. విమలజూడలేదు. విమల మేల్ముసుంగునుండి యా బ్రాహ్మణుని గుర్తించెను. అతఁడభిరామస్వామి.

"అయ్యా! ఇదె నాకడసారివందన మర్పించుచున్నాడను. ఇఁక నేజెప్పవలసిన దేమియున్నది? ఇఁక నీప్రపంచమున నాకెవరున్నారు? ఎవరికొఱకు నేను భగవంతుని ప్రార్థింతును?" అని వీరేంద్రుఁడాతనితో ననియెను.

అభిరామస్వామి మేల్ముసుంగునందున్న యువిద నాతనికిఁ జూపెను. వీరేంద్రుఁడు వెనుకకు దిరిగి చూచెను. తోడనే మేలిముసుఁగునుదీసి వైచి విమల సంకెలలతో నున్న యాతని పాదములపైఁ బడెను.

"విమలా!" అని యాతఁడు గద్గదస్వరముతో ననియెను.

విమల యావేశముతో "ఓనాథా! ప్రాణప్రియా! నాసర్వస్వమా! నేనీదినమున బహిరంగముగఁ జెప్పుచున్నదానను. నన్నెవ్వరు నడ్డుపెట్టలేదు. ఓనాథా! జీవితేశ్వరా! నన్నిట విడిచి నీవెటకేగెదవు? ఎటకేగెదవు?" అనియెను.

వీరేంద్రుని నేత్రములనుండి బాష్పములు వెల్లువలగుచుండెను.

"ప్రియా! విమలా! ఇట్టిసమయమున నన్నేల దుఃఖసముద్రమున ముంచెదవు? శత్రువులు మరణమునకు భయపడితిననుకొనరా?" అనియామెను లేవనెత్తుచు ననియెను. విమలయూరకుండెను.

"విమలా! నాకనుజ్ఞ. నీవుకూడ నన్ననుసరించెదవా?"

"కాదు. ఇప్పుడుకాదు—కొంచె మాలస్యముగ—ముందుగ నాతప్పిదమునకుఁ బగదీర్చుకొనెదను."

వీరేంద్రుని ముఖ మారిపోవనున్న దీపమువలె నొక్కమాఱు ప్రకాశించెను. విమలతో నిట్లనియెను.

"నీస్వహస్తముతోడనేనా?"

"ఈస్వహస్తముతోడనే. ఇదిగో నాచేతినుండి కంకణముల దీసివేయుచున్నదానను. ఇక వీనితో బ్రయోజనమేమి? [ఆమె యలంకారములను కంకణములను దీసి దూరముగఁ బారవైచెను.] ఇఁక నాచేతు లేయలంకారమును ధరియింపఁబోవు. కాని వానిస్థానమున నిశిత ఖడ్గముంపబడును."

"నీవు తప్పక జయమునుగాంచగలవు. దైవము నీకు దోడగుగాక" అని వీరేంద్రుడు సంతోషముతో ననియెను.

"నేనిఁక నిరీక్షించి యుండజాలను" అని తలవరి కేకవైచెను.

"విమలా నీవు పోవచ్చును" అని వీరేంద్రు డానతిచ్చెను.

'అట్లుకాదు నన్ననాథగఁ జేయనున్న దారుణాసి, పాతము నీకన్నులతోజూచిగాని యిటనుండి పోవను. నీరక్తమున న్యాయాన్యాయసంశయములన్నియు ముంచివైచెదను'

విమల వాక్యము శాంతముగనుండెను. కాని, భయసూచకమైనది.

"అట్లేచేయుము" అనిచెప్పి వీరేంద్రుడు తలవరికి సైగచేసెను.

తలవరి యెత్తినగొడ్డలిని విమలచూచెను. అదిసూర్య కిరణములలోఁ దళతళమని మెఱయుచుండెను. ఆమె నేత్రములొక్క నిముషము మూఁతపడియెను. అవి మరల విడు నప్పటికి వీరేంద్రసింహుని మూర్ధము రక్తముచే మలినమై యామెకడఁబడి దొరలుచుండెను.

విమల రాతివిగ్రహమువలె నిలువఁబడిపోయెను. ఆమె శిరోజాగ్రమైనను గాలియందు కదలుటలేదు. నేత్రమున నొక్కబాష్పబిందువైనలేదు. దృష్టి శిరస్సుపైనుండెను. చలించుటలేదు.

అయిదవ ప్రకరణము

—x—

గతభర్తృక

తిలోత్తమ యెటనున్నది? అయ్యో! తండ్రిలేని నిరాధారురాలగు నాబాలిక యేమైపోయినదోకదా! విమల యెట నున్నదో? వధ్యస్థానమున కామె యెటనుండి వచ్చినదో? ఆ దారుణ కార్యానంతరమున నామె యెటకేగినదో?

వీరేంద్రసింహుడవసాన సమయమునఁ బ్రియతనయఁ జూడ నపేక్షింపలేదేమో? ఆమె పేరు వినినంతమాత్రమున నాతని కోపాగ్ని ప్రజ్వల్లినదెందువలననో? "నాకీలోకమునఁ గుమార్తెలేదు" అని యాతడెందులకనియుండెనో? విమల

యుత్తరము జదువనైన జదువకుండ నాతడేల పాఱవయి చెనో? అయ్యో! పాఠకులారా! మీకింత సందియమేల? కటుల్‌ఖానుని వీరేంద్రుడెట్లునిందించెనో, యెట్టిదారుణము సంభవమయ్యెనో జ్ఞప్తికి దెచ్చుకొనుడు. నన్నును నావారల నపకీర్తి పాలుచేసితివని బోనులోని సింగపు గొదమవలెనెట్లు గర్జించెనో జ్ఞప్తిలేదా?

విమలాతిలోత్తమ లెటనున్నారని యడుగుచున్నారా? కటుల్‌ఖానుని యంతఃపురమును బరీక్షించినచో మీకగ పడుదురు.

"ఔరా! ప్రపంచవైఖరి. అదృష్టచక్రము నిర్దయాత్మకమైనది. అది యిట్లే తిరుగుచుండును. యౌవనము, లావణ్యము, సద్భావము, నిర్మలత్వము, నన్నియు-సర్వమును నతికఠినమగు దాని పరిభ్రమణవేగమున నలగి నాశనమై పోవును.

ఏకోటయందుఁగాని, యేపల్లెయందుగాని, యెప్పుడైన, సౌందర్యవతియగు నేయువిదయైన పట్టువడెనేని వినోదార్థమామెను దనకడ కంపుచుండుడని కటుల్‌ఖాను డొక నిబంధన నేర్పఱచెను. గరమందరమును బట్టుకొనిన మరుసటిదినమున నాతఁడాదుర్గమునకుఁ బోయెను. చెరయందున్న వారిని విచారించుట, వారికి కావలిభటుల నేర్పఱచుట, మొదలగు పనులొనర్చుచుండెను. ఆఖయిదీలనడుమ విమలాతిలోత్తమలుండిరి. వారినియుప్పురను, తన యంతఃపురమునకుఁ బంపివేసెను. పిదప నాతనిహృదయ మితర కార్యములమీదికి

బోయెను. తమ ప్రభువును విడిపించుకొనుట్కై రాజపుత్రసైనికులు తనపైనెత్తివచ్చుచున్నారని యాతనికి వార్త వచ్చెను. అందుచే వారి నెదుర్కొను నుపాయములఁ జింతించుచుండెను. తనస్కాలమున నీతని కీక్రొత్తబానిసలతో వినోదమనుభవింప నవకాశము లేకపోయెను.

విమలను, తిలోత్తమను, వేఱువేఱు గదులలోనుంచిరి. చదువరులారా! తండ్రిలేని యాబాలిక పాపము క్రిందఁబడి దొరలుచున్నది. ఆమె యాకోమలశిరీషగాత్రి మిప్పుడు పరాగమిళితమైయున్నది. ఇట్లని మనము జాలినొంది చూచిన నేమిలాభము? ఏమిప్రయోజనము? ఇప్పుడు తిలోత్తమను జూచువారెవరు? వసంతకాలమునఁ జక్కని కుసుమముల తోడను, మొగ్గలతోడను, శృంగారితమై కన్నులవిందొనర్చు పూలతీవను బరిమళముకొరకెవ్వఁడు ప్రార్థింపకుండును? దాని సందర్శనమున నెవ్వఁడానందింపకుండును? ఆతీవ చుట్టుకొనియున్న వృక్షము తుపానుచే బడిపోయినప్పుడు వేళ్లతోఁ బెల్లగిలిన వృక్షమునువిడిచి యాతీవను జూచువారెవరు? తోఁటవాఁడు తీవను బాదముతోఁద్రొక్కి చెట్టును దీసికొనిపోవునుకదా!

చదువరులారా! మనము మఱియొకచోటునకుఁ బోవుదము. విమల నిపుణవతి, ఉల్లాసవతి, చాతుర్యవతి, చుఱుకైనది. పాపమామె యిప్పుడట్లులేదు. చీఱ చెఱగును నేత్రములపై వైచుకొని పంకనిర్మగ్నయై విచారించుచు ననాథయైయుండెను. మన మొక్కసారి యామెయొద్దకుఁబోయిచూచివత్తమురండు.

విమల యీమెయేనా ?

విమలా ! చక్కగదువ్వుకొనిన యాశిరోజము లేనా యివి ? నీశిరమట్లు ధూళిచే నిండియున్న దేమి? బుటేదారి యంచులతో మనోహరముగ నుండునాచీర యేది? రత్నఖచిత మగు కంచెల యెటనున్నది? ఇది యేమి? నీవస్త్రమంతధూళి ధూసరితమైన దేమి? ఇట్టివస్త్రమును దాల్చినా వేమి? ఆనగ లన్నియు నెటువోయినవి? నీకపోలముల నెప్పుడు ముద్దాడు చుండు కర్ణాలంకారము లేవి? నీనేత్రములెందుచే నట్లుబ్బినవి? అయ్యో ! నీక్రీగంటిచూపు లెటుపోయినవి? నీలలాటమున గాయమెందులకయినది? ఎవరు నీకట్లుగాయమొనర్చిరి ?

వీనికన్నిఁటికి నొక్కటే యుత్తరము. పాపము విమల యిప్పుడు గతభర్తృక. ఆమె యిప్పుడస్మాను కొఱకు నిరీక్షించుచుండెను.

అస్మాన్ఖానునిజూచి పఠానులందఱును గర్వపడుట న్యాయమే. ఆతనికి రణమే వృత్తియగుటంబట్టి జయము నొడగూర్చు నెట్టికార్యమునైనను జేయుటకు వెనుదీయడు. కాని రణకార్యములు ముగిసినపిదప పరాజితుల విషయమున ననగత్యముగ నెట్టిదుష్కృత్యములును జేయసమ్మతింపడు. విమలాతిలోత్తమలకట్టి దురవస్థగలుగఁజేసినది కటుల్ఖానే గాని యీతఁడు కాఁడు. ఇతఁడెప్పుడును వారల ఖయిదీలుగఁ బట్టుకొనియుండ లేదు. అస్మానను గ్రహమువలననే విమల యానాఁడు వధ్యస్థానమున భర్తను జూడఁగలిగెను. ఆమె వీరేంద్రునిభార్యయని వినినతోడనే పాప మాతనిహృదయము

సిరయిపోయెను. అతఁడు కటులుఖానునకు మేనల్లుఁడు, అభ్యంతరమందిరములోనికిఁ బోవుటకాతనికి స్వాతంత్ర్యము కలదు. ఈసంగతి యిదివఱకే విశదమైనది. కాని కటులుఖానుని యంతఃపురమందిర ద్వారము దాఁటుటకు మాత్రము మాతనితనయులకైనను, నస్మానునికైనను, సాధ్యముకాదు. అస్మాను కటులుఖానునకు కుడిభుజము. కటులుఖాఁ దామోదరానదీపర్యంతరాష్ట్రమునంతయు జయించిన దీభుజబలము వలననే, అందుచేఁ గోటలోనివారందరు కటులుఖానునకు వలెనే యస్మానునకును విధేయులైయుండిరి. తన్మూలముననే విమలను భర్తకడకు గొంపోవునప్పుడెవ్వరు నేయాటంకము లును జేయలేదు.

రెండుదినములు జరిగినవి. విమల మిగిలిన నగలన్నియు దనకుఁబరిచారికగా నియమింపబడిన యామెకిచ్చెను.

"అమ్మా? ఏమిసెలవు?"

"నిన్నటివలెనే నీవస్మాన్ ఖానునియొద్దకేగుము. ఒక్కమాఱు నాకాతని దర్శన మొసంగుమనియు, నిదియే నా తుది ప్రార్థనమనియు, నింకనెన్నఁడు నట్టికోరికఁ గోరననియు, వేఁడుకొంటినని యాతనితోఁ జెప్పుము."

పరిచారిక యట్లుచేసెను. అస్మానిట్లు చెప్పెను.

"నేనటకు వచ్చుట యిరువురకు నపాయకరమే. నా యింటికడఁ జూడవచ్చునని చెప్పుము."

"అటకుఁ నేబోవుటెట్లు?" అని విమల యడిగెను.

"అమ్మా! అతఁడందులకుఁ దగినయుపాయముచేసెద నని చెప్పినాఁడు" అని పరిచారిక బదులుచెప్పెను.

ర్రాత్రిపడియెను. అయేషా పరిచారికలలో నొకర్తు లోపలికివచ్చి లోపలిభాగమున రక్షకులుగానున్న కోజ్జాలతో నేదియో మాటలాడెను. విమల నస్మాన్‌ఖాను కడకు గొంపోయెను. ఆతఁడు విమల నిట్లడిగెను.

"నావలన నీకింకను గావలసిన ప్రియోజనమెద్ది?"

"ఒక చిన్న కార్యమున్నది. రాజపుత్త్రుఁడు జగత్సింహుడు జీవించియుండెనా?"

"ఔఁ! జీవించియున్నాఁడు"

"ఆతఁడు ఖైదీయా?"

"ఖైదీయే కాని యిప్పుడు చెరసాలయందు లేఁడు. అతనికిఁ గాయములు తగిలినవి. మంచంపట్టియున్నాఁడు"

"దురదృష్ట వంతురాండ్రగు నీయువిదల సంబంధము గలిగినంతవఱకుఁ బ్రతిమనుష్యుఁడును దురదృష్ట వంతుఁడే యగుచున్నాఁడు. భగవదనుగ్రహ మిట్లున్నది. ఆతనికివ్యాధి కుదిరినచో నీయుత్తరము నాతనికిమ్ము. అంతపర్యంత మిది నీయొద్దనుంపుము. ఇదియె నాప్రార్థనము." అని యుత్తరము నాతని కిచ్చెను.

అస్మాన్‌ఖా నాయుత్తరమును మరల నిచ్చుచు నిట్లు చెప్పెను.

నేనీపని చేయఁజాలను, నన్ను మన్నింపుము. జగత్సింహుఁ డిప్పుడేస్థితిలోనున్నను, నాతఁడు ఖైదీగనే యెంచబడుచున్నాఁడు. మొదట మేము చదువకుండ నీయుత్తరము నట్టివానికిచ్చుటమాకనుచితము, అదిమాయజమానుని యాజ్ఞలకు వ్యతిరేకము."

"ఇందాక్షేపణీయమైన యంశములేవియులేవు. నా మాటనమ్ముము. నీవేమియు సందేహింపఁ బనిలేదు. యజమానునియాజ్ఞ యనుచున్నావేమి? యజమానియెవరు? నీకు నీవే యజమానుఁడవు."

"ఇతర విషయములలో మామగారి యుత్తరువులకు వ్యతిరేకముగఁ బ్రవర్తింపగలను. కాని, యీ విషయమున మాత్రి మట్లొనర్పజాలను. ఈయుత్తర మనపాయకరమని చెప్పుచున్నావు. నీమాటయందు నాకు సంపూర్ణ విశ్వాసము కలదు. కాని, యిందుకొఱకు నేనా నిబంధన నతిక్రమింపఁ జాలను. ఈకార్యమున నీకు సహాయమొనర్ప నాకుసామర్థ్యము లేదు."

"అయిన సరియే! నీవు దీనిని చదువుము"అని విమల విచారముతో ననెను. అస్మాన్ ఖాన్ ఉత్తరమును గైకొని చదువ నారంభించెను.

ఆఱవ ప్రకరణము

—♦—

విమల యుత్తరము

రాజకుమారా!

నాజీవిత చారిత్రమును నీకు విశదపఱచెదనని యొకదినమున నేను వాగ్దత్త మొనర్చియున్నదానను. నావాగ్దత్తము నెరవేర్పవలసిన యవసరము వచ్చినది.

తిలోత్తమ యబ్బీరు సింహాసనాధినేత యర్ధాంగిలక్ష్మియైయున్నప్పుడు నాచారిత్రమును నీకడ విన్నవింపవలెనని నేనెంతో యాశతో నుంటిని కాని యాయాశ—అయ్యో—దైవమా—పాతాళమున కణగం ద్రొక్కంబడినది. ఇంక కొలంది కాలములోనే యీభూలోకమునుండి విమలా తిలోత్తమలు పోయిరని బహుశానీవు వినంగలవు. మాబ్రతుకు కింక లెక్కదినములలో నున్నది.

ఇందుమూలముననే నీకిప్పుడీయుత్తరమును వ్రాయుచుంటిని. నేను మిగుల పాపాత్మురాలను. నాజీవితకాలములో నేనెన్నియో దుష్కృత్యము లొనర్చితిని. నేనీలోకమును విడిచిపోయినతోడనే లోకము నన్నెంతయో నిందించును. ప్రజలు నాపై నెన్ని యకార్యకరణముల నారోపింతురో! అప్పుడు నాకుం గలుగనున్న యపకీర్తిని బాపువా రెవ్వరు! నాకీలోకమున నట్టి మిత్రు లెవ్వరున్నారు?

నాకు బంధువుం డొక్కండున్నాడు? కాని, యాయన యింక గొలందికాలములోనే ప్రాపంచ విషయములం బరిత్యజించి మోక్షవిషయిక కార్యములం బ్రవర్తించును. అట్టి యభిరామస్వామి మూలమున నాయుద్దేశము నెఱవేఱం జాలదు. రాజపుత్త్రా! ఎప్పటికయినను నేను నీబంధువర్గములో నొక్కతెనుగా నొప్పుదునని యాశనొందితిని. ఎప్పటికయిన నన్ను బంధువురాలనుగం దలంపవలయునని వేడుకొనుచున్నాను.—కాని యిప్పుడీవిషయ మేరితో విన్నవించుచుంటిని! ఈనిర్భాగ్యురాండ్ర యదృష్ట మగ్నిజ్వాలవలె దగ్గర

నున్న స్నేహితునిఁగూడ ముట్టుకొనుచున్నయది. అది యట్లుండనిమ్ము. ఈ సేవకురాలొనర్చు విన్నపమును మఱచి పోవకుము. విమల జారిణియనియు పరిచారికారూపముననున్న యుంపుడుకత్తెయనియు లోకులు చెప్పుకొన్నప్పుడు "విమల హీనవంశోత్పన్న. అదృష్టహీన, విషయాసక్త, కూడనికార్యము లెన్నియోఁ జేసినది. కాని, జారిణిమాత్రముకాదు" అని లోకమునకు వెల్లడిసేయుము. ఇప్పుడు స్వర్గముననందున్న పూజనీయుఁడు, నాయదృష్టవశమున నన్ను యథావిధిగఁ బరిణయమైనాఁడు. నా నాథుఁడు వ్యభిచారవిషయమున నన్నెప్పుడును ననుమానించి యుండలేదు.

ఈవిషయము చాలకాలమునుండి రహస్యముగనున్నది. ఇప్పుడెవ్వరు నమ్మెదురు? ఆతనిభార్యనైయుండియుఁ బరిచారికావిషయమున నేలప్రవర్తింపవలసివచ్చెనో చెప్పెద వినుము.

గరమందర సమీపస్థమగు పల్లెయందు శశిశేఖరభట్టాచార్యుఁడను బ్రాహ్మణుఁ డొకఁడు కలఁడు. ఆతనితండ్రి చాల భాగ్యవంతుఁడు. శశిశేఖరుడు తనకు యౌవనము వచ్చు వఱకు విద్యార్థి యయ్యెను. కానియావిద్య స్వభావమునందలి మాలిన్యమును దొలఁగింపలేక పోయెను. భగవంతుఁ డాతని కమితమయిన సుగుణసంపదనిచ్చి యాతనిహృదయమున విషయలోలత్వమునుగూడ నాటియుంచెను. విషయలోలత్వమెప్పుడును యౌవనమున నభివృద్ధి చెందునుగదా!

ఆ కాలమున గరమందరమున జయధారసింహుని వంశ ప్రభావుఁడగు రాజపుత్రుఁ డొకఁడుండెను. అతఁడు చక్రవర్తి సైన్యమున సైనికుఁడుగఁ జేరి చాలకాలము ఢిల్లీలోనుండెను. ఆతని భార్య గరమందరముననేయుండి భర్తకొఱకుఁ జాల కృశించుచుండెను. ఆమె సౌందర్య మసామాన్యము. తుద కామె యింద్రియవృత్తుల నణఁపఁజాలక శశిశేఖరుని మోహించి యాతనితో యథేచ్ఛముగ విహరించెను. కొలఁది కాలములోనే యామె గర్భవతియయ్యెను.

పాపము, నగ్నియుఁ జాలకాలము దాఁగియుండవు. శశిశేఖరుని యకార్యకరణము తండ్రిచెవులఁ బడియెను. తన కుమారునివలన నింకొకకులమునకుఁ గలుగనున్న యాకళంక మును దొలగించుటకై యాతఁడతిశీఘ్రముగ నింటికి రావల యునని యామెభర్త కుత్తరమువ్రాసెను. మఱియుఁ దన తనయునిఁ గఠినముగ మందలించెను. తండ్రిచే నవమానింపఁ బడి యాతఁడు దేశమునువీడి లేచిపోయెను.

ఆతఁడు కాశీ కేగెను. విద్యాసముద్రుఁడని పేరొందిన దండి కీర్తినివిని యాతనికడ విద్యనభ్యసింప నారంభించెను. శశిశేఖరుఁడు స్వతః కుశాగ్రబుద్ధికలవాఁడు. కావున షడ్దర్శనములలో నాతఁడు పూర్ణప్రజ్ఞావంతుఁడయ్యెను. మఱియు ఖగోళశాస్త్రమునఁగూడ శ్లాఘ్యతఁ గాంచెను. దండియాతని యెడ నత్యంతవాత్సల్యముతో నుండెడివాఁడు.

శశిశేఖరుఁడట నొక శూద్రస్త్రీయింట వాసముసేయు చుండెను. ఆమెకొక నవయౌవనవతి కుమార్తెకలదు. అయి

వతి వంటకుఁ గావలసిన పదార్థములు మొదలగునవి యందిం
చుచు నాతని పూజించుచుండెను. జననీ జనకులగౌరవమును
గాపాడుభారము బిడ్డలయందుండునుకదా! ఇఁక నేజెప్పవలసిన దే
మున్నది? ఆశూద్రయువతియే ఈ దురదృష్టవంతురాలగు
విమలకు జనని.

ఈసమాచార మంతయువిని దండి "బిడ్డా! అక్రమ
ప్రవర్తకులకు నేను విద్యగఱపను. ఇఁక నీముఖమును గాశీపట్ట
ణమున నెన్నఁడును జూపింపకుము." అనియెను.

శశిశేఖరుఁడు లజ్జనొంది యటనుండి వెడలిపోయెను.
మాతాత మాయమ్మను కులభ్రష్టయని యింటనుండి వెడలఁ
గొట్టెను.

పేదరాలగు మాయమ్మ నన్నుఁ దీసికొని యొకకుటీర
మునకుఁ గాపురమునకుఁ వచ్చెను. ఆమె కాయకష్టమువలన
మేముపొట్టఁ బోసికొనుచుంటిమి. మేము పేదవారలమగుటచే
మమ్ములనెవ్వరును లక్ష్యముసేయలేదు. నాతండ్రిసమాచార
ములు దెలియనులేదు. ఇట్లు కొన్నియేండ్లు గడచినవి. హే
మంతఋతువున నొకనాఁడొక ధనికుఁడగు పఠానుఁడు వంగ
దేశమునుండి ఢిల్లీకామార్గమునఁ బోవుచుండెను. ఆతఁడు
చాల రాత్రియగువఱకు కాశీపట్టణమును జేరెను. విశ్రమిం
చుటకెక్కడ తావు దొరకలేదు. భార్యయు నొకశిశువు
నాతనితో గూడనున్నవారు. వారు మాకుటీరమునకువచ్చి
మాయమ్మను నారాత్రి తమ్మట గడుపుకొననిమ్మని వేఁడు
కొనిరి. "హిందువులెవ్వరును నాకాశ్రయ మీయలేదు. ఈ

శిశువుతో నీరాత్రియే యెక్కడకు బోవుదుము? పాపమీబాలుడు తఁడు చలిని సహింపలేకున్నాఁడు. నాతోఁగూడ మనుష్యులు విస్తారముగ లేరు. ఈకుటీరమున మాకొక్క గదినిచ్చితివా యదియచాలును నీకుఁ బరితృప్తియగునట్లుగ బహుమాన మొసఁగెదను.' అనియెను. ఆతఁడొక యత్యవసర కార్యము మీఁద ఢిల్లీకిఁ దొందరగఁ బోవుచుండెను. ఆతనితో నొక్క సేవకుడు మాత్రమున్నాఁడు. మాయమ్మ యెంత పేదరాలో అంత దయార్ద్రస్వభావము గలది. ధనమందలి యాశక్తిచే నైననేమి యాశిశువునందలి కనికరముచేనైననేమి మాకుటీర మున వారికిఁ దావొసంగెను. ఒకభాగమున దీపముపెట్టుకొని భార్యాపుత్రులతో నాతడు పరుండియుండెను. వేఱొకభాగ మున మేము శయనించితిమి. ఆకాలమున వారణాసియందు శిశువుల నెత్తుకొనిపోవు చోరులెందఱో యుండిరి. అప్పుడు నేనాఱేండ్లదానను. జరిగినదంతయు నేను చెప్పజాలను. మా యమ్మచే వినినవిషయముల నిటనుడివెదను.

రాత్రి రెండుఝాములైనది. దీపము వెలుగుచుండెను. దొంగయొకఁడు గోడకు గన్నముత్రవ్వి లోపలఁ బ్రవేశించి యాపఠాను పిల్లవానిని దొంగిలించుచుండెను. అప్పుడు నాకు మెలకువ వచ్చినది. చూచితిని. 'దొంగదొంగ' యని పెద్ద కేకవైచితిని. అందఱు మేల్కొనిరి.

పఠానుభార్యకు దనప్రక్కను పరుండబెట్టినబిడ్డ కనఁ బడలేదు. తత్క్షణమే యామె పెద్దకేకవైచెను. చోరుడు బాలునితోఁగూడ నావలకు బాఱిపోయెను. పఠానుడా మను

ష్యునిపై దుమికి వానిజుట్టుపట్టుకొని శిశువు నూడబెత్తికికొని యెను. చోరుడు తన్నురక్షింపుమని బ్రతిమాలుకొన బఠాను డాతని చెవి నొకదానినిగోసి విడిచిపెట్టెను.

అస్మాన్ ఖా నింతవరకును జదివి యేదియో యోచన సేయదొడంగెను. విమలతో నిట్లనియెను.

'నీకింక వేఱొక పేరు లేదా?'

'ఉన్నది. అది మహమ్మదీయనామము. దానిని మా తండ్రి మార్చివైచినాఁడు.'

"ఆ పేరేమి? మహరుకాదా?"

"ఔను. నీ వెట్లెఱుంగ గలిగితివి?"

"నేనే ఆపిల్లవాడను"

విమల యాశ్చర్యపడియెను. అస్మాన్ మరల చదువ నారంభించెను. మరుసటిదిన ముదయము నాపఠానుడు బయలుదేరిపోవుచు మాయమ్మతో నిట్లనియెను. "నీకుమా ర్తె మాకుజేసిన యుపకారమునకు బదులు మేమేమియు బత్యుపకార మొనర్పలేము. అయినను నీమనోరథము నెఱిగింపుము. నేను ఢిల్లీకి బోవుచున్నాఁడను. నీవేదికోరిన నది యక్కడనుండి పంపెదను. ద్రవ్యమపేక్షింతువేని యదియే పంపెదను. మాయమ్మ యిట్లు బదులుచెప్పెను. "నాకు ద్రవ్యమక్కఱ లేదు. ఇట్లే పాటుపడి పనిచేసికొని కాలమును సుఖముగాఁ గడపఁగలను. కాని మీకుఁ జక్రవర్తితో విశేష పరిచయముండెనేని—"

"పరిచయమున్నది. రాజునాస్థానమున నీకు గావలసిన సాయ మొనర్చెదను."

"అయిన.దయచేసి యీబాలికతండ్రి సమాచారముల నారయఁ బ్రయత్నింపుఁడు. తెలిసెనేని నాకుఁ దెలియఁ జేయుఁడు.

"అట్లేచేయుదు"నని పఠానుఁడు వాగ్దత్తముచేసెను. ఆతఁడు కొంతద్రవ్యము నీయఁబోయెను. కాని, మాయమ్మ వలదని దానిని నిరాకరించెను. ఆతనివాగ్దత్తము ననుసరించి నాతండ్రిసమాచారములను గనుగొనుట్కై చక్రవర్తియుద్యోగస్థుల గొందఱును నియమించెను. కాని, కార్యములేకపోయినది. ఇది గడచిన పదునాలుగేండ్లకు మాతండ్రి సమాచారమును వారెఱింగిరి. దానిని మాయమ్మకడ కంపిరి. "అతఁడు ఢిల్లీలో నున్నాఁడు. శశిశేఖరభట్టాచార్యుఁడనుటకు బదులు అభిరామస్వామి యను పేరును వహించినాఁడు" ఈ వార్తవచ్చునప్పటికి మాయమ్మ లోకాంతరగతురాలయ్యెను. ఆచార విద్యుక్తముగఁ గాకుండ బరిణయమాడిన స్త్రీలకు స్వర్గమున దావుగలదేని మాయమ్మ స్వర్గమునందుండుట నిశ్చయము.

నాతండ్రి సమాచారము నాకెఱుగవచ్చు నప్పటికి మాయమ్మ లేకపోవుటచే నాకు కాశియందుండుట కిష్టము లేకపోయినది. నాకీప్రపంచమునఁ దండ్రిదక్క నింక నెవ్వరును లేరు. ఆతఁడు ఢిల్లీలోనుండ నేనుగాశియందుండు టెందులకు అని యోచించి నేనాతని కడకుఁ బోయితిని. మొట్టమొదట

నాతఁడు నన్నుజూచి చాలనసహ్యించుకొనెను. కాని, నేనాతని పాదములపైబడి యేడ్చుచుండ తుదకాతనికి బరిచర్య సేయుచుండుట కంగీకరించెను. "మహరు" అనెడి నానామమునుమార్చి విమల యని పేరుపెట్టెను. శ్రద్ధాభక్తులతోఁ దండ్రిగారికిఁ బరిచర్యలు సేయుటలో నాకాలమంతయుఁ గడుపుచుంటిని. ఇదియంతయు నాయం దాతనికిఁ బ్రేమ గలుగుననుతలంపుతోఁ చేసినదికాదు. నిజముగానాతనియందు గల గౌరవభావముననే చేయుచుంటిని. ఆతఁడు దక్క నాకిఁక నెవ్వరున్నారు? ఆతనికి సేవసేయుటదక్క నాకీప్రపంచమున సౌఖ్యమేమియున్నది? కర్తవ్యమేమికలదు? నేజేయు సేవకు సంతసించుటనో, మానవస్వభావమునకు లోబడుటనో, యాతనికి నాయందు చాల ప్రేమయుదయించెను. ప్రేమ ప్రవహించుచున్న నదివంటిది. ప్రవహించుచున్నకొలదిని శక్తి యభివృద్ధియగుచుండును. నానాథుడు వధ్యస్థానముననున్నప్పుడు, ప్రేమసముద్రమెంత యగాథమయినదో నేను దెలిసికొంటిని.

—♦—

పదవ ప్రకరణము

విమల యుత్తరము శేషము

రాజపుత్త్రా!

గరమందరమున మాతండ్రిని మోహించి గర్భవతియైయున్న యొక పేదయువతి యుండెనని యిదివఱకుఁ దెలిపి

యున్నాను. ఆమె యదృష్టముకూడ మాతల్లివలెనే యయి నది. ఆమెకుఁగూడ నొకతనయ యుద్భవించెను. భర్తయ నంతరమామెయు నాతల్లివలెనే పాటుపడి బిడ్డతో కాలము గడుపుచుండెను. ఫల మెప్పుడును ఉత్పత్తి స్థానమునుబట్టి యుండదు. మృదుకుసుమములనుబూయు వృక్షములు కఠిన పర్వతముల పైబయలు వెడలుచున్నవి. అంధకార బంధురము లగు గనులనుండి దేదీప్యమానములగు రత్నములు పుట్టు చున్నవి. ఆపేదయువిధ కుటీరమున భూసంచార నక్షత్రి మొకటి బయలువెడలెను. ఆమెకుమార్తె యద్వితీయసౌంద ర్యవతియని పేరువడసెను. కాలమత్యద్భుతములను జూపు చుండును. కాలమే యావితంతువు కళంకమును దుడిచివై చెను. ఆయువతి జనన హేతువును గొందఱు మరచిపోయిరి. కొందఱెఱుఁగనే యెఱుంగరు. కోటలోనివారు కొందఱెఱు గుదురో యెఱుగనేయెఱుంగరో? ఇఁక వేఱే చెప్పనదేమి? ఆసౌందర్యవతియే యీతిలోత్తమజనని.

తిలోత్తమ యామె తల్లిగర్భమం దుండగనే నాకీ పరిణయమైనది. ఆకాలమున నొకనాఁడు మాతండ్రి తన యల్లుని మాకుటీరమునకు దీసికొనివచ్చెను. అతనిని తన శిష్యుఁడని చెప్పుకొనెను. నిజమైన వృత్తాంతము నానాథుని వలన నాకు దెలిసినది.

అతనిఁ జూచినతోడనే నాహృదయము మవశ మయి పోయినది. అతఁడు ప్రతిదినమును మాకుటీరమునకు వచ్చి చాలసేపుండెడివాఁడు. అనేక విషయములనుగూర్చి మాట

లాడుచుండెడివాఁడు. కథలు చెప్పుచుండెడివాఁడు. నేనాతని మధుర వాక్యామృతమును గ్రోలి యానందించుచుండెడి దానను, నాశరీరమును హృదయము నాతనికి నామనసున నమ్మి వెచితిని. ఆతఁడుకూడ నన్ను నిరసింపలేదు. ఒకరి యుద్దేశ్యముల నొకళ్ళము గ్రహించితిమి. నేనాతనితో మాటలాడితిని. ఆతఁడు రహస్యముగ నాడిన మాటలర్థ్వను లిప్పటికిని గంధర్వ వీణాగానమువలె నా చెవియందు ధ్వనించు చున్నవి.

నాహృదయము నాతనికి చౌకగ విక్రయించినను, నా తల్లియనుభవించిన యవస్థమాత్రము నామనస్సును వీడిపో లేదు. నాకన్యాత్వమును విక్రయింప నిష్టములేకపోయినది. కాని, యిది యూతనియాత్మసక్యాగ్నిని జల్లార్పలేకపోయినది. మాతండ్రి యీసంగతి నంతయుఁ గనిపెట్టెను. ఒకదినమున నాయనకును, నానాథునకును, నీక్రింది సంభాషణ జరిగెను. అది చాటుననుండి వింటిని.

"విమలను విడిచి నేను వేఱొకచో నుండజాలను. నీవు విమలను బెండ్లియాడితివా! నీతోఁగూడ నేనుందును. కాని, నీయభిప్రాయ మన్యథానున్నచో—"

"అయ్యో! నేను శూద్రస్త్రీనెట్లు పెండ్లియాడుదును" అని యాతఁడు కోపముతోననియెను.

"నీవిదివఱకు జారజనెట్లు పరిణయమైతివి" అని మా తండ్రి యపహాస్యముతోఁ బలికెను."

"పరిణయమగునప్పుడామె యట్టిదని నేనెఱుంగను.

పూర్ణముగఁ దెలిసియుండియు శూద్రస్త్రీ నెట్లు వివాహ మాడుదును. ఇంతేకాక నీపెద్దకూఁతురు జారజమైనను శూద్రస్త్రీ కాదు.''

''పెండ్లియాడ నీకిష్టము లేకపోయినచో నీవిటకువచ్చుటా క్షేపణీయము. నీవిఁక మాకుటీరమునకు రానగత్యము లేదు. నేనే నీయొద్దకు వచ్చుచుండెదను''

ఆనాఁడు మొదలు ఆతఁడు కొంతకాలమువఱకు మా కుటీరమునకు రాలేదు. నేను ప్రతిదినము నాతనికొఱకు త్యాత్రిముతోఁ జూచుచుండెడిదానను. తుదకాతఁడు మరల రానారంభించెను. ఆతఁ డిక్కడ రాకుండ నుండలేకపోయెను. ఆతఁడు వచ్చుట మానినతోడనే ప్రేమయన నేమియో నేను తెలిసికొనగలిగితిని. కడపటిసారి యాతఁడు మాకుటీరమునకు వచ్చుచున్నప్పుడు మునుపటివలె లజ్జావిహీనహృదయనైయుండరాదని నిశ్చయించుకొంటిని. ఈవిషయమును మాతండ్రి గ్రహించెను. ఒకనాఁ డాయన నన్ను పిలిచి ''విమలా! నేను సన్యాసాశ్రమమును స్వీకరించితి నని నీవెఱుంగుదువు కద! నేనెప్పుడును నీతోనుండ నాకవకాశము లేదు. దేశసంచారము చేయవలసి యుండును. నేను సంచారమున కేగునప్పుడు నీ వెటనుందువు?'' అనియెను.

మాతండ్రిని విడిచియుండుటకు నేనుచాలవిచారించితిని. ''నేనుకూడ నీతోవచ్చెద''నంటిని. ఇంతలో నాహృదయమునకు నానాథుచూపట్టెను. మరల నిట్లు చెప్పితిని. ''లేదా. నేను మునుపటివలెనే కాశియందుండెదను''

"విమలా! అట్లుకాదు. ఇంతకంటె మంచికార్యమొక టియున్నది. నీకొకటొక మంచి యాశ్రియముజూచెదను, నేను దేశసంచారార్థమేగినప్పుడు నీవు మానసింహరాజువారి నూతన రాజ్ఞీమణికడఁ బరిచారికగా నుండవచ్చును."

"తండ్రీ! నన్ను విడిచిపుచ్చెదవా?" అని యేడ్చితిని.

"లేదు. లేదు. ప్రస్తుతమున నేనిటనే యుందును. నీవు మానసింహుని నగరున కేగుము. ప్రతిదినమును నిన్నుఁ జూచుచుండెదను. అచ్చట నీకెట్లుజరుగునో చూచి యగత్యమయిన యేర్పాటుల నన్నిఁటిని చేసెదను. అని యాతఁడనెను. రాజకుమారా! నేను కొన్నాళ్ళు మీామందిరమున నివసించియుంటిని. ఈమిషచే నాతండ్రి నన్ను తనయల్లుని దృష్టిపథమునుండి తొలగించెను.

మీాతండ్రిగారి భవనమున నేను చాలకాలముంటిని. కాని నీవదియెఱుంగవు. నీవప్పుడు పదేండ్లబాలుఁడవు. అబ్బీరులో మీాతల్లితోఁగూడ నున్నాఁడవు. అప్పుడు మీా క్రొత్తసవతితల్లికడ నేనుంటిని. మహారాజగు మానసింహునకు దండకు బుష్పములవలె నెందఱో రాణులుండెడివారు. మీాసవతితల్లుల నందఱ నీవెఱుంగుదువా? యోధపురపురాజ తనయ యూర్మిళ రాజ్ఞిప్రియయందుండెనా? ఆమె నాయందగ బఱచిన దయను నేనెంతని చెప్పఁగలను? ఆమె నన్నుఁ బరిచారికగాఁ జూడలేదు. ప్రియసోదరివలె నన్నాదరించినది. ఆమెయాదరమున నేను మంచి విద్యసంపాదించితిని. ఆమె యనుగ్రహమున నే బుటేదారీపనికూడ నేర్చుకొంటిని. ఆమెను

సంతోషపఱచుటకొఱకే సంగీతనృత్యములనభ్యసించితిని, ఉత్తరములు వ్రాయుటకూడ నామెయే నాకు నేర్పినది. అందు మూలమున నాకీయుత్తరము వ్రాయుసమర్థత యేర్పడినది. ఆమె యనుగ్రహము వలననే యిప్పటికిని మంచియదృష్టమనుభవించుచున్నదానను. ఆమె యాదరించుటయేగాక నన్ను మహారాజునకుఁ గూడఁ బరిచయముచేసెను. సంగీత నృత్యములయందు నాకుఁ గొంతప్రజ్ఞకలదు. నావలన సంగీత నృత్యములనువిని మహారాజానందించుచుండెడివాఁడు. మహారాజు నన్ను స్వకుటుంబములోనిదానివలెఁ జూచుచుండెడివాఁడు. నన్నుజూచుటకుఁ దఱచుగా వచ్చెడు నాతండ్రి నాతఁడు చాల గౌరవించుచువచ్చెను.

ఊర్మిళతో నేను సుఖముగఁ గాలముగడుపుచుంటిని. కాని నాకొక్క విచారముమాత్రముండెను. నామర్యాదఁ దక్క తక్కినవన్నియు నాప్రాణములతోఁగూడ నెవరికర్పింప సిద్ధముగనుంటినో, యట్టినామనోహరుఁడు చాలకాలమునుండి నాకుఁ గనఁబడుటలేదు. ఆతఁడు నన్ను మఱచిపోయెనా? లేదు. రాజపుత్త్రీ! ఆప్మానియను పరిచారికను నీవెఱుంగుదువా? ఎఱిఁగియుందువు. నేనామెతో సఖ్యమొనర్చితిని. నా నాథుని సమాచారములను దెలిసికొనిరా నామెనుబంపితిని. ఆమెయట్లు చేసినది. నేనాతనికొకయుత్తరము వ్రాసితిని. దానికాతఁడు ప్రత్యుత్తరము వ్రాసెను. దానినిగూర్చి నే నెంతనిచెప్పుదును? ఆదినమునకాదినము మేము వేఱయినను

నిట్లుత్తరప్రత్యుత్తరముల మూలమున మాటలాడుకొనుచు నన్యోన్యానురాగము నభివృద్ధిచేసికొనుచుంటిమి.

ఈరీతిగ మూఁడేండ్లు గడచినవి. చాలకాలమునుండి విడిపోయినను, నొకరినొకరు మఱవక యన్యోన్యానురాగముతో నున్నందున మాప్రేమ నాచువలె పైపైనున్నది గాదనియు, పద్మమువలె వ్రేళ్ళుపాఱియున్నదనియుఁ దెలిసికొంటిమి. తుదకు నామనోహరున కేలయోగ్యులేకపోయెనో, నేనెఱుంగను, ఆతఁడు దూరాలోచనలేక ప్రవర్తించెను. ఒకనాఁడు నాగదియందు నేనొక్కతెను బరుండియుంటిని. మెలఁకువవచ్చి చూచునప్పటికి నాతలదిక్కున నాదీపప్రకాశమున నొకమనుష్యుఁడు కన్పట్టెను. అప్పు డీమధుర వాక్యములు నా చెవులంబడినవి.

"ప్రియా! భయమొందకుము. నేను నీవాఁడను"

నేనేమి ప్రత్యుత్తర మిత్తును? మూఁడేండ్ల తరువాతనైన సమావేశము! నేనన్నియు మఱచిపోయితిని. ఆతని కంఠమును గౌఁగలించుకొని యేడ్చితిని. నాకొక్కింత మాటలాడ శక్తిగలుగఁగనే "ఈయభ్యంతర మందిరమున కెట్లు వచ్చితివి?" అని అడిగితిని.

"ఆస్మాని నడుగుము. నీళ్ళు మోయువానివలె నామె వెంటవచ్చితిని. అప్పటినుండియు నిందు దాఁగియుంటిని."

"అయిన నిప్పుడేమిచేయవలయును?"

"ఏమియూ? నీయిష్టము."

ఏమిచేయవలయునాయని యాలోచించుచుంటిని ఏ

మార్గము నవలంబింతునాయని యోచించితిని. నాభావో ద్రేకము లేమార్గము నవలంబించినవో యామార్గమునకే నా హృదయమును బోయెను. ఇంతలో నాకస్మికముగ నాగది తలుపు తెఱువఁబడెను. మాయెదుట మానసింహమహారాజు నిలువఁబడియెను.

ఇఁక వివరముగఁ జెప్పఁబనియేమి ? నా నాథుఁడు ఖైదీగాఁ బట్టుకొనఁబడియెను. న్యాయశాస్త్రానుసారముగ దండింతునని మహారాజు తనయుద్దేశమును వెలిపఱచెను. అప్పుడు నాయవస్థ యెట్లుండునో నీవేయూహించుకొనగలవు. ఏడ్చుచు నూర్మిళ పాదములపైఁ బడితిని. నాయవివేకమును నిష్కపటముగ నొప్పుకొంటిని. నేరమంతయు నాపైనిబెట్టు కొంటిని. నాతండ్రినిగలిసికొని యాయనపాదములపైఁగూడఁ బడితిని. మహారాజున కాయనయందు గౌరవముకలదు. గురువువలె సన్మానించుచున్నాఁడు. నాతండ్రిప్రార్థన నాతఁడంగీకరించునని తలంచితిని. "నీపెద్దకుమార్తె దురదృష్టమునాలోచింపుము" అని నాతండ్రితో విన్నవించితిని. ఆయన మహారాజుతో గలిసి మాటలాడునని యనుకొంటిని. కాని, నా ప్రార్థనలన్నియు నాతనికడఁ జెవిటికిసంకూదినట్లయినవి. ఆతఁడాగ్రహమునొంది నన్నిట్లునిందించెను. "నిర్భాగ్యురాలా ! నీవు సిగ్గును విడిచివైచితివా ?"

ఊర్మిళను నన్ను రక్షింపవలయునని యూహ వోడ మెను. నావిషయమున మహారాజును బ్రతిమాలుకొనియెను. "వీరేంద్రుఁడు విమలను బరిణయమాడ నంగీకరించునేని నే

నాతని క్షమించెదను." అని మహారాజానతిచ్చెను. ఆతని యభిప్రాయమును నేనుగ్రహించి యూరకుంటిని నానాథుం డామాటను విని యత్యాగ్రహము నొంది యిట్లు ప్రత్యుత్తర మిచ్చెను.

"నే నెప్పుడును ఖైదీగనైన నుండెదను. నాప్రాణములు విడువుమన్న విడిచెదను. కాని నేనెన్నఁటికిని శూద్రవనితను బెండ్లియాడను. నీవు రాజపుత్త్రుఁడవైయుండియు నన్నెట్లాపని చేయమనెదవు?"

"నాసోదరిని యువరాజగు సలీమునకిచ్చి పరిణయ మొనర్చినప్పుడు, నినొక క్షత్రియ బ్రాహ్మణుని తనూజాతను వివాహ మగునని చెప్పుటలో నాశ్చర్యమేమికలదు?" అని మానసింహుఁడు ప్రత్యుత్తరమిచ్చెను.

నానాథుం డంగీకరింపలేదు. ఇట్లనియెను.

"మహారాజా! జరిగినదేమో జరిగినది. అనుగ్రహముంచి విడిచిపెట్టితిరా యిఁక నేనెన్నఁడును విమల పేరైన దలపెట్టను"

"నీవు చేసిన నేరమునకుఁ బ్రాయశ్చిత్త మేమిచేసికొననెంచితివి? విమలను విడిచిపెట్టుటయా? ఇతరు లామెను గుల భ్రష్టయని బరిత్యజింపరా?"

ఎంత చెప్పినను నాతఁడు పట్టువిడువలేదు. ఆతఁడు కారాగృహమున నతినీచముగఁ జూడఁబడెను! అతికష్టమనుభవించుచుండెను. ఆబాధల సహింపలేక తుదకాతఁ డర్ధాంగీకారము నొసంగుచు నిట్లుచెప్పెను.

"విమల నాయింటఁ బరిచారికగా సంచరింప నిష్టపడునేని, ఆమె యీవివాహవిషయము నా కెప్పుడునుజ్ఞప్తికిఁ దేకుండునేని, ఆమె యెప్పుడును నాకు ధర్మపత్నియనిచెప్పుకొనకుండునేని, నేనాశూద్రవనితనుబెండ్లియాడెదను. లేనిచోఁ నేఁబరిణయముగాను."

మహోత్సాహముతో వీనికన్నిటికిని నేను సమ్మతించితిని. నాకు భాగ్యముపైఁగాని, పేరునందుఁగాని యించుకంతయిన నాశలేదు నానాథునికొఱకే నేనుపరితపించుచుంటిని నాతండ్రియు మహారాజునుగూడ నిందులకు సమ్మతించిరి. నేను బరిచారికా వేషమున నానాథుని గృహమునకువచ్చితిని.

నామనోహరుఁడు నన్ను నిర్బంధముమీఁదఁ బరిణయమైనాఁడు. నిర్బంధమున జేకొనిన కాంత నెవ్వరు ప్రేమింతురు? పరిణయానంతరమున నాతనికి నాపైఁ జాలనసహ్యము జనియించినది. పూర్వపు ప్రేమయంతయునదృశ్యమైపోయెను. మానసింహునివలనఁ దానను భవించిన కష్టము, అమర్యాద, జ్ఞప్తికిఁ దెచ్చుకొనుచు నన్ను నిందించుచుండెడివాఁడు.

ఆతని తిరస్కారమే నేను ప్రేమగా భావించుకొనెడిదానను. ఈవిధముగఁ గొంతకాలము జరిగినది. కాని యవి యన్నియు నిందుదహరించుటవలన లాభమేమి? నాస్వీయ చరిత్రతో సంబంధించిన దింతయే ఇఁక నధిక మేమియులేదు. తరువాతఁ గ్రమక్రమముగ నాతని యనురాగమును మరలఁ బడయగలిగితిని. కాని, యెప్పటికిని నబ్బీరుప్రభువుపై నాతఁ డధికముగ వైరభావమునే కలిగియుండెడివాఁడు. అది విధి

విధానము. లేనిచో నివియన్నియు నెందులకు సంభవించును? రాజకుమారా! నాపని యయిపోయినది. నా వాగ్దత్తమును నెఱవేర్చుటకే నేనిది వ్రాయలేదు. నాగౌరవమును బోఁగొట్టుకొని నేను గరమందరప్రభువుని భవనమున నుంటినని లోకు లనుకొనెదరు. నేనీప్రపంచమును వీడిపోయినప్పుడు నా గౌరవమునకుఁ గలుగు కళంకమును నీవు తుడిచి వేయుదువని నాప్రార్థనము. ఇందులకే నేనీయుత్తరము వ్రాసితిని.

నాచరిత్రముతో సంబంధించిన విషయములనుమాత్రమే యిందు వ్రాసితిని. నీవెవరి నిమిత్తమాత్రముతో నుందువో అట్టియామెనుగూర్చి యొకవిషయమైనను వ్రాయలేదు. ఆమె యీప్రపంచమున నశించిపోయినదని తలంపుము. తిలోత్తమ జీవించియున్నదనుమాట మఱచిపొమ్ము.

ఉత్తరమునంతను జదివి యస్మాన్ ఖానిట్లనియెను.

"అమ్మా! నీవు నాప్రాణములను గాపాడితివి. నేను నీఋణమును దీర్చుకొనియెదను."

విమల నిట్టూర్పు విడిచి యిట్లుబదులు చెప్పెను.

"అయ్యో! నానిమిత్తమిప్పు డేమిచేయఁగలవు? నీ వలన నగుకార్యమిప్పుడేమికలదు? అయిన నింకనొక్క——

"అది తప్పక యొనర్చెదను."

విమల నేత్రములు దీక్షత వహించెను. ఇట్లనియెను.

"అస్మాన్! ఏమనుచుంటివి? మండుచున్న యీహృదయమును మరల నీవేల వంచించెదవు"

అస్మాన్ తనవ్రేలినుండి యుంగరమును దీసి యిట్లు చెప్పెను.

"ఈయుంగరమును బుచ్చుకొనుము. ఒకటి రెండుదినములలో నేనేమియుఁ జేయలేను. కాని కటులూఖానుని జన్మదినము రానున్నది. ఆనాఁడు సంతోషముతోడను, మద్యపానాదులతోడను, రక్షకులొడలు మరచియుందురు. ఆరాత్రి నిన్ను దాఁటించెదను. అర్థరాత్రిమున నభ్యంతరమందిర ద్వారముకడకు రమ్ము. అట నిట్టియుంగరము నింకొకదాని నెవ్వఁడగపఱచునో వానితోఁగూడఁ బొమ్ము. ఏవిఘ్నమును లేకుండ నీవుదాఁటిపోఁగలవని యనుకొనెదను. అయినను నిది యంతయు భగవదధీనము."

"భగవంతుఁడు నిన్ను రక్షించుగాక; ఇంతకన్న నేఁ జెప్పునదేమి?" అని విమల యనియెను.

విమలకు గద్గదస్వరము వచ్చెను. మాటాడలేక పోయెను. ఆతనికడ సెలవుగైకొని పోనున్న సమయమున నామెతో "నీకొక్కమాట చెప్పెదను. నీవొక్కతవేరమ్ము. నీవెవరినైనఁ దీసికొనివచ్చినచో నీయుద్దేశము కొనసాగ నేరదు. అపాయకరముగూడనగును." అని యస్మాననియెను.

తిలోత్తమను దీసికొనిపోరాదని యాతని యభిప్రాయముగా గ్రహించి విమల తనలో నిట్లనుకొనెను.

"మంచిది. మేమిరువురమును పోరాదేని ముందు తిలోత్తమనే యవ్వలకుఁ బంపివైచెదను."

విమల యాతనికడ సెలవుఁ గైగొనిపోయెను.

పునరారోగ్యము

కాలము పరుగెత్తు స్వభావము కలది. నీవేమిచేయు చున్ననుసరే కాలముమాత్రమునిలువఁబడదు. పరుగెత్తుచునే యుండును. నీవెట్టిస్థితిలోనున్నను కాలగమన మాఁగియుండదు. పోవుచునేయుండును. పథికుఁడా! వర్షమున, గాలిచే, నధికముగ కష్టపడుచున్నావా? నీశిరస్సుపై మేఘములు కాఱు క్రమ్మకొని గర్జించుచున్నవా? వాయువులు క్రమముదప్పి విసరుచున్నవా? వర్షములోఁదడియుచుంటివా? నీదేహమును వడగండ్లు మొత్తుచున్నవా? తలఁ దాఁచుకొనుటకు నీకెక్కడ నాశ్రయములేదా? కొంచెమోర్పు వహింపుము. ఈదినము శాశ్వతముగ నుండదు. వెళ్ళిపోవును. కొంచెముసేపాగుము. ఈభయంకరదినము గడచిపోఁగలదు. మంచికాలము రానున్నది. సూర్యుఁడు మరలఁ బ్రకాశింపనున్నాఁడు. రేపటి వఱకు నిరీక్షింపుము.

ఎవరిదినములు గడచిపోవు? ఎవరికి కష్టదినములు శాశ్వతములుగానున్నవి? సోదరుఁడా! ఏల దుఃఖించెదవు? ఎవరికి సుఖదినములు గడచిపోకుండ నున్నవి? ఏల డంబములు పలికెదవు?

ఎవరిదినములు గడచుటలేదు? తిలోత్తమ పరాగమునఁ బడిదొరలుచున్నది. అయినను దినములు గడిచిపోవు చునే యున్నవి.

విమల హృదయము పగకు నివాసగృహమైనది. ఆ గృహముయొక్క ప్రతిభాగమునందును, నావిరోధసంబంధమయిన విషము వ్యాపించియున్నది. అను నిమిషమును నా విషము దుస్సహముగ బాధించుచున్నది, దినమున కెన్ని నిమిషములు? ఎన్ని నిమిషములు గడపిన దినమగును! ఆమె దినములు గడచుటలేదా?

జయమునుగాంచిన కిటుల్ ఖాఁ మహాభోగముతో నున్నాఁడు. ఆతనికి దినములు సుఖముగా నున్నవి. అయిన నవియును గడచిపోవుచునే యున్నవి. కాని, నిలిచియుండుట లేదు.

జగత్సింహుఁడు వ్యాధిపీడితుడై యున్నవాఁడు. వ్యాధిపీడితునకు కాలము చాలనాలస్యముగ నడచునని యెవ్వరెఱుంగరు? అయినను నాతనికిని దినములు గడచిపోవుచునే యున్నవి.

అవును. దినములు గడచుచునే యున్నవి. జగత్సింహునకుఁ గ్రమక్రమముగఁ బునరారోగ్యము కలుగుచున్నది. మృత్యుదేవత నోటినుండి తప్పివచ్చినాఁడు. క్రమక్రమముగ బలము చేరుకొనుచున్నది. శరీరదుగ్మత యదృశ్యమైనది. ఆఁకలి కలిగెను. బలము కలిగెను. హృదయమున కాత్రము జనియించెను.

ఆతనిప్రథమోద్దేశము— "తిలోత్తమయెటనున్నది?" బలముకలిగినకొలదిని విచారకరమైన హృదయముతో నాతఁడు మార్గమునవచ్చుచుఁ బోవుచునుండువారి నందఱఁదిలో

త్తమనుగూర్చి యడుగుచుండెను. కాని, యెవ్వరును దృప్తికరమగు ప్రత్యుత్తరమీయ లేదు. అయేషా యెఱుఁగదు—అస్మాన్ చెప్పలేదు—సేవకులును, పరిచారికలు, తెలిసియో తెలియకయో చెప్పలేదు. వారికట్లాజ్ఞయైనది. జగత్సింహునకు, ముండ్లశయ్యపైఁ బరున్నట్లుండెను.

ఆతని రెండవయుద్దేశము భవితవ్యవిషయము—'ఏమి రానున్నదో'' ఈప్రశ్న కెవ్వరుత్తర మీయఁగలరు? ఆతఁడు కైదీగనున్నాఁడు. అయేషాస్మానులయనుగ్రహమునఁ జెరసాలలో నుండుటకు బదులాతఁడు చక్కఁగ నలంకరింపఁబడిన విశాలభవనముననున్నాఁడు. పరిచారికలును, సేవకులును వచ్చి యుపచారములు సేయుచున్నారు. అడుగుటయే తడవుగఁ బ్రతివస్తువును సిద్ధముగనుండెను. సహోదరికంటె నధిక జాగ్రత్తతో నయేషా కాపాడుచుండెను. అయినను ద్వారముకడ పర్వతమువలె రక్షకుఁడొకఁ డున్నాఁడు. రాజపుత్త్రుఁడు మధురపదార్థములఁ దినుచు బంగారు పంజరమున నున్న పక్షివలె నున్నాఁడు. ఆతనికిఁక స్వేచ్ఛ యెప్పుడు? స్వేచ్ఛతప్పకుండఁ గలుగునను నిశ్చయమేమికలదు? ఆతని సైన్యములెట నున్నవి? సేనాధిపతినిగోల్పడి యూసైనికులేమిచేయుచున్నవారు?

మూఁడవయుద్దేశ మయేషావిషయము, మనోహారిణియైహృదయాకర్షణము గావించుచున్న యాసుందరియెవ్వరో? ఈసద్గుణమూర్తి యీకృపావతార మెటనుండి యీప్రపంచమునకు దిగివచ్చెనో?

ఆయేషాకు విశ్రాంతి లేదు—ఆయాసము లేదు—అవిధేయత లేదు. ఇదియంతయు జగత్సింహుఁ డెఱుంగును. ఆమె నిరంతరము నాతనిని శ్రద్ధతోఁ జూచుచుండెను. ఆతని వ్యాధి కుదురునంతవఱకు ఆమె ప్రతిదినమును బాలసూర్యునివలె నుదయముననే పూగుత్తి చేతఁదాల్చి మందయానముతో వచ్చుచుండెడిది. స్నానభోజనసమయ మతిక్రమించినను నామె యచ్చటనేయుండుట నాతఁడు చూచుచుండెను. ఆవశ్యకరణీయములందీర్చి మరల నతిశీఘ్రముగ వచ్చుచుండెడిది. బీగముపరిచారికను బంపునంతవరకు నక్కడ నేయుండి పరిచర్య సేయుచుండెడిది. వ్యాధిపీడితుఁడై మంచముపట్టినిమనుష్యుఁ డెవ్వఁడు? లావణ్యరాశియగు యువతియొక్కర్తు తలదిక్కునఁ గూర్చుండి మృదుహస్తములతో విసరుచు నుపచారములు సేయుభాగ్య మలవడెనేని వ్యాధి, యంత బాధాకరముకాదని, యాతఁడే చెప్పఁగలఁడు.

పాఠకమహాశయా! జగత్సింహుఁడెట్టిస్థితి యందుండెనో మనసుచేఁ జూచుకొన నీకభిలాషగలదా? అయినసరియే. నేఁజెప్పినట్లొనర్పుము. నీశరీరమంతయు గాయములతో బాధనొందుచున్నదనుకొనుము. మంచముపై పడియుంటివని భావింపుము. శత్రువులనడుమ ఖైదీగానుంటివని తలంపుము నీవున్నది యమూల్యపదార్థాలంకృతమై చల్లనై సుగంధబంధురమగు విశాలభవనమనుకొనుము. నీదృష్టినొక్కమారా ద్వారమువంకఁ బ్రసరింపఁజేయుము. ఆకస్మికముగ నీకధిక సంతోషముగలిగి ముఖవికాసము కలుగును. అదిగో యా

వచ్చుచున్నవ్యక్తి శత్రుమధ్యమున నిన్నుసోదరునివలెఁ గాపాడును. ఆవ్యక్తి స్త్రీ. ఆమె స్త్రీమాత్రమేకాదు. యౌవనవతి. పూర్ణముగ వికసించిన పద్మమువంటిది. అట్టెపరుండియుండి నీవామెను నిశ్చలముగఁ జూచుచుండుము. ఆరూపమున సౌందర్యమెట్లు మూర్తీభవించెనో చూడుము. ఆయాకృతి యిప్పుడిప్పుడే కొంచెమున్నతమగుటకు ఉంకించుచున్నది. పరిపూర్ణావయవానురూపత్వముగలది. సంపూర్ణదివ్యలక్షణ విశిష్టయగు దేవత. ప్రకృతి పోఁతపోసిచేసిన సుకృతరాజ్ఞి ఆమె గమన సౌందర్యమెట్లుండునో పరికింపుము నీవెప్పుడైన మదగజయానమును వినియుంటివా? అదేమి? హంసగమన మెట్లుండునో చెప్పఁగలవా? ఆయువతిగమనమునను, గుర్తించుకొనుము. మర్దళము సంగీతమున లయఁజూపును. అట్లే ఆమె పదగతులకు నీహృదయము లయఁజూపును. ఆమెహస్తమునఁ బూలగుత్తియున్నది. చూడు! నిరవధికతేజోవిరాజితములగు నాహస్తములకడ నా కుసుమములెట్లు ప్రకాశహీనములయియున్నవో చూచితివా? ఆమెగళప్రకాశముకడ నాబంగారుగొలుసెట్లు వన్నెదఱిఁగియున్నదో చూచితివా? ఓహో! అదేమి? నీనేత్రములు ఱెప్పపాటులను మఱచిపోయినవేమి? ఆమెమెడయొక్క సొగసు చూచినావా? చంద్రకాంతోపలసన్నిభంబగు నామె గళప్రదేశమున నావినీలకుటిల కుంతలము లెట్లుపడుచున్నవో చూచితివా? అదిగో, యామెకర్ణాలంకృతము లెంతమనోహరముగ నల్లలాడుచు మెఱయుచుండెనో కనుఁగొంటివా? ఆమె శిరసు కొంచెము వంగియున్నది. గుర్తించితివా? కొంచెము

పొడవును తగ్గించుకొనుట కట్లు చేసినది. నీవు తదేకధ్యానము తోఁ జూచుచున్నా వెందులకు? నిన్నుగూర్చి యయేషా యేమనుకొనును?

అయేషా వ్యాధిపీడితుఁ డగుజగత్సింహునకుఁ దనసేవ యెంతకాల మవసరమో అంతకాలము నామె ప్రతిదినమును విడువకుండ నాతని యొద్దనేయుండి యాతనికుపచారములు సేయుచుండెడిది. ఆతనివ్యాధి తగ్గుచున్నకొలఁదిని నామె రాకయుఁ దగ్గుచుండెను. అతఁడు పూర్ణారోగ్యమును బొందినప్పు డామెరాక చాలయరుదైనది. ఎప్పుడో — ఒకమాఱు రెండుమాఱులు — ఆమె వచ్చినప్పుడెల్ల సాధారణముగా నస్మానునిగూడఁ దీసికొనివచ్చుచుండెను. శీతకాలమునఁ బ్రొద్దెక్కినకొలఁదిని వణఁకుచున్న మనుష్యునకు దూరముగఁ దొలఁగిపోవు సూర్యకాంతివలెనే యారోగ్యము నొందుచున్నకొలఁదిని జగత్సింహున కయేషా దూరమగుచుండెను.

ఒకనాఁటి సాయంకాలమున జగత్సింహుఁడు కోట యావలిప్రదేశమును జూచుచు గవాక్షములోఁ గూర్చుండి యుండెను. ఆమార్గమున మనుష్యులు వ్యాపారములమీఁదనో, వినోదముకొఱకో, యటునిటు పోవుచుండిరి. వారియదృష్టము తోఁ జగత్సింహుఁడు తనయదృష్టమునుఁ బోల్చుకొనియెను. చాలవిచారమునొందెను. ఒకప్రదేశమునఁ గొందఱు మనుష్యులు చుట్టువారియుండిరి. వారినడుమ నొకమనుష్యుఁడో, యేదయిననొక పదార్థమో యుండెను. రాజపుత్త్రునిదృష్టి యావైపునకేగెను. వారేదో వినోదము ననుభవించుచున్నారని యాతఁడనుకొనియెను. వారేదో శ్రద్ధతో వినుచున్నా

రనికూడ గ్రహించెను. నడుమనున్నది వస్తువో, మను ష్యుడో, యెవ్వరో, యాతనికిఁ గనబడ లేదు. అతఁడును గొంచెము వినోదమునొందెను. కొంతసేపటికిఁ జాలమంది చూపఱు లటనుండి వెడలిపోయిరి. ఆతని వేఁడుక తీరెను. ఆనడుమ పులివలెఁ దాటియాకులపుస్తకమును చదివి వినుపిం చుచున్నవాఁ డొక్కఁడుండెను. ఆచదువరి యాతని వినోద మును మఱింతయభివృద్ధిచేసెను. ఆతఁడు మనుష్యుడైనఁ గావచ్చును, లేదా, దేవతాగ్నివలన నాకులు దహింపఁబడి యున్న మధ్యపరిమాణ తాళవృక్షమైనఁ గావచ్చును. ఆతఁ డంతపొడవు యంతవర్తులమును గలిగియుండెను. కాని తాళ వృక్షము మాత్రి మెన్నటికిని తొండమువంటి యంతనాసికను మోయఁజాలదు. ఆతని యాకారమెట్లుండెనో నడవడియు నట్లేయుండెను. ఆతఁడు చదువుచు హస్తము, శిరసు ముక్కు వీనితో చేయుచున్న యభినయములను జగత్సింహుఁడు వినో దముతోఁ బరికించుచుండెను. ఇంతలో నస్మాన్ ఖాన్ వచ్చెను. ఒకరికొకరు వందనములఁ జేసికొనిరి.

"తదేకధ్యానముతో గవాక్షమువంకఁ జూచుచున్నా రేమి ?

"చెట్టు తునకవలె నేదో యుట నున్నది. నీవును జూడవచ్చును"

అస్మాన్ చూచియిట్లు చెప్పెను.

"ఇదివఱకు మీ రెప్పుడును నితనిని జూడలేదా?"

"లేదు"

"ఇతఁడు మీ బ్రాహ్మణుఁడే. ఈతని సంభాషణ చాల నింపుగనుండును. నేనీతనిని గరమందరమునఁజూచితిని"

రాజపుత్త్రిక కౌతుకముజనియించెను. తనలో నిట్లను కొనెను. "గరమందరమున నుండెనా? తిలోత్తమనుగూర్చి యేమయిన చెప్పఁగలఁడేమో?"

"ఆతని పేరేమి?" అని యాతఁడాతుముఁతో నడిగెను.

అస్మాన్ ఖాన్ కొంచెమాలోచించి యిట్లు చెప్పెను.

"ఆతని పేరు చెప్పుటకొంచెము కష్టము. అవి యంత త్వరలో జ్ఞప్తికిరాదు గజపత్ ? —కాదు—గణపతి? — గజపత్?—కాదు—గణపతి? ఇఁక నేమి?"

"గజపతి?—ఇది వంగదేశపునామముకాదు. అయినను సీతఁడిక్కడివాఁడేయని తోఁచుచున్నది."

"ఔనౌను ఇతఁడు వంగదేశస్థుఁడే. ఒక భట్టాచార్యుఁడు ఈతని కేదో బిరుదమున్నది. ఎలిమ్—ఎలిమ్— తరువాత నేమి?"

"కాదు—కాదు. వంగదేశపు బిరుదము లెప్పుడును "ఎలిమ్" అనియుండును. ఎలిమనఁగా వంగభాషలో విద్య యని యర్థము. విద్యాభూషణుఁడనియో, విద్యాజిగీషుడనియో యుండవచ్చును."

"ఔనౌను విద్యా—ఇంక నేదోయున్నది. ఉండుము —వంగభాషలో నేనుఁగు నేమని పిలిచెదరు."

"హస్తి"

"ఇంకను"

"కరి—దంతి—వారణ—నాగ—గజ—"

"ఆఁ! ఆఁ అదే యీతని పేరు గజపతి విద్యాదిగ్గజుఁడు."

"విద్యాదిగ్గజుఁడా ? నేను వినినంతవరకిట్టి బిరుద మరుదు. పేరునకును బిరుదమునకును, సరిపోయినది. నాకాత నితో మాటలాడవలయునని యున్నది."

గజపతి సంభాషణమును నస్మాక్ వినియుండెను. రాజపుత్త్రునితో మాటలాడినందువలన భయము లేదని తలంచెను.

"ఇందేమియు నుపద్రవము లేదు"

వారిరువురు నింకొక గదిలోని కేగిరి. సేవకునిచే గజపతిని బిలువనంపిరి.

తొమ్మిదవ ప్రకరణము

దిగ్గజుని వార్తలు

సేవకుఁడు గజపతిని లోపలకుఁ దీసికొనివచ్చెను. రాజపుత్త్రుఁడాతని నిట్లడిగెను.

"అయ్యా! నీవు బ్రాహ్మణుఁడవా?"

"యావన్మేరోస్థితో దేవా, యావద్గంగా మహీతలే, అసారేఖలు సంసారే సారం శ్వశురమందిరమ్"

జగత్సింహుఁడు వచ్చుచున్న నవ్వు నణంచుకొని యీతనికి వందనము చేసెను.

"బాబూ! * ఖోదాఖాఁ నిన్ను రక్షించుఁగాక!"

"నేను మహమ్మదీయుఁడను గాను. హిందువుఁడను"

"ఈతడు మోసగాఁడు. తప్పక యవనుఁడే. నన్ను మోసముచేయ యత్నించుచున్నాఁడు. ఇందులకీతని కేదో యుద్దేశముండి యుండును. లేనిచో నన్నెందులకు లోపలికిఁ బిలిపించును?" విచారముతో "ఓఘనతగల ♦ ఖాన్ బాబూ! నేను నిన్నెఱుంగుదును. నేను మీాయన్న మేతిని బ్రతుకు చున్నాఁడను. నన్నవమానింపకుము. నేను మీా సేవకాను సేవకుఁడను."

జగత్సింగాతని చిక్కును గ్రహించి యిట్లనియెను.

"నీవు బ్రాహ్మణుఁడవు. నేను రాజపుత్త్రుఁడను. నీవు నాయెడ నుపయోగించు భాష యుక్తమైనది కాదు. నీ పేరు గజపతి విద్యాదిగ్గజుఁడా?"

దిగ్గజుఁడు తనలో నిట్లు యోచించుకొనెను. "హా! ఇదిగో! ఇతడు నా పేరునుగూడ నడుగుచున్నవాఁడు. నాకీతఁ డేమికష్టమును దెచ్చి పెట్టనున్నాఁడో! భగవంతునికే యెఱుక" "సాహేబుగారూ! నా పైదయఃజూపుఁడు; (చేతులు జోడించి) నేనొక బీదబాపఁడను. మొకరించి వేడుకొనుచు న్నాఁడను! నాపైదయయుంచుడు" అనియెను.

---

* ఖోదా = దేవుఁడు; ఖా = బిరుదు. దేవునకు బిరుదుండదు. ఇతనిది వచ్చియురాని హిందూస్థానిభాష. అందుచే నిట్లనియెను. పాఠకులారా! విద్యాదిగ్గజుని తప్పు పట్టకుఁడు.

♦ ఇదియును తప్పుమాటయె విద్యాదిగ్గజుని యంతవాఁడిట్లన్నాఁడు.

జగత్సింహుఁడు బ్రాహ్మణుని యపరిమితభయమును గాంచెను. తనకార్యము నాతనివలనఁ దెలిసికొనుట యసాధ్యమని తలంచెను. అందుచే నాప్రసంగమును మార్పుచేయవలయునను నుద్దేశముతో నిట్లనియెను.

"నీచేతనున్న పుస్తకమేమి?"

"మణికర్పూర చరిత్రము——"

"నీవు బ్రాహ్మణుఁడవు. మణికర్పూరచారిత్రము నేల వ్రాయుచున్నాఁడవు"

"హెమ్. హెమ్. నేనొకప్పుడు బ్రాహ్మణుఁడనే కాని యిప్పుడు కాను"

జగత్సింహున కాశ్చర్యమును విసుగును జనియించెను.

"ఏమంటివి? నీవు గరమందరమున లేవా?"

దిగ్గజుఁ డిట్లు యోచించుకొనియెను. మరణము——దండన——నేను వీరేంద్రసింహుని దుర్గమున నుంటిననికూడ నీతఁడెఱుంగును. వీరేంద్రుని జేసినట్లే నన్నును జేయుదురు. బ్రాహ్మణుని నేత్రములవెంట బాష్పములు ప్రవహింపనారంభించెను. "ఖాఁ ప్రభూ! అనుగ్రహింపుము. ఏడ్చుచు (శక్తికొలది చేతులు నలుపుచు) నేను ప్రార్థించుచున్నాఁడను. నేను నీ సేవకుడను. నన్ననుగ్రహింపుము"

"నీకు మతియున్నదా?"

"చిత్తము. మహాప్రభూ ! ఉన్నది. నేను నీసేవకుడను, నీవాఁడను"

"నీకు భయములేదు. నీపుస్తకమున గొంతభాగము నాకు జదివి వినిపింపుము."

బ్రాహ్మణుడు పుస్తకములోనిపద్యభాగము నీడ్చుచుం జదువుచుండెను. ఆతనినేత్రము లింకను బాష్పావృతము లయ్యేయున్నవి. ఆతని కంఠధ్వని యప్పుడేడ్చుచు జదువు చున్నట్లుండెను. నాటకశాలయందుపాధ్యాయుడు బాలకుని చెవిపట్టుకొని నులివేయుచు బాడించినట్లుండెను.

కొంతసేపు చదివిన పిమ్మట రాజపుత్త్రు డిట్లడిగెను.

"నీవు బ్రాహ్మణుడవైయుండియు మహేశ్వర చారిత్రము నేలచదువుచుంటివి?"

"నేను మహమ్మదీయులలో గలిసిపోయితిని"

"అదెట్లు?"

మహమ్మదీయబాబులు కోటలో బ్రవేశించినప్పుడు వారు నాతోనిట్లనిరి. "బ్రాహ్మణుడా! రమ్ము, కులభ్రష్టుడవుకమ్ము" పిమ్మట వారు నన్నీడ్చుకొనిపోయి కోడిపలో (పులావు)ను దినుమని నిర్బంధించిరి"

"పలోయననేమి?"

"స్వచ్ఛమయిన పాలలో నుడికిని యాతపబియ్యము"

ఆతని యభిప్రాయమును రాజపుత్త్రుండు గ్రహించెను.

"తరువాత"

"వారు నాచే కల్మ చదివించిరి."

"కల్మయా? తరువాత"

"వారు నాతో నీవు మహమ్మదీయుడవైతివి" అని చెప్పిరి. అప్పటినుండియు నేను మహమ్మదీయుడను"

"కోటలోని తక్కినవారో!"

"తక్కిన బ్రాహ్మణుల నందఱను నావలెనే చేసిరి"

రాజపుత్త్రి డస్మాన్ ముఖముపై దృష్టిసారించెను. లోపల నణగియున్న యాతని యాగ్రహము నస్మాన్ గ్రహించి యిట్లుచెప్పెను.

"రాజచంద్రా! ఇందుపద్రవమేమున్నది? మహమ్మదీయమత మొక్కటియే నిజమయినదని మేము నమ్మినారము. ఏమార్గముచేనైన నామతమును వ్యాపింపజేయుట పుణ్యమే కాని పాపముకాదని తలంచితిమి."

జగత్సింహుఁడాతని కేమియుఁ బ్రత్యుత్తర మీయ లేదు.

"విద్యాదిగ్గజా!"

"నన్ను సాహేబుదిగ్గజా ! అని యనుగ్రహింపుడు."

"అట్లే. సాహేబుజీ! కోటలోనుండెడి తదితరులను నీ వేమైన నెఱుఁగుదువా?"

జగత్సింహుని యభిప్రాయమును గ్రహింపవలయునని యస్మాన్ ఖానాత్రము జెందుచుండెను.

"అభిరామస్వామి పాఱిపోయినాఁడు"

అతనికేదైన దెలిసియున్నచో నిఁక స్పష్టముగఁ జెప్పునని జగత్సింహుఁ డనుకొని యిట్లడిగెను.

"వీరేంద్రసింహుడో"

"నబాబాతని శిరచ్ఛేదము చేసినాఁడు"

జగత్సింహునిముఖ మెఱ్ఱవారెను. ఆస్మానుతో నిట్లని యెను.

"ఆతఁ డేమిచెప్పినాఁడు? బ్రాహ్మణుఁ డసత్యము చెప్పెనా?"

"వీరేంద్రసింహుని విచారణచేసి రాజద్రోహి యని స్థిరపఱచి వధించినారు."

రాజపుత్త్రుఁడు నేత్రములగ్నిగురియుచుండ నిట్లనియెను.

"నేను నిన్నొక్కమాట యడుగవలసియున్నది. అపని నీసమ్మతముమీఁదనే జరిగినదా?"

"లేదు. నాయాలోచనకుఁ బ్రతికూలముగ జరిగినది."

రాజపుత్త్రుఁడేదియో యాలోచించుచుండెను. ఆసమయమున నస్మాను దిగ్గజునితో "నీవుపోవచ్చును" అనియెను. ఆతఁడు వెడలిపోనుండెను. జగత్సింగాతని చేయిపట్టుకొని యాపి యిట్లనియెను.

"ఇఁకనొక్కమాట, విమలయెటనున్నది?"

బ్రాహ్మణుఁడు నిట్టూర్పు విడిచెను. కొంచెమేడ్పు కూడవచ్చెను.

"విమల యిప్పుడు నబాబుగారి యుంపుడుకత్తెగా నున్నది."

రాజపుత్త్రుఁడు మరల నస్మాను వంకజూచి యిట్లనెను.

"ఇదియు నిజమేనా?"

ఆస్మానాతనికిఁ బ్రత్యుత్తరమీయక దిగ్గజునితో "నీ వింకను నెందులకున్నావు? పొమ్ము" అనియెను.

జగత్సింహుఁడు బ్రాహ్మణుని హస్తములను బట్టుకొనెను. ఆతఁడు చేయిని విడిపించుకొనలేకపోయెను. అట్టె నిలువ బడియెను.

"ఇఁక నొకనిమిషమాఁగుము. అయిపోయినది. ఒక్క మాట ఇఁక నొక్కమాట! తిలోత్తమ?"

తిలోత్తమకూడ నిప్పుడు నవాబుగారి యుంపుడు కత్తెయే. వారిరువురు నిప్పుడు మహాభోగముల నందుచు నెమ్మదిగనున్నారు"

రాజపుత్త్రుఁడాతని హస్తమునుదోసిపుచ్చెను. ఆతడు మడమలమీాద నడచుచు నదృశ్యమైపోయెను.

అస్మాన్ ఖాన్ సిగ్గుపడియెను. మెల్లగ నిట్లనియెను.

"నేను కేవలముద్యోగస్థుఁడనే."

"నీవు రాక్షసోద్యోగస్థుఁడవు."

పదియవ ప్రకరణము

మాధురీ విగ్రహమా! తొలగిపొమ్ము

జగత్సింహుని కారాత్రి కంటిపై ఱెప్పపాటు లేదని వేఱుగఁ జెప్పఁబనిలేదు. ఆతని శయ్యపై నపరిమితముగఁ దేళ్ళు, జెఱ్ఱులు పాఁకుచున్నట్లుండెను. పరితాపాగ్నిచే హృదయము దహింపబడుచుండెను. ఏతిలోత్తమ మరణించెనేని నిఁక నీలోకమున తాను మనియుండుట దుస్సహమని

యదివఱకును దలంచెనో యాతిలోత్తమ యింకను జీవించి యుండుటయే జగత్సింహునకు విచారకారణమయ్యెను.

అదియెట్లు? తిలోత్తమ యింకను జీవించియున్నది. అట్టి మృదుకుసుమమును, అట్టి దివ్యమాధుర్యమును, అట్టి స్నిగ్ధప్రకాశమును జగత్సింహుని వీక్షణ మెటుదిరిగిన నట దర్శనమొసంగెడునట్టి సుకుమారగాత్రిమును, అట్టికోమలతను వల్లిని అట్టి తేజోనిధిని, మృత్యుదేవత తన కడుపునఁ బెట్టు కొనఁగలదా? ఈభూమి—ఈవిశాలమహీతలము—ఆకోమల గాత్రచిహ్నముల నైనఁ గలిగియుండదా? ఎంతవిచారకరమైన విషయము ? ఎంతదుస్సహమైన సమయము ! జగత్సింహుని నేత్రములనుండి యందుఁగువృక్షములనుండి పాలుస్రవించు నట్లు బాష్పములు స్రవించుచుండెను. తత్క్షణమె నరకసదృశ మగు కటుల్ఖానుని భోగభవన మాతనిహృదయమున కెట్ట యెదుట గన్పట్టెను. ఆశిరీషపుష్ప మాదుష్టాత్మునిప్రక్క నుండజూచెను. ఆతని హృదయ మగ్నిపర్వతములె మండు చుండెను.

ఏలావణ్యరాశియొక్క రూపమాతని హృదయాంత రాళమున ప్రతిష్ఠితమై ప్రకాశించుచుండెనో యట్టితిలోత్తమ యిప్పుడు పఠానులయంతఃపురవాసిని యయ్యెఁగదా! ఆహా!

రాజపుత్రునకట్టి నట్టిరూపమునం దనురాగముండునా క్షత్రియ కులాలంకారమగు నాపౌరుషశాలి తనహృదయము నుండి యట్టి విగ్రహమును జించిపారవేయుట కిసుమంతయైన సంశయించునా?

ఆవిగ్రహము జగత్సింహుని హృదయ క్షేత్రమున బాగుగా వేళ్ళుపారియున్నది. వేళ్ళతోఁ బెఱికి పాఱవేయ వలయునన్న హృదయముకూడ పెల్లగిలిపోవలయునుగదా! అట్టిమనోహరరూపమును శాశ్వతముగ నెట్లు వెడలఁగొట్టి వేయఁగలఁడు! అది యాతనికి సాధ్యమగునా? కలతఁ జెందిన యాతని హృదయమున జ్ఞాపకశక్తికలిగియున్నంతవఱకు రక్త మాంసములు శరీరము నాశ్రయించియున్నంతవఱ కారూప మాతని హృదయాత్మలపైఁ బ్రభుత్వము నెఱపుచునే యుండును.

ఇఁక మనశ్శాంతినిగూర్చి చెప్పనవసరములేదు. కలత జెందిన యాయాలోచనములవ నాతనికి వివేచనాశక్తి లేకుండబోయెను. జ్ఞాపకశక్తి క్షీణింప నారంభించెను. తెల్ల వారుసమయ మయినది. శిరసును చేతిలోనుంచుకొని కూ ర్చుండియుండెను. బుద్ధియూఁగులాడుచుండెను. ఆలోచనా శక్తియంతయు నశించిపోయెను.

ఆతఁ డట్లే చాలసేపుగూర్చుండియుండుటచే శరీరము నొప్పియెత్తెను. విస్తారమగు మనోవేదనచే నాతనికి జ్వరము వచ్చినట్లుండెను. ఆతఁడు గవాక్షముకడకేగెను.

అతని లలాటమునకు చల్లని మలయానిలము సోకెను. చుట్టును నంధకారము. ఆకసమున సన్నని మేఘమువ్యాపించి యుండెను. నక్షత్రములస్పష్టముగ నుండెను అక్కడక్కడ శాంతప్రకాశనక్షత్రములు వేగముగ సంచరించుచున్నపయో ధరములమాటుననుండి మినుకు మినుకు మనుచుండెను. కొం

చెముదూరమున వృక్షము లొండొంటితోఁ గలిసి యాకస
మున నంధకారబంధురగు భిత్తికవలె నొప్పుచుండెను. వృక్ష
ముల నాశ్రయించి మెఱయుచున్న మిణుఁగురుపురువులు
వజ్రములభాతి ప్రకాశించుచుండెను. ఎదుటనున్న సరోవర
మున గగనముయొక్కయు ధరణీజములయొక్కయు ఛాయ
లస్పష్టముగఁ గన్పట్టుచుండెను.

ఆరాత్రి వారిధరములకనుండి శీతలత్వము, నపహ
రించిన మందమలయానిలుం డాతనిశరీరోష్ణతను గొంతవఱకుఁ
జల్లార్చెను. జగత్సింహుఁడు గవాక్షముకడ శిరస్సుపైఁ జేయి
వైచుకొని నిలువఁబడియుండెను. ఎడతెగని మనోవ్యాకుల
త్వమువలనను నిద్రలేమిచేతను నాతఁడు చాలనలసిపోయెను.
మలయానిలస్పర్శమున నాతఁ డొక్కింత శాంతమునొందెను.
ఆలోచనలను వదలివైచెను. ఉద్దేశము లొక్కింత మార్పు
జెందెను. ఇంతవఱకు నాతనిహృదయము నిశితమగు కటారిచే
గాయపఱుపఁబడుచుండెను. ఇప్పుడది పోయినది. దానికిబదు
లుగ సిరాసయనుకటారినొప్పియె త్తించుచుండెను. కానియీ
బాధ మునుపటికంటె కొంచెము తక్కువయినది. ఆశ విడిచి
పెట్టుటయే బాధగనుండెను నిరాశ యొక్కమాఱు హృదయ
మున స్థిరపడెనేని బాధయంత యధికముగ నుండదు. దెబ్బ
తగిలినప్పుడే బాధయధికము. గాయము చాలకాలముండునది
య్యైనను నంతకష్టముగా నుండనేరదు. ఆతఁడు నిరాశచే
మాత్రమే కొంచెము బాధపడుచుండెను. నక్షత్ర విహీనమై
యంధకారబంధురమైన యాకసమువంక వీక్షించెను. పిదప

బాష్పావృతలోచనుండై నక్షత్రవిహీనమైన యంధకారబంధురమైన తనహృదయాకాశమునుజూచెను. ఆతనికిజ్ఞాపకశక్తి క్రమక్రమముగ మెల్లగ మరల రాదొడఁగెను. ఆతనిబాల్యము, యౌవనమునందలిసంతోషము అన్నియునతనిహృదయమునకు గోచరమయ్యెను. ఆతఁడాలోచనలో మునిఁగి క్రమక్రమముగ నవశుఁడైపోయెను. శరీరము చల్లపడియెను. ఆ యాసముచే నింద్రియజ్ఞానము క్రమక్రమముగ దగ్గిపోయెను. గవాక్షమును బట్టుకొని యాతఁడు నిద్రవోయెను.

నిద్రలో నాతఁడొక స్వప్నముం గనియెను. అదిచాల బాధాకరమైనది. మిక్కిలి కలవరమును గలుగఁజేయునది నిద్రలోనే యతని కధికాగ్రహము కలిగెను. ఆతఁడత్యంత వేదన నొందుచున్నట్లు ముఖముసూచించుచుండెను. పెదవులు కంపించుచుండెను, లలాటమునస్వేద ముదయించెను. పిడికిళ్ళు దృఢముగ ముడుచుకుపోయినవి.

ఆతఁ డులికిపడి లేచెను. తొందరతో నడువ నారంభించెను. ఆతఁడిట్లెంతగా బాధపడుచుండెనో వ్రాయుటకు నాకుఁ జాలగష్టముగ నున్నది.

ఉదయసూర్యకిరణములచే నాగదిగోడలు ప్రకాశించుచున్నవి. తుదకు జగత్సింగు భూమిపైఁబడినిద్రపోవుచుండెను. శయ్యలేదు. తలగడలేదు.

అస్మానుఖానువచ్చి యతనిని లేపెను. వందనమొనర్చి యుత్తరమొకటి రాజపుత్రునకిచ్చెను. ఆతఁ డదియేమియు ననకుండఁగైకొని యస్మానువంక వీక్షించెను. రాజపుత్రుని

హృదయము పరిభ్రమించుచున్న దనియు నిప్పుడేవిషయ మును మాటలాడ నదనుగాదనియుదలంచి యస్మానిట్లనియెను "రాజోత్తమా! నీవిట్లు క్రిందపరుంటివేమని నేనాశ్చర్య బడను ఈయుత్తరమును నీకందఁజేసెదనని వ్రాసినవారితో వాగ్దత్త మొనర్చియుంటిని. ఇఁక దీనిని దాఁపఁబనిలేదు. ఇంతవరకును నేకారణముచే నీకు దీనిని నేనీయలేదో యది యంతయుఁ నీకుఁ దెలిసిపోయినది. అందుచే నీయుత్తరమును నీకడవిడిచి వైచెదను. సావకాశము గలిగినప్పుడు చదువుము. నేను మరల సాయంకాలమువచ్చెదను. ప్రత్యుత్తరము వ్రాయ నిచ్ఛకలదేని వారికది పంపెదను."

ఇట్లుచెప్పుచు నుత్తరము నాతనికిచ్చి యస్మాక్ వెడలి పోయెను. రాజపుత్త్రునిహృదయము మరలయథాస్థితికివచ్చెను ఒంటరిపాటున నాతఁ డాయుత్తరమును మొదటినుండి తుద వఱకుఁ జదివెను. అగ్నిజేసి ఉత్తరము నంటువైచెను. అది మండుచున్నంత సేపును నాతఁడు దానివంకఁ జూచుచుండెను. పూర్ణముగ దహింపఁబడినది. రాజు తనలో నిట్లను కొనెను.

జ్ఞాపకశక్తినిగలిగించు నీయుత్తరమును జ్వాలలకర్పించి కృతార్థుడనైతిని. పరితాపాగ్నిచే జ్ఞాపకశక్తికూడ దహింపఁ బడును. కాని, యది దీనివలె భస్మమైపోదేమి చెప్పుమా?

పిదప నాతఁడు ప్రాతఃకాలోచితకృత్యములనిర్వర్తించి భగవత్ప్రార్థనముఁ జేసెను. వినయపూర్వకముగ వందన మొనర్చి చేతులు జోడించి పైకిదృష్టిసారించి యిట్లనియెను.

"భగవానుఁడా! తండ్రీ! నీ సేవకుని బరిత్యజింపకుము. నేను రసపుత్త్రవీరున కనుగుణముగ వర్తించెదను. నేను నీయను గ్రహమునుమాత్రమే వేఁడుచున్నాఁడను. జాతివిహీనుఁడగు నానీచునియుంపుడుకత్తెను నాహృదయమునుండి త్రోసివైచె దను. ఈప్రయత్నమునఁ బ్రాణమును గోలుపోయితినేని నిన్ను లోకాంతరమున సేవించెదను. మనుష్యుఁడు చేయదగినయంత యుఁ జేసితిని, ఇంకను చేసెదను. ఓసర్వహృదయపరిశీలకా! నా యాత్మాకుహరాంతరాళమును బరిశీలింపుము. ఇంకను దిలో త్తమకొఱకుఁ బరితపించెద నేమో చూడుము. ఇంకను నామె సందర్శనాభిలాష కలదేమో పరికింపుము. స్మృతిమాత్రము నిర్దయాత్మకమైనది. అది యింకను నన్ననవరతము బాధించు చునేయున్నది. నామనోరథమును విసర్జించివైచినాఁడను. ఈజ్ఞప్తి నెప్పటికి రాకుండ దోసివేయఁజాలనా? తండ్రీ! నాపై దయఁజూపుము. లేనిచోఁ గ్రూరతమమగు నాస్మృతి నన్ను పేరు లేకుండఁ గడతేర్చివేయును."

ఆతనిహృదయమునుండి యీయాకారమదృశ్యమయ్యె ను. తిలోత్తమా! పాపము నీవు బాలికవు. నేలపైఁబడియుండి నీవేమి తలపోయుచున్నావు? దేని వెలుఁగును నమ్మికొని నీవీ విపదంధకారమునుండి వెలువడ నత్యాతురముతో నిరీక్షిం చుచుంటివో యానక్షత్రమింక నీకుఁ బ్రకాశ మొసఁగదు. దేని నూతకోలగ నమ్మికొని యీమహాకల్లోలవిపదంబుధినుండి ప్రాణము నుద్ధరించుకొనఁదలచితివో యాఫలక నీచేతినుండి

జారిపోయినది. దేవ నిడి నీమనోరథములనెల్ల నీవిపత్సముద్రమునుండి గట్టెక్కించుకొన దలచితివో యానావ యడుగంటినది.

పదునొకండవ ప్రకరణము

—♦ ♦—

స్థలము మార్చుట

చెప్పినప్రకార మస్మాన్‌ఖాన్ సాయంకాలమువచ్చి యిట్లనియెను.

"రాజకుమారా! ప్రత్యుత్తరములిచ్చెదవా?"

రాజపుత్త్రిక యుత్తరమునువ్రాసియుంచెను. అదియాతనిచేతికిచ్చెను. అస్మాన్‌ఖాను దానినిగైకొనియిట్లుచెప్పెను.

"ఈకోటలో నివసించువారెవ్వరైన మఱియొకరికుత్తరమంపునెడల మొదట నందు వ్రాసినయంశము మాకు సమ్మతముగనుండినగాని పంపుట కంగీకరింపవలనుపడదు. ఇట్లన్నందులకు మన్నింపుము."

జగత్సింహుడు విచారముతో నిట్లనియెను.

"ఆవిషయమును నాతోఁజెప్పనేల? నీవుచదివి యిష్టముండెనేని పంపుము"

అస్మానుత్తరమును విప్పి యిట్లు చదివెను.

"దురదృష్టవంతురాలా! నీవిన్నపమును మఱపుఁజెందను. కాని, నీకు నాథునియందు నిశ్చయముగఁబ్రేమకలదేని

నీపాతనితోఁగూడ బోవలసినది. తన్మూలమున నీపేరునకు సంభవించిన కళంకము నశించిపోఁగలదు.

జగత్సింహుఁడు."

ఉత్తరము చదివినపిమ్మట నతఁడిట్లనియెను.

"రాజోత్తమా! నీవు చాలకౄరుఁడవు"

"పఠానులకంటె నధికకౄరుఁడనుగాను.

అస్మాన్ మొగమెఱ్ఱవడియెను. కొంచెము కఠినభావముతో నిట్లనియెను.

"మొత్తముమీఁద పఠానులు నీవిషయమున నంతనీచముగఁ బ్రవర్తింపకపోయి యుండవచ్చును."

జగత్సింహునకు లజ్జాక్రోధము లినుమడించెను. "నా విషయమై నేను చెప్పలేదు. నీవు నన్నుఁ జాలదయతోఁ జూచుచున్నాఁవు. అది నిశ్చయము. నీవునన్ను చెఱపట్టినను నాప్రాణములను గాపాడితివి. నీసైనికులను నాశనముసేయుచుండిన నన్నీకఠినవ్యాధినుండి యారోగ్యమునొసంగి కాపాడితివి. సంకెలతోఁ గారాగృహమున నుండుటకు బదులుగ, నలంకరింపబడిన దివ్యభవనమునం దుండుటయు నీయనుగ్రహవశముననే. పాపము! ఇంతకంటె నీవేమిచేయఁగలవు? కాని, నేజెప్పునదేమియన—నన్ను నీకు ఋణస్థునిగ నొనర్చితివి. సౌఖ్యమొసంగుచుంటివి. కాని, ఈసౌఖ్యముయొక్క యుద్దేశమేదియో నాకు తెలియకున్నది. నేను ఖైదీనైనచోఁ జెరసాలకంపుము. కృపయనెడి యీావలనుండి నన్ను విడిపిం

పుము. ఖైదీగానిచో నీబంగారు పంజరమున నన్నుంచిన లాభ మేమి?''

''చెడుగున కంతతొందరపడెద వేల? చెడుగునురమ్మని యాశ్రయింపనక్కరలేదు. దానంతట నదియే వచ్చును''

''రాజపుత్త్రిలు సుకుమార పుష్పశయ్యనుండి తరలి జాతినేలఁబరుండుట దురదృష్టముగా భావింపరు?''

''దురదృష్ట మొక్క జాతిశయ్యకంటె నధిక బాధాకరము గానేర దేని దానినిగూర్చి యంతగా విచారింపఁబని లేదు''

రాజపుత్త్రిఁ డాస్మానునివంకఁ దీవ్రముగఁజూచెను.

''కటుల్ఖానుని నేను శిక్షింప లేకపోయినప్పుడు నాకు తలవరియొక్క ఖడ్గమయినను నంత బాధాకరము కాదు''

''జాగ్రత్త! జాగ్రత్త! పఠానులు వదరుబోతులుకారు''

జగత్సింహుఁడు తిరస్కార పూర్వకముగ నవ్వుచు ''సేనాధిపతీ! నీవు నన్ను బెదరించెదవా? అందెన్నటికిని నీకు జయ మొనఁగూడదు''అనియెను.

''మనమిరువురము నొకరినొకర మెఱుఁగుదుము. ఇఁక వాగ్వ్యయముతోఁ బనియేమి? నేను నీతో నొకపనియుండి వచ్చితిని''

రాజపుత్త్రిఁ డాశ్చర్యపడి

''ఏమిపని చెప్పుము'' అనియెను.

''నేను కటుల్ఖానుని యాజ్ఞానుసరణి మాటలాడు చున్నాఁడను. సహింపుము.''

"మంచిది"

"పఠానులును రాజపుత్త్రులును బోరాడుచుండుట యిరువురకును హానికరమే"

"పఠానులను వేళ్ళతోఁగూడ జెఱికి పాఱవేయవల యునని మాయాశయము"

"నిజమే కాని, మమ్ములను నాశనము చేయునప్పటికి మీరుగూడ నాశనము కావలసియుండునుగదా! ఆలోచింపుము. గరమందరమును జయించినవారు కేవలము బలహీనులేకదా! అది నీ వెఱుంగుదువు"

జగత్సింహుని పెదవులపైఁ గొంచెము హాసముద యింప "వారి నైపుణ్యమును నేనంగీకరింతును" అనియెను.

"నాయభిప్రాయమాత్మశ్లాఘనముకాదు. పఠానులు చక్రవర్తిపైఁ గత్తిపట్టిపోరాడుచు నోరిస్సాలో నివసించుట దుర్ఘటమే. కాని, చక్రవర్తిమాత్రము వారల నెన్నఁడును లోఁబరచుకొనఁజాలఁడు. జాతీయాభిమానముతో మమ్ము నిందింపకుము. రాజకీయ విషయముల నీవును పరివీణుఁడవు. ఢిల్లీకిని నోరిస్సాకును నెంతదూరముండెనో యోచింపుము. మానసింహుని మూలముగ పఠానుల నాతనికి వశ్యులుగఁ జేసికొనుట చక్రవర్తికి సులభమే యనుకొమ్ము. కాని యోరిస్సాలో వారి ధ్వజమెంతకాలము నిలువఁగలదు? ఆతఁడు వెనుకకు మరలినతోడనే యోరిస్సాలోని చక్రవర్తి స్వాస్థ్యములన్నియు పఠానులు మగల స్వాధీనము చేసికొనఁగలరు. అక్బరింతకుపూర్వమీ దేశమును జయింపలేదా? పఠానులెంత

కాలము కప్పమును జెల్లించిరి? మరల నిప్పుడాతఁడొరిస్సాను జయించెనేని ఫలితముకూడ మరల నట్లేయుండును. ఇఁక నొకపర్యాయమాతఁడు సైన్యముల నంపవచ్చును. రాష్ట్రమును జయింపవచ్చును. కాని పఠానులు యథాప్రకారము మరల స్వతంత్రులు కాగలరు. పఠానులు వంగదేశీయులు కారు. అదిమాత్రముజ్ఞప్తియందుంచుకొనుము. వారెప్పుడును నెవ్వరికిని మోకరించువారుకారు. తుదకొక్కపఠానుని దేహమున నూపిరియున్నను నొరిస్సా చక్రవర్తి స్వాధీనముకాదు. కాదు నిశ్చయము. అట్టియెడ పఠానులయొక్కయు, రాజపుత్రులయొక్కయు, రక్తముతో నీభూమిని తడుపుటవలన నగులాభమేమి?"

"అయిన నీయభిప్రాయమేమి?"

"నాయుద్దేశ మేమియులేదు. కాని యుద్ధమును విడిచి సంధిచేసికొనవలయునని మాప్రభువుగారి యుద్దేశము"

"ఏవిధమయినసంధి?"

ఆవిషయమున మన మిరువురము నాలోచింతము వంగదేశములో కటుల్ఖానుని యాధీనమందున్న ప్రదేశములను విడిచిపెట్ట సిద్ధముగానున్నాఁడు. అక్బరును, ఒరిస్సాపైఁగల యధికారములను విడుచునట్లుచేయుము. ఒరిస్సానుండి యాతనిసైన్యములఁ దీసికొనిపోవలయు, రణసంబంధమేమియు గలుగకుండఁ జేయవలయు. ఈయొడంబడికవలన నాతనికి రవంతయైన నష్టములేదు. పఠానులకే నిశ్చయముగ కొంత నష్టముకలదు. మాప్రయత్నములవలన సంపాదించిన రాష్ట్ర

మును మేము వీడిపోవుచున్నాము. చక్రవర్తికట్టిదేమియు లేదు. ఏది యతనికాదో యట్టియొరిస్సానుండి మాత్రమే వెడలిపోవుచున్నాఁడు."

"ఇదిబాగుగనేయున్నది. కాని, ఈవిషయమునాతో నేల ప్రసంగించెదవు? రణముచేసినను, సంధిచేసినను మహారాజు మానసింహుఁడు చేయవలయును. కావున నాయన కడకు రాయబారిని పంపుఁడు."

"మే మట్లొనర్చితిమి, కాని, మా దురదృష్టవశమున నెవఁడో మేము మీప్రాణములఁ గైకొంటిమని యాతనికిఁ దెలియఁబఱచినాఁడు. అందుచే నాతఁడు విచారాగ్రహములతోనుండి సంధియొనర్చుటకు సమ్మతింపలేదు. మారాయబారి యెంతనమ్మించినను నాతఁడు నమ్మలేదు. నీవు సమక్షమున నీపద్ధతుల నాతనికిఁ దెలిపితివేని తప్పకయంగీకరించును'

రాజపుత్త్రుఁ డస్మాన్ ముగముపై దృష్టి నిలిపి యిట్లనియె.

"నిష్కపటముగమాటలాడుము. నాహస్తలిఖితమును మహారాజు నమ్మవచ్చును. ఉత్తరము వ్రాసిన జాలదా? నన్నే వెళ్ళుమనెద వెందులకు?"

"విషయ మిది. మహారాజు మాబలమును బాగుగ నెఱుఁగఁడు. అందునుగూర్చి మీరాయనకు నచ్చజెప్పుటకుఁ దగినవారఁట. మీరుమధ్యవర్తిగానుండిరేని కార్యముచక్కఁబడునని మాయాశ. ఉత్తర మంతపనిచేయఁజాలదు. ఇంతేగాక మిమ్ములను విడిచిపెట్టుటయే సంధికి మొదటికారణము.

అందుచే నీసంధికి మీరు యత్నముచేయవలయునని నవాబు గారి యుద్దేశము."

"మాతండ్రిగారి కడ కేగుటకు నాకభ్యంతరములేదు."

"అందులకు నేను చాలసంతసించితిని. కానినాదొక్క మనవియున్నది. మేమనినట్లు సంధి కుదరదేని మీరుమరల మాకోటలోనికి వచ్చెదమని వాగ్దత్త మొనర్పవలయు."

"వాగ్దత్త మొనర్చినంతమాత్రమున నేను మరలవచ్చెదనని మీకు నమ్మకమెట్లు?"

"మాకు నమ్మకమున్నది (చిరునగవుతో) రాజపుత్త్రులసత్యమాడరను విషయ మందఱెఱింగినదయే"

"మంచిది. నాతండ్రినిజూచినవెంటనే నేనొక్కఁడను మరల గోటలోనికి వచ్చెదను."

"ఇంక నొకవాగ్దత్త మొనర్పవలయు. దానితో మాకుఁ గావలసినవన్నియుఁ బరిపూర్తియగును. మహారాజును చూడనేగినప్పుడు మేము చెప్పినపద్ధతులను నీవాయనతో విన్నవింపవలయు."

"అస్మాక! ఈవాగ్దత్తమునుమాత్రము నేనొనర్పఁజాలను. పఠానులను జయించుటకే చక్రవర్తినన్ను నియమించినాఁడు. వారితో రణమొనర్చి వారిని వశ్యులను గావించుటయే నాపని. ఆతఁడు సంధికార్యములఁ జక్కఁబెట్టనన్ను నియమింపలేదు. అందుచే మేమెప్పుడును నట్టికార్యములను చేయఁబోము. అట్టివిషయములను ప్రస్తావింపను."

అస్మాన్ ముఖమున వసంతృప్తియు విచారమునుగన్ప

ట్టెను.

"రాజపుత్త్రిలకుఁ దగిన ప్రత్యుత్తరమిచ్చితివి. కాని, యీకార్యము చక్కబెట్టకున్న నీకు స్వేచ్ఛలేదని తలంచు కొనుము."

"చక్రవర్తికిని నాస్వేచ్ఛకునుసంబంధమేమి? నావంటి రాజపుత్త్రిలాతనికిఁ జాలమందికలరు."

అస్మాన్ విచారకరమైన యాత్రిముఁతో నిట్లనియెను.

"నాయాలోచనను గ్రహింపుము. నీ ప్రస్తుతోద్దేశ మును బరిత్యజింపుము."

"ఏల?"

"నీవీకార్యమును నిర్వహింతువను నమ్మకముఁతో నవాబు నీయందిట్టిదయావాత్సల్యములఁ జూపియున్నాఁడు. నీవాతని యభిప్రాయమునకు వ్యతిరేకముగఁ బ్రవర్తించితివేని నాతఁడు నీయెడఁ జాలక్రౌర్యము వహించును."

"మరల బెదరించుచుంటివా? ఇంత కొక్క నిమిషము నకుఁ బూర్వము నన్నుఁ గారాగృహమున కంపుమని నిన్న డిగియుండలేదా?"

"పడుచువాఁడవు. నీకేమియుఁ దెలియదు. నవాబు నీయెడఁ దృప్తుఁడయ్యెనేని నదినీకు చాల నదృష్టము."

"రాజపుత్త్రిడు ముఖము చిట్లించుకొనియెను.

"ఆతని యనుగ్రహము లేకపోయిన నాకేమికొదువ?

వీరేంద్రసింహుని రక్తప్రవాహము నభివృద్ధినొందించెను. ఇంతయేనా?''

జగత్సింహుని నేత్రము లగ్నిగురియుచుండెను.

“అయినఁ నేబోయెదను. నావిధిని నేనునిర్వర్తించితిని. కటుల్ఖానుని యుద్దేశము నొకదూతమూలమున నీవు వినఁగలవు'' అని యస్మాన్ఖాననెను.

కొంతసేపటికొకమనుష్యుఁడు వచ్చెను. అతఁడొక సైనికుఁడు. ఉద్యోగమున పదాతికంటె కొంచె మధికుఁడు. ఆతనితోఁగూడ నలుగురుపదాతులున్నాఁరు.

“నీవు తెచ్చిన వర్తమానమేమి?'' అని రాజకుమారుఁడడిగెను.

“నీ నివాసస్థలమును మార్చుకొనవలయు''

“సిద్ధముగ నున్నాఁడను'' అనిచెప్పుచు నాతనితోఁగూడఁబోయెను.

పండ్రెండవ ప్రకరణము

—::—

విచిత్రాలంకారము

కటుల్ఖానుని జన్మదినమహోత్సవ మతివైభవముతో జరుగుచుండెను. నృత్యము, మధుపానము, హాస్యము, ఆట పాట, దానము ధర్మములతో దినమంతయు వేడుకగా నుండెను. రాత్రి యింతకంటె నుల్లాసముగ నుండెను. ఇప్పుడే

సూర్యాస్తమయమయినది. కోటయంతయు దీపములతోఁ ప్రకాశించుచుండెను సందులు—గొందులు, కోటయంతయు మనుష్యసంకులము, ఉద్యోగులు, సైనికులు, రాజసేవకులు, సేవకులు, యాచకులు, తాగుబోతులు, నటులు, వేషగాండ్రు వేషకర్త్రులు, వేశ్యాంగనలు, సంగీతపాటకులు, గారడివాండ్రు ఫలవిక్రయులు, పరిమళద్రవ్యవిక్రయులు, తాంబూలవిక్రయులు నానావిధభక్ష్యవిక్రయులు, విచిత్రవస్తువిక్రయులు, మొదలగు వారలతో దుర్గమంతయు నిండియుండెను. నీవెక్కడకేగిన నక్కడనే, సంగీతము, నృత్యము, పరిమళోదకము, తాంబూలము పుష్పములు, గారడీ, వ్యభిచారమును గాంచగలవు. ఈ వేడుక లభ్యంతరభాగమునఁగూడ కొంతవఱకు జరుగుచుండెను. నవాబంతఃపురమందిరము లింతకంటె ప్రకాశముగను నింతకంటె నుల్లాసముగను, నింతకంటె శాంతముగను నుండెను. ప్రతిమందిరమును స్వచ్ఛస్ఫటిక వినిర్మిత దీపయంత్ర ప్రకాశితమైయుండెను. పూలకుండ్లు, స్తంభములు, శయ్యలు, కుర్చీలు, మెత్తలు, మనుష్యులు నన్నియు పరిమళమిళితకుసుమ సంభరితములై యుండెను. మందమలయానిలుండు గొజ్జంగి పూలపరిమళమును మోసికొనుచు నంతటఁ గలయఁదిరుగుచుండెను. బంగారు సరిగ వైచినపట్టు, నలుపు, పసుపు, ఊదా ఎఱుపు వర్ణముల చీనిచీనాంబరములం దాల్చి పరిచారికాసమూహ మటునిటు దిరుగుచుండెను. వారి సువర్ణాలంకారములు దీపప్రకాశమున మెఱయుచున్నవి. పరిచారికలు కొందఱు వారియజమానురాండ్ర నలంకరించు పనియం

దుండిరి. విలాస భవనమున నీరాత్రి నవాబు ప్రీతియువతి తోడను విలాసముగాఁ గాలముగడుపును. ప్రీతియువిదయు నీనాఁడు వారివారి మనోరథములఁ బొందగలరు. ఒకయువిద తనసహోదరున కుద్యోగ మిప్పింపవలయునను నభిప్రాయముతో శిరోజములను జక్కఁగదువ్వుకొనుచుండెను. ఇంకొకతె తన కెక్కువ పరిచారికలు కావయునని యడుగుటకై సుందర కుటిలకుంతలముల వక్షస్థలమునఁ జక్కఁగ వ్రేలాడ వైచుకొనుచుండెను. వేఱొకర్తు కొ్రత్తగఁ గలిగినతనయున కరణముమూాలమునఁ గొంతయాస్తిని సంపాదింపవలయునను తలంపుతో నామె మెడయును గపోలములును నెఱ్ఱగ బ్రకాశించుటకై రక్తమువచ్చునంతదనుక రాచుకొనుచుండెను. మఱియొకర్తు, ఈనడుమ నవాబు తనకిష్టురాలగు నింకొకతెకాభూషరాజి నిచ్చెనని యసూయనుపొంది కన్నుపొడుగున నడుగుటెప్పలకు కజ్జలముంచుకొనుచుండెను. ఒకపరిచారిక, యామె యజమానురాలికి వస్త్రమును గట్టుచు పరాకున నామెదుస్తులను ద్రొక్కెను. ఆమె యజమానురాలామె దౌడపై నొక్క హస్తప్రహార మొసంగెను. ఒకస్త్రీ శిరోజములు వృద్ధురాలగుటచే పాపము కొంచెము పలుచనగనుండెను. పరిచారిక దువ్వుటలో నవికొంతభాగ మూాడివచ్చెను. అదిచూచి యా వృద్ధస్త్రీ కపోలములపై బాష్పములు ప్రవహింప నేడ్వనారంభించెను.

ఆరామమందలి స్థలపద్మమువలె, పక్షులలో మయూరముభాతి నొకయువతీమణి యలంకరణము సమాప్తినొందించి

యటునిటుఁ దిరుగుచుండెను. ఆరాత్రియెవ్వారైనను, నెక్కడకైనను, నభ్యంతరములేకుండ సంచరింపవచ్చును. ప్రకృతి తనమాధుర్యము నంతనుఁజేర్చి యీయువిదను నిర్మించియుండెను. కటుల్ ఖానాయె పత్యవయవమునకుఁ దగిన భూషణముల నన్నింటి నిచ్చెను. ఆమె మొగమున నందమునకుఁగాని, యలంకారములకుఁగాని, యీమె గర్వమొందుచున్నట్లు లక్షణములేవియు గాన్పించుట లేదు. ఆమెయుల్లాసముగ లేదు. వికాశముగ లేదు. ఆమెముఖము గంభీరమై శాంతముగనుండెను. ఆమె హృదయమున నగ్ని మండుచున్నట్లు నేత్రములు సూచించుచుండెను.

ఆమె విమల. అక్కడనక్కడఁ దిరిగి తుదకొక సుందర భవనములోని కేగి లోపల తలుపు బిగించెను. ఈయుత్సవ సమయమున నట నొక్కటియే దీపమున్నది. అది చుట్టును గాంతుల నిచ్చుచుండెను. ఆవలిప్రక్క శయ్యపై నఖశిఖ పర్యంతమును దుప్పటమును ముసుగు పెట్టుకొని యెవ్వరో పరుండియుండిరి. విమల యాసమీపమున కేగి "నేనువచ్చితి" ననియెను.

శయ్యనుండి యులికిపడి లేచి ముఖమ్ముపైనున్న ముసుంగును దీసివైచి యామెను జూచెను. విమల యనిగూర్తించెను. దుప్పటమునుదీసివైచి కూర్చుండెను. కాని యేమియు మాటాడ లేదు.

"తిలోత్తమా! నేను వచ్చితిని" అని విమల మరల ననెను.

తిలోత్తమ మాటాడలేదు. విమలవంక తీవ్రముగఁ జూచుచుండెను.

ఆమె పూర్వమువలె సంతలజ్జావిహీతయైయుండలేదు. వెలవెలపోవుచున్న యావెలుతుకున నప్పుడామెను జూచితివా నిజముగ నున్నవయసుకంటె పదేండ్లు పెద్దయని యనుకొందువు. శరీరము కృశించి సన్నముగ నుండెను. ముఖము వైవర్ణ్యమును పొందెను. ఆమె, మలినమైన చిన్న వస్త్రమును దాల్చియుండెను. ఆమెకడ నొక్కనగయైన లేదు. పూర్వము ధరించెడి యలంకారముల గుర్తులు మాత్ర ముండెను.

"నేను నీతో ననినప్రికారము వచ్చితిని. మాటాడ వేమి?"

"చెప్పవలసినదేదియో చెప్పితిని. ఇఁక నేమి చెప్ప వలయు?"

తిలోత్తమ కంఠధ్వనినిబట్టి యామె యేడ్చుచున్నదని విమల గ్రహించెను. తనహస్తము నామె శిరస్సుపైనుంచి ముఖమును పైకెత్తెను. వదనమంతయుఁ గన్నీళ్ళలో మునిఁగి యుండెను. ఆ బాష్పోదకములచే వస్త్రమంతయుఁ దడిసిపోయి నది. విమల యామె శిరసునుంచి పండుకొనియున్న తలగడ నంటిచూచెను. అదియును దడిసిపోయెను.

నీశరీర మీయెడ తెగని యుమ్మలికము నెంతకాల మోర్వగలదు.

"ఓర్వకున్న నేమి?" ఇంతకాలము సహించియున్నం దులకే నేను విచారించుచున్నదానను"

విమల మాటలాడకుండ నేడ్వ నారంభించెను. కొంత సేపటికి నిట్టూర్పు విడిచి యిట్లనియెను.

"ఈరాత్రి చేయవలసినదేమి?"

తిలోత్తమ విమల యలంకారములవంక నయిష్టముతో వీక్షించుచు నిట్లనియెను.

"అట్లాలోచించినందువలనఁ బ్రయోజనమేమి?"

"బిడ్డా! నన్నుఁ దృణీకరించకుము. కట్లుఖానుని నీవు బాగుగ నెఱుంగవు. సావకాశములేక కొంతయును, మనవిచారము పోవుటకై కొంతయు నింతకాలమ్ము మనలను వదలివైచినాఁడు. ఈవిషయ మింతకుబూర్వము నీతోఁజెప్పి యుంటిని. ఈదినముతో స్వేచ్ఛపరిసమాప్తియగును. నాట్య శాలకేగనిచో మనకేమి సంభవించునో యని తలంచుచున్న దానను."

"మనకింతకన్న వేఱేమి యుపద్రవము సంభవింపఁ గలదు."

"తిలోత్తమా! ఇంతలోనే యింతనిరాశఁ జెందెద వేల? ఇంకను మనకంతమున జీవములున్నవి. మనము నిర్దో షులము. ఎంతకాలము మనదేహమునఁ బ్రాణములుండునో యంతకాలము మన నిర్దోషత్వమును గాపాడుకొనవలయు"

"అమ్మా! అయిన నీయలంకారముల నన్నిటిఁ దీసి వేయుము. అవి నాకన్నులకు విషప్రాయములుగ నున్నవి"

"విమల చిరునగవుతో బిడ్డా! నాయలంకారములను బూర్ణముగ జూడకుండ నాగ్రహ మొందెదవేమి?" అని చెప్పుచు నామె దట్టినుండి చిన్నకటారినిదీసి చూపెను. అది యామెదుస్తులలో దాచియుంచెను. అది కన్నులు మిఱుమిట్లు గొలుపుచుండెను. తిలోత్తమ యులికిపడెను. చూడలేక పోయెను.

"దీని నెక్కడనుండి సంపాదించితివి?" అని తిలోత్తమ యడిగెను.

"అభ్యంతరభవనమునకు నిన్నవచ్చిన క్రొత్తపరిచారికను నీవు చూడలేదా?"

"అవును చూచితిని. ఆమె యాషామ్నీ"

"అభిరామస్వామికడనుండి యామెచేఁ దెప్పించితిని"

తిలోత్తమ యాశ్చర్యపడియెను. ఆమెకు గుండెలు కొట్టుకొనసాగెను. కొంచెముసేపుండి యామె యిట్లనియెను.

"ఈరాత్రి నీవేషమును మార్పవా?"

"మార్పను. నీవు నృత్యమునకుగాని, సంగీతమునకుఁ గాని రావా?"

"నేను రాను"

"అయినను నినొక్కతెను విడిచిపోలేను"

తిలోత్తమ యేడ్వనారంభించెను.

"ఏడవకుము. వినుము. నీవిటనుండి దాఁటిపోవుటకు నేనొక యుపాయము నారసితిని"

తిలోత్తమ యాతృముతో విమలవంకఁ జూచెను.

విమల యస్మాన్సుఖా నిచ్చిన యుంగరము నామెకిచ్చి యిట్లనియెను.

"దీనిని నీయొద్దనుంచుము. ఆవినోదముల వంకఁబోకుము. అది యర్ధరాత్రిమగువరకును బరిసమాప్తము నొందదు. అంతవఱకును నేను పఠానునకు పనిగలుగఁ జేసెదను. నేను నీసవతితల్లినని యాతఁడెఱుంగును; సంగీతనృత్యములు పూర్తియగుదనుక నేనుండగా నీవు రావని మిషఁజెప్పి యాతనికి నిన్నుఁ జూడవలయుననుకోరిక కలుగకుండఁ జేసెదను. అర్ధరాత్రిమయినతోడనే నీవభ్యంతర ద్వారముకడకేగుము. అక్కడ నొకమనుష్యుఁడుండును. ఆతఁడిట్టియుంగరము నొకదానిని నీకుఁజూపును. ఏమియు సంశయింపకుండ నాతనితో నీవేగుము. నీవెక్కడకుఁ బోవలెనన్న నక్కడకాతఁడు నిన్నుఁగొంపోవును. అభిరామస్వామి కుటీరమునకుఁ దీసికొనిపొమ్మని చెప్పుము."

అధికాశ్చర్యముచేతనోఁ అధికానందముచేతనో తిలోత్తమ కొంతసేపటివఱకు మాటలాడలేకపోయెను.

"ఇదియేమి? నీకీయుంగర మెవరిచ్చిరి?" అని చాలసేపటికనెను.

"అది చెప్పుటకుఁ జాలకథయున్నది. సావకాశముగఁ జెప్పెదను. నేఁజెప్పినట్లు చేయుటకు నీవేమియు సంశయింపకుము."

"మఱినీవో? ఎట్లావలఁ బడెదవు?"

"ఆవిషయమున నీవు విచారమొందకుము. ఏదేని నుపాయముచే నేను విడివడియెదను. రేపటియుదయమున నిన్నుఁ గలిసికొనియెదను."

విమల తిలోత్తమ నీవిధముగ నూఱార్చెను. కాని, తిలోత్తమను గాపాడుటకయి విమల తానువిడివడుమార్గమును వదలివైచెనని తిలోత్తమ గ్రహింపలేకపోయెను.

చాలదినములనుండి తిలోత్తమముఖమున సంతోషమే లేదు. ఈసంతోషవార్త విని యామె పరమానందము నొందెను.

"ఇఁక నేఁబోయెదను" అని విమల యనెను.

తిలోత్తమ బాష్పావృతలోచనయై గద్గదస్వరమున "ఈకోటలోనీ వెఱుంగని ప్రదేశములును నీవెఱుంగని విషయములును లేవు. మనస్నేహితులు పరిచయులు నెక్కడెక్కడ నెట్లున్నారో చెప్పెదవా?"

ఇట్టిమహాపత్సమయమునఁ గూడ నామె హృదయము నకు జగత్సింగు జ్ఞప్తియందుండె నని విమల గ్రహించెను. జగత్సింహుని నిర్దయాత్మకమగు నుత్తర మామెకు చేరినది. అందుఁ దిలోత్తమ పేరైన నుదహరించియుండలేదు. విచారముచేఁ బాతాళమున కణఁగఁదొక్కఁబడియున్న తిలోత్తమహృదయమున కీవిషయము మఱెంత విచారజనకమని యామె చెప్పక యూరకుండి యిట్లనియెను.

"జగత్సింహుఁడీకోటలో నారోగ్యముగనున్నవాఁడు."

తిలోత్తమ మాటలాడకూరకుండెను. విమల యామెను ముద్దుపెట్టుకొని వెడలిపోయెను.

పదుమూఁడవ ప్రకరణము

అంగుళీయ ప్రదర్శనము

విమల వెడలిపోయినపిదప తిలోత్తమ యొక్కతెయు నామె గదిలో గూర్చుండియుండెను. ఆమె హృదయమువిచారోల్లాసభరితమైయున్నది. దుష్టపిశాచము చేతినుండి విడివడుట కిప్పటికి మార్గమేర్పడినదను నాలోచనలు మరల మనసు నాకర్షించినవి. మొట్టమొదటఁ దన్ను ప్రాణాధికముగఁ జూచుకొనుచుండుననియు నామె యనుగ్రహముననే తాను విడివడుచున్నాననియు తలంచెను. ఈయాలోచనలే యామెకుఁ దఱచుగ వచ్చుచుండెను. ఆమెమనస్సున నుల్లాసమొదవెను. నేనావలకేగినప్పుడెటకు బోవుదును? అయ్యో! నాతండ్రిదుర్గమెచ్చటనున్నది? అనియామె విచారింపసాగెను, తత్క్షణమ యామెకుబాష్పములుదయించి కపోలములవెంటఁ బ్రవహింప నారంభించెను. ఒకటి యడంగిన నామెకు మనోవేదనకారణమగు నింకొకయోచన జనియింపఁ దొడంగెను. రాజపుత్త్రుఁడు క్షేమముగ నుండెను. ఎటనున్నాఁడో? ఎట్లున్నాఁడో? అతఁడు కూడ ఖైదీయేనా? ఈయాలోచన మరలనామెకు బాష్పములుదయింపఁజేసెను. అయ్యో! దురదృష్టమా! నానిమిత్తమె

కదా యాతఁడు కారాగృహవాసి గావలసివచ్చె. నాప్రాణములనాతని పాదములకడ విడిచి యాతనిఋణము దీర్చుకొనునంతటి భాగ్యము నాకలవడునా? హా! దైవమా! నేనాతని కేమియొనర్పఁగలను? ఆతఁడు కారాగృహమునను డెనా? కారాగృహమున నెట్లుండునో? ఎవరును నటకుబోరాదా? చెఱయం దొంటరిగఁ గూర్చుండి యేమితలపోయుచున్నాఁడో! తిలోత్తమయను నబలయుండె నని యాతనికిప్పుడు జ్ఞప్తియుండునా? అయ్యో! ఉండ కేమి? ఆతని ప్రస్తుతదురవస్థకుఁ గారణమును నేనేకదా! ఆతఁడు నన్నెంతసదూగుచుండెనో కదా! అదెట్లు? నేనట్లేల తలంపవలయు? ఆతనికొకరిని నిందించుట తెలియునా? ఎవరిని నిందింపలేఁడు. నిందింపలేడు. కాని, యాతఁడు నన్ను మరచిపోయి యుండునేమో యని భయమగుచున్నది. లేదా. యవనాంతఃపురవాసినని యాతని హృదయమునుండి నన్నావలకుఁ ద్రోసివైచియుండును. కాదు. కాదు. ఆతఁడట్లుమాత్రి మేలచేయును? ఆతనివలె నేను దుర్గమున కై దిగఁ బట్టువడితినికదా! నన్నేల తృణీకరించును? ఆతఁడట్లేయెంచి తృణీకరించిన నేనాతని పాదములపైఁబడి యిదియంతయు విన్నవించుకొనియెదను. ఆతఁడు తృప్తిపొందఁడా? నిజమని నమ్మఁడా? బహుశా విశ్వసించును. విశ్వసింపఁడేని యాతనికడనే ప్రాణపరిత్యాగ మొనర్చెదగాక! పూర్వపునారీమణు లగ్నిలోఁబడి ప్రమాణములుచేయలేదా? ఈకలియుగమున నట్టిప్రమాణములు లేవా? పోనిమ్ము. ఆతని యెదురనగ్నిబడిననేమి? అయ్యో! ఆతని నెప్పుడు

చూడఁగందును? ఆతఁడు చెఱనుండి విడివడుటయెట్లు? నేను విడివడినఁ బ్రయోజనమేమి? మాయమ్మ యీయుంగర మెటనుండి తెచ్చినదో? ఇది యాతనిని విడిపించుట కుపయోగింపనా? ఈయంగుళీయక మాతనికంపిన నేమి? నన్ను దీసి కొనిపోవుట కచట ఎవ్వరుందురు ? ఆతనిమూలముగ నే నేయుపాయములనైనఁ గనిపెట్టఁజాలనా? అయినను నేనీవిషయమునుగూర్చి యాతని నేమని యడుగుదును ? ఆ రాజచంద్రు నింకొక్కసారి చూడ నాకుఁ బ్రాప్తములేదా? ఆతనితో సంభాషించుటకు నే నేమని యవసరమిమ్మని యెట్లడుగుదును? ఆతని యెదుట నాతనిగూర్చి నా పెదవులువిప్పి యెట్లుమాటలాడుదును? ఏమి మాటలాడి యీనిర్భాగ్య హృదయముయొక్క పరితాపమును జల్లార్చెదను ?

ఆమెయింకను నాలోచించుచునేయుండెను. ఇంతలో నొక పరిచారిక వచ్చెను. తిలోత్తమ యామె నిట్లడిగెను.

"ఇప్పుడెన్ని గంటలయినది?"

"పండ్రెండుకొట్టినారు"

పరిచారిక యావలకుఁబోవువరకును తిలోత్తమ వేచియుండెను. ఆమెదృష్టిపథమునుండి దాటినపిదప తిలోత్తమ యుంగరమును గైకొని గదినుండి బయలువెడలెను. ఆమెకు భయమధికమయ్యెను. పాదములు వడఁకుచుండెను. హృదయము కొట్టుకొనుచుండెను. ముఖము వెలవెలబారెను. ఏమి రానున్నదో? ఒక్కయడుగు వైచెను. మరల వెనుకకరిగెను. క్రమక్రమముగ ధైర్యమును దెచ్చుకొని తుద కభ్యంతర

మందిర ద్వారముకడ కరుదెంచెను. కోటయందున్నవారును, కొజ్జాలును, నీగ్రోసేవకులును, నందరుల్లాసములో మునిఁగి యుండిరి. ఎవరు నామెను జూడలేదు. ఎవరైన నొకరిద్దఱు చూచినను వారామెనుగూర్చి యాలోచింపనేలేదు. తిలోత్తమమాత్రి మందఱును దన్ను గుర్తించిరనియే యనుకొనియెను. ఎట్లయిననేమి ధైర్యమును దెచ్చుకొని ద్వారముకడకేగెను. ద్వారపాలకులు మధుపాన మత్తులై నిద్రించుచునో మెలకువగనున్నను స్మృతిలేకయో, అర్ధస్మృతితోడనో, యుండిరి. ఎవరు నామె నానవాలుపట్టలేదు. ద్వారముకడ నొక్కమనుష్యుఁడు మాత్రముండెను. ఆతఁడుకూడ ద్వార రక్షకుని వేషముతో నున్నవాఁడు. తిలోత్తమనుజూచి "నీకడ నుంగరమున్నదా? అమ్మా!" అని ప్రశ్నించెను. తడఁబాటుతో విమల యిచ్చినయుంగర మాతనికిచ్చెను. ఆతఁడదిజాగ్రత్తగఁ బరీక్షించి తనవ్రేలినున్నయుంగర మామెకుఁ జూపెను. ఇట్లనియెను.

"అమ్మా! భయములేదు. నాతోరమ్ము",

తిలోత్తమ తొందరగా నాతనితోఁ జనియెను. అభ్యంతరమందిర ద్వారపాలకులవలెనే ప్రమత్తులై యితరద్వార రక్షకులు నుండిరి. ఆరాత్రి ద్వారములన్నియుఁ దీసియున్నవి. ఎవరును వారినేమియు ననలేదు. ఎన్నియో ద్వారములు, ఎన్నియోభవనములు, ఎన్నియోప్రదేశములు దాఁటి వారు తుదకు కోటయొక్క ప్రధాన ద్వారముకడ కరుదెంచిరి.

"అమ్మా! నీవెటకేగెదవు?"

విమల చెప్పిన మాట యామె హృదయమున లేదు. మొదట జగత్సింహునిఁ దలంచెను. నన్ను రాజపుత్రి నొద్దకు, గొనిపొమ్మని చెప్పనుత్సహించెను. కాని యామె పూర్వవైరియగు లజ్జయామెను నిర్బంధించెను. కంఠముకడ నాఁగిపోయెను. ఆతఁడు మరల నిట్లడిగెను.

"నేను నిన్నెక్కడకుఁ గొనిపోవుదును?"

ఆమె యేమియుఁ జెప్పలేకపోయెను. వివశురాలై యుండెను. హృదయము కొట్టుకొనుచుండెను. ఎందులకో యామెయెఱుంగదు. నేత్రములదృష్టితప్పెను. చెవులు వినఁబడుటలేదు. పెదవులనుండి యేదియో యివ్వాలకువచ్చెను. అది యామెయెఱుంగదు. అది చాల దుర్బలస్వరము. "జగత్సింహుఁడు" అని యన్నట్లాతనికి వినఁబడియెను.

జగత్సింహుఁ డిప్పుడు చెఱలో నున్నాఁడు. అట కెవ్వరును బోరాదు. కాని నీవెచ్చటకుఁ దీసికొనిపొమ్మనిన నటకుఁ గొనిపోవుటకు నేను నియమింపబడితిని. "అమ్మా! నాతోరమ్ము"

అని యాతఁ డనియెను. ఆతడు మరలఁ గోటలోఁ బ్రవేశించెను. తిలోత్తమ యేమిచేయుచున్నదో యెటకుఁ బోవుచున్నదో, యేమియు నెఱుంగదు. వెనుకకుఁ దిరిగి జంత్రిపు బొమ్మవలె నాతనితోఁ గూడ బోవుచుండెను. కోటలోని యందఱు ద్వారపాలకులవలెఁ గారాగృహపాలకులు మత్తులై యుండలేదు. వారివారి స్థానముల నతిజాగ్రత్తగ నున్నారు.

"రాజపుత్త్రి డెక్కడనున్నాఁడు" అని యాతఁడు కారాగృహ పాలకునడిగెను.

ఆతఁడు వ్రేలితోఁ జూపెను.

"ఆతఁడు నిద్రించుచున్నాఁడా? మెలకువగనున్నాడా?"

చెఱసాల రక్షకుడు కారాగృహ ద్వారముకడ కేగ మరల వచ్చి యిట్లనియెను.

"మెలకువగ నున్నాఁడు. నాకుఁ బ్రత్యుత్తరమిచ్చినాఁడు."

"తలుపుఁదీయుము." ఆతనిని జూచుట కీమె లోనికేగును.

"అదెట్లు? అట్టియధికారము మాకు లేదు"

అస్మాన్ ఖానుని యుంగరమాతనికిఁ జూపెను. కారాగృహ రక్షకుఁడు దానికి విధేయతను జూపి తలుపుఁ దీసెను.

రాజపుత్త్రిఁ డొకసామాన్యమైన మంచముపై శయనించియుండెను. తలుపుఁదీసిన ధ్వనివిని యాతఁ డత్యాశ్చర్యముతోఁ జూచుచుండెను. తిలోత్తమ తలుపునొద్దకువచ్చెను. ముందునకుఁ బోలేకపోయెను. ఆమెపాదములు వానివిధిని నిర్వర్తించుటలేదు. ఆమె తలుపు పట్టుకొని నిలుచుండియుండెను. తిలోత్తమ చేయుచున్న యాలస్యమును జూచికూడ వచ్చిన యాతఁడు.

"ఇదియేమి? ఇక్కడెందులకాగియుంటివి?" అనియెను.

తిలోత్తమ యింకనుబోలేదు.

"లోపలికిఁబోన నీకిష్టములేదేని వెనుకకు మరలుము. ఇక్కడ నాలస్యముచేయుట కిది సమయముకాదు.''

తిలోత్తమ మరలుటకు సిద్ధపడియెను. కాని యట్లును చేయలేదు. ఆమె యేమిచేయఁగలదు? కూడ వచ్చినవాఁడు తాలిమిలేనివాఁడు. తొందర యిచ్చుచుండెను. ఇట్లూగులాడుచు తిలోత్తమయొక్క యడుగు ముందునకు వైచెను. అట్లు వైచుట యామెయెఱుంగదు. ఆమె గదిలోఁ బ్రవేశించెను.

ఆమె రాజపుత్త్రిని చూచినదో లేదో? ముందున కడుగిడలేకపోయెను. గోడపట్టుకొని తలుపునొద్ద క్రిందకు వంచి యోచించుచుండును.

జగత్సింహుఁడు మొట్టమొదటఁ దిలోత్తమను గుర్తింపలేకపోయెను. అటకు స్త్రీయెట్లు వచ్చెనని యాతఁడాశ్చర్యమొందెను. ముందునకు రాకుండ నామె యటునిలువఁబడినందులకు మఱింత యాశ్చర్యపడియెను. ఆతఁడు లేచి తలుపునొద్దకువచ్చెను. ఆమెనుచూచి గుర్తించెను.

ఒక్కనిమిషమునకు వారివీక్షణములు కలిసికొనియెను. తత్క్షణమే యామె యవనతాలోకన యయ్యెను. రాజపుత్త్రిని పాదములపైఁ బడుటకుద్యమించిన ట్లామె దేహమెుక్కింత వంగెను.

ఆతఁడు కొంచెము వెనుకకుఁ దగ్గెను. తత్క్షణమయామె మంత్రబద్ధయైనదానివలె, చిత్తగువువలె, నిలువఁబడిపోయెను. ఒక్కక్షణము క్రింద పద్మమువలె వికసించినయామెహృదయమిప్పుడట్లె వాడిపోయెను.

"వీరేంద్రసింహుని తనయయా?" అని రాకొమరుఁడనెను. కటారివలె నీవాక్యమామెహృదయమును భేదించివైచెను. ఆతఁడేమనెను? వీరేంద్రసింహుని తనయయనియా? ఇప్పుడు పిలువవలసిన రీతియేనా యిది? జగత్సింహుఁడు తిలోత్తమయను పేరును మఱచిపోయెనా? ఇరువురును గొంతసేపు మాటలాడక యూరకుండిరి.

"ఇక్కడి కెందులకు?" అని యాతఁడు ప్రశ్నించెను.

"ఇక్కడి కెందులకు?" ఇదేమిప్రశ్న? తిలోత్తమతల తిరుగనారంభించెను. అన్నివైపులను, గది, మంచము, దీపము గోడలు అన్నియు చుట్టును దిరుగనారంభించినవి. ఆమె శిరసును గోడకుఁ జేర్చెను.

ప్రత్యుత్తరము వచ్చునేమో యని రాజపుత్త్రుఁడు చాలసేపు చూచెను. కాని ప్రత్యుత్తర మిచ్చువారెవరు? ఇఁక నాయాశ లేదనుకొని యతడిట్లనియెను.

"పాపము నీవు చాలవిచారించుచున్నదానవు. మరలి పొమ్ము గతమునంతను మఱచిపొమ్ము"

తిలోత్తమ హృదయమునుండి యన్నిసంశయములును వీడిపోయినవి. చెట్టునుండి యెండిపోయిన యాకువలె నామె భూమిపై బడిపోయెను.

మూర్ఛ

జగత్సింహుఁడు ముందునకు వంగి యామెపై దృష్టి సారించెను. ఆతడు తనవస్త్రముతో నామెకు విసరుచుండెను. ఆమెకు స్పృహవచ్చిన లక్షణములేవియు గాన్పించుటలేదు. ఆమెతోగూడ వచ్చినవానిని లోపలకు బిలిచెను. ఆతడు లోపలకు వచ్చెను.

"ఈస్త్రీ యాకస్మికముగ మూర్ఛఁజెందినది. ఈమె తోఁగూడ వచ్చిన పరిచారిక యెవరు? ఆమెను వచ్చిచూడు మని చెప్పుము."

"నేనొక్కఁడనే వచ్చితిని"

"నీవా?" అని యత్యాశ్చర్యముతో నడిగెను.

"నేనే, ఇంకెవరును రాలేదు."

—అయిన నిప్పుడు చేయవలసినదేమి? ఈకోటలోని యేపరిచారికతోనైనఁ దెల్పుము."

ఆతఁడు వెడలిపోయెను. రాజపుత్త్రుఁడాతని మరల లోపలకుఁ బిలిచి యిట్లనియెను.

"ఇదిగో! చూడు! ఈవిషయమునుగూర్చి యెవరితో నైనఁ జెప్పితివా యది క్రమక్రమముగ వెల్లడియగును. ఈ యుత్సవ సమయమున నీయువిదకు పాపము సహాయము చేయువా రెవరు?"

"ఔను. అదియును నిజమే. అదిగాక కారాగృహ రక్షకులు మఱియొకరి నిందు రానిత్తురా? నేనుమాత్రి మెటు తీసికొనిరా సాహసింతును?"

"అయిన నేనిప్పుడేమిచేయవలయు? ఇంకొకయుపాయమున్నది. నీవతిత్వరితముగఁ బోయి యొకపరిచారికచే నయేషా కీ సమాచారము నందజేయుము."

ఆతఁడు చెప్పినప్రకార మామనుష్యుఁ డతివేగముగఁ బోయెను. రాజపుత్త్రిఁ డామెకు సాధ్యమయినంతవఱకు నుపచారములఁ జేయుచుండెను. ఆతని హృదయభావము లప్పుడెట్లుండెనో? ఎవరు చెప్పఁగలరు? ఆతని నేత్రముల భాష్పోదయమయ్యె? ఏమో? ఎవరు చెప్పగలరు?

చెఱసాలయం దాతఁడును దిలోత్తమయునేయుండిరి. ఆతఁడు చాల కలవరపడియెను. "ఆయేషా కీవర్తమాన మందకపోయిన నెట్లు? అందినను నామె యేయుపాయమును జేయలేకపోయిన యేమిరానున్నదో?

క్రమక్రమముగఁ దిలోత్తమకు బ్రాణములు తేరుకొనియెను. రాజపుత్త్రినకుఁ దోడనే యామనుష్యునితోఁ గూడ నిరువురుస్త్రీలుకనఁబడిరి. దూరమునుండి మేలుముసుంగు వైచుకొని వచ్చుచున్న యాస్త్రీ లయ బద్ధగమనమును మనోహర గంభీరరూపమును జూచి యయేషా పరిచారికతో వచ్చుచున్నదనియు నామె యాశాదేవతనుగూడఁ దీసికొని వచ్చుచున్నట్లుండెననియు నాతఁ డనుకొనెను. వారిరువురును కారాగృహ ద్వారముకడకు వచ్చిరి. ఉంగరమును జూపిన యాతనితో కారాగృహపాలకుఁ డిట్లనియెను.

"వీరినిగూడ లోపలకుఁ బోనీయవలసినదేనా?"

"అది నీయిష్టము, నేఁజెప్పలేను"

"మంచిది"అని యాతఁడు వారలఁబోరాదని యభ్యంతర పెట్టెను.

అయేషా మేల్ముసుంగును దొలఁగించి "రక్షకుఁడా! నన్నులోపలకుఁ బోనిమ్ము. నీకేదేని యిందుమూలమున నుపద్రవము వచ్చెనేని యది నాపైఁ బెట్టుము" అనియెను.

అయేషాను జూచి యాతఁ డాశ్చర్యపడెను. వినేయతనుజూపి చేతులుజోడించి "అమ్మా! సేవకు ననుగ్రహింపుము. లోపలికేగుటకు మీకభ్యంతరమేమి?"

అయేషా చెఱసాలలోఁ బ్రవేశించెను. ఆమె యెప్పుడును మందహాసము సేయుచున్నట్లే యుండును. అందు నామె నవ్వుచున్నట్లు కనుపట్టుచున్నదిగాని నిజముగా నామె మందహాసము చేయుటలేదు. అంధకారబంధురమైన యాచెరసాల కెంతప్రకాశము వచ్చినది? ఇఁక నది చెఱసాలయేకాదు.

అయేషా వందన మొనర్చి రాజపుత్త్రిన కిట్లనియె.

"రాజోత్తమా! సంగతులేమి?"

ఆతఁ డేమని ప్రత్యుత్తరమిచ్చును? క్రిందపడియున్న తిలోత్తమను జూపెను. ఆమెనుజూచి యయేషా యిట్లడిగెను.

"ఈమె యెవరు?"

"వీరేంద్రసింహుని కుమార్తె"

అయేషా తిలోత్తమను లేవఁదీసి తనయొడిలోఁ జేర్చుకొనియెను. అట్టిస్థితియందయేషాగాక మఱి యేయువతియైన నయ్యెనేని సంకోచము నొందును. వితర్కించును. కాని

యయేషా యట్లుచేయలేదు. తత్క్షణమే యామెను లేవదీసి తనయొడిలోఁ జేర్చుకొనియెను.

ఆమె యేమిచేసినను నందముగనే యుండును. ఆమె ప్రతీకారమును మనోహరముగఁ జేయుచుండును. ఆమె తిలోత్తమ నొడిలోఁ జేర్చుకొనుటనుజూచి జగత్సింహుఁడును బరిచారికయు నిట్లు తలంచుకొనిరి. "ఎంత మనోహరముగ నున్నది!"

అయేషా పరిచారికచేఁ బన్నీరుబుడ్లు మద్యభత్తులు మొదలగునవి తెప్పించియుంచెను. వానిచే దిలోత్తమ కుపచారము చేయించెను. తిలోత్తమకు స్పృహ కలిగనది. పరిచారిక యామెకు విసరుచుండెను. తిలోత్తమకిదివఱకే కొంచెము కొంచెము స్మృతి వచ్చినది. అయేషా యుపచారములచే పూర్ణముగ స్మృతి కలిగెను.

తిలోత్తమ చుట్టును గలియఁజూచెను. జరిగినదంతయు జ్ఞప్తికివచ్చెను. తటాలున గదియావలకు దాఁటిపోవుచుండెను. కాని మనోవ్యాకులభావమునకుఁదోడు శరీరదార్ఢ్యము కూడ నీరసించి పోవుటచే నడునలేకపోయెను. జరిగిన విషయములు జ్ఞప్తికివచ్చిన కొలఁదిని తల తిరుగుచుండెను. ఆమె కూర్చుండెను.

ఆమెచేతిని బట్టుకొని యయేషా యిట్లనియెను.

"సోదరీ! నీవేల విచారపడియెదవు? నీవు చాల నీరసముగ నున్నదానవు. విశ్రాంతికై నామందిరమునకు రమ్మా, పిదప నీవెటకుఁ బోవలెనన్న నటకు బంపెదను."

తిలోత్తమ ప్రత్యుత్తరమీయలేదు. అయేషా కూడ వచ్చిన వాని నడిగి యంతయుఁ దెలిసికొనియెను. తిలోత్తమ భయపడుచున్నదని తలంచి యయేషా యిట్లు చెప్పెను.

“నీవు నన్నేల విశ్వసింపవు? నేను నీశత్రుని కుమార్తె నను మాట నిశ్చయమే కాని యంతమాత్రమున నీనమ్మకము నకు పాత్రురాలను గానని, తలంపకుము నేను నీసంగతిని తెలిసికొంటినని భయపడనక్కఱలేదు. ఈరాత్రిగడవక పూర్వమే పరిచారికాసాహాయ్యమున నీవెక్కడకుఁ బోవలయు నన్న నక్కడకుఁ బంపెదను. ఈవిషయమున నెవ్వరు నేమియు నెఱుంగజాలరు.”

అయేషావాక్యములు చాల మధురముగనున్నవి. ఆమె నిష్కాపట్యవిషయమున దిలోత్తమ కించునేని సందేహము వొడమలేదు. ఇదిగాక యామెకు నడచుటకు శక్తిలేదు. ఇఁక జగత్సింహునికడ నుండలేదు. ఏమిచేయును? అయేషాచెప్పిన ట్లంగీకరించెను.

“నీకునడువ బలము లేదు. పరిచారికా సాహాయ్యమున వెళ్ళఁగలవా? అని యయేషా యడిగెను.

తిలోత్తమ పరిచారిక భుజముపై చేయివైచి మెల్లఁగ నడువ నారంభించెను. అయేషాకూడ వెడలిపోవుటకుద్దేశించి రాజపుత్రునొద్ద సెలవుబుచ్చుకొనఁ బోయెను. ఆతఁడు తన దృష్టి నామెపై సారించెను. ఏదియో యామెతో చెప్పదలఁ చుకొనిన ట్లావీక్షణమునఁ గన్పట్టుచుండెను. అయేషా యది గ్రహించి పరిచారికతో నిట్లనియెను.

"ఈయబలను దీసికొని నీవు నాశయనాగారమునకుఁ బొమ్ము పిదప నన్నుఁదీసికొనిపోవుటకు మరలరమ్ము"

తిలోత్తమయు బరిచారికయు వెడలిపోయిరి. జగత్సింహుఁడు నిట్టూర్పు విడిచి తనలో "ఇదియేకడసారివీక్షణము" అని యనుకొనియెను. తిలోత్తమ దృష్టిపథమున నున్నంతవఱ కతఁడామెను జూచుచుండెను. తిలోత్తమ తనలో "ఇదియే కడసారి యనుజ్ఞ"అని యనుకొనియెను. జగత్సింహుఁడు కన బడునని తోఁచినంతవఱ కామె వెనుకకుఁదిరిగి చూడలేదు. ఆమె తిరిగి చూచునప్పటి కాతఁడు కనబడలేదు.

పదునేనవ ప్రకరణము

ప్రకటన

తిలోత్తమయు సేవకురాలును నాగది విడిచిపోయిన పిదప నయేషా ముందుకువచ్చి శయ్యపైఁ గూర్చుండెను. అట నింకొక పీఠములేదు. జగత్సింహుఁడు నిలువఁబడియుండెను.

ఆమె తన జడనుండి గులాబీపుష్పము నొకదానినిదీసి దానిపత్రముల నొక్కటొక్కటిగ నూడఁదీయుచునిట్లనియెను.

"రాజపుత్రా! నాతో నేదియో మాటలాడఁదలంపున్నటుల నీవీక్షణమువలనఁ జూపట్టుచున్నది. నాసాహాయ్యము వలన నీకు లేశమైన ప్రయోజనముఁ గలదేని, నీహృదయము

నాకిఁక వెల్లడించుట కించుకేనియు ననుమానింపకుము. నేను నిశ్చయముగఁ బరమానందముతో నీసేవ యొనర్చెదను.

"రాకుమారీ! నాకిప్పుడేదియుఁ బ్రయోజనకారి కానేరదు. స్వప్రయోజనాభిలాషచే నీతో మాటలాడవలయునను నుద్దేశము లేదు. నేను చెప్పదలఁచినది, నాయవస్థనుబట్టిచూడ నిన్ను మరలఁ జూడఁగలుగుదుననునాశ నాకులేదు. మన మొకరినొకరు చూచుకొనుటకు బహుశః యిదియేతుది. అయ్యో! నేను నీకు ఋణగ్రస్థుఁడను. ఈవిషయమును మాటలచే నెంతని తెలపఁగలుగుదును. నాదురదృష్టమును బట్టి యాలోచించిచూడ నీఋణమును నేనెన్నటికైన దీర్చుకొనఁగలుగుదునను నాశ నాకులేదు. కాని, యెప్పుడైన నీకు ప్రత్యుపకార మొనర్పశక్తినాకు గలిగె నేని నదృష్టమెన్నడైన నాయెడఁ బ్రసన్నముఖియయ్యెనేని నాకడ నీయుద్దేశములను వెలిఁబరప సందేహింపకుమీ! సోదరి తనమనోరథముల సహోదరునకు ధారాళముగ నెఱింగింపదా? నీవును నట్లే యొనర్పుము."

జగత్సింహుని కంఠధ్వని దుఃఖభరితమై గద్గదికముతో నుండెను. ఆతఁడు నిరాశ జెందెను. అయేషాహృదయము నీరయిపోయెను. ఇట్లనియెను.

"నిరాశ జెందకుము. అధైర్యపడకుము, ఈదినమున నున్న కష్టములు శేషుండజాలవు"

"నేను నిరాశజెందుటలేదు. కాని యీజన్మమున దేనికై యాశపెట్టుకొని యుండవలయును? నాజీవితము నిక

గాపాడు కోరిక లేదు. ఈలోకమును విడిచిపోవుటకంటె నాకు వేఱుద్దేశమేమియు లేదు. కాని యది యీకారాగృహమున మాత్రముకాదు"

జగత్సింహుని యీదీనోక్తు లయేషా హృదయమును నీరుజేసెను. ఆతనిభావప్రకటనమున కామె యాశ్చర్యము గూడ నొందెను. ఆమె హృదయమును కలతనొందెను. దూరతాభావము, మితభాషణత్వము, తొలగిపోయినవి. అత్యంత ప్రేమాస్పదయగు నువిదవోలె నామెస్త్రీస్వభావ మగు మృదుకృపార్ద్రీభూతహృదయయై రాజపుత్రుని చేయి పట్టుకొని "జగత్!" అనియెను.

ఆతని ముఖమువంక జూచుచు నొక్కనిమిషమూర కుండి మరల నిట్లనియెను.

"జగత్! ఎందులకింత పరితాపము? నన్ను దూరస్థురాలినిగ భావింపకుము. అనుజ్ఞ యయ్యెనేని నినొ్నకప్రశ్న యడిగెదను. వీరేంద్రసింహుని కుమార్తె—

"అనుగ్రహింపుము. ఆప్రసంగమును దేకుము. అది స్వప్నము. అదియంతయు నదృశ్యమైపోయినది."

చాలసేపిరువురును మాటలాడకుండ నూరకుండిరి. ఒకరిహస్తముల నొకరు బట్టుకొనియేయుండిరి. అయేషా తన శిరసును హస్తముపై వంచుకొనియుండెను.

బాష్పబిందు వొకటి రాజపుత్రుని చేతిపై బడియెను. ఆతడులికిపడి తనశిరసును క్రిందకువంచి యామెసుందరవదన

మును వీక్షించెను. బాష్పోదకము లామె మృదుకపోలముల వెంట బ్రవహించుచుండెను. ఆత డాశ్చర్యముతో

"భగవంతుడు తోడగుగాక! అయేషా! ఇదియేమి? ఏడ్చుచున్నావేమి?" అని యడిగెను.

అయేషా యేమియు బ్రత్యుత్తర మీయకుండ నాతని చేయిపట్టుకొని తీసికొనివచ్చి శయ్యపై దనప్రక్కను గూర్చుండబెట్టుకొనియెను. ఆతడు కూర్చుండిన పిదప మరల నాతనిచేయిని గ్రహించి యిట్లనియెను.

"రాకుమారా! నేను నీకిట్లు చెప్పవలసివచ్చునని కలనైనఁ దలంపలేదు. నేనెంతకష్టమునైన ననుభవించెదఁగాని యీపరితాపముతో నిన్ను కారాగృహమున విడిచి నేను బ్రతుకఁజాలను. నాతోఁ గూడరమ్ము. నేను నిన్ను వేఁడుకొనెదను. నాయశ్వశాలనుండి నీకొకగుఱ్ఱము నిచ్చెదను. దాని నధిరోహించి యీరాత్రియే మీతండ్రిగారి కడకేగుము."

జగత్సింహుఁడు తనను రక్షించు దేవత తనను ధన్యాత్మునిఁజేయ సాక్షాత్కరించినను, నింతకంటె నాశ్చర్యమును పొందఁజాలడు. ఆతఁ డాశ్చర్యముతో మాటాడ నశక్తుడయ్యెను.

"జగత్సింహ కుమారా! రమ్ము రమ్ము" అని యామె బలవంతపెట్టెను.

"అయేషా! నీవు నాకు స్వేచ్ఛ నొసఁగెదవా? నన్ను విడిపించెదవా?"

"నిశ్చయముగ, తత్క్షణమే"

"మీతండ్రికి దెలియకుండగ నేనా?"

"భయములేదు. మాతండ్రికి నీవంద నేరవని తోఁచిన ప్పుడు వెల్లడిచేసెదను."

"కారాగృహరక్షకు లట్లంగీకరింతురా?"

"ఇదిగో! మనకీరక్ష యున్నదికదా! ఇదియే వారి నొప్పించు" అని యామె తన కంఠహారమునుదీసి రాజపుత్త్రి నొద్దనుంచెను.

"ఈవిషయము వెల్లడియయినప్పుడు మీతండ్రిగారిచే నీకు చిక్కులు కలుగఁగలవు."

"అదియొక గొప్పవిషయము కాదు."

"వలదు. వలదు. నేను పోనొల్లను"

అయేషా వెలవెలఁబోయి చూచి విచారముతో

"ఏమి?" అని యడిగెను.

"నేనిదివఱకె నీకుఁ జాల ఋణపడి యున్నాఁడను. నాప్రాణ మొసంగినను నాయప్పు తీరునదికాదు, ఇపుడు మరల నీకు కష్టమును దెచ్చిపెట్టెడు కార్యమును జేయఁజాలను"

"నామాటను వినుఁడు. పట్టుపట్టకుఁడు. నిరాకరింప కుఁడు." అని గద్గదస్వరముతో ననియెను.

"వలదు. వలదు. నీవు వెళ్ళుము."

అయేషా మరల నూరకుండెను. ఆమె బాష్పముల నాపుకొన నెంతయో ప్రయత్నించెను. కాని పాపము! నిష్ఫల మయ్యెను. అవి మరలఁ బ్రవహించుచుండెను.

"అయేషా! నీవెందులకు దుఃఖించెదవు? చెప్పవా?

అయేషా! మాటలాడలేదు? ఇంకను విచారించుచునే యున్నావు. కారణమును నాకెఱింగింపుము. వానిని దొలఁగింప నాప్రాణములనైన నొసంగెదను. నేను కారాగృహమున నుండిమాత్రమున నీకీ విచారమెందులకు? నీ వెందు కేడ్చెదవు? మీతండ్రిగారి కారాగృహమున నెన్నివేల కైదీలు లేరు?"

అయేషా ప్రత్యుత్తరమీయకుండ నేత్రములు తుడుచుకొని కొంచెము సేపుండి యిట్లనియెను.

"రాజతనయా! ఇఁక నేను దుఃఖింపను"

ఆమె విచారకారణమును దెలుపనందులకు జగత్సింహుఁడొక్కించుక చింతించెను. ఇరువురును శిరసులను వంచి కొంతసేపట్లేయుండిరి.

ఇంతలో నెవరో మూఁడవ మనుష్యునియొక్క ఛాయ యాగదిగోడపైఁ బ్రతిఫలించెను. దానిని వీరిరువురును జూడలేదు. అతఁడు లోపలికరుదెంచి వారియెదుట నిలువఁబడియెను. చిత్తరువువలె కొంతసేపట్లు నిలుచుండియుండి, క్రోధసంజనిత కంపితస్వరంబున నిట్లనియెను.

"రాకుమారీ! ఇది వధ్యార్హము"

ఇరువురును శిరసులఁ బైకెత్తిచూచిరి అతఁ డస్మాన్ ఖాఁ. అస్మాన్ ఖా నుంగరమును గైకొని తిలోత్తమతోఁ గూడవచ్చిన యామనుష్యునిచే సర్వమును దెలిసికొనియెను. అతఁడయేషాను వెదకుచు నిటకు వచ్చెను. జగత్సింహుఁ డస్మాన్ ఖానుని జూచెను. కెటులో ఖానువలనగాని, యస్మాన్

ఖానుని మూలమునఁగాని యయేషా కేమి ముప్పువాటిల్లునో, యేమియాపద నొనఁగూడునోయని యాతఁడు చాల భయ మందెను. అస్మాన్ ఖానుఁ డాగ్రహముతో ననిన యా వాక్య మాతనికి మఱింతభయమును కలుగఁజేసెను. అస్మానుఖానుని వాక్యమందలి భావము నయేషా నిమిషములో గ్రహించెను. మనోహరమైన యామె ముఖలక్షణము లొక్కనిమిష మెఱ్ఱ వడియెను. కాని, ఆమె కడనోర్పులేమిని సూచించు మఱే చిహ్నములును గాన్పించుటలేదు. ఆమె మెల్లఁగా నిట్లని యెను.

"అస్మాన్! ఏదివధ్యార్హము?"

"అర్ధరాత్రిమున రాజతనయ యొక ఖయిదీతోఁగూడి నుండుట వధ్యార్హము. చట్టమునకువ్యతిరేకముగ నామె చెఱ సాలలోనికి వచ్చుటకూడ వధ్యార్హమైన నేరమే" అని యాతఁ డాకంఠధ్వనితోడనే ప్రత్యుత్తర మొసంగెను.

అయేషా నిర్దోషురాలు, కళంకరహిత. అస్మాను ఖానుని వాక్యముల కామె సహింపలేకపోయెను. ఆతనివంకఁ దీవ్రముగ దృష్టిసారించి యస్మా నెప్పుడును కనివినియుండ నంత తీవ్రముగు కంఠధ్వనితో నామె యిట్లు చెప్పెను.

"ఇదినాయిష్టము— ఈయర్ధరాత్రిమున చెఱసాలకు వచ్చుటకూడ నాయిష్టము. ఈకయిదీతో మాటలాడుటయుఁ నాయిష్టమే నాస్వభావమునందలి మంచిచెడ్డల నారసి తీర్మా నించుటకు నీవస్సుండవుకావు ఆవిషయమున నీకేమియుఁ బ్రసక్తి లేదు."

ఆతఁ డాశ్చర్యపడియెను. ఆతఁడింకను కోపముతోడనే "త్రేపుదయమున నవాబుగారియెదుట నాసంగతియంతయు నీవు చూచెదవుగానిలే" అనియెను.

"మాతండ్రినన్నుఁ బ్రశ్నించినప్పుడు నేనుత్తరమిచ్చెదను. ఆవిషయమున నీవు విచారింపఁబనిలేదు." అని యాయా విధముగానే చెప్పెను.

"నేనడిగిన?" అని యతఁడు యథారీతి కంఠధ్వనితో నడిగెను.

అయేషా పాదములపై లేచి నిలువఁబడియెను. ఆమె దృష్టి యస్మానుపైఁ బఱపెను. ఆమె విశాల నేత్రములు మఱింతవికాసమునుబొందెను. ఆమె పద్మసన్నిభవదన మధిక ప్రకాశము నొందుచుండెను. వినీలకుటిల కుంతలములతోఁగూడ నామెశిరసాక్షింత యొక ప్రక్కకొఱఁగెను. తరంగములచే నాడుచుండెడి శైవలముభాతి నామె హృదయ మభివృద్ధినొందుచున్న మనస్తాపముచేఁ జలించుచుండెను. ఆమె విస్పష్టధ్వనులతో నిట్లు చెప్పెను.

"అస్మాన్! నీవడిగనచో నిట్లు చెప్పెదను. ఈచెఱసాలయందిప్పుడునాయెదుటనున్న యీకయిదీనాహృదయేశుఁడు"

ఆసమయమున నాకస్మికముగ పిడుగుపడినట్లయ్యెను. రాజపుత్త్రుఁడుగాని పఠానుఁడుగాని యెప్పుడును నింతగానులికిపడియుండరు. వారు మహాశ్చర్య నిమగ్నులైరి. రాజపుత్త్రునకు హృదయాంధకారమంతయు నదృశ్యమైనది—అయేషా మాటలాడకుండ నేడ్చినకారణము నంతయు నాతఁడుగ్రహిం

చెను. అస్మాన్‌ఖా సింతకుపూర్వ మిదియంతయు నూహించి కొనియున్న వాఁడు. అందుచేతనే యామెతో నట్లు తిరస్కారముగ మాటలాడియుండెను. కాని, తన సమక్షముననే యామె తన ప్రేమ నట్లు ప్రకటించునని యాతఁ డెన్నఁడును దలంపలేదు. అస్మాన్ నిశ్శబ్దముగ నూరకుండెను.

ఆమె యిట్లు మరల చెప్పనారంభించెను.

"అస్మాన్! వినుము, ఈ ఖైదీయే నాహృదయేశుఁడు. ఈశంతమున నణుమాత్రి మూపిరియున్నను నాహృదయమున నీతఁడు దక్క మఱి యెవ్వరును నీపణ్మాత్రప్రదేశమైనను పొందఁజాలరు. తేపుదయమున నీతనిరక్తములో వధ్యస్థానమంతయు మునిఁగిపోవుట సంభవించెనేనియు (ఆమె కంపించెను) ఇంకను, ఇంకను, ఎల్లప్పుడును నాతని మాధురీ విగ్రహమునే నామనమునఁ బ్రతిష్ఠించుకొని యారాధించుచుండ నీవు చూడఁగలవు. మేమిరువురము నొకరినొకరు చూచుకొనుట కీనిమిషమే కడసారియయినను, ఈరాజపుత్త్రి శిరోమణి తేపటిదినముననే కారాగృహమునుండి విముక్తిగాంచినను, ఈగాంభీర్యనిధి వందలకొలఁది భార్యలచేఁ బరివృతుఁడయి యుండినను లజ్జాకరమై యయేషానామ మీప్రపంచమున నానుడిగఁ బరిగణింపఁబడినను, ఇంకను, ఎప్పటికిని, నాకంఠమున ప్రాణముండినంతకాల మీతనినే ప్రేమించుచుండెదను. ఇట నేను రహస్యముగ మాటలాడుచున్న దేమియో నీ వెటిఁగితివా? మంచిమాటలచేతనో, బహుమానము నిచ్చియో ద్వారరక్షకుల సమ్మతింపఁజేసి యాతని నీచెఱ

నుండి తప్పించెదననియు, నాయశ్వశాలయందలి యశ్వము నొకదాని నిచ్చెదననియు నీరాత్రి యాతనితండ్రిగారికడకేగు మనియు నాతనితోఁ జెప్పుచుంటిని. ఈరాజపుత్త్రరత్నమా మాటకు సమ్మతింపలేదు. కాని, లేకున్న నీపాటికి నీవీతని కాలిగుర్తులనైన నిటఁ గాంచలేకపోయియుందువు.''

ఆమె బాష్పములఁ దుడుచుకొని కొంచెము విరతిఁజెంది కంఠధ్వని నొక్కింత మార్చుకొని మరల నిట్లు చెప్పఁదొడం గెను.

"కాని, ఉస్మాన్! నీకు నేను చాలనొప్పికలుగఁజేసి తిని, నన్ను మన్నింపుము. నేనిదె వేఁడుకొనుచున్న దానను. మేమిరువురమును నన్యోన్యప్రేమతోఁ జరించుచున్నారము. నాస్వభావము చాలనిర్దయాత్మకమైన దానివలెఁ గన్పట్టును. కాని నీవు నాపాతివ్రత్యమును గూర్చి యనుమానించితివి. ఇతరదోషము లెన్నియున్నను నయేషాకడ కళంకము మా త్రములేదు. అయేషా యేమిచేసినను నామె ప్రత్యక్షముగ దాని నొప్పుకొనును. ఈవిషయము నిప్పుడు నీకడఁ బ్రకటిం చితిని. అవసరమైనచోఁ ద్రేపు మాతండ్రిగారికడకూడ నీవిష యమును బ్రకటించెదను.''

ఆమె మరల జగత్సింహునివంకకుఁ దిరిగి "రాజపుత్త్రా! నీవుకూడ నన్ను క్షమింపుము. ఉస్మాన్ ఖా నిట్లునన్ను నొవ్వ నాడకుండు నేని, నాహృదయమును దహించుచుండెడి విచా రము, నీచెవిని బడకయుండును, నీచెవినే కాదు. ప్రపంచమున నెవ్వరిచెవులను బడియుండదు.''

రాజపుత్త్రుఁడు మాటలాడ లేక నిలుచుండియుండెను. ఆతని హృదయము పరితాపాగ్నిచే దహింపఁబడుచుండెను. అస్మార్ కూడ మాటలాడకుండ నుండెను. అయేషా మరల నిట్లనియెను.

"అస్మార్! నీమనస్సునకు భారముకలుగునటులమాటలాడియుంటినేని నన్ను మన్నింపుము. నేనెప్పుడును నీప్రియసోదరివలె వర్తించెదను. నీవు నాపైని ప్రేమను దగ్గింపకుము, తగ్గింపకుము. నాదురదృష్టవశమున నేనీసముద్రమునఁబడి మునిఁగిపోవుచున్నదానను. సోదరప్రేమను లేకుండ జేసి నా దుఃఖమును మఱింత యభివృద్ధిచేయకుము."

ఇట్లు చెప్పుచు పరిచారిక తిరిగి వచ్చువఱకు నుండక యామె యతివేగముగ వెడలిపోయెను. ఇంద్రియజ్ఞానవిహీనునివలె నస్మార్ఖాన్ మాటలాడకుండ కొంతసేపచటనుండి పిదపఁ దనగృహమునకుఁ బోయెను.

పదునాఱవ ప్రకరణము

ప్రభూ! నీబానిస నీపాదములకడనేయున్నది

కటుల్ఖానుని యంతఃపురమున నారాత్రి నృత్యము జరుగుచుండెను. మొగలాయీచక్రవర్తులవలె నాతఁడు జన్మదినమహోత్సవమునాఁడు రాజసేవకుల నడుమను, ఉద్యోగస్థుల నడుమను, ఉల్లాసవినోదములతోఁ గాలము గడపఁడు.

ఆతఁడు స్వభావముగ నధిక స్వార్థపరుఁడు. విషయభోగవాంఛాతత్పరుఁడు. ఆరాత్రి యాతఁడు ప్రియురాండ్రందరతోఁ గూడి విలాసవిహారము లొనర్చుచుండెను. అటనీక వేత్ర వేశ్యాంగన లేదు. ఇఁక వేఁలుచూపఁలు లేరు. కొజ్జాలు తప్ప నిఁక నెవ్వరు నటకుఁబోరాదు. కొందఱు నృత్యము సేయుచుండిరి. కొందఱు సంగీతము పాడుచుండిరి. కొందఱు లయ వేయుచుండిరి. మిగిలినవా రాతనిచుట్టును గూర్చుండి వినుచుండిరి.

ఇంద్రియసౌఖ్య మొనగూర్చువస్తువు లక్కడ లేని వీ ప్రపంచమున నెక్కడను లేవు. నీవాభవనమునఁ బ్రవేశించితి వాచల్లనిమందమలయానిలము నీశరీరమంతటఁ గలయఁబ్రాకును. అది నిరంతరాయముగ వెదచల్లు పరిమళోదకములచే సుగంధబంధురముగఁ జేయఁబడినది. ఆస్ఫటిక పాత్రములు, ఆదంతపాత్రములు, ఆరజితపాత్రములు, నీకన్నులకు మిఱుమిట్లుఁగొలుపును. ఇటపూలగుత్తులు, అట పూలహారములు, ఇంకొకచోఁ బూలరాసులు, పరిమితిలేదు. అవి స్త్రీలశిరోజముల నలంకరించుచుండెను—మఱియు వారికంఠహారములై యొప్పారుచుండెను—కొందఱు పూలవీవనల మోయుచుండిరి—కొందఱు పూలనలంకరించుకొనుచుండిరి— కొందఱు పూలగుత్తుల వేఱొకరిపై విసరుచుండిరి—

ఆకుసుమ పరిమళము, ఆపరిమళద్రవ్యసుగంధము— ఆసుంధ తైలదీపికాసౌరభము—ఆసౌరభసమ్మిళిత కోమల. యువతీ జనగాత్ర సంజనితామోదము — వీనియన్నిటితో నచ్చటి మలయానిలముఘుమఘుమాయమానమగుచుండెను.

ఆదీపికా వైభవము, ఆపుష్పసౌభాగ్యము! ఆయాభూషణ విలసనము, ఆసుందరవిలాసినీజననిరంతర కటాక్షవీక్షణ గాంభీర్యము, ఆ వేణువీణానినాదంబు లాకోకిలవాణులనిర్మల మధుర స్వరంబులంగలిసి మలయానిల సమ్మిళితంబు లగుచుండెను. ఒకనాట్యాంగన నడుమనడుమఁ దనమంజీరకలనిస్వనంబుల నిరుపమానకౌతూహలకారిణియై హృదయాకర్షణము గావించుచుండెను.

చదువరీ! అటుచూడుము. అదిగో! ఆకోమలగాత్రి యెట్లు నృత్యము సేయుచుండెనో! తరంగమాలికా సంచలితంబగు జలజస్థితమరాళకామినియుంబోలె నామెయెట్లునాట్యమాడుచుండెనో! పరికింపుము, చుట్టునున్నవారంద ఱామెను దమయుల్లాసవికసిత సుందరవదనంబులఁ జూచుచుండిరి. అదిగో! నీలాంబరధారిణియై యటగూర్చుండియుండిన యాయువతి నీక్షింపుము, నక్షత్రములవలె మెఱయు బంగారుపూలచే నాచీర యెంతమనోహరముగనున్నదో — ఆహా! ఏమి యావిశాల నేత్రద్వయ సౌందర్యము! ఆకసమువలె నవి యెంతకోమలవినీలకాంతులు ప్రకాశించుచున్నవో—విద్యుత్కాంతివలె మెఱయు నాకేగంటిచూడ్కులో! ఇంకొకచో లలాటాగ్రభాగమున సీమంతముకడ వజ్రము నలంకరించుకొనియున్న యానారీమణిని జూడుము. ఆమనోహరఫాలభాగమును జూచితివా? అదియెంతగంభీరము—ఎంతవిశాలము! ఎంతనిర్మలము!—భగవంతుఁ డట్టి తేజోరాశిని పరానునిభోగభవనమున నుండుటకై సృజించెనా? అదిగో! వేఱొకచో

కుసుమాలంకృతయై విలాసమునంగ్రాలు నాశ్యామలగాత్రిం బరికింపుము. పుష్పాలంకృతములగు నాదుస్తులామె గాత్రమున కెంతవన్నె దెచ్చుచున్నవో చూచితివా? పుష్పములు సౌందర్యవతుల కొఱకే నిర్మింపఁబడినవి. ఆదిగో! ఆప్రిక్కఁ గూర్చుండియున్న బింబాధరిం జూచితివా? ఆమె యోష్ఠము లాక్రించుక లోనికణపఁబడియున్నవి. పరికించితివా? నిర్మలాకాశమునఁ బ్రకాశించు రాకాచంద్రునివలె కోమలనీలాంబర పరివృతంబగు నామె ముఖమండల మెంతమనోహరముగ నున్నదో చూడు! అదిగో! అట మరాళ కాంతుల నీసుకు మార గళసౌందర్యమునఁగ్రాలు నాసుందరీమణిని జూచితివా? ఆమె మాటలాడుచు నెందులకో నవ్వుచున్నది! చూడు! చూడు! ఆకర్ణాభరణములెట్లు కదలుచున్నవో! ఓశిరీష కుసుమపేశలమూర్తీ! సుందరశిరోరుహ సందర్శనంబునఁ జూపఱ హృదయాకర్షముఁగావించుచున్న నీవెవతెవు? నీవినీల కుంతలముల, వక్షస్థలంబున వ్రేలాడవైచితి వెందులకు? సరోరుహకుట్మలంబునకు సర్పమెట్టు చుట్టుకొనునో చూపించుచుంటివా?

కటుల్‌ఖానుని సమీపమునఁగూర్చుండి బంగారు కలశమున నమృతముపోసి యాతనికిచ్చుచున్నావు. సుందరీమణీ! నీవెవతెవు? కటుల్‌ఖానుఁడు క్రేగంటిచూడ్కులతో నీపరిపూర్ణవికసిత మనోహరరూప సంపదలఁ జూచుచున్నాఁడు. నీవెవతెవు? అమోఘకటాక్ష నిరీక్షణమున నాతనిహృదయమును దహించుచున్న నీవెవతెవు? ఆకటాక్షమును నే నెఱుఁ

గుడును—నీవు విమలవు —ఆతనికంతగా మధువు నిచ్చుచు న్నా వెందులకు? ఇమ్ము—ఇమ్ము— ఇంకనునిమ్ము—నీదుస్తులలో గటారిని దాచుకొని వచ్చితివా? దాచుకొనివచ్చితివి. నిశ్చ యమే. ఆరీతిగా నీకు హాస మెట్లు వచ్చుచున్నది? అయ్యో! అది సర్వసామాన్య హాసముకాదు. కటుల్ ఖాన్ నీముఖము వంకఁ జూచుచున్నాఁడు. అదియేమి! కటాక్షనిరీక్షణమా? అదియేమి? మరలనేమి? ఆమహమ్మదీయుని బాగుగఁ ద్రాగ నిచ్చి యున్మత్తునిగ నొనర్చితివేమో చూడు, నీతంత్రము లచే నాతఁడు నినొక్కతెనే ప్రేమించునట్లుగ నొనర్చితివా ? అట్లేల గాకుండును ? అట్టిహాసము ! అట్టివగ ! అట్టిమాధు ర్యము ! అట్టియుల్లాససంభాషణము ! అట్టికటాక్షము ! మరల మధుపాత్రము కటుల్ ఖాన్ ! జాగ్రత్తగనుండుము. కటుల్ ఖానేమిచేయఁగలడు ? కటాక్షనిరీక్షణముతోడ విమల మధు పాత్రమునిచ్చుచుండ నేమిచేయును? హా ! ఆధ్వనియేమి ? ఎవరు పాడుచున్నారు ? అది మర్త్యవనితా కంఠధ్వనియా ? లేక అప్సరోంగనా గానధ్వనియా? విమల పాటకులతోఁ గలిసి పాడుచున్నది. ఆకంఠధ్వనియేమి! ఆస్వరములేమి! మనోహరములగు నాలయతాళములేమి! కటుల్ ఖాన్! ఇది యేమి? హృదయమును వశపరచుకొనినవారెవరు? ఎవరివంక వీక్షించుచున్నాఁడవు? ఆలాపించునపుడు ప్రతిమూర్ఛావస్థ యందును మృదుమందహాసముతో నామె తన కటాక్షముల నీపైఁ బఱపుచుండెనా ! ఆమె కేగ్రంటిచూడ్కులు వాడి కటారికంటె నధికముగ నీహృదయమును భేదించుచున్నవా ?

అది నీవు చూచితివా? కటాక్షనిరీక్షణమే మోహోద్రేక కరము. అదియిప్పుడు సంగీతమిళితమైనది. ప్రతికటాక్షము తోడను నామెశిరసెట్లు చలించుచున్నదో చూచితివా! ఆమె కర్ణాలంకారము లెట్లాడుకొనుచున్నవో చూచితివా! హా! మరల మధువును పోయుము. మరలపోయుము. దేవుని కొరకు మరలపోయుము. ఇదియేమి! ఇదియేమి! విమల లేచినది. నృత్యము సేయుచున్నది. ఆహా! ఎంతమనోహ రము! ఏమి యానటన! మధుపాత్రిమా! ఏమివ్యక్తి! ఏమి సుకుమారగాత్రిము! కటుల్ ఖాన్ ప్రభూ ఓర్పుతో నుం డుము! ఓర్పు! ఓర్పు! నీవగ్నిలో నున్నాడవు. ఆహా! కటుల్ ఖానుని శరీరము మండుచున్నది! మధుపాత్రము! ఆహా! మధుపాత్రము! హా! మరలనేమిది! మరలహాసము. మరల కటాక్షము! సారాయము! సారాయము! ఇదియేమి. అయ్యో! కంకాళి!

ప్రభూ! ఇదియేమి! ఇదియేమి!

చుట్టునున్నస్త్రీలు హాసపల్లవితో లేచి వెడలిపోయిరి.

ఆకస్మికముగ దీపమారిపోయెను. కటుల్ ఖా నిట్ల నెను.

"మనోహరణీ! నీవెటనున్నావు!"

విమల యాతనిభుజముపై నొకహస్తముపై చి యిట్ల నియెను.

"ప్రభూ! నీబానిస నీపాదములకడనేయున్నది"

ఆమె రెండవచేతితో కటారిని బట్టుకొని యుండెను.

కటుల్‌ఖానుఁ డామెను దన వక్షస్థలమునఁజేర్చి బిగ్గఁగౌఁగి లించుకొనియెను. ఆయుత్తరక్షణముననే యాతఁడు కెవ్వన నార్చెను. ఆమెను దూరముగఁద్రోసివైచి శయ్యపై వ్రాలెను. విమల తనచిన్నకటారి నాతనివక్షమున పిడికంటఁగ్రుచ్చెను.

"దుష్టహంతకురాలా! మహాపాపాత్మురాలా!" అని గద్గదస్వరముతో నాతఁడనియెను.

"హంతకిని గాను, పాపాత్మురాలనుగాను. కీర్తిశేషుఁడైన వీరేంద్రసింహుని భార్యను."

ఇట్లుచెప్పి యామె వెడలిపోయెను.

కటుల్‌ఖానునకు మాటాడుశక్తి నశించిపోవుచుండెను. శక్తికోలఁది నేడ్చుచుఁ బడియుండెను. విమలయు నేడ్చుచు బరుగెత్తుచుండెను. ఆమె యింకొకగదిడ కరిగెను. అక్కడ కొందఱు మాటలాడుకొనుచున్నారు. ఆమె వాయువువలెఁ బరుగెత్తుచుండెను. తరువాత భవనమున కొందఱు రక్షకులను, కొజ్జాలను జూచెను. ఆమెయేడ్పును, తడబాటునుజూచి వారిట్లడిగిరి.

"ఏమిది! ఏమిది!"

"మరణము — నాశనము — తొందరగఁ జనుఁడు. రాజద్రోహులు కొందఱు లోనఁబ్రవేశించిరి. వారు బహుశః నవాబును వధించియుందురు."

వారత్యంత వేగమున నాభవనమువంకఁ బరుగెత్తిరి. విమల యభ్యంతమందిర ద్వారముకడ కరిగెను. అట ద్వారపాలకుఁడు మత్తుచే నిద్రఁబడియుండెను. ఆమెయభ్యంతరము

లేకుండ నాద్వారమును దాఁటిపోయెను. పొడుగునను నిశ్శ్శ బ్దముగ
పోయెను. ఆమె నిరంతరాయముగఁ బరుగెత్తుచుండెను. ఆమె
కడపటి ద్వారముకడకు వచ్చెను. అట ద్వారరక్షకులు
మేల్కనియుండిరి. అందొకఁడు విమలతో నిట్లనియెను.

"ఎవరక్కడ? నీవెక్కడ కేగెదవు?"

అభ్యంతరభాగమున నిప్పుడు మహోద్భుతమైన కోలా
హాల ముప్పతిల్లెను. అందఱు నావంకఁ బరువులెత్తుచుండిరి.
నీవిక్కడ నూరకకూర్చుండి యేమి చేయుచున్నాఁడవు?
ఆకోలాహలము నీవు వినలేదా?" అని విమల యనియెను.

"అదేమి?"

"నవాబు నెవరో మార్కొనిరి."

ద్వారమును విడిచి రక్షకులు బరువెత్తిరి. విమల యే
యభ్యంతరమును లేకుండ దాటిపోయెను. ఆమెద్వారమును
గడచి కొంతదూర మరుగునప్పటి కొకచెట్టుకడ నొకమను
ష్యుఁడామెకుఁ గన్పట్టెను. విమల తోడనే యాతఁడభిరామ
స్వామియని గుర్తించెను. ఆమెతో నాతఁ డిట్లనియెను.

"నేను చాల భయపడుచున్నాఁడను. ఆ కోలాహల
మేమి?

"నాతప్పిదమునకు నేను పగఁదీర్చుకొంటిని. మన
మిక్కడ దడయరాదు. మనకుటీరమునకు శీఘ్రముగఁ బోవ
లయు, జరిగినదంతయు బిదపఁజెప్పెదను. తిలోత్తమ యటకు
వచ్చినదా?"

" ఆమె యామాస్మినితోఁగూడ నరుగుచున్నది. మన మిప్పుడే కలిసికొనగలము."

వారు వేగముగ నడిచి కుటీరమును జేరిరి. అయేషా యనుగ్రహముచేఁ దిలోత్తమ యామాస్మినితో నప్పుడే యటఁ జేరెను. ఆమె యభిరామస్వామి పాదములపైఁబడి యేడువ నారంభించెను. ఆమె నూరార్చి యాతఁడిట్లు చెప్పెను. "భగవదనుగ్రహమున పాపాత్ముల చేతినుండి యీవలఁ బడితివి. ఒక్కక్షణికమైనను మనమిట నిలువరాదు. పఠానులు మనల గుర్తించి రేని వారి ప్రభువునకయి మనప్రాణములఁ గైకొని పగదీర్చుకొనఁగలరు. మనమీరాత్రియే యిటనుండి లేచిపో వలయును. అందఱు నటు చేయ సమ్మతించిరి.

పదునేడవ ప్రకరణము.

అవసానము

విమల పలాయనమైనతోడనే కటులూ ఖానుని యుద్యోగస్థుఁడొకఁడు జగత్సింహుఁడున్న చెఱసాలకడకు వచ్చి యాతనితో నిట్లనియె.

"రాజకుమారా! నవాబునకవసానకాలము తటస్థించినది. ఒక్కమాఱు మిమ్ముఁ జూడవలయుననుచున్నవాఁడు"

"అదేమి" అని జగత్సింహుఁ డాశ్చర్యముతో నడిగెను.

"ఎవరో శత్రువులభ్యంతర మందిరమునఁ బ్రవేశించి నవాబును పొడిచి పాఱిపోయిరి. ఆతఁ డిప్పటికి జీవనముతో నున్నాఁడు. కాని, యిఁక జాలసేపు బ్రతుకఁడు. శీఘ్రముగ రెమ్ము. లేకున్న కార్యము మించిపోవును."

"అట్టిసమయమున నాతఁడు నన్నేలచూడ నభిలషించెను?"

"ఏమో నేనెఱుంగను. మిమ్ముఁ దీసికొని రమ్మనిన వచ్చితిని. అంతకంటె నాకేమియుఁ దెలియదు."

జగత్సింహుఁడాతనితోఁగూడ లోపలికిఁ జనియెను. కటుల్ ఖానుని ప్రాణములు కడసారి ప్రకాశమును జూపుచున్నవి. ఇఁకనారిపోవును. శాశ్వతాంధకారమగును. ఆతని చుట్టును తనయులు, పట్టమహిషి, అయేషా, అస్మాన్, ప్రియురాండ్రు, సేవకులు, ఉద్యోగస్థులు, మొదలగువారందఱుబరివేష్టించియుండిరి. ఆప్రదేశమంతయు రోదనప్రలాపములతో నిండిపోయెను. అందఱును దుఃఖించుచుండిరి. శిశువులు విషయము నెఱుంగక యేడ్చుచుండిరి. ఒక్కరు మాత్రమేడ్చుట లేదు. ఆమె యయేషా దుఃఖబాష్పములామె గండభాగములపైఁ గాల్వలుగట్టి ప్రవహించుచున్నవి. తండ్రిశిరసును తన యొడిలోఁ జేర్చుకొని నిశ్శబ్దముగఁ గూర్చుండియుండెను.

జగత్సింహుఁ డామె విధమునంతయుఁ జూచెను. ఈషణ్మాత్రవాయుప్రసారము లేని దీపమువలె నామెచలింపక యుండెను.

జగత్సింహుఁడు లోనఁ బ్రవేశించినతోడనే క్వాజా యనురాజసేవకుఁ డాతని హస్తమునుబట్టుకొని కటుల్‌ఖానుని ప్రక్కకుఁ గొంపోయి పెద్దగొంతెత్తి యాతనితోనిట్లనియెను.

"రాజా జగత్సింహుఁడు వచ్చినాఁడు. కటుల్‌ఖాను రాకుమారునితో నిట్లనియెను. "నేను నీకుశత్రువుఁడను. నాకుఁ గాలము చెల్లినది. ఈలోకమును విడిచిపోవుచున్నాఁడను. వైరమును నాగ్రహమును బరిత్యజింపుము".

"మంచిది. అట్లే చేసెదను."

"నాదొక్క ప్రార్థన—వాగ్దత్తము" అని హీనస్వరముతో బలికెను.

"నేనేమి వాగ్దత్త మొనర్పవలయును?"

"నీహస్తము"

అస్మాత్ కటుల్‌ఖానుని యభిప్రాయమును గ్రహించి జగత్సింహునిహస్తము నాతనిహస్తమున నుంచెను. జగత్సింహుని శరీరమంతయు వేడియెక్కెను. అగ్నివ్యాపించి నట్లయ్యెను. కాని యాతఁడా యుద్రేకము నాఁపుకొనియెను. కటుల్‌ఖానిట్లు చెప్పదొడంగెను.

"అందఱును పిల్లలు—యుద్ధము—దాహము—చచ్చిపోవుచున్నాఁడను."

అయేషా షర్బతు నాతనినోటఁబోసెను.

"లాభములేదు—యుద్ధమువలన—శాంతము."

కటుల్‌ఖాను మాటాడకయూరకుండెను. జగత్సింగు ప్రత్యుత్తర మీయలేదు. ప్రత్యుత్తరము నపేక్షించుచు

కటులుఖాన్ జగత్సింహుని ముఖమువంక వీక్షించుచుండెను. రాకుమారుఁడేమియు మాఱుపలుకకుండుట చూచి కటులుఖానుడతి ప్రయత్నపూర్వకముగ—

"అనిష్టమా?" అనియెను.

"చక్రవర్తి యాధిపత్యమునకు పఠానులు లోఁబడెదరేని సంధికొఱకు నేఁబ్రయత్నింతునని వాగ్దత్త మొనర్పఁగలను."

"ఒరిస్సాయో?" కటులుఖాను సగమస్పష్టముతో ననెను.

జగత్సింహుఁడాతని యుద్దేశమును గ్రహించి యిట్లనియెను.

"ఆవిషయమున నాసాధ్యమయినంతవఱకుఁ బ్రయత్నించెదను. నాప్రయత్నము విఫలముగాదేని మీాతనయులొరిస్సాను విడచిపోనక్కర లేదు."

మరణబాధచే వైవర్ణ్యమైయున్న యాతనిముఖముల్లాసముచే వికసించెను. ఇట్లనియెను.

"నీవు—స్వేచ్ఛ—భగవంతుఁడు —మేలు"

జగత్సింహుఁడు వెడలిపోవుచుండెను. అయేషా శిరసునువంచి తండ్రి చెవియందేదియో చెప్పెను. కటులుఖాన్ మొదట క్వాజాయిసా మొగమువంకను, పిదప వెడలిపోనుద్యుక్తుఁడయి యున్న రాజపుత్రుని వంకను వీక్షించెను. క్వాజా రాజపుత్రునితో నిట్లనియెను.

"నవాబు మీతోనింకను నేమియో చెప్పదలఁచు కొనినట్లున్నాఁడు."

రాజపుత్రుడు వెనుకకుమరలెను.

"నీచెవి".

రాజపుత్త్రుఁడాతని యుద్దేశమును గ్రహించి సమీప మునకువచ్చి తనకర్ణము నాతని పెదవులయొద్ద నుంచెను.

"వీర—"అని యస్పష్టముతో నవాబనియెను.

కొంచెముసేపూరకుండి మరల "వీరేంద్రసింహ— అయ్యో నోరెండిపోవుచున్నది." అనియెను,

అయేషా మరల షర్బత్తునుపోసెను.

"వీరేంద్రసింహుని తనయ"

జగత్సింహునకు విషసర్పదష్టమైనట్లయ్యెను.

"నిరాధారురాలు — నేను పాపాత్ముఁడను — దాహము"

అయేషా పదింబదిగ షర్బత్తు నిచ్చుచుండెను. ఆత నికి మాటలాడుట కష్టమయ్యెను. ఉచ్ఛ్వాసనిశ్వాసములు కఠినముగా వచ్చుచుండెను.

"నేను దహింపఁబడుచున్నాను— నేనుదహింపఁబడు చున్నాడ—పతివ్రత—నీవుచూడఁగలవు"

"ఏమిది?" అని రాజు ప్రశ్నించెను.

ఆతని కంఠధ్వని కటులుఖానుని చెవియందు దుందుభి వలె గింగురుమనియెను. కటులుఖానుఁడిట్లు చెప్పదొడంగెను.

"ఎప్పుడునుజూడఁబోను—అట్టిమహాపతివ్రత—చూ డలేదు—ముట్టుకొనలేదు—నీవు — దాహము—ఎట్లు—

బిడ్డా!—చచ్చిపోవుచున్నాఁడను—చచ్చి పోవుచున్నాఁడను. అయేషా!''

ఇదివఱకే శక్తినిమించి పనిచేసెను. ఇఁకమాటలేదు. శిరసును గ్రిందకు వ్రేలవైచెను. ఆతఁడీ ప్రపంచమున నుడివిన కడపటిమాట "అయేషా'' తటాలున గప్పుమని యాదీపమారిపోయినది. మరణాంధకారమువ్యాప్తమయ్యెను, ప్రాణములు ప్రపంచమును నాతనినుండి విడిపోయినవి.

పదునెనిమిదవ ప్రకరణము

ద్వేషము.

జగత్సింహుఁడు చెఱసాలనుండి విడివడియెను. మానసింహునికడకేగెను. కతులుల్ ఖానునితో చేసినవాగ్దత్తమును జెల్లించెను. మొగలులకును, పఠానులకును, సంధిజరిగెను. పఠానులు చక్రవర్తి ప్రభుత్వము నొప్పుకొనుటకును, నొరిస్సా పఠానుల వశమున నుండుటకును. నిరువురును సమ్మతించిరి, సంధిపద్ధతులను వివరముగఁ దెలియఁగోరు చదువరులు చారిత్రమును జూచికొనియెదరుగాక! మేమిప్పు డావిషయమును వివరముగఁ బ్రస్తావింపఁబోము. ఒడంబడిక జరిగినపిదపఁ గొన్నిదినము లెచ్చటనున్న వారచ్చటనుండిరి. క్రొత్తగాఁ గలిగిన యీ స్నేహ బంధమును దృఢము చేయవలయునను నుద్దేశముతో నొకనాఁడు ప్రధానమంత్రియగు ఖాల్ జా యును, సేనాధిపతియగు నస్మాక్ ఖానును, మానసింహుని

జూడనేగిరి, కటుంభ్ ఖానుని కుమారులగూడఁ దీసికొనిచనిరి. ఏఁబదిమదగజములను నింక ననేకయమూల్య పదార్థములను నాతనికి కానుకగ నర్పించిరి. మానసింహమహారాజు గౌరవ పూర్వకముగ వాని నందుకొని వారిని గౌరవించి పంపెను.

రాజపుత్రిబల మటనుండి బయలుదేరుటకుఁ గొన్ని దినములుపట్టినవి. తుదకొకనాఁటి సాయంతనము పాట్నాకుఁ బోవుటకు స్థిరపఱుపఁబడియెను. ఆమధ్యాహ్నమున జగత్సింహుఁడు తగన పరివారముతోఁ బఠానుల కోటలోనికిఁ బోయెను. అస్మాన్ ఖానునితోడను, తదితర పరిచయుల తోడనుజెప్పిపోవలయునని యాతనియుద్దేశము. చెఱసాలలోఁ గలిసికొనిన యారాత్రినుండియు నస్మాన్ రాజపుత్రునెడల నుపేక్షాభావముఁ జూపుచువచ్చెను. ఆతఁడిప్పుడు కొన్ని సన్మానవాక్యములతో రాజపుత్రుని సాగనంపెను.

కొంచెము విచారకరమైన హృదయముతో జగత్సింహుఁడచటి నుండి మరలెను. ప్రధానమంత్రినిజూచి పిదప నయేషాభవనమునకుఁబోయి ద్వారపాలకునిచే నామె కీరీతిగ సమాచారమంపెను. "నవాబు కాలధర్మము నొందినపిదప మరల నిన్నుఁజూచు నదృష్టము నాకు లభింపలేదు. నేనిప్పుడు పాట్నాకుఁ బోవసిద్ధముగ నున్నాఁడను. నీదర్శనభాగ్యము మరల నాకెన్నటికోగాని కలుగదు. అందుచే నొక్కసారి నిన్నుఁజూచి నీకడ ననుజ్ఞఁగొని యేగవలయునని యత్యాత్రముతో నున్నాఁడను."

ద్వారపాలకుఁడు తిరిగివచ్చి యిట్లు చెప్పెను.

"రాజోత్తమా! మా ప్రభుతనయ యిట్లు నీతోఁ జెప్పు మనినది.

ఇప్పుడు మిమ్ము దర్శింపఁజాలను. ఇట్లన్నందులకు క్షమింపుఁడు".

రాజపుత్త్రుఁడు . మఱింత చిన్నపుచ్చుకొనియెను. ఆతని నివాసమునకుఁ బోవ బయలువెడలి కోటగుమ్మము కడకువచ్చెను. అక్కడ అస్మాన్ ఖాను తనకొఱకు నిరీక్షించుచుండెను. జగత్సింగు నాతనికి మరల వందనముచేసి బయలు దేరెను. అస్మాన్ ఖాన్ కూడవచ్చుచుండెను. రాజపుత్త్రుఁ డిట్లనియెను.

"సేనాధినాయకా! నావలన నీకేదైనపని గావలసి యుండెనేని నెఱింగింపుము. నీమనోరథము నత్యానందముతో నెఱవేర్చెదను."

నీతోరహస్యముగ నొకవిషయము మాటలాడవలసి యున్నది. ఇందఱినడుమ నీతో నది చెప్పవలనుపడదు. వారిని ముందునకు సాగిపొమ్మనుము. నాతోఁగూడరమ్ము"

జగత్సింగహుఁ డించుకేని సందియమొందక తన పరి వారమును పొమ్మని యాజ్ఞయొసంగి తానస్మానుతోఁగూడఁ జనియెను. అస్మానాతని గుఱ్ఱమునధిరోహించెను. ఇరువురును కొంతదూరమేగిరి. అస్మాన్ సాంద్రమయిన 'సాలారణ్యమును ప్రవేశించెను. రాజపుత్త్రుఁడు నాతనితోఁగూడ నేగెను. అట శిథిలమైన భవనమొకటియున్నది. బహుశః పూర్వకాలమున నెవఁడో రాజద్రోహి యీయరణ్యముననుండి యుండ

వచ్చెను. అస్మాన్ గుఱ్ఱమునొక సాలవృక్షమునకుఁగట్టి లోనికి బోయెను. ఆమధ్యమున నొక విశాలమైన పెరడున్నది. అం దొకప్రక్కను శవమునుపాతు గొయ్యియొకటి త్రవ్వఁబడి యుండెను. అది క్రొత్తగ త్రవ్వఁబడినది. కాని శవము మాత్రముచట లేదు. రెండవప్రక్కను చితియొకటి పేర్చియుం డెను. అక్కడ మృతకళేబరములేదు.

జగత్సింహుఁడు లోపలఁబ్రవేశించి యిట్లనియెను.

"ఇదియేమి? ఎందుకొఱకు?"

"ఇది నాయాజ్ఞనుసారము సిద్ధపఱుపబడినవి. ఈ దినమున నేను మృతిజెందితినేని నన్ను అదిగో ఆసమాధిలో బాతిపెట్టింపుము. ఎవ్వరును గ్రహింపజాలరు. నీవు మరణించితివేని బ్రాహ్మణులచే నీయుత్తరక్రియలు చేయించెదను. ఎవ్వరును తెలిసికొనజాలరు."

"నీమాటలు నాకర్థముకాలేదు."

"నేనుపఠానుడను. మాహృదయముల నగ్నిప్రజ్వరిల్లెనేని మాకు న్యాయాన్యాయములుండవు. ఈప్రపంచమున నయేషాయొక్క ప్రేమకు రెండుస్థానములుండరాదు. అందుచే మనయిరువురియం దెవ్వరైన నొకరిప్పుడంతమొంది తీరవలయును."

రాజపుత్రుఁడు సర్వమునుగ్రహించి యిట్లనియెను.

"అయిన నీయుద్దేశమేమి?"

"నీవును నాయుధపాణివి. నాతో రణ మొనర్పుము

నాప్రాణములను గైకొని నీవు సుఖముగ నుండుము. లేదా నీప్రాణముల నిట నర్పించి నాకు మార్గమును జూపుము.''

ఇట్లు చెప్పుచు ప్రత్యుత్తరమున కైన నవకాశమీయ కుండ నాతడొఱనుండి ఖడ్గమును బెఱికి రాజపుత్త్రునిపై కురికెను. తనను గాపాడుకొనుట కై రాజపుత్త్రున కతిశీఘ్రముగ కత్తిని దీయవలసివచ్చెను. అస్మాన్ఖా ననేకపర్యాయములు రాజపుత్త్రుని ప్రాణముల దీయ ప్రయత్నించెను. కాని జగత్సింహుఁడొక్క దెబ్బయయినను తనశత్త్రువుపై విసరలేదు. ఆతనిదెబ్బ తగులకుండమాత్రము కాపాడుకొనుచుండెను. ఆయుధవిద్యయందిరువురును బరిపూర్ణులే. జయాపజయములు లేకుండ నిరువురును సమానముగ జాలసేపు పోరాడిరి. కాని, పఠానుఁడొనరించిన గాయములచే రాజపుత్త్రుని శరీరము రక్తములో మునిగియుండెను. పఠానుని శరీరమున నొక్క గాయమైనలేదు. రాజపుత్త్రుఁ డాతనిని ముట్టుకొననైనలేదు. తాను రక్తహీనుడనై పోవుచున్నాననియు నిట్టి యసమాన యుద్ధమున నిఁక దనకు మరణముతప్పదనియు రాజపుత్త్రుఁడు నిశ్చయించుకొనియెను. ఇట్లనియెను.

''చాలు—విడువుము — నేనోడింపబడితినని యొప్పుకొనుచున్నాఁడను.''

అస్మాన్ ఖాఁ నవ్వుచు నిట్లుత్తరమిచ్చెను.

''హా! రాజపుత్త్రుఁడు మరణమునకు భయపడునని నేనెన్నఁడును వినియెఱుంగను—రణమొనర్పుము—రణమొనర్పుము—నేను నిన్ను సంహరించెదను— నిన్నుక్షమింపను—

నీవు జీవించియుంటివేని అయేషా యెన్నఁడును నాయయేషా కాదు"

"నాకయేషాపై వలపులేదు"

"లేదు. నీవు ప్రేమించుటలేదు. కాని, యయేషా నీ యెడ ననురాగయై యున్నది—యుద్ధమొనర్పుము—క్షమార్పణలేదు—"అని ఖడ్గకాంతులు మెఱయుచుండఁ ద్రిప్పుచు జెప్పెను.

రాజపుత్త్రుఁడు తనయాయుధమును దూరముగ విసరి వైచి యిట్లుచెప్పెను.

"నేను రణమొనర్పను, నాదురదృష్ట దినములలో నీవు నాకుఁ జాలసాహాయ్యమొనర్చితివి. అందుచే నేను నీతో యుద్ధమును జేయను."

కోపావేశ పరవశుఁడై యస్మానుఖాను రాజపుత్త్రుని వక్షస్థలమున నొక్కతన్నుఁ దన్ని యిట్లనియెను.

"మరణమునకు భయపడిన వీరులతో నేనిట్లే యుద్ధమొనర్చెదను."

రాజపుత్త్రుని యోర్పంతయు నశించిపోయెను. పాఱవయిచిన యాయుధము నతిశీఘ్రముగ నందుకొని నక్కకఱచినసింగపు గొదమవలె ముందునకు లంఘించి పఠానుని దాఁకెను. మహాద్భుతమైన యాతని తాఁకుడును పఠానుఁడు సహింపలేకపోయెను. రణరంగమున నిలువునఁ బడిపోయెను. రాకుమారుఁ డాతనివక్షముపైఁ గూర్చుండి యాతనిచేత

నున్న కత్తిని బెఱికికొని యాతని కంఠస్థలమునబెట్టి యిట్లని యెను.

"ఇప్పుడేమనియెదవు? నీరణవాంఛ తృప్తినొందెనా?'

"నేను బ్రతికియుండగఁగాదు"

"నీప్రాణము నిప్పుడు నాశనమొందింపగలను."

"అట్లుసేయుము. లేకున్న నీప్రాణశత్రువు జీవించి యుండును."

"బ్రతికియుండనిమ్ము. రాజపుత్రులు డంబులకు భయ బడఁడు నేను నిన్ను వధించియుండుదును. కాని నీవు నాప్రాణ మును గాపాడితివి. అందుచే నీప్రాణములను నేను కాపాడు చున్నాఁడను"

రాజపుత్రుఁ డస్మానుని చేతులును, గాళ్ళను గట్టి యొక్కటొకటిగ నాతని యాయుధముల నన్నిఁటిని దీసిపాఱ వైచి, యాతని నిరాయుధునిగఁ జేసెను. పిదప నాతని బంధ విముక్తుని జేసి యిట్లనియెను.

"నీవు నెమ్మదిగ నీయింటికిఁబొమ్ము. నీవు యవనుఁ డవైయుండియు రాజపుత్రుని వక్షస్స్థలమునుదన్నితివి. అం దుచే నీకీదురవస్థఁ గలుగఁజేయవలసివచ్చినది. లేకున్న రాజ పుత్రులెప్పుడును దమకు మేలొనర్చినవారియెడ గృతఘ్నులై ప్రవర్తింపరు.

అస్మానుఁ డేమియుఁ బ్రత్యుత్తరమీయకుండ నశ్వా రోహణము జేసి దుర్గమువంకఁ బరుగెత్తెను.

రాజపుత్త్రుఁడు తనవస్త్రమును నూతిలోఁ దడిపి శరీర మంతయుఁ గడిగికొనియెను. అతఁడు గుఱ్ఱము నధిరోహించి కళ్ళెమును బుచ్చుకొనెను. ఆకళ్ళెమునకు నాకులు లతలు చుట్టఁబడియున్నవి. వానిని దీసివేయ శిరోజములతోఁ గట్టఁబడిన యుత్తర మొకటి కనఁబడియెను. దానిపై నీవిధముగ లిఖింపఁబడియుండెను.

"అయ్యా! రెండు దినములవఱకు నీయుత్తరమును విప్పకుము. విప్పితివేని దీనియుద్దేశము కొనసాగ నేరదు."

రాజపుత్త్రుఁ డొక్కింతసే పాలోచించి లేఖరియభిప్రాయము నంగీకరించెను. విప్పలేదు. దానిని తాయెతులో భద్రపఱచెను. గుఱ్ఱము నొక్కదెబ్బకొట్టి నివాసమునకై మరలెను.

ఇంటికిఁ జేరిన మూఁడవనాఁ డాతనికొకదూత మఱియొకయుత్తరమును దెచ్చియిచ్చెను.

దానినిగూర్చి తరువాత ప్రకరణమున ముచ్చటించుకొందము.

పందొమ్మిదవ ప్రకరణము

అయేషా యుత్తరము

అయేషాయుత్తరము వ్రాయఁ గూర్చుండెను. ఆమె ముఖలక్షణము, తదేకధ్యానమును, గంభీరమును, సూచించు

చుండెను. ఆమె వ్రాయబోవు నుత్తరము జగత్సింహునకు, చిన్నకాగితము నొకదానిని గైకొని వ్రాయఁ దొడంగెను. మొదట "ప్రాణాధికప్రియా" అని వ్రాసి వెంటనే దానిని తుడుపు పెట్టెను. మరల "రాజకుమారా!" అని వ్రాయుచుండ నేత్రముల భాష్పములుదయించి కపోలముల వెంటఁ బ్రవహించి యాకాగితముపైఁ బడియెను. అయేషా దానిని చించి పాఱవైచి మఱియొక క్రొత్త కాగితమును గైకొని వ్రాయుచుండెను. ఎన్నియో పంక్తులు వ్రాయలేదు. దానిపైకూడ నట్లే బాష్పములు స్రవించెను. ఆమె దానినికూడఁ బాఱవైచెను. మూఁడవసారి కన్నీళ్ళచే మరక పడకుండ నుత్తరమును బూర్తిచేసెను. వ్రాసినదానిని చదువనారంభించెను. అశ్రువులామెను చదువనీయలేదు. అక్షరములుకనఁబడలేదు. అతికష్టముమీఁద నెట్లోచదివి యుత్తరమును మడచి దూతకిచ్చెను. ఆతఁడు రాజపుత్రసైన్యము విడిచియున్న ప్రదేశము వంకకుఁ బోయెను. అయేషా యొక్కతెయు శయ్యపైఁ బడి యేడ్చుచుండెను.

జగత్సింగుత్తరమును విప్పి యిట్లు చదివెను.

"రాజకుమారా! నా మనోధైర్యమునందు నాకు నమ్మకమున్నది. ఆవిషయమున నాకేమేని భయముండినన్ను జూడరాకపోలేదు. అయేషాకు తాలిమి తక్కువయని యెన్నఁడును దలంపకుము. ఆయుద్దేశము నాకుఁ జాలబాధాకరము. అస్మానుభాగ్ నాతనిహృదయమునఁ గ్రోధాగ్ని నిరగుల్కొల్పి నాఁడని నీవెఱుంగుదువు. మరల నాతని హృదయమునకు

బాధకలుగఁ జేయవలసివచ్చు ననెడియుద్దేశముతో నేను నిన్నుఁ జూడరాలేదు. నీదర్శనమును నిరాకరించినందులకు నీవన్యథా తలంపవని యనుకొనెదను, నాకష్టసుఖములన్నియు భగవంతునిపై వైచితిని. నీసమక్షమున నేను నీకనుజ్ఞ నొసంగి యుంటినేని నావిచారమునంతయు సులభముగా భరింపఁగలిగి యుందును. నేను నీదర్శనముఁ జేయలేకపోవుటచే, ఱాతితో నిర్మింపబడిన స్త్రీనై పోయితిని.

అయిన నిప్పుడీయుత్తర మెందులకని యడుగవచ్చును. నాదొక్క ప్రార్థనమున్నది. సోదరీప్రేమతోఁగంటె నన్యథా నన్ను నేను ప్రేమించియుంటినని నీకుఁ దెలిసెనేని దానిని మఱచిపొమ్ము. ఈజీవితమున నేనా విషయమును గూర్చి యేమియుఁ దెలుపకుండుటకై మొదట నిశ్చయము జేసికొంటిని. కాని భగవంతుఁడన్యథా యొనర్చినాఁడు. అయిననిఁక దానిని జ్ఞప్తియందుంచుకొనకుము.

నిన్ను ప్రేమించునంతటి భాగ్యమునకై నేను నోఁచి పుట్టలేదు. నేను దేనినినీకీయవలసియుండెనో దానినినీకర్పించి వైచితిని. దానికి బదులుగ నేనేమియుఁగోరను. నీహృదయమును బడయగలుగుదునను నాశలేకపోయినను నాప్రేమ బలమున నిర్విచారముగఁ గాలము గడుపఁగలను. ఇప్పుడా విషయమగు ప్రస్తావనమంతయు ననావశ్యకము.

నేను నిన్ను దురవస్థలోఁ జూచితిని. నీకదృష్టదినములు సంప్రాప్తమైనప్పు డయేపాకుఁ దెలియపఱుపుము. కాని యట్లుచేయ నీకిష్టములేకపోయెనేని చేయకుము. ఎప్పుడైన

నీహృదయమునకుఁ గష్టము కలిగినేని యప్పుడయేమా జ్ఞప్తి యుండునా ?

నీకీయుత్తరము వ్రాసినందులకిప్పుడుగాని ముందుగాని లోకులు నన్ను నిందింపవచ్చును. నేను నిర్దోషురాలను. లోకులాడుకొను దానినిగూర్చి నీవంతగా పాటి సేయనక్కఱ లేదు. నీకెప్పుడైన నిష్టముకలిగెనేని నాకుత్తరముల్ వ్రాయుము.

నీవిప్పుడు వెడలిపోవుచున్నాఁడవు. ప్రస్తుతమీప్రదేశమును విడిచి యేగుచున్నాఁడవు. పఠానులు శాంతస్వభావులుకారు. అందుచే నీదేశమునకు మరల నీవు రావలసి యుండును. కాని నీవిఁక నెప్పుడును నన్నుఁ జూడబోకుము. నేనా విషయమును చాలదూరము యోచనచేసి యట్లు నిశ్చయించితిని. స్త్రీలహృదయమునందు విశేషముగ నమ్మక ముంపరాదు. దానిని వశ్యము జేసికొనుట స్వభావసిద్ధముగఁ జాలకష్టము.

నిన్నిఁక నొకమాఱు మాత్రము చూడవలయునని నాకభిలాషకలదు. ఈదేశమున నీకుఁ బరిణయమగునేని యప్పుడా విషయమును నాకెఱిగింపుము. నేను స్వయముగ నీవివాహమున కరుదెంచెదను. నీయర్ధాంగిగాఁ గానున్న యా నారీశిరోమణినిమిత్తము కొన్నిభూషణములను దాఁచియుంచితిని. ఆ సమయమును నే నెఱుంగఁగలిగితినేని నాహస్తములతో నాయలంకారముల నామె గాత్రమున కలంకరించెదను.

ఇంకొకమనవి. అయేషా లోకాంతరమున కేగెనని నీకు సమాచారము వచ్చినప్పుడు నీవొక్కమారు ఇక్కడకు రమ్ము. నీపేరువ్రాసి పెట్టెలో నుంచబడినవేవి నీకగపడునో వానిని నీవు నాకొఱకంగీకరింపుము. ప్రేమాస్పదుఁడగు నా తండ్రివలన నేను తనయనైనను కొంతద్రవ్యముఁ బడసి యున్నదానను. అది స్వల్పముగ గాన్పించినను, బీదదేశములోఁ జాలగొప్పగఁ బరిగణింపఁబడును. అబ్బీరు రాజపుత్త్రవంశజుల కది గ్రహింపఁదగనిదైనను దానిని నీవు స్వాధీనము చేసికొనవలయునని నాప్రార్థన.

దానపత్త్రమును నీవా పెట్టెయందే కాంచఁగలవు.

ఇఁక వ్రాయుటకేమియున్నది? ఇంకను నెంతయో వ్రాయవలయునని నాకభిలాషకలదు. కాని దానివలన లాభమేమి? భగవంతుఁడు నీ కెప్పుడును సౌఖ్యమొనగూర్చుఁగాక! అయేషా విషయమై నీకెప్పుడును నసౌఖ్యమొనఁగూర్పకుండుఁగాక!”

ఉత్తరముఁ జదువుకొని జగత్సింహుఁ డేడువదొడంగెను. ఆయుత్తరమును జేతఁబట్టుకొని చాలసేపటునిటు పచారు సేయుచుండెను. పిదప నాతఁడు శీఘ్రముగనొక కాగితమును గైకొని యీదిగువ మాటలను వ్రాసి దానిని దూతకిచ్చి పంపెను.

“అయేషా! నీవు నారీలోకమునం దంతకుఁ బ్రకాశనీయురాలవు. ప్రపంచమును గష్టములలోఁ ద్రోయుచుండుట భగవదుద్దేశముకాఁబోలు! నీయుత్తరమునఁదలి యేయంశము

నకును నేను బ్రత్యుత్తర మీఁజాలను — నీయుత్తరముచే నేనవశుఁడ నైపోతిని. నిన్ను నేనెప్పుడును బ్రియతమయగు సోదరి వలెఁ జూచుకొనుచుందునని మాత్రమే దీనివలన నీవెఱుంగ వలయును."

దూత యాయుత్తరమును గైకొనిపోయి యయేషా కిచ్చెను.

ఇరువదియవ ప్రకరణము

ఆరిపోవుచున్న దీపము

అయేషాకడ సెలవుఁ గైకొని యాస్మానీతోఁగూడ తిలోత్తమ వెడలిపోయినపిమ్మట నామె యెటనున్నదో యెవ్వరును జెప్పలేరు. తిలోత్తమ యాస్మానీ, అభిరామస్వామి, విమలను గూర్చిన సమాచారము లెవ్వరికిని దెలియుట లేదు. సంధికార్యములు సమాప్తమయినపిదప మొగలాయీలును, బఠానులునుగూడ వీరేంద్రసింహుని దారుణవధను గూర్చియు నాతని కుటుంబమునకు సంఘటిల్లిన దురవస్థం గూర్చియుఁ జాలపరితపించిరి. జాలినొందిరి. ఆతనిభార్యను, తనయను వెదకించి తీసికొనివచ్చి గరమందరమున మరల వారిని నిలుపవలయునని నిశ్చయించిరి. తదనుసరణముగ నస్మానును క్వాజాయిసాయును మానసింహుఁడు మొదలగు వారును జాలశ్రద్ధచేసి వారిని వెదకించిరి. కాని, యయేషా

కడనుండి యష్మాన్గీర్ వెడలుటతప్ప తిలోత్తమ సమాచారముల నెవ్వరును నెఱుంగజాలరైరి. మానసింహుఁడు తన ప్రయత్నములన్నియు విఫలములయిపోవఁదుదకుఁదనకు నమ్మకమైనవాని నొకనిని గరమందరమున నుంచి యాతనికిట్లాజ్ఞాపించెను.

"వీరేంద్రసింహుని భార్యను, తనయను వెదకింపుము. వారిని నీవు కనుగొంటివేని గరమందరమును వారికొప్పగించి నాకడకుఁరమ్ము. నీకు బహుమానముగ నేనొక జాగీరు నిచ్చెదను."

ఈవిధముగ గరమందర వ్యవహారము నంతను నెఱవేర్చి మానసింహుఁడు పాట్నాకుఁబోవ సిద్ధపడియెను.

కటులుఖాను చచ్చిపోవుచుఁ జెప్పినవాక్యములు జగత్సింహుని హృదయమున కేమేని మార్పును గలిగించెనో లేదో చెప్పలేము. ఆయువిదలను గనుగొనుటకై యాతఁడు మనుష్యులను బంపుటలోఁగాని ద్రవ్యమును వెచ్చించుటలోఁ గాని యేమియు లోటుచేయలేదను మాటమాత్రము వాస్తవము. కాని, యీ ప్రయత్నములు చేయవలయునను నుద్దేశ మాతనికి గతమునంతను జ్ఞప్తికిఁదెచ్చుకొనుటవలనఁ గలిగెనో మానసింహుఁడు మొదలగువారిని ప్రేరేపించిన యుద్దేశములే యితనిని ప్రేరేపించుటవలనఁ గలిగెనో, పూర్వపు ప్రేమ యంతయు మనసున మరల నుద్భవించుటవలనఁ గలిగెనో, మనము చెప్పలేము. కారణమేదియయినఁ గానిమ్ము. అతని ప్రయత్నములన్నియు నిష్ఫలములైపోయినవి.

మానసింహుని సేనలన్నియు నచటినుండి బయలు దేరు ప్రయత్నముతోనున్నవి. తేపటిదినమున వారుబయలు దేరి పోయెదరు. ఈదినముననే గుజ్జముకళ్ళేమునకుఁ గట్టఁబడిన యుత్తరముఁ జదువలసిన సమయము, రెండుదినములును గడచి పోయినవి. అత్యాత్రముతో జగత్సింహుఁ డుత్తరమును విప్పి యీాదిగువ యంశములను జదివెను.

"నీవు సదుద్దేశము గలవాఁడవై పాపమునకు భయపడెదవేని, బ్రాహ్మణుని శాపమునకు నీవుభీతిఁజెందెదవేని, నీయుత్తరమునందలి విషయములను జదివినతక్షణమే నీవొంటరిగ నిటకు రావలసినది. ఇంతేసంగతులు."

"ఒకబ్రాహ్మణుఁడు"

రాజపుత్త్రుఁ డాశ్చర్యపడియెను. ఒకమారిట్లుయోచించెను. "ఇది శత్రువులమోసకృత్యమయి యుండవచ్చును. నేను వెళ్ళవచ్చునా?" మరల నిట్లుతలంచెను. "ఈయుత్తరము స్వచ్ఛమయిన దేవనాగరాక్షరములలో వ్రాయఁబడియున్నది. "తుదికిది తప్పక బ్రాహ్మణునియొద్ద నుండియే వచ్చియుండునని నిశ్చయించెను.

తక్కిన యన్నిటికంటె బ్రాహ్మణశాప మనిన రాజపుత్త్రిల కెక్కుడుభయము. అందుచే నాతఁడు వెళ్లుటకే నిశ్చయించుకొనియెను. తన పరివారముతో నాతఁ డిట్లు చెప్పెను.

"మీరు బయలుదేరులోపల నేను—మిమ్ములఁ గలిసికొనకుండినను, నానిమిత్తము కనిపెట్టుకొని యుండవలదు.

మీరు ముందుకుపోయినను నిబ్బంది లేదు. బరడ్వాను కడఁ గాని, రాజమహాలునందుగాని, మిమ్ముఁ గలిసికొనెదను."

ఇట్లు వారికిఁజెప్పి యొక్కఁడును సాలారణ్యము వైపునకుఁ జనియెను. మునుపటివలెనే శిథిలమైయున్న యాభవన ద్వారముకడకుఁ బోయి యశ్వము నొక సాలవృక్షమునకుఁ గట్టి చుట్టును జూచెను. ఎవ్వరును గనఁబడలేదు. పిదప నాతఁడు లోపలికేగెను. అక్కడ నొక ప్రక్క సమాధికై త్రవ్వఁబడిన గోరియు నొకప్రక్క శవదహనమునకై యేర్పఱుపఁబడిన చితియునుండెను. అవి యిదివఱకు తాను చూచినవియే. ఆచితిపై నొక బ్రాహ్మణుఁడు కూర్చుండి యుండెను. ఆతఁడు తలవాల్చుకొని యేడ్చుచుండెను.

"అయ్యో! నన్నిక్కడకు రావలయునని కోరినది నీవేనా ?"

బ్రాహ్మణుఁడు తలపైకెత్తెను. రాజకుమారుఁ డాతని జూచెను. ఆతఁడభిరామస్వామి.

ఆశ్చర్య సంతోష వినోదము లొక్కుమ్మడి రాజపుత్త్రిని హృదయమునావరించెను. బ్రాహ్మణున కాతఁడు వినయపూర్వకముగ వందన మొనర్చి యిట్లడిగెను.

"మిమ్ముఁజూడవలయునని నేనెన్ని ప్రయత్నము లొనర్చితినో యిప్పుడెంతని చెప్పుదును. మీరెందుల కిక్కడనున్నారు?"

అభిరామస్వామి నేత్రములు తుడుచుకొని యిట్లనియెను.

"ప్రస్తుతము నేనిక్కడనే యున్నాఁడను."

ఆతఁడామాట వినియు విననితోడనే ప్రశ్నపై ప్రశ్న వైచి యడుగనారంభించెను.

"నన్నిక్కడఁ జూడఁగోరినదెందులకు? మీరు విచారించుచున్నారెందులకు?"

"నిన్నిటకురమ్మనుటకును నాకన్నీళ్ళకును, నొక్కటే కారణము. తిలోత్తమ మరణశయ్యపైనున్నది."

రాజపుత్త్రుఁడు మెల్లఁగ జేయానుకొని క్రిందఁ గూర్చుండెను. ఆతని హృదయమున కన్నియు జ్ఞప్తికివచ్చెను. చాలకష్టపడియెను. దేవాలయమునందలి ప్రథమావలోకనము;—శైలేశ్వర సన్నిధానమున నొనర్చిన శపథము—ఆశ్రంగారభవనమునఁ బ్రథమసమావేశ సమయమున గాఢానురాగముచేనైన భాషోదయము—గాఢాంధకార మయమగు నారాత్రి సంభవించిన దురవస్థ — ఆమూర్ఛావస్థయందలి తిలోత్తమవదనము-యవనాంతఃపుర గుహాయందలి యామె కష్టము—చెఱసాలయందు తానుచూపిన నిర్దయ—తుదకీమరణశయ్యపై నుచ్ఛ్వాసనిశ్వాస నిర్గమనము——అన్నియు-జ్ఞప్తికి వచ్చెను. ఆతని హృదయమున కివి తుపాను వేగమున వచ్చి తట్టెను. పూర్వపుటగ్ని పదిరెట్లభివృద్ధిఁజెంది యాతని హృదయమును దహించుచుండెను.

అతఁడు చాలసేపు మాటలాడకుండ నూరకుండెను. అభిరామస్వామి యిట్లు చెప్పుచుండెను.

"ఆనాఁడు, విమల తననాథుని జంపినందులకయి పగ

తీర్చుకొనినది మొదలు నేను నాతనయను నాతనయతనయను దీసికొని యిల్లురహస్యముగ నొకచోనుండక యాదేశము నాదేశము తిరుగుచున్నాఁడను. మహమ్మదీయుల భయముచే నిట్లు చరింపవలసివచ్చినది. ఆనాఁటినుండియు తిలోత్తమ వ్యాధిపీడితురాలై యున్నది. వ్యాధికారణమును నీవు బాగుగ నెఱుంగుదువు."

రాజపుత్త్రిని హృదయమున శూలము గుచ్చినట్ల య్యెను.

"అప్పటినుండియు నామె ననేకప్రదేశములయందుంచితిని. అనేకవిధముల వైద్యమొనర్చితిని. నాయౌవనమునుండియు నేను రోగలక్షణ శాస్త్రమును బాగుగఁ జదువుకొన్నాడను. అనేక వ్యాధులకు వైద్యముజేసితిని. ఎవ్వరునెఱుంగని యనేకౌషధముల నేనెఱుగుదును. కాని హృదయమున బాగుగ వేళ్లుపాఱియున్న విచారముచే బాధపడుచుండు రోగికేవైద్యుఁడు వైద్యముఁ జేయగలడు? ఈప్రదేశము రహస్యముగనున్నదని యెంచి ఈభవనమునం దొకరహస్యస్థానమున నొకవారము దినములనుండి నివసించియున్నారము. అదృష్టవశమున నిన్నిటఁ గనుగొని నీయశ్వము కళ్లెమున కుత్తరమును గట్టితిని. ఆమెవ్యాధిని నేను కుదుర్పలేకపోయినచో నవసానకాలమున నామెకు శాంతిగలుగుటకై, నిన్నొక్కమారామెకడకుఁ గొనిరావలయునని నేనెప్పుడును తలంచుచుంచెడివాఁడను. ఇందుకొఱకే నీకు నేనీయుత్తరము వ్రాసితిని. అప్పటికామె జీవితవిషయమున నాకుఁగల యాశాలత

లన్నియుఁ దెగిపోలేదు. ఇఁక రెండుదినములలోపలఁ గొంచెముగుణము గాన్పించదేని యామెతప్పక మరణించునని యప్పుడనుకొన్నాఁడను. అందుమూలముననే యీయుత్తరమును రెండుదినములు గడచినపిమ్మట చదువవలయునని వ్రాసియుంటిని. ఇప్పుడవసానము తటస్థించినది. ఆమె బ్రతుకునను నాశలేదు. అయ్యో! ఆదీపము కడసారి ప్రకాశమును జూపుచున్నది.''

అతడు మరల నేడ్చెను. జగత్సింగుకూడ నేడ్చుచుండెను.

"నీయంతట నీవాకస్మికముగ తిలోత్తమ యెదుటకు రాకుము. మిక్కిలి కృశించియున్న యామె హృదయ మొక్క-మాఱుగ నీయత్యధికానందమును భరింపజాలదు. ఒక్క-మాఱు వచ్చిచూడవలయునని వర్తమాన మంపితిననియు, నీవు రానున్నావనియు నామెతో జెప్పియున్నాఁడను. ఇప్పుడు నేనేగి నీరాక నెఱింగించెదను. నీవామెను పిదప జూడ వచ్చును."

ఇట్లు చెప్పుచు నాత డాశిథిల భవనమునందలి లోపలి భాగమునకు జనియెను. పిదప కొన్ని నిమిషముల కాతడు మరలవచ్చి "రమ్ము" అనియెను.

రాకుమారుఁ డాతనితోఁగూడ లోనికిఁ జనియెను. ఆ గదియంతయు, నిశ్శబ్దముగనుండెను. అందొకపాత్రమంచము పైఁ జాలకృశించినను నింకను మనోహరముగనున్న తిలోత్తమపండుకొనియుండెను. పూర్వలావణ్యముయొక్క- యస్ప

ష్టకాంతులింకను నామె నావరించియుండెను. సూర్యోదయా త్పూర్వాగ్ర మాకసమున నించించుక కాంతులఁ బ్రసరింపఁ జేయుచు నస్తమింపనున్న మనోహర నక్షత్రంబుఁబోలె నామెయట బరుండియుండెను. ప్రక్కనొకయనాధస్త్రీ కూర్చుండి తన హస్తముచే నామెశరీరముపై మెల్లఁగ రాచుచుండెను. ఆమె శరీరమున నలంకారములులేవు. ఆమె యేకాకినియు మలిన దేహయునగు వితంతువు. మొట్టమొదట నామెనురాజపుత్త్రి డానవాలుపట్టలేకపోయెను. ఎట్లులానవాలు పట్టఁగలడు? ఆతఁడు చూచునప్పటికామె నిరంతర యౌవనవతి. ఇప్పుడో వృద్ధాంగన.

రాజపుత్త్రుఁడు లోపలికేగి తిలోత్తమ శయ్యకడ నిలువఁబడునప్పటి కామె నేత్రములు మూఁతపడియుండెను. అభిరామస్వామి యామెనుపిలిచి యిట్లుచెప్పెను.

"తిలోత్తమా! కుమారజగత్సింహుఁడు వచ్చినాడు"

ఆమె కనులువిప్పి జగత్సింహునిఁజూచెను. ఆవీక్షణము కోమలముగ నుండెను. అందుఁ దిరస్కారసూచకము లేశమైనను లేదు. ఆతనిజూచియుఁ జూచుటలో నామెనేత్రములు క్రిందకు వాల్చెను. క్రమక్రమముగ నశ్రువులు కపోలములవెంటఁ గాల్వలుగట్టసాగెను. ఆతఁ డికఁ సహింపలేక పోయెను. లజ్జయును గంభీరభావమును దొలఁగిపోయినవి. ఆమెపాదములపైఁబడి బాష్పధారలచే నామె కుసుమగాత్ర మంతయుఁ దడుపుచుండెను.

స్వప్న పర్యవసాన మసత్యబోధకము

తండ్రి లేని నిరాధారురాలగు బాలిక వ్యాధిపీడితయై మంచముపట్టియుండెను. జగత్సింహుఁ డామె ప్రక్కనున్నాఁడు. పగలుగడచినది. రాత్రిగడచినది. మరలఁ బవలు వచ్చినది. మరల గడచిపోయినది. మరల రాత్రియే తెంచినది. రాజపుత్త్రిరత్న మామె ప్రక్కనే కూర్చుండియుండి యామె కుపచారములు సేయుచుండెను. ఆమె కుపచారముసేయుటలో గతభర్తృకయగు నాయువిద దఱచుగ సాహాయ్యముసేయుచుండెను. తిలోత్తమ తన ముఖమువంకఁ జూచునా? పూర్వమువలె మందహాసాలంకృతమై యామె వదనము మాధుర్యమును వెలిగొలుపుచుండునా?

అని యాతఁడామె వదనమును బలుమాఱుచూచుచుఁ గూర్చుండియుండెను.

సైనిక పటకుటీరము లెటులున్నవి? సైనికు లెటనున్నారు? వారాప్రదేశమును విడిచిపోయి యిప్పుడు పాట్నాలోనున్నారు. జగత్సింహుని స్వపరివార మెచటనుండెను? వారు దారుకేశ్వరనదీతీరమున తన ప్రభుని రాకనునిరీక్షించుచున్నారు. ప్రభు వెక్కడనున్నాఁడు? నిర్దయాత్మకములగు మధ్యాహ్నసూర్యుని వేఁడి కిరణములచే వాడి కృశించిపోవ సిద్ధముగనున్న శిరీషకుసుమమునకు నేత్రహోని కరములగు బాష్పోదకములచే మరల జీవముఁ బోయుచున్నాఁడు.

ఆ మృదుకుసుమము మరల బ్రతికినది. మోహమొక్కటియే యీప్రపంచమున సర్వకార్య నిర్వాహకమైన

మంత్రము. మోహజ్వరమును గుదుర్చు వైద్యుఁడు మన్మథుఁ డొక్కఁడే. ఆతఁడుదప్ప నావ్యాధినిగుదుర్చువార లెవ్వరు?

మంచి తైలమును గ్రొత్తగఁబోయుటచే గ్రమక్రమముగఁ బ్రకాశించు దీపమువలెఁ గ్రీష్మర్తు భానుకిరణములచే వాడిపోయి తొలకరివాన చినుకులచే మరల నేపుఁజెంది చిగిర్చెడితీఁగవలె, జగత్సింహుని సహవాసముచేఁ దిలోత్తమ యారోగ్యమునొందుచుండెను.

ఆమె శయ్యపైఁగూర్చుండుటకు శక్తిగలిగెను. నడుమ నడుమ విమల యావలికేగునప్పు డామె తనహృదయము నాతనికడ విప్పి యేమేమియో చెప్పుచుండెను. ఎన్నివిషయములో చెప్పినది. హృదయముననున్న యనేకములగు తప్పయిన యభిప్రాయములన్నిఁటిని దెల్పినది. ఆమెమనసున నుద్భవించి నాశనమైన యాశలన్నియు నెఱింగించినది. నిద్రించుచున్నప్పుడు మెలఁకువగనున్నప్పుడామె కనిన స్వప్నకథల నన్నిఁటిన నుడివినది. వ్యాధిపీడితయై స్పృహలేకుండ పడియున్నప్పుడు తనకొకనాఁడు వచ్చిన యాకిరిందిస్వప్నము నాతనికిఁ జెప్పెను.

వసంతకాలమున నంకురములు మొదలగు వానిచేఁ జక్కఁగనలంకరింపబడియున్న యొకపర్వతముపై నామెయు రాజపుత్త్రుఁడును నాటలాడుకొనుచుండిరి. ఆమె పువ్వులనేరి దండలుగాఁ గూర్చెను. ఆమె రెండు దండలనుగ్రుచ్చి యందొకటి తనకంఠమున నలంకరించుకొని రెండవది జగత్సింహుని కంఠమున వైచెను. రాజపుత్త్రుని నిశితఖడ్గమునకుఁ

దగిలి యాతనిహారము తెగిపోయెను. "నేనిఁక నేహారమును నీకంఠమున నలంకరింపను. నీపాదములకు సంకెలలఁ దగిల్చి కట్టివైచెదను." అని తిలోత్తమ యనియెను. పిదప నామె పూలతో సంకెలఁ జేసెను. ఆమె యాసంకెలలం దగుల్ప నాతనికడ కేగెను. ఆతఁడు కొంచెము వెనుకకరిగెను. తిలోత్తమ యాతనిఁబట్టుకొనుటకై శీఘ్రముగ నడచెను. ఆతఁడింకను దూరమరిగెను. తిలోత్తమ పరుగెత్తెను. జగత్సింహుఁడు వేగముగాఁ బర్వతము నెక్కనారంభించెను. అక్కడ చిన్నకాలువ యొకటి యుండెను. జగత్సింహుఁడు దానిని దాఁటెను. తిలోత్తమ స్త్రీయగుటచే దాఁటలేకపోయెను. ఆకాలువ యెటసన్నముగానుండునో యక్కడనుండి దాఁటవలెనని యామె యాప్రక్కగాఁ బోయెను. వెళ్ళినకొలఁది నాయేఱు సన్నమగుటకు బదులు వెడల్పయ్యెను. క్రిమక్రమముగ నదియొక చిన్న నదియయ్యెను. తుదకది పెద్ద నదియయ్యెను. ఇఁక జగత్సింహుఁ డగపడలేదు. ఆనది గట్టెత్తుగ నుండెను. భయంకరములై మెరకపల్లములచే సమానముగా లేకుండబోయెను. ఇఁక నడచుటకు సాధ్యముకాదు. ఇంతలో తిలోత్తమ నిలుచుండియుండిన గట్టుమహాధ్వనిచేయుచుగూలి నదిలోఁబడిపోయెను. క్రింద నొకభయంకరమయిన సుడిగుండమున్నది. తిలోత్తమయుటనుండి యెగిరి పర్వతము నెక్కఁబోయెను. కాని, తిలోత్తమ బిగ్గఱఁగ నేడ్వనారంభించెను. ఆకస్మికముగ భయంకర స్వరూపుఁడగు కటులూఖాను సమాధినుండి వచ్చియామె కడ్డముగ నిలిచెను. తత్క్షణమే యా

పూలదండ యినుపసంకెలగ మాఱిపోయెను. ఆమెహస్తమున నున్న పూలసంకెల యదృశ్యమై యామెపాదముల కినుపసంకెలయయ్యెను. ఆకస్మికముగ నామె శరీరమునిలువఁబడి పోయెను. కటుల్‌ఖాను మెడఁబట్టుకొని యామె నాప్రవాహ మధ్యమునఁ బడ వైచెను.—

తిలోత్తమ నేత్రములు బాష్పావృతము లగుచుండ "రాకుమారా! కల వట్టి కలకాదు. నీకొఱకుఁ గూర్చిన యాపూలసంకెల నాపాదముల కినుపసంకెలయై నిజమును ఋజువుచేసెను — నీకంఠమున నేనలంకరించిన యాపూల హారము నీవు కత్తితో ముక్కలుచేసితివి."

రాజపుత్త్రినకు నవ్వువచ్చెను. అతఁడు తనకత్తినందుకొని యామెపాదములకడ నుంచి యిట్లనెను.

"తిలోత్తమా! ఇదిగో! నాఖడ్గమును నీకిచ్చివైచితిని, ఇఁక నొక్కమాఱు పుష్పహారమును నాకంఠమున నలంకరింపుము. ఈహస్తములతో నీకత్తిని రెండుముక్కలుచేసి వైచెదను."

తిలోత్తమ యూరకుండెను. రాజపుత్త్రుఁడు
"తిలోత్తమా! పరిహాసముకాదు." అనియెను.
ఆమె సిగ్గుచేఁ దలవంచుకొనియెను.

ఆసాయంకాలమభిరామస్వామి యింకొకగదియందుఁ గూర్చుండి ప్రదీప ప్రకాశ సాహాయ్యమున వ్రాఁతగ్రంథము నొకదానిని చదువుకొనుచుండెను. రాజపుత్త్రుఁ డటకువచ్చి యతివినయమున నిట్లనియెను.

"అయ్యా! నాదొక్క ప్రార్థనము. తిలోత్తమ కిప్పుడు ప్రయాణశ్రమను సహింపదగినంత శక్తి కలిగినది. ఇంక నీ శిథిలభవనమున నుండి కష్టమనుభవించు టెందులకు! రేప శుభదినముగాదేని, గరమందరమునకుఁ గొనిరమ్ము. నీకిష్టము గలదేని తిలోత్తమ నబ్బీరు రాజపుత్ర వంశమునకుఁ గోడలిఁగఁ జేసి నాకు సౌఖ్యమొనఁగూర్పుము."

పుస్తకము నటబెట్టి లేచి యభిరామస్వామి యాతనిని గౌఁగిలించుకొని పరవశుఁడై పోయెను. ఆపవిత్ర గ్రంథమును కాలితోఁ ద్రొక్కుచుండెను.

రాజపుత్రుఁ డభిరామస్వామికడ కరుదెంచుచున్నప్పు డేదయోయూహించివిమలయు, నాష్మానీయునాతని వెనుకనే వచ్చిరి. వెలుపలనుండి యంతయువినిరి. రాజపుత్రుఁడివ్వలకు వచ్చి విమలను జూచెను. ఆమె విధమంతయు నాకస్మికముగ మారియుండెను. ఆమెయదేపనిగ నవ్వుచుండెను. ఆష్మానీని జుట్టుపట్టుకొని కొట్టుచుండెను. ఆ దెబ్బలను లక్ష్యముచేయక ఆష్మానీ విమలయొద్ద నాట్యము నేర్చుకొనుచుండెను. రాజపుత్రుఁడు మెల్లగ నటనుండి జారిపోయెను.

ఇరువదిరెండవ ప్రకరణము

పుష్పము వికసించినది

అభిరామస్వామి గరమందరమునకేగి జగత్సింహుని కును దిలోత్తమకును బరిణయ మతి వైభవముతో జరుపు చుండెను.

జగత్సింహుఁడు తనపరిణయమునకు జహానబాదునుండి మిత్రులను, బరిచయులను నాహ్వానముచేసి రప్పించెను. తిలోత్తమతండ్రి బంధుమిత్రులుకూడ నరుదెంచి యామహోత్సవము నతివైభవముగఁ గావించిరి.

జగత్సింహుఁ డయేషాకుఁగూడ సమాచారమంపెను. ఆమె సహోదరునితోడను, బరివారముతోడను, నామహోత్సవమున కేతెంచెను.

ఆమె మహమ్మదీయ యువిదయయ్యు జగత్సింహుని యందును, దిలోత్తమయందును దనకుఁగల ప్రేమాతిరేకమునఁ బరిచారికలతోఁగూడ దుర్గాభ్యంతర మందిరద్వారమున కరుదెంచెను. విచారసాగర నిమగ్నయగు నయేషాయట్టి యుత్సవమునకట్టి మహోల్లాసమును జూడ రాఁజాలదని చదువరులాలోచింపవచ్చును. కాని యామె యట్టిదికాదు. అయేషా యుల్లాసభరితమయిన హృదయముతో శరద్రాకాశ చంద్రకిరణ ప్రకాశమున సంపూర్ణ వికసితమై నిర్మలోదకము పైఁ దేలియాడుచు చూపఱుల నానందపరవశులం జేయు కుసుమ రాజంబుపోలిక నందఱ నానందింపఁ జేయుచున్నది. ఆమె మందహాస కాంతులఁ జుట్టును బ్రకాశింపఁజేయుచున్నది

వివాహ కార్యములు పూర్తియగునప్పటికి రాత్రి రెండుజాములైనది. అయేషా తన పరివారముతోఁ గూడ మరలిపోవ బ్రయాణమయ్యెను. హాసమొనర్చుచు నామె విమలకడ సెలవుఁగైకొనియెను. అయేషా హృదయమును విమల యేమియు నెఱుంగదు. ఆమెయిట్లనియెను.

"అయేషా! నీవివాహమునకు మరల మమ్ముఁ బిలువవలెనుసుమీ! మేము తప్పక వచ్చెదము."

విమలను విడిచి యామె తిలోత్తమకడకువచ్చి యామె నొక యేకాంతభవనమునకుఁ గొంపోయెను. ఆమెచేయిపట్టుకొని యిట్లనియెను.

"సోదరీ! నేనిప్పుడు వెళ్ళిపోయెదను. భగవంతుఁడు నీకు చాలకాలము సుఖమొనర్చుఁగాక! ఇదియే నా మనఃపూర్వకమైన ప్రార్థనము."

"మరల నిన్నెంతకాలమునకుఁ జూతును."

"అయ్యో! మరల నిన్నుఁజూచు నాశ నాకెక్కడిది?"

"తిలోత్తమ విచారము నొందెను. ఇరువురు నూరకుండిరి.

"మనము మరలఁ జూచికొనినను జూచికొనకున్నను నయేషాను నీవు మఱచిపోయెదవా?"

తిలోత్తమ నవ్వుచు నిట్లనియెను.

"అయేషాను నేను మరచినచో రాకుమారుఁడు నన్ను మన్నించునా?"

"నీమాటలు నాకు సంతోషమునిచ్చుటలేదు. రాకుమారునికడ నీవెప్పుడును నాపేరుతలపెట్టకుము. అట్లుచేయనని నాకు వాగ్దత్తమొనర్పుము" అని కఠినముగాఁ జెప్పెను.

అయేషాయొక్క భావిసౌఖ్యము సంపూర్ణముగఁ దననిమిత్తమై నాశనము చేయఁబడెనని జగత్సింహుఁడు విచారించుచున్నవాఁడనియు, నామె పేరు తలపెట్టినంతమాత్రమున

నాతనికా విచార మతిశయిల్లుచుండుననియు నయేషా గ్రహించెను.

తిలోత్తమయట్లు శపథ మొనర్చెను. అయేషాయిట్లనెను.

"అయినను నన్నుమాత్రము మీరు మరచిపోవలదు. జ్ఞప్తికొఱకు నేనొసంగిన వస్తువులను బరిత్యజింపకుము"

పిదపనామె పరిచారికనుబిలిచి యాజ్ఞయొసంగెను. ఆమె యలంకారములుంచిన దంతపుపెట్టెను దీసికొనివచ్చెను. అయేషా పరిచారికనుబంపి, యామె మృదుహస్తములతోఁ దిలోత్తమనలంకరింప నారంభించెను.

తిలోత్తమకూడ నొక భాగ్యవంతుని తనయయే, అయినను నాయలంకార నిర్మాణకుశలతయు నారత్నప్రకాశతయు గాంచి చాలగ నాశ్చర్యపడియెను. అయేషా తన తండ్రిచేనీయబడిన సొత్తుచే దిలోత్తమనలంకరించుటకయి యాయాభూషణములన్నియు జేయించియుంచెను. తిలోత్తమ యాభూషణముల నెంతయో శ్లాఘించెను. అయేషా యిట్లనియెను.

"సోదరీ! వీనినంతగా శ్లాఘింపకుము. నేఁడేరత్నముచే నీహృదయాలంకార మొనర్చుకొంటివో దానితోఁ బోల్చినప్పుడిది ముచ్చిబంగారమునుగాదు."

ఇటులఁజెప్పునప్పటి కామె నేత్రములఁ బాష్పోదయమయ్యెను. తిలోత్తమ యేమియు నెఱుంగదు.

అలంకరించుట పూర్తియగునతోడనే యయేషా తిలోత్తమ రెండుచేతులనుఁబట్టుకొని యామె ముఖముపై

దృష్టిసారించి తనలో నిట్లనుకొనెను. "నేనెవనిని ప్రేమించి తినో యారాజకుమారుఁ డీనిష్కపటమనోహర ముఖమండల ముతో నెప్పుడును సుఖములనందుచుండుఁగాక! నాప్రాణావసానసమయమునఁగూడ భగవంతునిఁగూర్చి రాజపుత్త్రుఁడీ బాలికతో సుఖమొందునట్లనుగ్రహింపుమని నేనొక్కప్రార్థనమే యొనర్చెదను."

"తిలోత్తమా! నీమనోహరుఁ డేదేని వ్యాపారతత్పరుడై యుండును. ఆతనికడ సెలవుఁగయికొనుటకయి కాలహరణమొనర్పను. భగవంతుఁడు నీకు దీర్ఘాయు వొసంగునుగాక! ఈయలంకారములను ధరింపుము. మఱియునా—నీయలంకార రాజమును నీహృదయమున నలంకరించుకొనుము"

నీయలంకార రాజమును నప్పటికామె గద్గదకంఠ యయ్యెను. ఆమెనేత్రములు బాష్పపూరితములయియుండెనని తిలోత్తమచూచెను. తిలోత్తమహృదయముకఱఁగి "అయ్యో నీవు దుఃఖించుచున్నావేమి?" అని యడిగెను.

తత్క్షణము బాష్పోదకపూరితనేత్రద్వారములు తెఱవబడెను. ఆయేషా యేమియుఁజెప్పలేదు. ఒక్కక్షణికమైన నటనుండ లేదు. అతిశీఘ్రముగ నీవలకువచ్చి పల్లకీయెక్కెను.

ఆమె యింటికివచ్చుసరి కింకను రాత్రియున్నది. ఆమె దుస్తులను మార్చుకొనెను. తనభవనమున గవాక్షమునఁ గూర్చుండియుండెను. ఆగవాక్షమువెంట చల్లనిమందమలయానిలము వచ్చుచుండెను. ఆకాశము మినుకుమినుకుమనుచున్న నక్షత్రములతో నామె యిప్పుడేమార్చివైచిన దుస్తు

లకంటె కొంచెము నీలమైమనోహరముగ నుండెను. మలయానిలముచే నెండుటాకులు మరమరధ్వనులు సేయుచుండెను. దుర్గముయొక్క పైభాగమున గుడ్లగూబ కీచుమని ధ్వనిచేయుచుండెను. కోటగోడక్రింద నయేషాగది ప్రక్కను నిర్మలవారిపూరితమై యాకాశచ్ఛాయను బ్రతిఫలింపఁజేయుచుఁ గందకమొకటియుండెను.

అయేషా గవాక్షమున నాలోచనానిమగ్నయై కూర్చుండియుండి యామె తనవ్రేలినుండి యుంగరము నొక దానిని దీసెను. అందలంకరింపబడినరత్నము విషనివాసమైన వజ్రము. ఆమె యిట్లు యోచించెను.

"ఈరత్నము నలుగఁదీసి మ్రింగి నాకెన్నఁటికి నిఁక దాహములేకుండఁ జేసికొనఁగలను."

ఆమె మరల నిట్లు యోచించెను.

"భగవంతుఁ డీప్రపంచమున నన్నిందులకే సృజించెనా? నేనీమాత్రము కష్టమును సహింపలేక పోయితి నేని, స్త్రీనై యేలజన్మింపవలయు? ఇది వినెనేని జగత్సింహుఁ డేమని తలంచును?"

ఆమె మరల నుంగరమును బెట్టుకొనియెను. ఆమె మరల నేదియో యోచించి దానిని మరలఁదీసెను.

"ఈమనోవికారము నడంచుటకు స్త్రీల కసాధ్యము. దీనిని దీసిపాఱవైచెదను."

ఇట్లు చెప్పుచు నాయుంగరమును గందకములోఁ బాఱవైచెను.

సమాప్తము

ANDHRA UNIVERSITY

Part II Telugu, March, 1951

B (a) దుర్గేశనందిని కథాకాలమునాటి రాజకీయ పరిస్థితి.

(b) విమల జీవితచరిత్రము

Part II Telugu Sept. 1951

B (a) అయేషా ఆదర్శప్రేమ

(b) అస్మానుఖాను కృతజ్ఞత.

---

* అయేషా తరువాతి వృత్తాంతమేమైనది ?
* జగత్సింహునికి మానసింహుఁడేల యావజ్జీవ కారాగార శిక్షవిధించెను ?
* తిలోత్తమ గతియేమయినది ?
* విమల జీవితశేషమెట్లు గడచినది ?
* గజపతి విద్యాదిగ్గజుని సామాచార మేమి ?
* అస్మాన్‌ఖాన్ ప్రణయపర్యవసాన మెట్టిది ?